# భారతదేశంలో కుల సమస్య – మన దృక్పథం

కేంద్రకమిటీ

సీ.పీ.ఐ. (మావోయిస్టు)

# భారతదేశంలో కుల సమస్య – మన దృక్పథం

కేంద్రకమిటీ

సీ.పీ.ఐ. (మావోయిస్టు)

భారతదేశంలో కుల సమస్య – మన దృక్పథం
మొదటి ప్రచురణ: మే 2017
రెండవ (సవరించిన) ప్రచురణ: జనవరి 2021
మూడవ (సవరించిన) ప్రచురణ: మార్చి 2025
కేంద్రకమిటీ
సీపీఐ (మావోయిస్టు) డాక్యుమెంట్

# విషయసూచిక


| | |
|---|---|
| రెండవ (సవరించిన) ప్రచురణకు నోట్ | 7 |
| మూడవ (సవరించిన) ప్రచురణకు ముందుమాట | 9 |
| అధ్యాయం-1 : కులవ్యవస్థ పుట్టుక | 17 |
| అధ్యాయం-2 : బ్రిటిష్ పాలన ప్రభావం, బ్రాహ్మణవాద వ్యతిరేక ఉద్యమాలు | 31 |
| అధ్యాయం-3 : బ్రిటిష్ వలసానంతర కాలంలోని మార్పులు | 49 |
| అధ్యాయం-4 : భారతదేశ చరిత్రలో వర్గాలు-వర్ణాలు-కులాల మధ్య సంబంధం | 68 |
| అధ్యాయం-5 : కుల నిర్మూలనపై వివిధ తప్పుడు ధోరణులు | 74 |
| అధ్యాయం-6 : కుల సమస్యపై మన పార్టీ అవగాహన-ఆచరణ | 79 |
| అధ్యాయం-7 : ప్రత్యేక కార్యక్రమం | 94 |
| అధ్యాయం-8 : నూతన ప్రజాస్వామిక విప్లవానంతర కాలంలో కుల సమస్య | 102 |

## రెండవ (సవరించిన) ప్రచురణకు నోట్

సీపీఐ (మావోయిస్టు) కేంద్రకమిటీ 'భారతదేశంలో కుల సమస్య - మన దృక్పథం' అనే ఈ డాక్యుమెంట్‌ను రూపొందించి మే 2017లో విడుదల చేసింది. అనంతరం కొందరు సీసీ కామ్రేడ్స్ నుండి, రాష్ట్రకమిటీల కామ్రేడ్స్ నుండి దీనికి కొన్ని సలహాలు, వ్యాఖ్యలు, సవరణలు కేంద్రకమిటీ ముందుకు వచ్చాయి. కేంద్రకమిటీ వీటిని చర్చించి ప్రస్తుతం సవరించిన డాక్యుమెంట్‌ను విడుదల చేస్తున్నది.

జనవరి 2021

విప్లవాభినందనలతో

కేంద్రకమిటీ

సీపీఐ (మావోయిస్టు)

# మూడవ (సవరించిన) ప్రచురణకు ముందుమాట

కామ్రేడ్స్ సీఎం, కేసీ వంటి అగ్రశ్రేణి కామ్రేడ్స్ సీపీఐ, సీపీఐ (ఎం)ల కరుడుగట్టిన రివిజనిజానికి, ఆధునిక రివిజనిజానికి వ్యతిరేకంగా కొనసాగించిన అంతర్గత సైద్ధాంతిక రాజకీయ పోరాటం ఫలితంగా, వీరు ఎంఎల్ఎం వెలుగులో భారత నూతన ప్రజాస్వామిక విప్లవానికి సన్నాహంగా 1964 నుంచి ఆరంభించి కొనసాగించిన కృషి ఫలితంగా రాజకీయ రంగంలో ఒక పెనుమార్పు (బ్రేక్ త్రూ) సాధ్యమైంది. భారతదేశ సామాజిక పరిస్థితిని నిర్దిష్టంగా విశ్లేషించడం ద్వారా భారత విప్లవ మౌలిక సమస్యలను సైద్ధాంతికంగా పరిష్కరించిన ఫలితంగా నక్సల్బరీ సాయుధ రైతాంగ విప్లవ వెల్లువ పెల్లుబకడంతో ఇది ఆరంభమైంది. ఇది భారత ప్రజాస్వామిక విప్లవ చరిత్రలో ఒక గొప్ప మూలమలుపు. ఇది భారత నూతన ప్రజాస్వామిక విప్లవానికి ఆరంభంగా నిలిచింది. ఇది ఊడలు దిగిన రివిజనిస్టు నాయకత్వ పంథాను, నిర్మాణాన్ని తిరస్కరించడం ద్వారా 1969 ఏప్రిల్ లో కామ్రేడ్ చారుమజుందార్ (సీఎం) నాయకత్వంలో సీపీఐ (ఎం-ఎల్), కామ్రేడ్ కన్హాయ్ చటర్జీ (కేసీ) నాయకత్వంలో 1969 అక్టోబర్‌లో ఎంసీసీ ఏర్పడ్డాయి. తమ తమ నాయకత్వ టీములకూ నాయకత్వాన్ని అందిస్తూ వీరిద్దరూ వర్గ పీడన, సామాజిక అణచివేత, కుల పీడన, అందులో భాగంగా అత్యంత పీడనకు గురవుతున్న దళితుల సమస్య గురించి మౌలికంగా సరైన అవగాహనతో కార్యాచరణను కొనసాగించి మన దేశంలో నూతన ప్రజాస్వామిక విప్లవాన్ని విజయవంతం చేసి, అంతిమంగా అన్ని రకాల దోపిడీ, పీడన, అణచివేత, వివక్షలకు తావులేని, వర్గరహిత, కులరహిత కమ్యూనిస్టు సమాజ స్థాపనకు మార్గాన్ని నిర్దేశించారు. సీపీఐ (మావోయిస్టు)గా ఈ రెండు విప్లవ స్రవంతుల విలీనానికి ముందు రెంటి అవగాహనలో అనుభవాల్లో కొన్ని తేడాలున్నా, అవి మౌలికంగా ఒకే అవగాహనను కలిగి వర్గ పోరాటాలతో పాటు, సామాజిక అణచివేతకు వ్యతిరేకంగా ఉద్యమాలు నడిపాయి. పీడిత వర్గాలను, పీడిత సామాజిక సముదాయాలను కేంద్రంగా చేసుకుని పని చేయడం వల్లనే అవి తమ ఆచరణను మెరుగుపరచుకున్నాయి. అందువల్లనే సీపీఐ (మావోయిస్టు) మౌలిక డాకుమెంట్లు-1) పార్టీ కార్యక్రమం, 2) పార్టీ నిబంధనావళి, 3) భారత విప్లవ వ్యూహం-ఎత్తుగడలు-వీటిలో ఈ సమృద్ధమైన అవగాహన చోటు చేసుకుంది. ఇదే అవగాహన కలిగి వుండడం వలననే 2013లో సీపీఐ (మావోయిస్టు), సీపీఐ (మా-లె) నక్సల్బరీ విలీనమయ్యాయి.

2007లో విజయవంతమైన సీపీఐ (మావోయిస్టు) ఐక్యతా కాంగ్రెస్-9వ కాంగ్రెస్ తర్వాత కేంద్రకమిటీ భారతదేశంలో కుల సమస్యపై ఒక డాకుమెంటును తయారు చేయాలని భావించింది. కానీ నూతన పార్టీ ఆవిర్భావంతోనే భారత దళారీ దోపిడీ పాలకవర్గాలు సామ్రాజ్యవాదుల

మార్గదర్శకత్వంలో దేశవ్యాప్తంగా విప్లవోద్యమంపై సాగించిన తీవ్రమైన శత్రు దాడిని తిప్పికొడుతూనే మన పార్టీ నాయకత్వం ఐక్యతా కాంగ్రెస్ కర్తవ్యాల పరిపూర్తికై నిమగ్నం కావడం, డ్రాఫ్టింగ్ టీము తయారు చేసిన ముసాయిదా డాకుమెంటు శత్రుదాడి మూలంగా అందుబాటులో లేకుండా పోవడం – ఈ ముఖ్యమైన కారణాలతో 2017లో మాత్రమే కేంద్రకమిటీ ఈ డాకుమెంటును రూపొందించి విడుదల చేయగలిగింది. అప్పటికే చాలా ఆలస్యం కావడంతో డాకుమెంటును విడుదల చేసి, దానిపై కామ్రేడ్స్ నుండి వచ్చే అభిప్రాయాలను సేకరించి తర్వాత సుసంపన్నం చేసుకోవచ్చనీ కేంద్రకమిటీ నిర్ణయించింది.

"మా–లె–మా సిద్ధాంత మార్గదర్శకత్వాన పని చేసే మన పార్టీకి గల శాస్త్రీయమైన, స్పష్టమైన, సరైన అవగాహన ప్రకారం, భారత సమాజంలో వర్గాలు ఏర్పడినప్పటి నుండి నేటి వరకు గడచిన వేల సంవత్సరాల చరిత్రంతా పీడక, పీడిత వర్గాల మధ్య జరిగిన వర్గ పోరాట చరిత్రే. భారతదేశంలో వర్ణాల రూపంలో వర్గాలు ఏర్పడినప్పటి నుండి వివిధ సామాజిక దశల్లో–వర్ణ వ్యవస్థ, ఫ్యూడల్ వ్యవస్థ/కుల వ్యవస్థ, వలస–భూస్వామ్య/అర్ధభూస్వామ్య వ్యవస్థ, అర్ధవలస, అర్ధభూస్వామ్య వ్యవస్థలలోని అన్ని రంగాలలో వివిధ రూపాలలో జరిగిన వర్గ పోరాటమే సామాజికాభివృద్ధికి ప్రధాన కారణం. ఈ సమాజాలన్నిటిలోనూ భావజాల, సామాజిక, ధార్మిక, ఆర్థిక, రాజకీయ, న్యాయ తదితర రంగాలలో నిరంతరాయంగా వర్గ పోరాటం కొనసాగింది. పీడితులెపుడూ పీడకులకు వ్యతిరేకంగా పోరాడకుండా లేరు. ఈ పోరాటం హింసాయుతంగానో, హింసేతరంగానో, తీవ్ర స్థాయిలోనో, మంద్రస్థాయిలోనో, రూపాలు ఏవైనప్పటికీ నిరంతరాయంగా కొనసాగుతూనే వచ్చింది. వీటిలో పీడితులకు లభించిన జయాపజయాల సంఖ్య, స్థాయి ఏదైనప్పటికీ ఈ పోరాటం కొనసాగుతూనే వున్నది. పీడితులు పీడకులకు వ్యతిరేకంగా కొనసాగించిన పోరాట వారసత్వాన్నీ, పాజిటివ్ అనుభవాలన్నింటినీ మనం ఎత్తిపట్టాలి. ఇందులో భాగంగా వర్గ పీడనకు, సామాజిక పీడనకు వ్యతిరేకంగా జరిగిన ఉద్యమాల పాజిటివ్ అంశాలన్నిటినీ ఎత్తిపట్టాలి, వీటి పరిమితులను ఎత్తిచూపాలి, వీటి నెగెటివ్ అంశాలను తిరస్కరించాలి, వాటి నుండి గుణపాఠాలు తీసుకోవాలి. పీడితులు జరిపిన ఈ పోరాటాల కొనసాగింపుగా, అభివృద్ధిగా నేడు మన పార్టీ నాయకత్వంలో కొనసాగుతున్న నూతన ప్రజాస్వామిక విప్లవాన్ని, వర్గ పోరాటం/దీర్ఘకాలిక ప్రజాయుద్ధం ద్వారా తుది విజయం సాధించేవరకు నడిపి వర్గ పీడన నుండి, సామాజిక పీడన నుండి విముక్తి సాధించడానికి మార్గం సుగమం చేయాలి. నూతన ప్రజాస్వామిక విప్లవం ద్వారా దేశ జనాభాలో 90 శాతానికి పైగా వున్న పీడిత వర్గాల, పీడిత సామాజిక సెక్షన్ల ప్రజలు విముక్తమవుతారు" (ఈ డాకుమెంటులోని 7వ అధ్యాయం, చివరి పేరా).

మన పార్టీలో ఏ స్థాయి కామ్రేడ్ అయినా ఈ మౌలిక అవగాహనతో, సామాజిక పీడనకు

వ్యతిరేకంగా, సామాజిక విముక్తికి పాటు పడిన వివిధ స్రవంతుల ఉద్యమాలను, వాటి నాయకత్వ రచనలను అధ్యయనం చేయాలి; ప్రత్యేకంగా సమాజాన్ని గొప్పగా ప్రభావితం చేసిన పూలే, పెరియార్, అంబేద్కర్‌ల రచనలు తప్పక అధ్యయనం చేయాలి; మార్క్సిస్టు, మార్క్సిస్టేతరుల రచనలు అధ్యయనం చేయాలి. ఆదిమ దశ నుండి మొదలుకుని నేటి వరకు గల భారత సామాజిక అభివృద్ధి చరిత్రను అధ్యయనం చేయాలి. వీటితో పాటు సామాజిక విముక్తికి బద్ధ శత్రువులైన బ్రాహ్మణీయ హిందుత్వ సంస్థ నాయకుల రచనలు కూడా అధ్యయనం చేయాలి. సామాజిక అభివృద్ధికి తోడ్పడిన ఉద్యమాలు, భావాలు ఏమిటనేది, వీటిని అణచిపెట్టిన ప్రతిఘాతక భావజాలం ఏమిటనేది అధ్యయనం చేయకపోతే, వర్తమాన కాలంలో ఒక సమగ్ర అవగాహనతో ప్రజలను రాజకీయంగా సమీకరించడానికీ, విప్లవోద్యమానికి విజయవంతంగా నాయకత్వాన్ని అందించడానికి పరిమితి ఏర్పడుతుంది.

2017లో విడుదల చేసిన డాకుమెంటును సవరించి సంపద్వంతం చేసి 2021లో విడుదల చేసిన 'భారతదేశంలో కుల సమస్య–మన దృక్పథం' డాకుమెంటులో ఈ కింది ముఖ్యమైన అంశాల్లో కొన్ని మార్పులు వున్నాయి. చరిత్రకు సంబంధించిన కొన్ని అంశాలను వాస్తవాలపై ఆధారపడి సవరించాం. అవసరమైన కొంత సమాచారాన్ని ప్రస్తుత పరిస్థితికి అనుగుణంగా చేర్చాం (అప్‌డేట్ చేసాం).

డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ పై ఇచ్చిన మన అంచనా విషయంలో నెగిటివ్‌గా చెప్పిన ఒక అంశాన్ని సరైన అర్థం స్ఫురించేలా సవరించాం. సవరించిన ఈ డాకుమెంటులో అంబేద్కర్ పై మన అంచనాను ఇలా పేర్కొన్నాం. ఆయన 'తన లక్ష్య సాధన కోసం పార్లమెంటరీ ప్రజాస్వామ్యాన్ని ఆశ్రయించారు. ఈ వైఖరి వాస్తవంగా వారిని సమరశీల పోరాట మార్గం నుంచి మళ్లించి పార్లమెంటరీ వ్యవస్థపై భ్రమలు కల్పించేలా చేసింది. మరోవైపు ఆయన సేవలు 1941 తర్వాత బ్రిటిష్ సామ్రాజ్యవాదులకూ, 1947 తర్వాత దళారీ నిరంకుశ బూర్జువా, భూస్వామ్య వర్గాలకు ఉపయోగపడ్డాయి'.... .... 'మొత్తంగా చూసినప్పుడు అంబేద్కర్ కుల నిర్మూలనను తన జీవిత లక్ష్యంగా ఎంచుకొని... తన యావత్తు శక్తితో నిజాయితీగా ప్రయత్నించారు'... .... 'మార్పు కోసం ఎల్లప్పుడు సిద్ధంగా వుండేవారు'.... .... ' ఆయనలోని పాజిటివ్ అంశాలను తీసుకోవాలి. దీంతో పాటు విప్లవ మార్గానికి అవరోధంగా వుండే వాటిని వదిలించుకోవాలి'.... .... 'అంబేద్కర్ కుల నిర్మూలనా సిద్ధాంతం ప్రజాస్వామిక సమాజ నిర్మాణపు దీర్ఘకాలిక ప్రక్రియలో ఒక ప్రముఖ భాగం. అంతేతప్ప ఇదే అంతిమమైంది కాదు. ఆ సిద్ధాంతమే సరిపోదు. ఈ ప్రక్రియ అంబేద్కర్‌కు ముందు కూడా కొనసాగింది. ఇప్పటికీ కొనసాగుతోంది. మనం దాన్ని కడవరకూ ముందుకు తీసుకుపోవాలి'.... .... (34, 35 పేజీలు).

కుల సమస్య పరిష్కారానికి 7వ అధ్యాయంలో చెప్పిన ప్రత్యేక కార్యక్రమంలో పేర్కొన్న వ్యూహాత్మక కర్తవ్యాలను, ఎత్తుగడల కర్తవ్యాలను కొంత సుసంపన్నం చేసాం. అంతే కాకుండా నూతన ప్రజాస్వామిక విప్లవంలో మూడు అద్భుత ఆయుధాలైన పార్టీ, ప్రజాసైన్యం, విప్లవకర ఐక్యసంఘటనలలో పీడిత వర్గాలైన కార్మిక, కర్షక, పట్టణ మధ్యతరగతి ప్రజలే, వీరిలో అత్యధికులుగా వుండే దళిత తదితర పీడిత సామాజిక సముదాయాలకు చెందినవారే క్రియాశీల పాత్ర పోషిస్తారని డాకుమెంట్ చెప్పింది. విప్లవంలో సకల రంగాల్లో, అన్ని విప్లవ నిర్మాణాల్లో పీడిత సామాజిక సెక్షన్ల చైతన్యయుత, క్రియాశీల పాత్రను పెంపొందించి, వాటిని విప్లవకరంగా తీర్చిదిద్దుతూ, అభివృద్ధి చేస్తూ వాటిపై కార్మికవర్గ నాయకత్వాన్ని స్థాపించడమనేది అత్యంత కీలకమైన వ్యూహాత్మక కర్తవ్యం అని స్పష్టంగా పేర్కొంది. అర్ధవలస-అర్ధభూస్వామ్య వ్యవస్థను కూలదోసే పోరాటంలో మార్క్సిజం-లెనినిజం-మావోయిజం వెలుగులో పార్టీని కార్మికవర్గీకరించడం, అందుకు తగిన శిక్షణనీయడం, పార్టీలో స్వయంవిమర్శ-విమర్శ ప్రక్రియ ద్వారా తప్పుడు అవగాహనలను, పని పద్ధతులను, ధోరణులను సరిదిద్దుతూ పార్టీని నిజమైన కార్మికవర్గ పార్టీగా తీర్చిదిద్దాల్సిన ఆవశ్యకత గురించి నొక్కి చెప్పాం. పునరుచ్ఛరణ దోషాలను, అచ్చుతప్పులను సవరించాం.

డాకుమెంటులో అగ్రకులాలను పీడక కులాలు అని, నిమ్న కులాలను పీడిత కులాలు అని సవరించాం. ఆర్థికంగా, సామాజికంగా ఆధిపత్యం కలిగిన కులాలు నిచ్చెన మెట్ల బ్రాహ్మణవాద కులవ్యవస్థను ఉపయోగించుకుంటూ మిగతా కులాలను ఇప్పటికీ దోపిడీ పీడనలకు గురి చేస్తున్నాయి. కనుక ఇలాంటి కులాలను సాధారణ పదబంధంతో 'అగ్రకులాలు' అని పిలవడం కన్నా 'పీడక కులాలు' అని, 'నిమ్నకులాల'ను 'పీడిత కులాలు' అని పిలవడం సరిగా ఉంటుందని ఈ సవరణ చేసాం.

మన దేశంలో అమానవీయ తీరులో కొనసాగిన కుల వ్యవస్థ కారణంగా అమలైన అంటరానితనం, కుల అణచివేత, వివక్ష, వేధింపులు తదితర నికృష్ట పరిస్థితులలో పీడిత కులాల ప్రజలు, ప్రత్యేకంగా దళిత ప్రజలు బౌద్ధం, క్రైస్తవం, ఇస్లాం, సిక్కు మతాల్లోకి మారిన చరిత్ర తెలిసిందే. కానీ, కుల వ్యవస్థ నుండి ఏ మతంలోకి మారినా అంతవరకు ఆ మతంలో లేని కులాలు అక్కడ కూడా ప్రత్యక్షం కావడం మన దేశ విశిష్టతే. ఏ జాతీ కులాలకు అతీతంగా లేదని చెప్పవచ్చు. అలాగే, తెగలలో లేదా ప్రాదుర్భావ జాతులలో కూడ తరతమ తేడాలతో కులాలు ప్రవేశించాయి. సారాంశంలో చెప్పాలంటే, పునాది వర్గాల ప్రజలు ఏ మతంలోకి మారినా వారక్కడ కుల వ్యవస్థ ప్రభావానికి అతీతంగా లేరు, వివిధ రూపాల్లో కుల వివక్ష, పీడన అనుభవిస్తున్నారు.

మరోవైపు మన దేశంలో ముందు నుండే సంఘ్ పరివార్ సంస్థలు 'ఘర్ వాపీస్' (పునరాగమనం) అభియాన్లు ఎన్నో నడిపాయి, మైనారిటీలపై హింసాత్మక దాడులు చేసాయి. ఈ మతోన్మాద

హింసాకాండ-సామాజిక హత్యాకాండ-మత కల్లోలాలు జరగని రాష్ట్రం ఏదీ లేదు. గత దశాబ్దం నుండి హిందుత్వ శక్తులు అధికారాన్ని చేపట్టాక 'ఘర్ వాప్సీ' పేరుతో దేశవ్యాప్తంగా, మరీ ముఖ్యంగా హిందుత్వ శక్తులు అధికారంలో వున్న రాష్ట్రాలలో బుల్‌డోజర్లతో మత మైనారిటీల కాలనీలు, వ్యాపార సముదాయాలు తదితరాల మీద డబుల్ ఇంజన్ ప్రభుత్వాల పాశవికమైన దాడులు పెరిగాయి. దేశంలో బ్రాహ్మణీయ హిందుత్వ భావజాలాన్ని నిరంకుశంగా అమలు చేయడానికి అనేక రాష్ట్రాలలో గోహత్యా నిషేధం, మత మార్పిడి నిరోధక, 'లవ్ జిహాద్' చట్టాలను మరింత కఠినతరం చేశారు.

మన పార్టీ పని చేసే ప్రాంతాలలో ఈ డాకుమెంటుపై ఆధారపడి అంటరానితనం, కుల అణచివేత, వివక్ష, వేధింపులకు వ్యతిరేకంగా దళితులతో పాటు యావత్తు పీడిత కులాలను, పీడక కులాలలోని ప్రజాస్వామిక సెక్షన్లను సమీకరించాలి. మత మార్పిడులను నిరుత్సాహపరచాలి. ఘర్ వాప్సీలకు, హిందుత్వ శక్తుల దాడులకు వ్యతిరేకంగా, ప్రజల ఆహారపుటలవాట్లలో, వివాహాలు చేసుకోవడంలో, దుస్తులు ధరించడంలో, మతాన్ని పాటించడంలో వారి స్వేచ్ఛను అణచివేస్తున్న బ్రాహ్మణీయ హిందుత్వ చట్టాలకు వ్యతిరేకంగా ప్రజలను సమీకరించాలి. ప్రగతిశీల, ప్రజాస్వామిక, లౌకిక శక్తులతో కలిసి కులపీడన, వివక్షలకు వ్యతిరేకంగా, మత మార్పిడి (హిందూ మత అనుకూల, మైనారిటీ మతాల వ్యతిరేక) చట్టాల రద్దుకు, హిందుత్వ ఫాసిస్టు దాడులకు వ్యతిరేకంగా పోరాడాలి. నిచ్చెన మెట్ల కుల వ్యవస్థ సారాన్ని, మతాల సారాన్ని ప్రజలకు బోధించాలి.

దేశంలో అన్ని దోపిడీ వర్గ-కుల పార్టీలు సహా వామపక్షాల ప్రభావంలో అన్ని కులాలోని పేదలు, శ్రామిక ప్రజలు వున్నారు. ఈ పార్టీలన్నీ తమ నాయకత్వంలో కుల సంఘాలను కూడ ఏర్పర్చి ఎన్నికలలో ఓట్లను సొమ్ము చేసుకోవడం తెలిసిందే. పాలకవర్గ పార్టీలన్నీ కులాల ప్రతిపదికన కులతత్వాన్ని బలోపేతం చేస్తూ ప్రజలను కులాల ప్రాతిపదికన చీల్చుతున్నాయి. కులాల్లో అంతర్గతంగా వున్న వివిధ సముదాయాల మధ్య చిచ్చు పెడుతున్నాయి. రివిజనిస్టు పార్టీలు కుల నిర్మూలనపై ఎన్ని నీతులు చెప్పినప్పటికీ, ఆచరణలో వారు అనుసరిస్తున్న విధానాలు మాత్రం కులతత్వాన్ని బలపర్చడానికే తోడ్పడుతున్నాయి. ఈ అన్ని పార్టీల వెనుక ఏ రూపంలో ఏ మేరకు దళిత, తదితర పీడిత కులాల ప్రజలు, ఆదివాసీ ప్రజలు సమీకరించబడి వున్నప్పటికీ మన పార్టీ వారిని వర్గ ప్రాతిపదికనే కాకుండా కుల, మత పీడనకు వ్యతిరేకంగా సమైక్యం చేసి పోరాడాల్సిన ఆవశ్యకత నేటి హిందుత్వ శక్తుల పాలనలో గతం కంటే ఎంతగానో తీవ్రమైంది.

వలస పాలన ముందు (స్వయంపోషక గ్రామీణ ఆర్థిక వ్యవస్థ వున్నంత వరకు) కులానికి, వర్గానికి మధ్య సమాన దూరమే వున్నప్పటికీ సమాజంలోని అంతర్గత వైరుధ్యాలు, ఫ్యూడల్ యుద్ధాలు, వర్గ పోరాటం కారణంగా వలసపాలన కంటే ముందు నుండే జరుగుతూ వచ్చిన

మార్పుల వల్లనూ, తర్వాత వలస పాలన మూలంగా జరిగిన ఆర్థిక, సామాజిక మార్పుల వల్లనూ కులాధారిత ఫ్యూడల్ వ్యవస్థలో గణనీయమైన మార్పులు వచ్చాయి. వివిధ కులాల్లో వర్గ విభజన జరిగింది. దీంతో కులం, వర్గం మధ్య వున్న సమాన సంబంధం తగ్గుతూ వచ్చింది. 1947 అధికార మార్పిడి తర్వాత దేశంలోని అత్యధిక గ్రామీణ ప్రాంతాలలో బ్రాహ్మణ, క్షత్రియ కులాల సామాజిక ఆధిపత్యం గణనీయంగా తగ్గుతూ మునుపటి శూద్రవర్ణంలోని 'ఆధిపత్య కులాలు' వివిధ రూపాల్లో ఆ స్థానాన్ని ఆక్రమించినప్పటికీ, దళితుల్లో అతి చిన్న 'క్రీమీలేయర్' ఆవిర్భవించినప్పటికీ, చాలా చిన్న సెక్షన్ తప్ప దళితులంతా ఇప్పటికీ పీడిత వర్గంగానే కొనసాగుతున్నారు. సమాజంలో ఇలాంటి మార్పులెన్ని జరిగినా ముందు నుండి బ్రాహ్మణవాదం కులవ్యవస్థకు ఆధారంగా కొనసాగుతుండడం వల్ల అది నేటికీ మౌలికంగా అలాగే కొనసాగుతున్నది. నేడు బ్రాహ్మణీయ హిందుత్వ శక్తులు దానికి కొత్త ఊపిరి ఊదుతున్నాయి. నిచ్చెనమెట్ల ఫ్యూడల్ ఆధిపత్యం ప్రతీ కుల అస్తిత్వానికీ, హిందూ మత అస్తిత్వానికి భావజాలపర ఆధారంగా కొనసాగుతున్నది. బ్రాహ్మణవాదం వివిధ రూపాలలో నిరంతరం సమాజాన్ని ప్రభావితం చేస్తున్నది. అభివృద్ధి నిరోధక విలువలను, సంబంధాలను పెంచి పోషిస్తున్నది. అందువల్ల నూతన ప్రజాస్వామిక విప్లవ ఆరంభం నుంచి దాని అంతిమ విజయం వరకూ సమాజ పునాదిలోనూ, ఉపరితలంలోనూ కుల పీడనకు వ్యతిరేకంగా, కుల నిర్మూలన కోసం పోరాడడం అవసరం.

మన దేశ సామాజిక పరిస్థితిలో శ్రామిక జనావళిలో అత్యధికులు దళిత తదితర పీడిత సామాజిక సముదాయాలకు చెందినవారే వున్నందున వర్గ పీడనకు, సామాజిక పీడనకు వ్యతిరేకంగా పోరాడే సంస్థలలో వాటి నాయకత్వ టీములలో వారి ప్రాతినిధ్యానికి చాలా ప్రాధాన్యం వుంటుంది. ఈ సంస్థల్లో, ఉద్యమాల్లో వారి క్రియాశీల పాత్రను పెంపొందించాలి. ఈ సంస్థలను, వాటి నాయకత్వాన్ని బలమైన, విశాలమైన, సమర్థవంతమైన సంస్థలుగా, నాయకత్వంగా అభివృద్ధి చేయాలి. వాటిలోని క్రియాశీల సభ్యులకు మార్క్సిజం విద్య గరిపి, వర్గ పోరాట శిక్షణనిచ్చి, ఆచరణలో వర్గపోరాటాల్లో భాగం చేస్తూ, మెరుగైన శక్తులను పార్టీలోకి తీసుకుని రావడం ద్వారా పార్టీ పీడిత వర్గ పునాదిని, పీడిత సామాజిక సెక్షన్ల పునాదిని బలోపేతం చేయాలి. మన దేశంలో కులాలుగా విడిపోయి వున్న కార్మికవర్గం వాస్తవంగా 'తనంటు ఒక వర్గం'గా తయారయ్యే క్రమం ఇదే. ఈ క్రమాన్ని వర్గ పోరాట, భావజాల రంగాలు–రెండింటిలోనూ నిరంతరం ప్రభావవంతంగా నడపడం కార్మికవర్గ పార్టీకి ఒక ముఖ్య కర్తవ్యంగా వుంటుంది.

శతాబ్దాల తరబడి ప్రజల ఆర్థిక జీవనంతో, వారి మనోభావాలతో ముడిపడిన అతి సున్నితమైన సంక్లిష్టమైన సమస్య కుల సమస్య. కులవ్యవస్థ కాలం చెల్లినదే అయినప్పటికీ కులతత్వం ప్రజల నరనరాన జీర్ణించుకుపోయి వుంది. ఇది బలహీనపడుతున్నప్పటికీ పునాదిలోనూ, ఉపరితలంలోనూ

కొనసాగుతూ ప్రజలలో సంఘీభావానికి, ప్రజాస్వామిక విలువలకు, ఆకాంక్షలకు, సాంఘిక సమానత్వానికి అడ్డుగా ఇనుప గోడలా నిలిచి వుంది. దీనిని రూపుమాపడానికి ఆర్థిక, ఆర్థికేతర రంగాలన్నింటిలో దోపిడీ, పీడనలకు వ్యతిరేకంగా పీడిత, తాడిత ప్రజలను ఐక్యం చేసి పోరాటాలు చేపట్టడం ఒక అత్యంత ముఖ్యమైన కర్తవ్యం. ఇది కుల పీడన వ్యతిరేక పోరాటాల నుండి, కుల నిర్మూలనా పోరాటాల నుండి విడదీయరాని అంశం.

మన కేంద్రకమిటీ రూపొందించిన ఈ డాకుమెంటులో భారత సమాజంలో వర్గాలు వర్ణాల రూపంలో ఏర్పడినప్పటి నుండి, తదనంతరం అది కులవ్యవస్థగా మారినప్పటి నుండి భారతదేశంలో జరిగిన మౌలిక మార్పుల గురించి స్థూలంగా పేర్కొంది. హిందూ, ఇస్లాం పాలకుల కాలంలో గానీ, బ్రిటిష్ పాలనలో గానీ, 1947 ఆగస్టులో జరిగిన అధికార మార్పిడి తరువాతి కాలంలో పాలకవర్గాలు గానీ, కుల వ్యవస్థను తమ దోపిడీ, పీడనలకు, అధికారానికి ఒక బలమైన సాధనంగానే వాడుకున్నాయి/వాడుకుంటున్నాయి. సామ్రాజ్యవాదులు, దళారీ నిరంకుశ బూర్జువాలు, భూస్వాములు కుమ్మక్కై కుల చట్రం నుండి ఈ సమాజం బయటపడకుండా చేయగలిగినదంతా చేస్తున్నారు. ఈ ప్రక్రియలో హిందుత్వ శక్తులు అత్యంత దూకుడుగా వ్యవహరిస్తూ ప్రజల మనోభావాలను రెచ్చగొడుతూ సమాజాన్ని మతాల ప్రాతిపదికన, కులాల ప్రాతిపదికన చీల్చడానికి చేయగలిగినదంతా చేస్తున్నారు. ఈ విషయాలన్నింటినీ మన ఈ డాకుమెంటు అధ్యయనం చేయడం, అర్థం చేసుకోవడం ద్వారా సామ్రాజ్యవాదానికీ, దళారీ నిరంకుశ పెట్టుబడిదారీ, భూస్వామ్య వర్గాలకూ, వారు ఒక బలమైన సాధనంగా వుపయోగించుకుంటున్న కులతత్వానికి వ్యతిరేకంగా, వారి రాజ్యానికి వ్యతిరేకంగా పోరాడి దాన్ని ధ్వంసం చేయడం ద్వారా నూతన ప్రజాస్వామిక విప్లవాన్ని విజయవంతం చేయగలుగుతాం. తద్వారానే సమాజంలో కుల పీడన, కులాధిపత్యం, కులతత్వం అంతమై అంతిమంగా సమాజం వర్గరహిత–కులరహిత సమాజంగా మారడానికి దారి సుగమమవుతుంది.

2017లో విడుదల చేసిన డాకుమెంటుపై పార్టీలో సీసీ నుండి వివిధ రంగాల్లోని వివిధ స్థాయిల కామ్రేడ్స్ నుండి సాధ్యమయినంత వరకు అభిప్రాయాలను తీసుకొని 2021లో జరిగిన సీసీ సమావేశంలో సవరణలతో దీనిని సుసంపన్నం చేసి మరో విడత సీసీ విడుదల చేసింది. తర్వాత ఈ డాకుమెంటుకు కొందరు కామ్రేడ్స్ కొన్ని సవరణలు పంపించారు. సీసీ వీటిని పరిశీలించి సరైన వాటిని చేర్చి, ముందుమాట రాసి ప్రస్తుతం మళ్లీ విడుదల చేస్తున్నది.

సింధూ నది పరీవాహక ప్రాంతంలోకి పశుపాలక ఆర్య గణాలు వలస వచ్చిన కాలం నుండి నేటి వరకు జరిగిన పరిణామాలపై స్థూలంగా ఈ డాకుమెంటు ద్వారా పార్టీకి గతం కన్నా మెరుగైన స్పష్టత చేకూరుతుంది. దీనిపై ఆధారపడి మరింత సృజనాత్మకంగా, క్రియాశీలంగా

పనిచేస్తూ అనుభవాల నుండి నేర్చుకోవడం ద్వారా, అధ్యయనం చేయడం ద్వారా యావత్తు పార్టీ, నిర్దిష్టంగా ఈ ఫ్రంట్‌లో పనిచేసేవారు మన దేశంలోని అత్యంత విశిష్టమైన, జటిలమైన కుల సమస్యను అర్థం చేసుకోగలుగుతారు. పీడిత సామాజిక సముదాయాలయిన దళితుల, ఆదివాసీల, మత మైనారిటీల, మహిళల మౌలిక, తక్షణ సమస్యల పరిష్కారానికి డాకుమెంటు తక్షణ, దీర్ఘకాలిక కార్యక్రమాన్ని రూపొందించింది. కుల సమస్య పట్ల సరైన అవగాహనతో పార్టీ అంతా ఎడ్యుకేట్ కావడానికి, ఈ సముదాయాల ప్రజలనే కాకుండా దేశ పీడిత ప్రజలను ఎడ్యుకేట్ చేయడానికి, సరైన దృక్పథంతో పని చేయడానికి ఈ డాకుమెంటు మౌలికమైన మార్గదర్శకత్వాన్నందిస్తుంది. ఇది ఈ సమస్యపై విశాల పీడిత ప్రజానీకాన్ని, ప్రత్యేకించి దళిత ప్రజానీకంతో పాటు పీడిత కులాల ప్రజానీకాన్ని సమైక్యం చేయడానికి, సంఘటితం చేయడానికి తోడ్పడుతుంది. ఈ వెలుగులో దేశంలో మన పార్టీ నిర్మాణం వున్న ప్రతీ రాష్ట్రంలో, ప్రాంతంలో ప్రజలను ప్రత్యేకంగా ఈ సామాజిక సముదాయాల ప్రజలను రాజకీయంగా జాగృతం చేయాలి. విశాల ప్రజాసంఘాలు నిర్మించి వాటిని బలంగా అభివృద్ధి చేయాలి. కుల పీడనకు సంబంధించిన దైనందిన, మౌలిక రాజకీయ సమస్యలపై బలమైన, సమరశీల పోరాటాలు నిర్వహించాలి. వీటిని కుల నిర్మూలన, సామాజిక విముక్తి దిశగా సాగే లక్ష్యంతో నడపాలి. ఈ విధంగా చేయడం ద్వారానే ప్రజలు తమ భవిష్యత్తును స్వీయకృషి ద్వారా తీర్చిదిద్దుకోగలిగేలా చేయగలుగుతాం.

మార్చి 2025

**కేంద్రకమిటీ,**

**భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)**

# 1వ అధ్యాయం

# కులవ్యవస్థ పుట్టుక

భారతదేశ ప్రజాస్వామిక విప్లవ ప్రత్యేక సమస్యలలో కులసమస్య ఒకటి. దీనికి మూలాలు వర్ణవ్యవస్థలోనూ, బ్రాహ్మణవాదంలోనూ ఉన్నాయి. భారతదేశ సామాజిక పరిణామపు ప్రత్యేక స్వభావంతో ముడిపడివున్న కులవ్యవస్థ, ప్రాచీన కాలం నుండి ఆధునిక కాలం వరకు దోపిడీ వర్గాలు శ్రామిక ప్రజానీకాన్ని దోచుకునే అత్యంత ముఖ్యమైన సాధనంగానే ఉన్నది. మెజారిటీ పీడిత ప్రజానీకాన్ని దోపిడీ చేయడాన్ని, అణచివేయడాన్ని సుసాధ్యం చేసేటటువంటి భావజాలం గానూ, సామాజిక వ్యవస్థ గానూ కులవ్యవస్థ భారతదేశ పాలకవర్గాలకు ఉపయోగపడుతున్నది. కులవ్యవస్థ నిర్మూలన కోసం సరైన కార్యక్రమం రూపొందించుకోవడానికి ముందుగా మనం కులవ్యవస్థ ఎలా పుట్టిందో, ఎలా అభివృద్ధి చెందిందో తెలుసుకోవాలి.

మన దేశంలో కులవ్యవస్థ మూలాలకు మూడువేల సంవత్సరాలకు పైగా చరిత్ర ఉన్నది. వర్గసమాజం అభివృద్ధి చెందడంతోనూ, రాజ్యం ఆవిర్భావంతోనూ, ఫ్యూడల్ ఉత్పత్తి విధానం అభివృద్ధితోనూ, దోపిడీ వ్యవసాయ ఆర్థిక వ్యవస్థ లోకి స్వంత ఆచారాలు, అలవాట్లు కలిగిన తెగల సముదాయాల నిరంతరాయ, తరచుగా బలవంతపు విలీన క్రమంతోనూ కులవ్యవస్థ విడదీయరాని విధంగా ముడిపడి ఉన్నది.

దిగువ ఇచ్చిన మూడు చారిత్రక కాలాల ద్వారా కులవ్యవస్థ పుట్టుక, అభివృద్ధులను గుర్తించవచ్చు.

### 1. వర్ణాశ్రమ ధర్మ కాలం:

క్రీ.పూ. 1500–క్రీ.పూ. 500 మధ్యకాలంలో వాయవ్య దిశ నుండి దేశంలోకి వలస వచ్చిన పశుపాలకులైన ఆర్యతెగలు స్థానిక వ్యవసాయక తెగలతోనూ, వ్యవసాయేతర తెగలతోనూ ఘర్షిస్తుండినప్పుడు వర్ణాలు (బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య) వర్గాలుగా ఉనికిలోకి వచ్చాయి. క్షత్రియులు, బ్రాహ్మణులు పాలక కూటమిగా, వైశ్యులు దోపిడీకి గురైన రైతాంగంగా ఉండేవారు. ఈ క్రమంలో వ్యవసాయం ప్రధానమైన ఉత్పత్తి విధానంగా అవతరించడంతో కట్టుబానిసలుగా (captive slaves) అట్టడుగు వర్ణంగా శూద్రవర్ణం ఏర్పడింది. ఈ విధంగా క్రీ.పూ. సుమారు 500 ప్రాంతంలో రాజ్యం ఆవిర్భవించింది.

### 2. తొలి ఫ్యూడల్ (proto-feudal) రాజ్య కాలం:

క్రీ.పూ. 500 నుండి క్రీ.శ. 4వ శతాబ్దం వరకు గల కాలం, ఇనుప నాగలి విస్తృతంగా వాడుకలోకి వచ్చిన కాలం, స్థిర గ్రామ జీవితంతో కూడిన వ్యవసాయం విస్తరించిన కాలం. ఈ

కాలంలో  పాలక కూటమిగా ఉన్న క్షత్రియులు, బ్రాహ్మణులు వైశ్య రైతాంగం నుండి పన్నుల రూపేణా, కానుకల రూపేణా మిగులును దోచుకునేవారు. విస్తారమైన రాజ్య భూములలో (సీతా భూములలో) శూద్రులు నిర్బంధ శ్రమ చేసేవారు. వాణిజ్యం, పెద్ద పెద్ద రాజ్యాలు వృద్ధి చెందాయి. బౌద్ధ, జైన మతాలు ఆవిర్భవించి వ్యాప్తి చెందాయి.

### 3. బ్రాహ్మణీయ కుల ఆధారిత ఫ్యూడల్ కాలం:

క్రీ.శ. 4వ శతాబ్దం నుండి బ్రిటీషువారు వచ్చేవరకు గడచిన ఈ కాలంలో, రాజుకు, ప్రజలకు మధ్య భూదానాలు (land grants) పొంది పన్ను వసూలు చేసే హక్కును కలిగిన చిన్న చిన్న పాలెగాళ్లు (feudatories), ఫ్యూడల్ మధ్యవర్తులు (feudal intermediaries) ఏర్పడ్డారు. కుల వ్యవస్థ స్థిరపడింది. బౌద్ధమూ, జైనమూ క్షీణించాయి. బ్రాహ్మణ మతం ప్రాబల్యం పొందింది.

పైన చెప్పినవి అతి విశాలమైన దశలు (పీరియడ్స్) మాత్రమే కాగలవు. చాలా విశాలమైన దేశంలోని ప్రతి ఒక్క ప్రత్యేక ప్రాంతానికీ  తేడాలు ఉండేమాట నిజమే. కానీ, సాధారణ ధోరణులు మాత్రం మొత్తం భారతదేశానికి వర్తిస్తాయి.

క్రీ.పూ. 2000 నాటికే తేలికపాటి వ్యవసాయం చేసే కంచుయుగపు నాగరిక సమాజాలు భారతదేశంలో ఉన్నాయి. సింధులోయ ప్రాంతంలోని ద్రావిడులు ఇనుము, నాగలి తెలియని కాలంలోనే నదులకు ఆనకట్టలు కట్టి నీటిని మళ్లించి పంటలు పండించారు. మొహంజొదారో, హరప్పా వంటి పట్టణాలను ప్రపంచంలో నాగరికత తెలిసిన మొదటి కాలంలోనే నిర్మించారు. సింధు వ్యాపారులు నైలు, మెసపొటేమియా వంటి పురాతన నాగరిక సమాజాలతో వ్యాపార సంబంధాలు కలిగి ఉన్నారు. ఆ కాలంలో భారతదేశ ఉత్తర, దక్షిణ ప్రాంతాల్లో కంచు యుగపు వ్యవసాయ సమాజాలు, చిన్న చిన్న ఆటవిక సమాజాలు ఉన్నాయి. కొన్ని తెగలు వ్యవసాయం, ఆహార సేకరణ, పశువుల పెంపకం చేసేవి. దక్షిణ ప్రాంతంలో నౌకా వాణిజ్యం (maritime trade) కూడా ఉంది. అయితే కంచుయుగంలో ఇనుప యుగం కంటే ఉత్పత్తి తక్కువ. ఆ ఉత్పత్తి అంతా రాజన్య, పురోహిత, వర్తక వర్గం చేతుల్లో కేంద్రీకృతమైనది.

క్రీ.పూ. 1500–500 సంవత్సరాలలో పశుపాలక సంచార జీవితం గడుపుతున్న తొలి విడుత ఆర్యులతో పాటు ఇనుము గురించి తెలిసిన మలి విడుత ఆర్యులు కూడా భారతదేశంలోకి ప్రవేశించారు. వారికి అప్పటికే బట్టలు నేయడం, వైద్యం చేయడం, ఆయుధాలు తయారు చేయడం తెలుసు. వారు ప్రాచీన సింధు నాగరికత కలిగిన నాగరిక జాతులైన కంచుయుగపు ద్రావిడులను, తమ కంటే వెనకబడిన రాతియుగపు ఆటవికులను ఓడించారు. అప్పటికే ద్రావిడులలో ఉనికిలో ఉన్న మాతృస్వామిక వ్యవస్థ స్థానంలో ఆర్యుల పితృస్వామిక వ్యవస్థ ప్రారంభమైంది.

ఆర్యులు వాయువ్య దిక్కు నుండి ప్రవేశించి గంగానదీ పరివాహక ప్రాంతం దిశగా

వ్యాపించారు. అప్పటికి వారు 'రాజన్య' అనే ప్రభువులు (Aristocracy)గానూ, 'బ్రాహ్మణులు' అనే పురోహితులుగానూ, 'విశ్' అనే రైతులు సాధారణ గణ సభ్యులుగా విభజించబడి ఉన్నారు. తూర్పు దిశగా సాగిన ఆర్యుల విస్తరణతో ముడిపడిన అంతులేని ఘర్షణలలోనూ, యుద్ధాలలోనూ, వివిధ పశుపాలక ఆర్య తెగల మధ్య, ఆర్య తెగలకు, స్థానిక తెగలకు మధ్య నీటి వనరుల కోసం, భూమి కోసం, తర్వాతి కాలంలో బానిసల కోసం జరిగిన ఘర్షణలలోనూ ఓడిపోయిన తెగలను బానిసలను గావించడం ప్రారంభమైంది. అలా బానిసలుగా గావించబడిన వారిని దాసులు-దస్యులు అని పిలిచేవారు.

ఆర్యులకు ఇతర తెగలతో యుద్ధాలు జరిగినపుడల్లా దాసులు ఆర్యుల పక్షాన పోరాడేవారు. ఆనాటికి ఉత్తర భారతదేశంలో ఆహార ఉత్పత్తిలోకి ప్రవేశించిన ఆర్యులది వ్యక్తిగత ఆస్తి సమాజం కాక, భూమినీ, పశువులనూ సమిష్టి ఆస్తిగా కలిగిన గణ సమాజం కావడం వలన వీళ్లకు లోబడిన దాస తదితర ఆర్యేతరులు బానిసలు కాలేదు. వారు మొత్తం ఆర్యగణాలకు సమిష్టి సేవకులయ్యారు, వర్ణ రీత్యా శూద్రులయ్యారు. దాసులను బానిసలుగా కాక శూద్రులుగా లోబరచుకోవడం వలన భారత సమాజంలో రోమ్ తరహా బానిస వ్యవస్థ ఏర్పడలేదు. దాని స్థానంలో పూర్తిగా పరిణతి చెందని బానిస సమాజం అంటే దాస వ్యవస్థ ఏర్పడింది.

యుద్ధాల ఫలితంగా తెగ నాయకుల (Chieftains) ప్రాముఖ్యత పెరిగింది. తమ ప్రతిష్టను పెంచుకోవడానికి సంఘటితం చేసుకోవడానికి, మిగులును దోచుకోవడానికి వారు కర్మకాండ పైన ఆధారపడ్డారు. ఈ కర్మకాండలలో సాధారణమైన విశ్‌లు కర్మకాండలు నిర్వహించే బ్రాహ్మణులకు, యుద్ధాలు నిర్వహించే రాజన్యులకు పశువులను, దాసులను సమర్పించుకునేవారు. బ్రాహ్మణులతో కలిసి రాజన్యులు పెద్ద, చిన్న యజ్ఞాలను నిర్వహించడం నానాటికి పెరిగిపోయింది. ఈ యజ్ఞాలలో విశ్‌లు చెల్లించే కానుకలపై (దానంపై/బలిపై) ఆధారపడి పాలక సంపన్న వర్గాలైన రాజన్యులు, పూజారులు జీవనం సాగించేవారు. ఈ దశలో గణ సంబంధాల పైన, బంధుత్వాల పైన ఆధారపడిన తెగ నిర్మాణాలు ఇంకా ప్రాబల్యం వహిస్తుండినాయి. ఈ బంధుత్వాలపై ఆధారపడిన గణాలు విచ్ఛిన్నమైపోయి, విశ్‌లూ, లొంగదీసుకున్న తెగలూ సమర్పించే కప్పాల(tributes)పై, కానుకల(gifts)పై ఆధారపడి బతికే ఒక విశాల వర్గం-వర్ణం ఏర్పడే క్రమంలో బ్రాహ్మణ, క్షత్రియ వర్ణాలు ఆవిర్భవించాయి.

ఆర్య పశుపాలక తెగలు, స్థానిక తెగల నుండి వ్యవసాయాన్ని నేర్చుకున్నాయి. ఈ స్థానిక తెగ నాయకుల గణాలను, పూజారుల గణాలను వరుసగా క్షత్రియ, బ్రాహ్మణ వర్ణాలలో చేర్చుకున్నారు. ఆ విధంగా ఆర్యులు తమలో ఆర్యేతరులను కలుపుకోవడం కొనసాగింది. అయినప్పటికీ క్షత్రియులు, పురోహితులు కలిసి ఆర్యుల జనాభాలో అల్ప సంఖ్యలోనే ఉండేవారు. ఓడిపోయిన ఆర్య, ఆర్యేతర తెగలను శూద్రవర్ణంలో చేర్చారు. అయితే శూద్రులలోచేర్చినప్పటికి

వారంతాబానిసలు కారు. గృహ బానిసత్వం ఉండినప్పటికీ, ప్రధానంగా మొదటి మూడు వర్ణాలలోని విశ్‌లు రైతులు కాగా, నాల్గవ వర్ణంగా ఏర్పడుతుండిన వైశ్య రైతులు (బంధుత్వాలపై ఆధారపడిన విశ్ నుండి విశాలమైన వైశ్య వర్ణం ఆవిర్భవించింది), శూద్రులు (సాపేక్షికంగా పరిమాణంలో చిన్నదైన వర్ణం) పశువులు కాచారు, వ్యవసాయ పనుల్లో పాల్గొన్నారు.

ఆయుధాల కోసం మాత్రమే గాక వ్యవసాయక అవసరాల కోసం కూడా ఇనుము విస్తృతంగా వాడుకలోకి రావడంతో, సుమారు క్రీ.పూ. 800 నుండి ప్రాచీన తెగ సమాజాల ఉత్పత్తి వ్యవస్థలో గుణాత్మకమైన మార్పు వచ్చింది. నాగలితో చేసే వ్యవసాయం క్రమం తప్పకుండా గణనీయమైన మిగులును సృష్టిస్తుంది. దట్టమైన విశాల అరణ్యాలను నరికి భూమిని సాగుకు సిద్ధం చేయగలిగారు. ఇలా ప్రాచీన కాలంలో వ్యవసాయక ఆర్థిక వ్యవస్థ ప్రధాన ఉత్పత్తి విధానంగా మారడాన్ని ఇనుము సుసాధ్యం చేసింది. వ్యవసాయేతర తెగలను దెబ్బతీయడం ద్వారానే వ్యవసాయ విస్తరణ సాధ్యమైంది. వ్యవసాయేతర తెగలను లొంగదీసుకున్నారు, లేదా అడవుల నుండి సాంప్రదాయిక జీవనాధారం నుండి వారిని గెంటివేశారు. నూతన భూభాగాలను జయించడం, స్థిర నివాసాలు ఏర్పడే అవకాశాలు ఏర్పడడం తెగ నాయకుల ప్రాధాన్యతను మరింతగా పెంచాయి. తెగలను పిడికెడు మంది పాలించే వ్యవస్థలు (tribal oligarchies) ఆవిర్భవించాయి. అనేక మంది తెగ నాయకులు తమ స్వంత గణాల పైన, తెగల పైన, తమ ఆధీనంలోని భూభాగాల పైన తమ పాలనను సంఘటితం చేసుకున్నారు. బ్రాహ్మణ పురోహిత వర్గం అప్పటికే వర్ణాశ్రమ ధర్మాన్ని అభివృద్ధి చేసింది. కర్మకాండలు మరింత సంక్లిష్టంగానూ, సంపద (wealth), కాల వ్యయాలతో కూడినవిగానూ మారాయి. ఈ కర్మకాండలు మిగులును పునఃపంపిణీ చేసే సాధనాలు. కానుకల రూపంలో రాబట్టిన మిగులును పాలకులైన క్షత్రియులు, బ్రాహ్మణ పురోహితులు పంచుకునేవారు. కానుకలు ఎంతమాత్రమూ స్వచ్ఛందంగా సమర్పించుకునేవి మాత్రం కావు, నిర్బంధంతో కూడినవి. రాజుల, పురోహితుల అధికారం పెచ్చుపెరిగిపోవడాన్ని, జయించిన తెగలను దిగువ వర్ణాలలో చేర్చుకోవడాన్ని ఆర్య ధర్మం, వర్ణ భావజాలం ధర్మసమ్మతమైనవిగా చేశాయి. వివిధ తెగల నుండి ఆవిర్భవించిన వర్గాలకు భావజాలపరమైన వ్యక్తీకరణగా ఆర్య ధర్మం, వర్ణ భావజాలం మారాయి.

ఆర్య, ఆర్యేతర తెగలను తమలో విలీనం చేసుకోవడానికి ఆర్యులు హింసతో పాటు సర్దుబాటు, సామాజిక, సాంస్కృతిక సమ్మేళనాన్ని కూడా సాధనాలుగా ఉపయోగించుకున్నారు. ఉత్పత్తి ప్రాథమిక దశలో ఉన్నప్పటి వర్ణాలే వర్గాలు. ఆర్యులు ఉత్పత్తి దారుల నుండి అదనపు ఉత్పత్తిని కాజేసేందుకు ముసుగుగా మత-తాత్విక (religio-philosophical) రూపాన్ని ఎంచుకున్నారు. క్రమంగా ఆర్యులు, అనార్యుల మధ్య అంతరాలు నశించి, ఆర్యులదిగానే ఒక నూతన తెగ ఆర్థిక వ్యవస్థ ఏర్పడింది. వైదిక కాలం నాటి బలి, పూజాది కార్యాలు నిర్వహించే బ్రాహ్మణులు ఆర్యధర్మాన్ని ఆటవిక సమాజంలోకి చొప్పించేందుకు క్రమంగా అడవులలోకి చొచ్చుకొనిపోయి, స్థానిక ఆదివాసీ సమూహాలలో ఉండిన అసంఖ్యాక మూఢాచారాలకు గౌరవం కలిగించారు. వారు తెగల,

రాజకుటుంబాల వంశ వృక్షాలను పురాణాలుగా రాశారు. వారు స్థానిక తెగ నాయకులతో చెలిమి చేసుకునేందుకు పాములను, కోతులను పూజించే తెగ ఆచారాలను, నరబలులను, జంతు బలులను అంగీకరించారు. ఈ విధంగా బ్రాహ్మణులు తెగల మూఢ విశ్వాసాలన్నింటికీ అధికార ఆమోదముద్ర వేయడం ద్వారా తమ వ్యతిరేక శక్తుల సహకారాన్ని సంపాదించారు. వ్యవసాయ కార్యకలాపాలకు అవసరమైన చంద్రమానాన్ని నిర్ధారించడానికి దీర్ఘకాలిక పరిశీలన, గణితం, అలాగే ఖగోళ శాస్త్రం తెలియని ప్రాచీన ఆదిమ తెగలలో వ్యవసాయ మెలకువలు ప్రవేశపెట్టారు. ఈ కొత్త వ్యవస్థ ఏర్పాటుతో ఇనుప నాగలి వంటి కొత్త ఉత్పత్తి సాధనాల వాడకం, ప్రధాన జీవనాధారంగా ఆహార ఉత్పత్తి అన్నీ కూడా క్రీ.పూ. 1000 నాటికే నెమ్మదిగా మొదలయినా అవి దాదాపు క్రీ.పూ. 600 దాకా గణవ్యవస్థ రూపం నుండి పూర్తిగా బయటపడలేదు.

క్రీ.పూ. 6వ శతాబ్ది ప్రాంతంలో చిన్న చిన్న జట్లుగా ఆర్యులు దక్షిణపథానికి రాసాగారు. దీనితో దక్షిణానికి ఇనుపకర్రు నాగలి వచ్చింది. దక్షిణ ప్రాంతంలో ఆర్య సంస్కృతి వ్యాప్తికి సైనిక ఆక్రమణల అవసరం అంతగా ఏర్పడలేదు. ఆర్యుల రాకకు ముందుండిన తెగ నాయకులను ఆర్యులు రాజులుగానే గుర్తించారు. తెగ పూజారులను కొత్తగా ఆవిర్భవించిన బ్రాహ్మణ వర్ణంలో చేర్చుకున్నారు. ఈ పరిణామాల ఫలితంగా తెగ వ్యవస్థ శిథిలమై అదనపు ఉత్పత్తి పెరిగి వ్యాపారం విస్తరించింది.

గంగానదీ మైదాన ప్రాంతాల్లో వరి సాగుతో సహా వ్యవసాయం అభివృద్ధి చెందడంతో పాటుగా శ్రమ విభజన విస్తరించడం, వాణిజ్యం వృద్ధి చెందడం కూడా సాగాయి. భూమి స్వంత ఆస్థిగా మారింది. పట్టణాలు అభివృద్ధి చెందాయి. వైశ్య వర్తకులు, గహపతుల (భూయజమానులు) వంటి నూతన వర్గాలు అస్థిత్వంలోకి వచ్చాయి. గహపతులు భూమిని దున్నేవారు కాదు. బానిసలతో లేదా శూద్రులతో దున్నించేవారు. అగ్ర (పీడక) వర్ణాలకు, కింది (పీడిత) వర్ణాలకు మధ్య, యజమానులకు, శ్రామికులకు మధ్య ఉద్రిక్తతలు తలెత్తాయి. ఇది రాజ్యం ఆవిర్భావానికి దారితీసింది. గంగా మైదానాలలో, బిహార్‌లో కూడా తొలి రాజ్యాలు ఆవిర్భవించాయి.

మొట్టమొదటి (proto-states) రాజ్యాలలోని తొలిరాజ్యాలు, పాలక గణాలు తమ పాలనను సుస్థిరం చేసుకోవడం కోసం, ధర్మసమ్మతం గావించడం కోసం యజ్ఞాలపై ఆధారపడ్డాయి. వర్ణవ్యవస్థను, వ్యక్తిగత ఆస్థిని నిలబెట్టాయి. కానుకల స్థానంలో పన్నులు ప్రవేశించాయి. బ్రాహ్మణ, క్షత్రియ ఈ రెండు పీడక వర్ణాల పైన పన్నులుండేవి కావు.

వైశ్యవర్ణం నుండీ, శక్తివంతమైన వర్తకుల గిల్డుల నుండీ, చేతివృత్తుల గిల్డుల నుండీ కొత్తగా ఏర్పడిన వర్గాలు, పీడిత వర్ణాలు రెండూ మొత్తంగానూ, ఇంకా జయించబడని తెగల సముదాయాలూ ఈ వర్ణాశ్రమ ధర్మ భావజాలాన్నీ, అది ప్రవచించే వ్యవస్థనూ (order) అంగీకరించలేదు. ఆనాడు ఆవిర్భవిస్తుండిన వ్యవసాయిక ఆర్థిక వ్యవస్థకు కూడా అతివ్యయంతో కూడిన పశుసంపదతో

సహా జంతువులను బలి ఇవ్వడం పైన ఆధారపడిన యజ్ఞాల వలన ఎలాంటి ఉపయోగమూ లేకుండాపోయింది. పలు తత్వశాస్త్రాలు, 'లోకాయుత', బౌద్ధము, జైనము ప్రాధాన్యత సంతరించుకున్నాయి.

క్రీ.పూ. 3వ శతాబ్దం నాటికి, భారతదేశంలో పూర్తిగా రూపొందిన మొట్టమొదటి ప్రధాన రాజ్యమైన మౌర్య సామ్రాజ్యం ఈ నూతన వాస్తవాన్ని ప్రతిబింబించింది. వైశ్యవర్ణంలోని సంపన్న వర్తకులను, వ్యాపారులను, భూస్వాములను 'పౌర జనపదం' అనే ప్రభువర్గంలోకి, అధికార యంత్రాంగంలోకి చేర్చుకున్నారు. ఈ కాలం నుండే బ్రాహ్మణులు తమ సాంప్రదాయిక వృత్తి అయిన యజ్ఞయాగాదుల ప్రాధాన్యత సన్నగిల్లడంతో వాటిని గణనీయంగా వదిలిపెట్టడంతో వారికి అధికార యంత్రాంగంలో స్థానం కల్పించారు. దీంతో వారు మంత్రులుగా, రాజుకు సలహాదారులుగా శక్తివంతమైన స్థానాల్లో ప్రవేశించారు.

ఈ నూతన తరహా రాజ్యం (ప్రాచీన సమిష్టి మరియు రాజ్య యాజమాన్యం) వైశ్యులు చెల్లించే పన్నుల పైన, శూద్రులు చేసే శ్రమ పైన ఆధారపడినది. కౌటిల్యుడు (చాణక్యుడు) రచించిన చాలా ముఖ్యమైన గ్రంథమైన 'అర్థశాస్త్రం' రాజు ఎలా పరిపాలన సాగించాలనే విషయాన్ని సూటిగా వివరించింది. ఎలాంటి మతపరమైన ముసుగూ లేకుండా ఆ గ్రంథం రాజనీతిని వివరించింది. అర్థశాస్త్రంలో చెప్పిన రాజ్యం కేంద్రీకృత రాజ్యం. వ్యవసాయం, వాణిజ్యాల విస్తరణ బాధ్యతను అది చేపట్టింది. గనులపై గుత్తాధిపత్యం వహించింది. భూమిని సాగులోకి తేవడానికి అవకాశం ఉన్న చోట నీటి పారుదల వంటి వ్యవసాయానికి అవసరమైన సదుపాయాలను కల్పించి శూద్ర సమూహాలను స్థిరపరిచింది. కట్టుబానిసలైన (captive) శూద్రులచే (Dasa/Helot) బలవంతంగా శ్రమ చేయించి, రాజ్యమే నేరుగా 'సీతా' భూములను సాగు చేసింది. కాగా 'రాష్ట్ర' ('Rashtra') భూములను స్వతంత్ర రైతాంగం (వైశ్యులు) చేత సాగు చేయించింది. ఈ స్వతంత్ర రైతాంగం పైన రాజ్యం వివిధ పన్నులు విధించింది. వర్ణ వ్యవస్థలోని యజమాని బానిస సంబంధాలు ఉనికిలో ఉన్నప్పుడు ప్రధానంగా భూ యజమానులైన గహపతులు ఇంటిపని కోసం దాసులను, బానిసలను ఉపయోగించేవారు లేదా రాజ్యం సేకరించిన ధాన్యాన్ని దంచడం, శుద్ధి చేయడం వంటి పనుల కోసం, కొన్ని సరుకుల ఉత్పత్తి కోసం వీరిని ఉపయోగించేవారు.

మౌర్య సామ్రాజ్యం నాటికి మూడు రకాల ప్రాంతాలుండేవి. కొన్ని స్థిర నివాస గ్రామాలతో కూడిన ప్రాంతాలుగా, కొన్ని వ్యవసాయ సంచార బృందాలతో కూడిన ప్రాంతాలుగా, చాలా భాగం ఇంకా ఇనుము వాడకం తెలియని పశుపాలక – ఆహార సేకరణ చేసే గణాలు ఉన్న అడవి ప్రాంతాలుగా ఉడేవి.

నైపుణ్యం కలిగిన కర్మకార శూద్రులు స్వతంత్ర చేతివృత్తుల వారుగా మారారు. బౌద్ధసంఘాలలో వారికి ప్రవేశం కూడా లభించింది. కట్టు బానిసలైన దాస శూద్రులకు బౌద్ధంలో

ప్రవేశం లేదు. వైశ్యులలోని ఒక సెక్షన్ కూడా రథాలు తయారు చేయడం వంటి ప్రత్యేక వృత్తులలో నైపుణ్యం కలిగిన చేతివృత్తుల వారుగా మారింది. భారతదేశ చరిత్రలోని ఆ తరువాతి దశలో వైశ్యులలోని పైస్థాయికి చెందిన వారు ప్రభువర్గంగా మారగా, అత్యధికులు శూద్రవర్ణంలోకి నెట్టివేయబడ్డారు.

తెగలలోని సంపన్న వర్గాలను (tribal elite) బ్రాహ్మణ, క్షత్రియ వర్ణాలలో చేర్చుకోగా, అత్యధికులు శ్రామికులుగా మారి శూద్రవర్ణంలో భాగమయ్యారు. బౌద్ధం నుండి శాఖాహారం, అహింస, కర్మ సిద్ధాంతాలను బ్రాహ్మణ వర్ణం స్వీకరించింది. పశుపోషక తెగలతో పాటు, ఆటవిక తెగల దేవుడిగా ఆమోదం పొందిన 'అవతార పురుషుడిగా' కృష్ణున్ని ఆరాధించడం ప్రాధాన్యత సంతరించుకుంది. తెగల సమూహాలను విలీనం చేసుకోవడం కొనసాగింది. విలీనం చేసుకున్న 'జాతుల'కు విధులను, స్థానాలను కల్పించినటువంటి 'వర్ణ-సంస్కార' సిద్ధాంతం, మనుస్మృతి (క్రీ.శ. 2వ శతాబ్దం) ఉనికిలోకి వచ్చాయి.

ఇనుప నాగలిని ఉపయోగించే విషయంలో, నక్షత్రాల విషయంలో బ్రాహ్మణులకున్న జ్ఞానం వలనా, వివిధ తెగలను 'ఆర్యీ'కరించడం ద్వారా లొంగదీసుకోవడంలో బ్రాహ్మణులు నిర్వహించిన పాత్ర వలనా ఆనాటికి వికసిస్తుండిన వ్యవసాయిక ఆర్థిక వ్యవస్థలో బ్రాహ్మణుల సామాజిక పునాది, ప్రాధాన్యత విస్తరించాయి. వీరు వివిధ తెగల, వాటి విలీనాల మూలాల నుండి ఆవిర్భవిస్తున్న పాలెగాళ్లకు రాజదర్బారులో వంశ నామావళిని తయారుచేసి ఇచ్చేవారు. ఇది అనేక మంది రాజుల పరిపాలనకు సమంజసత్వాన్ని కల్పించడానికి తోడ్పడింది. అందువల్ల, ఈ నయా బ్రాహ్మణ్యానికి పాలకుల మద్దతు-ప్రత్యేకించి గుప్తుల కాలం(క్రీ.శ. 4వ శతాబ్దం)లోనూ, ఆ తరువాతా లభించింది.

ఉత్తరాదిలోని కుషాణులు, శాకులు, దక్షిణాదిలోని వివిధ తెగలు వర్ణవ్యవస్థలో విలీనం కావడం, మున్నగు పరిణామాలతో కింది నుండి భూస్వామ్యం తలెత్తుతూ, వాణిజ్యం క్షీణించి స్వయంపోషక గ్రామ ఆర్థిక వ్యవస్థ అస్థిత్వంలోకి వచ్చిన, క్రీ.శ. 6వ శతాబ్దం నాటికి మౌర్య సామ్రాజ్యం పతనమై, ఈ నయా బ్రాహ్మణ్యమూ, మనుస్మృతిపై ఆధారపడిన కులవ్యవస్థ భారతదేశంలోని అత్యధిక భాగంలో ప్రాబల్యాన్ని సాధించింది.

లోగడ యజ్ఞంపై ఆధారపడిన బ్రాహ్మణ్యానికీ, వర్ణాశ్రమ ధర్మానికీ సవాలుగా బౌద్ధం ఆవిర్భవించింది. శక్తివంతమైన వర్తక గిల్డులు, చేతివృత్తుల గిల్డులు బౌద్ధానికి దన్నుగా నిలిచాయి. వైశ్యవర్ణపు ఆకాంక్షలను కూడా బౌద్ధం ప్రతిఫలించింది. 'అర్థశాస్త్ర' రాజ్యం వైశ్యవర్ణంలోని ఉన్నత వర్గాలను (నగర-శెట్టి, గహపతి) ప్రభువర్గంలోనూ, అధికార యంత్రాంగంలోనూ చేర్చుకుంది. 'అర్థశాస్త్ర' రాజ్యం మతాతీతమైనదే అయినప్పటికీ, అది బౌద్ధం, జైనాలకు ప్రధానంగా మద్దతునిచ్చింది. దిగువ కర్మకార శూద్రులు కూడా విడివడిపోయి వర్ణాల అంతస్థుల వ్యవస్థలో

పైకి ఎగబాకారు. దాస శూద్రులు బౌద్ధ సంఘాలలో చేరలేకపోయినప్పటికీ, వారు కూడా బౌద్ధం యొక్క ప్రజాస్వామిక ఆకాంక్షకు మద్దతునిచ్చారు. తరువాతి కాలంలో వాణిజ్యం క్షీణించి గ్రామాలపై ఆధారపడిన ఆర్థిక వ్యవస్థ ఆవిర్భవించడంతో, ప్రధానంగా పట్టణాలపై ఆధారపడిన బౌద్ధారామాలు తమ సామాజిక పునాదిని కోల్పోయాయి. భూరి భూదానాలను స్వీకరించి భూయాజమాన్య సంస్థలుగా మారిపోయిన బౌద్ధారామాలను ప్రజలు పాలకవర్గాల్లో భాగంగానే చూడడంతో వాటి ఆకర్షణ కోల్పోయాయి. అపరిమిత వ్యయంతో కూడిన, కానుకలపై ఆధారపడిన సంపన్నమైన ఈ బౌద్ధారామాలు, గ్రామస్థాయి లోని బ్రాహ్మణులతో పోల్చదగినటువంటి ఉపయోగకరమైన పాత్రను పోషించలేదు. మరోవంక నయా బ్రాహ్మణ్యం మిగులును దోచుకోవడంలోనూ, ప్రజలను అణచి ఉంచడంలోనూ ఆర్థిక వ్యవస్థలో ఉపయుక్తమైన పాత్రను నిర్వహించింది. అందువల్ల పాలకులు ఈ నయా బ్రాహ్మణ్యానికే ప్రాధాన్యతనిచ్చారు. ఉదాహరణకు: క్రీ.శ. 2వ శతాబ్దిలో వింధ్యకు దక్షిణాన గల శాతవాహనులూ, క్రీ.శ. 575లో దక్షిణాదిలోని పల్లవులూ తమను తాము క్షత్రియులుగాను, బ్రాహ్మణులుగాను వర్ణించుకొని, వర్ణాశ్రమ ధర్మాన్ని సమర్థించారు. వ్యవసాయిక ఆర్థిక వ్యవస్థకు ఉపయోగపడే అహింస, కర్మ సిద్ధాంతం, శాఖాహారం వంటి బౌద్ధంలోని లక్షణాలను అప్పటికే నయా బ్రాహ్మణ్యం స్వీకరించింది.

యూరపులో క్రీ.శ. 3వ శతాబ్దం తర్వాత రోమన్ సామ్రాజ్యం పతనం కావడం ఎలా జరిగిందో, మన దేశంలో గుప్తుల కాలం తర్వాత వర్తక గిల్డులు, చేతివృత్తుల గిల్డులు క్షీణించడం, ద్రవ్య చలామణి కుంచించుకుపోయి చేతివృత్తుల వారు గ్రామాలలో స్థిరపడడం, స్వయం సంపూర్ణ గ్రామీణ ఆర్థిక వ్యవస్థ అభివృద్ధి చెందడం జరిగాయి. ఈ పరిణామాలు కులాలపై ఆధారపడిన ఫ్యూడల్ విధానం తలెత్తడానికి అవసరమైన పరిస్థితులను సృష్టించాయి. ఫ్యూడల్ విధానం తలెత్తడంతో పన్నుల రూపేణా లేదా ఉత్పత్తిలో వాటా రూపేణా రైతాంగం నుండి, శ్రామిక ప్రజల నుండి మిగులును దోచుకునే దళారీ వర్గం ఆవిర్భవించడం కనపడుతుంది. మొదట్లో కేవలం భూదానాలు (బ్రాహ్మణులకు, బౌద్ధారామాలకు, సైనికాధికారులకు, ఇతర అధికారులకు) ఇచ్చేవారు. తరువాతి కాలంలో వారికి పాలనాపరమైన విధులను కూడా కేటాయించారు. దళారీలకు పాలనాపరమైన విధులు ఇవ్వడం క్రీ.శ. 2వ శతాబ్దంలో శాతవాహనుల పాలనా కాలంలో మొదట ప్రారంభమై, గుప్తుల కాలం (క్రీ.శ. 4వ శతాబ్దం)లో ప్రాచుర్యంలోకి రావడంతో వర్ణ వ్యవస్థలోని యజమాని బానిస పరిస్థితులు నశించాయి. ఇళ్లలో పని చేయటానికి మాత్రమే దాసులను వినియోగించుకునేవారు. యజమానులకు రకరకాల సేవలు చేయడం వీరి పని. ఒకవైపు అర్ధబానిస వ్యవస్థ, మరొకవైపు వర్ణాలు కులాలుగా మారే పరిణామం కొనసాగింది. ఒకే వృత్తి వారు ఒకే కులంగా మారడం ప్రారంభమైంది. వృత్తి, కులం పర్యాయపదాలైనాయి.

గుప్తుల కాలంలోనూ, ఆ తర్వాతనూ మత సంబంధమైన మరిన్ని హక్కులను నిర్వచించకల్పించడంతో శూద్రుల పరిస్థితి క్రమంగా మారింది. చాలా మంది చేతివృత్తుల వారినీ,

ఆదివాసులనూ అంటరానివారిలో చేర్చి శూద్ర సముదాయాన్ని విభజించారు. క్రమంగా పెరుగుతున్న అంటరానివాళ్లతో బాటు మొదటి నుంచి దాస స్థితిలో మగ్గుతున్న వాళ్లందరినీ అపరిశుద్ధ శూద్రులుగా పరిగణించి, వాళ్లకు ప్రత్యేకంగా మతసంబంధ నియమావళిని రూపొందించారు. వ్యవసాయ కూలీలను, కొన్ని 'అథమ' శ్రేణి చేతివృత్తుల వాళ్లనూ, మరికొందరినీ అపరిశుద్ధ శూద్రులుగా పరిగణించారు.

మౌర్యుల పతనం నుండి ఉత్తర భారతంలో స్వయంపోషక గ్రామీణ వ్యవస్థ ఏర్పడడం ప్రారంభమైంది. ఆటవిక గణాలను స్వయంపోషక గ్రామ సమాజంలో కలుపుకునే క్రమంలో కులాలు విస్తరించాయి. కులాలుగా మార్చబడిన తెగల దేవతలనూ, దేవుళ్లను బ్రాహ్మణీకరించి గుళ్లు కట్టారు. కుల వ్యవస్థను కట్టుదిట్టం చేశారు. ఈ కుల వ్యవస్థకూ, యజుర్వేదకాలపు వర్ణవ్యవస్థకూ గల సామాజిక పునాదులు పూర్తిగా భిన్నమైనవి. ఆహార ఉత్పత్తి కొత్తగా అలవడిన దశలో, ఆర్యులకు లొంగిన ఆర్యేతరుల చేత శ్రమ చేయించి ఆహారం ఉత్పత్తి చేయించుకోవడానికి శూద్ర వర్ణం సరిపోయింది. ఆర్యులలోని సామాన్య జనాన్నీ, పాలకవర్గాన్నీ వేరు చేయడానికి వైశ్యులు, బ్రాహ్మణ, క్షత్రియులు అనే విభజన సరిపోయింది. స్వయంపోషక గ్రామాలకు ఈ చతుర్వర్ణం ఎంతమాత్రం చాలలేదు. వ్యవసాయ విస్తరణ క్రమంలో సామాజికోత్పత్తి వృద్ధి చెందుతూ, సామాజిక అవసరాలకు అనుగుణంగా నూతన వృత్తులు వృద్ధి చెందుతూ నూతన గ్రామీణ సమాజం ఏర్పడ్డ క్రమంలోనే వర్ణవ్యవస్థతో ప్రమేయం లేకుండా అనేక 'శూద్ర' కులాలు ఏర్పడ్డాయి. నిజమైన వ్యవసాయదారులు, వృత్తి పనివారు శూద్రులై, వైశ్యులు వర్తకానికి పరిమితమైనారు. శూద్రుల సంఖ్య అపరిమితంగా పెరిగిపోగా వైశ్యులు అల్పసంఖ్యాకులయ్యారు.

సుమారు క్రీ.శ. 6వ శతాబ్దం నుండి కులవ్యవస్థ భారతదేశంలోని చాలా ప్రాంతాలలో సంఘటితం కావడం ప్రారంభమైంది. వర్ణాలు కులాలుగా మారాయి. భారతీయ చతుర్వర్ణ వ్యవస్థలో కర్షకుడు శూద్రుని స్థానం కలిగి ఉండగా, 'మలినమైన' పనులుగా పరిగణించబడే చచ్చిన పశువుల తోళ్లను తొలగించి శుభ్రం చేయడం, పశువులను చంపడం వంటి పనులను కుటుంబంలోని దాసుల చేత చేయించేవారు. భారత ఫ్యూడల్ సమాజంలో చతుర్వర్ణాలతో పాటు ఐదవ వర్ణం (పంచములు) గా అంటరానివారితో, అట్టడుగువారితో (అత్యంత పీడితులతో) ఏర్పడింది. వైశ్యులలో అధిక భాగం శూద్రుల స్థాయికి చేరుతూ వారిలో కలిసిపోతున్న క్రమంలో, దాసులు పెరుగుతున్న క్రమంలో మలినమైన పనులు చేయడానికి అంటరానివారు అనే 5వ వర్ణం సృష్టించబడింది. వర్ణవ్యవస్థ పునాదుల్ని గట్టిపరచడంలో, శూద్రులను అణచిపెట్టడంలో కర్మ సిద్ధాంతం ప్రధాన పాత్ర వహించింది. వర్ణ ధర్మాన్ని భగవంతుడు నిర్దేశించాడనీ, దానిని అచరించక పోవడం వల్ల దుష్పరిణామాలు సంభవిస్తాయనీ, కర్మ బలీయం కాబట్టి నిస్సహాయంగా అనుభవించాల్సిందేననే భావజాలంతో నాల్గవ, ఐదవ వర్ణాలను అణిచిపెట్టి ఉంచగలిగారు.

వాణిజ్యం క్షీణించడంతో వైశ్యవర్ణం జనాభాలోని అతి చిన్న భాగంగా మారింది. వైశ్యవర్ణంలోని చాలా మంది రైతులుగా మారి శూద్రవర్ణంలో భాగమయ్యారు. రైతులు తమ ఫ్యూడల్ ప్రభువులు ఎప్పుడు ఆజ్ఞాపిస్తే అప్పుడు యుద్ధానికి సిద్ధమయ్యే పార్ట్‌టైమ్ సైనికులు కావడంతో, క్షత్రియ వర్ణం కూడా జనాభాలోఅతిచిన్న భాగంగా మారింది. ఉత్తరాదిన గుజ్జర్లు, హూణులు వంటి దండయాత్రికులలోని పాలక గణాలు లేదా శక్తిమంతమైన గణాలు, ఆర్య క్షత్రియులు, ఫ్యూడల్ మధ్యవర్తులు (feudal intermediaries) రాజపుత్ర కులంగా వ్యవస్థీకృతమయ్యారు. ఫ్యూడల్ అంతస్థుకు చెందిన సమూహాలలోని గణ, బంధుత్వ సంబంధాలు వివాహ సంబంధాల ద్వారా సంఘటితమై రాజపుత్ కులం రూపొందింది. ఈ పదం మధ్యయుగాల ప్రారంభంలో కొన్ని గ్రామాలపై ఆధిపత్యం కలిగినవారి నుంచి వచ్చింది. గంగానది పరివాహక ప్రాంతంలో బ్రాహ్మణులు, క్షత్రియులు, వైశ్యులు, శూద్రులు మాత్రమే ఉండేవారు. ఈ కాలంలో దక్షిణాదిన గ్రామ పెద్దను కూడా చాలా ముఖ్యమైన వాడిగా పరిగణించేవారు. సాధారణంగా ప్రబలమైన వ్యవసాయ కులానికి చెందిన పెద్ద పెద్ద భూయజమానులు వ్యవసాయం చేసే తమ తోటి రైతు కులస్థుల నుండి విడివడిపోయి తమలో అంతర్గత వివాహ సంబంధాల ద్వారా, బంధుత్వ సంబంధాల ద్వారా స్థానికంగా తమ స్థానాల్ని సంఘటితపరచుకున్నారు. ఈ క్రమంలోనే ఆంధ్రప్రదేశ్‌లో రెడ్ల నుండి పెద్ద రెడ్లు, కర్నాటకలో గౌడ అనే ప్రత్యేక కుల సమూహాలు ఆవిర్భవించాయి. కులవ్యవస్థ భారతదేశంలోని ఫ్యూడలిజంతో విడదీయలేని విధంగా పెనవేసుకు పోయింది.

అంటరాని కులాల సంఖ్య పెచ్చుపెరిగి పోయింది ఈ కాలంలోనే. అంటరాని వారిని గురించిన ప్రస్తావనలు క్రీ.పూ. 4వ శతాబ్దం నాటికే ఉన్నాయి. ఉదాహరణకు, శూద్రులను రెండు రకాలుగా – నిరాశ్రిత (వెలివేయబడిన), ఆశ్రిత శూద్రులుగా పతంజలి ప్రస్తావించాడు. మొదట అంటరానివారి సంఖ్య పరిమితంగా ఉండేది. క్రమక్రమంగా కొత్త కొత్త తెగలను ఇందులో చేర్చుకోవడం మొదలైంది. అయితే, ఫ్యూడల్ కాలంలోనే వారి సంఖ్య బాగా పెరిగింది. ఉదాహరణకు, చర్మకారులు (పశువుల తోళ్లు ఒలిచేవారు లేదా తోలుతో పని చేసేవారు), రజకులు అంటరానివారి స్థాయికి నెట్టబడ్డారు. బలవంతంగా లొంగదీసుకున్న తెగల అడవులను/భూములను, జీవనాధార సాధనాలను, స్వేచ్ఛను హరించివేసి వారిని అంటరానివారి స్థాయికి దిగజార్చారు. శూద్రవర్ణం లోని కొన్ని చేతివృత్తుల సముదాయాలను కూడా అతిశూద్ర శ్రేణుల్లోకి తోసివేశారు. అలాంటివారు ప్రధానంగా మత ఆదేశాల ద్వారా సంపద (బంగారం వగైరా)ను, భూములను కలిగి ఉండడం నిరాకరించబడిన కట్టుబానిస వ్యవసాయ కూలీలు. మొత్తం గ్రామం కోసం, ప్రత్యేకించి భూయజమానుల వర్గం కోసం శ్రమ చేయడం మాత్రమే వారి విధి (ధర్మం)గా ఉండేది. గ్రామానికి బయట దూరంగా వారు నివశించాలి. వారి నీడ కూడా మైలపరిచేదే. ఇలా అంటరాని శ్రామికులను అతి హీనమైన భౌతిక జీవితంలోకి, శాశ్వతమైన దాస్యంలోకి నెట్టివేయడం ద్వారా ఉత్పాదక మిగులును అతి ఎక్కువగా దోచుకోగలిగారు.

క్రీ.శ. 10వ శతాబ్దం నాటికే, గజినీ మహమ్మద్ దండయాత్రలకు ముందే దేశంలో కులవ్యవస్థ సంఘటితమయ్యే క్రమం పూర్తయ్యింది. ఫ్యూడల్ వర్గం కులవ్యవస్థకు దన్నుగా నిలిచింది. బౌద్ధాన్ని ప్రచారం చేసిన పాలకులు కూడా కులవ్యవస్థకు సగౌరవంగా దన్నుగా నిలిచినవారే. శారీరక శ్రమతో సంబంధమున్న అన్ని కులాల (వ్యవసాయదారుల, చేతివృత్తుల) వారు లేదా బ్రాహ్మణుల ఆధిక్యతను లేదా వర్ణాల అంతస్థులను ప్రశ్నించిన వారు శూద్రులుగా వర్గీకరించబడ్డారు. మనుస్మృతి (క్రీ.శ. 2వ శతాబ్దం) భూస్వామ్యానికి, దోపిడీ వర్గాల ఆధిక్యతకు సమర్థవంతమైన భావజాల సమంజసత్వాన్ని సమకూర్చింది. అత్యధిక ప్రజల స్వేచ్ఛను హరించి వారిని హీన స్థితికి గురి చేయడాన్ని ~~శాసించింది.~~ఆమోదించింది.

క్రీ.శ. 13వ శతాబ్దంలో బానిస వంశం ద్వారా ఉత్తర భారతదేశంలో తురుష్క (Turkish) పాలన ప్రారంభమైంది. దానితో భారతదేశ ఫ్యూడల్ ఉత్పత్తి విధానంలో ఒక ముఖ్యమైన దశ ప్రారంభమైంది. తురుష్క పాలన కింద పరిపాలనా వ్యవస్థ కేంద్రీకృతమైంది. శిస్తు వసూలుకు వారు మరింత క్రమబద్ధమైన పద్ధతిని ప్రవేశపెట్టారు. పాలకవర్గాల పొందికలో మార్పులొచ్చాయి. మొదట్లో తురుష్క కుటుంబాలు, వారి బంధువులు పరిపాలించారు. ఆ తర్వాత క్రమంగా వారి స్థానం లోకి భారతీయ సంతతికి చెందిన దాసులు, భారతీయులుగా మారిన తురుష్కులు, విదేశాల నుండి వలస వచ్చినవారు ప్రవేశించారు. ఇంకా, చాలా మంది విదేశీయులు, నిమ్న కులాలకు చెందిన హిందువులు కూడా పాలకులయ్యారు. శిస్తు వసూలు హక్కుల (ఇక్తా) పద్ధతికి సంబంధించి ముఖ్యమైన మార్పులు చేశారు. మొదట్లో ఈ శిస్తు వసూళ్ల హక్కు జీవిత కాలానికి మాత్రమే పరిమితమై ఉండేది. 15వ శతాబ్ది చివరికల్లా వారసత్వంగా సంక్రమించేదిగా మారిపోయింది. తురుష్కులు పట్టణాలను కేంద్రంగా చేసుకున్నారు. వారు ఇస్లాం మతాన్ని ఆరాధించారు. ఆ విధంగా వారు తొలుత ఉండిన పాలెగాళ్లను తొలగించి కాలక్రమేణా కొత్తవారిని ఏర్పాటు చేశారు.

తురుష్కులు ప్రవేశపెట్టిన పరిపాలనాపరమైన మార్పులను దక్కన్ ప్రాంతంలో కూడా అనుసరించారు. సైనిక సర్వీసులలో ఉన్నవారు, పాలనాధికారులు, గ్రామపెద్దలు, పురోహితవర్గం శిస్తు వసూలు అధికారాలకు సంబంధించి, పరిపాలనకు సంబంధించి వారు ప్రవేశపెట్టిన మార్పుల ప్రభావానికి గురయ్యారు. కార్యాలయ అధికారులను ఈనామ్‌దారులు, వతన్‌దారులు, ఇక్తాదారులు, దేశ్‌ముఖ్‌లు, దేశాయ్‌లుగానూ, ఆ తరువాతి కాలంలో జాగీర్‌దారులు (మొగల్‌ల కాలంలో)గానూ వ్యవహరించేవారు. ఉత్తర భారతదేశంలోని ఫ్యూడల్ వర్గం అస్థిరతకు గురైంది. అయితే పదవులు కోల్పోయిన కొందరు పాత ఫ్యూడల్ మధ్యవర్తులు ఫ్యూడల్ వర్గ సంపుటి అస్థిరంగా ఉన్న తురుష్క పాలనలోని తరువాతి కాలంలో తిరిగి తమ పదవులను సంపాదించుకోగలిగారు. యుద్ధశాస్త్రంలో తురుష్కులు నూతన పద్ధతులను ప్రవేశపెట్టారు. పట్టణ ప్రాంతాలలోని వాణిజ్యం, వర్తకం, చేతివృత్తులను వారు ప్రోత్సహించారు కూడా. ఫలితంగా, ఈ కాలంలో భారతదేశ సమాజంలోని ఉత్పత్తి శక్తులు అభివృద్ధి చెందడం కనబడుతుంది.

దక్షిణ భారతదేశంలో పాలకవర్గాల పొందిక మాత్రం ఎలాంటి మార్పుకూ గురికాలేదు. కానీ పీడిత కులాలకు చెందిన కొన్ని విభాగాలు పాలకవర్గాల్లోకి చేర్చుకోబడ్డాయి. ఉదాహరణకు సైనికవర్గమైన నాయకర్‌లు విజయనగర సామ్రాజ్యంలో 'అమరం' (75 సంవత్సరాలు) అనే నిర్ణీతకాలం పాటు హక్కులుండే భూములను పొంది దళారులుగా మారారు. ఈ కాలంలో పలు తెగ రాజ్యాలు అవిర్భవించాయి. హిమాలయ ప్రాంత పర్వతాలలోని డోమ్‌లు క్రీ.శ. 13వ శతాబ్దంలో, అస్సాంలోని బోడోలు 13-18 శతాబ్దాల్లోనూ, ఛోటానాగపూర్, పలాములోని నాగవంశీయులు, చెరోలు 12వ శతాబ్దంలోనూ, మధ్య భారతదేశంలోని గోండ్‌లు 15-18 శతాబ్దాలలోనూ, దక్షిణ గుజరాత్‌లోని మహదేవ్ కోలీలు 13వ శతాబ్దంలోనూ రాజ్యాలు ఏర్పరచుకున్నారు. పొరుగున ఉన్న మైదాన ప్రాంతాల నుండి సాంకేతిక పరిజ్ఞానాన్ని, సంస్కృతిని స్వీకరించి ఈ తెగలు అప్పటికే స్థిర వ్యవసాయ దశకు అభివృద్ధి చెందాయి. ఈ తెగ సమాజాలలో అసమానతలు అప్పటికే వృద్ధి చెందాయి. తొలుత బ్రాహ్మణీయ హిందూ మతాన్ని వారు వ్యతిరేకించారు. అయితే తరువాతి కాలంలో వారు హిందూ మతాన్ని లేదా బౌద్ధమతాన్ని స్వీకరించారు, లేదా ఇస్లాం మతంలోకి మారారు. మరాఠాల లేదా మొగలుల పరిపాలనా కాలంలో వారు సామంతులు(vassal)గా మారారు.

వర్తకం, సరుకుల ఉత్పత్తి వృద్ధి చెందడం, రాజకీయపరమైన, సాంస్కృతికపరమైన మార్పులు సంభవించడం, ఫ్యూడల్ సమాజం లోపల కులవ్యవస్థకు వ్యతిరేకంగా నిరసన తలెత్తడానికి భౌతిక పరిస్థితులను సృష్టించాయి. ఈ పరిణామం 12వ శతాబ్దం ప్రాంతంలో దక్షిణ భారతదేశంలోనూ, ఒక శతాబ్దం తరువాత ఉత్తర భారతదేశంలోనూ వ్యాపారుల, చేతివృత్తుల సముదాయాలు బలపడడానికీ, తమ ప్రయోజనాల కోసం వారు దృఢంగా నిలబడడానికీ దారితీసింది. దక్షిణ భారతదేశంలో ఆ దశలో 'ఎడగై' (ఎడం చెయ్యి), 'బలగై' (కుడి చెయ్యి) అనే కుల సంఘాలు మొదలయ్యాయి. సరుకు ఉత్పత్తి విధానం, మార్కెట్ అభివృద్ధినీ ఇది సూచిస్తుంది. 'ఎడగై' సరుకులు ఉత్పత్తి చేసే, వృత్తులు చేసే కులాలకు ప్రాతినిధ్యం వహిస్తే, 'బలగై' వ్యాపార కులాలకు ప్రాతినిధ్యం వహించింది. తరచుగా ఈ సంఘాలు ఐక్యంగా ఫ్యూడల్ దోపిడీని ఎదిరిస్తూ ఉండేవి. ఉత్తర భారతదేశంలో 'జూలా' చేతివృత్తుల కులాలు (నేత పనివారు) ఇస్లాం మతం స్వీకరించారు.

12-17 శతాబ్దాల మధ్య, కులవ్యవస్థ పట్ల, బ్రాహ్మణీయ ఆధిక్యత పట్ల గణనీయమైన వ్యతిరేకతను వ్యక్తంచేస్తూ ప్రజలను బాగా ఆకట్టుకున్న భక్తి ఉద్యమాలు పెల్లుబికాయి. ఈ మత సంస్కర్తలలో కొందరు బ్రాహ్మణులు కూడా ఉన్నప్పటికీ, భక్తి ఉద్యమ ప్రబోధకులలో ఎక్కువ మంది కుమ్మరి, వడ్రంగి, నేత వంటి చేతివృత్తుల కులాలకు చెందినవారే. నందన్ (నయనార్), తిరుప్పన్ (ఆళ్వార్), చొఖమేల, సంత్‌రవిదాస్ వంటి కొందరు 'అంటరాని కులాలకు' చెందినవారు కూడా వుండిరి. ఈ ఉద్యమం మహిళా ప్రబోధకులను కూడా వెలుగులోకి తెచ్చింది.

ఏకేశ్వరోపాసనను నొక్కి చెప్పిన రామానుజ, జ్ఞానేశ్వర్, చైతన్య వంటి వారి మితవాద స్రవంతి కూడా ఈ భక్తి ఉద్యమంలో ఉండింది. బసవన్న, తుకారాం, నామ్‌దేవ్, కబీర్, గురునానక్ వంటి ప్రబోధకులతో కూడిన మరింత రాడికల్ స్రవంతి కులవివక్షను, బ్రాహ్మణీయ కపటత్వాన్ని ఎండగట్టింది. వారిలో కొందరు సాంఘిక సంస్కరణ చర్యలను చేబట్టారు కూడా. కబీరు, గురునానక్ హిందూ మతం పరిధి నుంచి వైదొలగిపోయారు. భగవంతునికీ, భక్తునికీ మధ్య వైయక్తిక సంబంధాన్ని నొక్కి చెప్పిన ఈ ఉద్యమం కులాల హద్దులను అధిగమించింది. జ్ఞానం పైనా, వేదాల పైనా గుత్తాధిపత్యంపై ఆధారపడిన బ్రాహ్మణీయ ఆధిక్యతా భావనను ఈ ఉద్యమం పెద్ద దెబ్బతీసింది.

ఫ్యూడలిజపు భావజాలపరమైన, భౌతికపరమైన ఆవరణం పైన భక్తి ఉద్యమం పెద్ద దాడి చేసింది. స్థానిక భాషలలో బోధన గావించిన భక్తి ఉద్యమం ప్రాంతీయ భాషలకు ప్రాధాన్యతనిచ్చింది. తద్వారా, వివిధ ప్రాంతాలలో జాతీయవాదం వృద్ధి చెందడానికి అది పునాది వేసింది. అయితే, భక్తి ఉద్యమ చివరి దశలో చాతుర్వర్ణ వ్యవస్థను సమర్థించి బ్రాహ్మణీయ ఆధిక్యతను, ప్రతిష్టను తిరిగి నెలకొల్పాలని వాంఛించిన రామదాస్, తులసీదాస్‌ల రూపంలో ఒక మితవాద ధోరణి తలెత్తింది. అయినప్పటికీ, మొత్తంగా చూస్తే ప్రధానంగా భక్తి ఉద్యమం మత, సాంఘిక సంస్కరణల కోసం సాగిన ఉద్యమం. ఆనాటి చారిత్రక పరిమితుల వలన కులవ్యవస్థకు పునాదైన ఫ్యూడల్ ఉత్పత్తి విధానం పైన, ఫ్యూడల్ ఉత్పత్తి సంబంధాల పైన ఈ ఉద్యమం దాడి చేయలేకపోయింది. అందువలన ఈ ఉద్యమం కులవ్యవస్థను విచ్ఛిన్నం చేయడంలో విఫలమైంది.

క్రీ.శ. 16వ శతాబ్దంలో మొగలులు కూడా ఉత్తరాదిలో, దక్కన్ ప్రాంతంలో తాము జయించిన రాజ్యాలలోని పాలక గ్రూపుల, రాజ్‌పూత్ నాయకుల, ఇతర సంపన్న (పీడక) కులాల దళారుల సహాయంతో తమ అధికారాన్ని సంఘటితపరుచుకున్నారు. మొగలులు డబ్బు రూపంలో శిస్తును ప్రవేశపెట్టారు. నీటి పారుదల వ్యవస్థలో మెరుగైన మార్పులు తెచ్చారు. వ్యవసాయ ఉత్పత్తి, వాణిజ్యమూ కూడా పెరిగాయి. అయినప్పటికీ మొగలుల పాలన గ్రామస్థాయిలోని సామాజిక నిర్మాణాన్ని మార్చలేదు. గ్రామీణ వ్యవస్థలో అగ్రభాగంగా పరిపాలనా బాధ్యతలు, అధికారాలు కలిగిన పీడక కులాల లేదా బ్రాహ్మణ లేదా రాజ్‌పూత్ దళారీలు, పెద్ద భూస్వాములు ఉండేవారు. వారు కౌలు రైతుల నుండి, భాగస్వామ్య రైతుల (Share-croppers) నుండి వసూలు చేసే శిస్తు పైన గానీ, లేదా తెగల, అంటరానికులాల వెట్టి శ్రామికుల శ్రమపైన గానీ ఆధారపడి బతికేవారు. శూద్ర పాలెగాళ్లు క్షత్రియుల స్థాయికి ఎదిగారు, కొన్ని సందర్భాలలో బ్రాహ్మణ హోదా సంపాదించారు కూడా. శతాబ్దాల తరబడి సాగుదార్ల కులాలు తమకూ, భూస్వాములకూ మధ్య వ్యవస్థీకృతమైన జాజ్‌మన్, బలూతెదారీ వ్యవస్థ (కమ్మరి, కుమ్మరి, వడ్రంగి, నేతకారులు మున్నగు కులాలతో కూడిన గ్రామీణ వ్యవస్థ పీడక కులాలకు సేవలు చేయడం వీరి విధి. దీనిని జాజ్‌మన్ అని అన్నారు. బలూతేదార్ అనేది మరాఠీ ప్రాంతంలో వున్న కుల వ్యవస్థను తెలిపేది) కారణంగా

భూమి తమదనీ, భూమిపై హక్కూ, ఉత్పత్తిలో వాటా తమకు దక్కాలనీ అంటూ ఉండినాయి. అయినప్పటికీ, ఈ వ్యవస్థ ఉచిత శ్రమను అనేక రెట్లు వెలికితీసే పీడక కులాలను గ్రామ స్థాయిలో సైతం మానవ శ్రమ నుంచి పూర్తిగా ఉపసంహరించేందుకు అనుమతించింది. చివరికి వెట్టి–బిగార్ పద్ధతి కూడా రూపుదిద్దుకుంది. ఈ పద్ధతి వలన ఒక ఆర్థికేతరమైన, నిర్బంధపూరితమైన కులపర దోపిడీ సంబంధాలు ఏర్పడ్డాయి. అంటరాని కులాలకు దిగువస్థాయి పనులను కేటాయించారు. వారిలో కొందరికి గ్రామంలోని కొద్దిపాటి భూమిని సాగు చేసుకునే హక్కు లభించినప్పటికీ, అత్యధికులు మాత్రం నిర్దిష్టంగా కొన్ని కుటుంబాలకు కట్టివేయబడిన వెట్టి సేవకులుగా, గృహ బానిసలుగా, భూమిలేని అర్ధ బానిసలుగా ఉండేవారు. మొగలుల పాలనా కాలంలో వెట్టి శ్రామికులు జనాభాలో 10 శాతంగా ఉండేవారు. దక్షిణాదిలో ఈ వెట్టి శ్రామికుల శాతం ఇంకా ఎక్కువగా ఉండేది.

**ఇస్లాం మత వ్యాప్తి – కులం:** మన దేశంలో ముస్లిం రాజుల దండయాత్రలకు చాలా కాలం ముందే మత గురువుల ద్వారా క్రిస్టియన్, ఇస్లామ్ మతాలు కేరళ రాష్ట్రంలోకి ప్రవేశించాయి. మొఘల్ పాలనా కాలంలో రాజ్య విస్తరణతో పాటు మత విస్తరణ కూడా జరిగింది. అయితే పీడక కులాలవారు ముస్లిం రాజుల ఆశ్రయం కోరి, ఆస్తుల కోసం, ఉన్నత పదవుల కోసం ఇస్లాంను స్వీకరించారు. వెనకబడిన కులాలు ప్రధానంగా దళితులు హిందూ మతంలోని కుల వివక్షతను భరించలేక దాని నుండి విముక్తి కోసం ఇస్లాంను స్వీకరించారు. ఇస్లాం మతంలో కుల వివక్షత లేకపోయినప్పటికీ హిందూ మతంలోని కులతత్వం హిందూ మతస్థుల ద్వారా ఇందులోకి చొరబడింది. ఇది ఇతర మతాలకూ వర్తిస్తుంది. దోపిడీకి కులం ఒక సాధనం కావడంతో అన్ని మతాలలోకి ఇది చొచ్చుకుపోయిందిస్వీకరించాయి. అయితే ఆయా మతాల్లో పాటించే కుల వివక్షలో తరతమ తేడాలు ఉన్నాయి. మొత్తం మీద, తురుష్కుల పాలన కుల సంకెళ్లు కొంత సడలడానికి తోడ్పడింది. అయితే స్థానిక స్థాయి నుండి కేంద్రం వరకు అధికార స్థానాలకు పీడక కులాలే దగ్గరగా ఉంటూ వచ్చాయి. మొఘల్ పాలనా కాలపు ఫ్యూడలిజం హిందూ రాజుల కాలపు ఫ్యూడలిజంతో మైత్రి నెరపింది, కుమ్మక్కైంది. ఫలితంగా ఉత్పత్తి సంబంధాలలో అంటే పునాదిలో ఎలాంటి మౌలిక మార్పులు సంభవించలేదు. బ్రిటిష్ పూర్వ ఫ్యూడల్ రాజ్యాలు ఉచితంగా శ్రమను పిండుకోవడం కోసం, ప్రత్యేకించి, ప్రభుత్వ పనుల కోసం శ్రమను పిండుకోవడం కోసమూ, కుల వివాదాల్లోనూ మధ్యవర్తిత్వం నెరపడం ద్వారా ఆర్థికంగా లబ్ది పొందడం కోసమూ కులవ్యవస్థను కాపాడాయి. చివరిదే కాని ప్రాధాన్యత కలిగినటువంటి మరొక అంశమేమంటే, కులవ్యవస్థ అధికారం చెలాయించడమన్న పాలకుల ధర్మాన్ని సమర్థించింది, వారి పాలనను న్యాయ సమ్మతమైనదిగా చేసింది.

## 2వ అధ్యాయం

# బ్రిటిష్ పాలన ప్రభావం,బ్రాహ్మణవాద వ్యతిరేక ఉద్యమాలు

## వర్గ విభజన మరియు కుల వ్యవస్థలో కలిగిన మార్పులు

వలస పరిపాలన బ్రాహ్మణీయ హిందూ వ్యవస్థను, అసమానతలతో కూడిన కులవ్యవస్థను గణనీయమైన మార్పుకు గురిచేసినా మౌలికంగా మార్చలేదు. సరికదా సాంప్రదాయకమైన స్థానిక ఆచారాలనుపక్కనపెట్టి కులవ్యవస్థను న్యాయవ్యవస్థలో చొప్పించడం ద్వారా నిజానికి అది, దానికి కొత్త ఊపిరులూదింది. శాస్త్రాలకు భాష్యం చెప్పడానికి, వాటిని అన్వయించడానికి బ్రాహ్మణ పండితులను వలస పాలకులు బ్రిటిష్ న్యాయమూర్తులకు సలహాదారులుగా నియమించారు. 'ఇతర కులాలలో స్థిరపడి ఉన్న సంప్రదాయాల' పేరిట వారు అంటరానివారికి ఆలయ ప్రవేశం నిరాకరించారు. కులవ్యవస్థ స్వయంప్రతిపత్తిని గౌరవించడం పేరిట బ్రిటిష్ న్యాయస్థానాలు కులపరమైన సంప్రదాయాలను ఆమోదించి చట్టబద్ధం చేశాయి. కుల కట్టుబాట్లను అతిక్రమించడానికి వ్యతిరేకంగా క్రమశిక్షణా చర్యలు తీసుకొనే అధికారం కులాలకు ఉండడాన్ని అవి ఆమోదించాయి. సంస్కృత అధ్యయనాన్నీ, సంస్కృత గ్రంథాలను ఇంగ్లీష్‌లోకి అనువదించడాన్ని బ్రిటీషువారు ప్రోత్సహించారు. వారు అందుకవసరమైన ఆర్థిక సహాయం చేశారు. వారు ఆర్యజాతి (race) యొక్క యూరోపియన్ మూలాలను నొక్కిచెబుతూ, కులం పుట్టుకపై జాత్యహంకార సిద్ధాంతాన్ని (racist theory), కులం యొక్క జాతిపరమైన స్వచ్ఛతను (racial purity) ప్రచారం చేశారు.

ఏదేమైనప్పటికీ, తమ పాలనను సుసంఘటితం చేసుకోవడం కోసం, భారతదేశంపై దోపిడీని తీవ్రతరం చేయడం కోసం 19వ శతాబ్దంలో వలస పాలన ప్రవేశపెట్టిన ఆర్థికపరమైన మార్పులు గ్రామీణ ప్రాంతాల్లోని ఉత్పత్తి సంబంధాలను తీవ్రంగా ప్రభావితం చేశాయి. వివిధ రూపాలలో నూతన వర్గాలను సృష్టించాయి. వలస పాలకులు భూమిని సరుకుగా మార్చడం, అన్ని కులాలకు చెందిన వారికి తరతమ స్థాయిల్లో భూమి అందుబాటులోకి రావడం, జమీందారీ పద్ధతి, రైత్వారీ పద్ధతి మొదలైన శిస్తు వసూలు పద్ధతులను ప్రవేశపెట్టడం, రైల్వేలు, పోర్టులు, రహదారులు, జౌళి పరిశ్రమలను ప్రవేశపెట్టడం, రక్షణ సంబంధమైన పనులు, వలసవాద విద్యావిధానం, ఉమ్మడి పౌర, నేర స్మృతులు ప్రవేశపెట్టడం వలన వారి అధికార యంత్రాంగం కులవ్యవస్థను తీవ్రంగానే ప్రభావితం చేసింది. సమాజంలో కులవ్యవస్థ నిర్వహించే పాత్రను కొంత మార్చడంతో పాటు కుల వ్యవస్థ వ్యతిరేక ఉద్యమాలు తలెత్తడానికీ, కులవ్యవస్థ సడలిపోవడానికి కావలసిన భౌతిక పరిస్థితులు కొంతవరకు సృష్టించబడినాయి.

బ్రిటిష్ పాలకులు తమ వలస పాలనకు మద్దతును కూడగట్టడం కోసం, ప్రత్యేకించి, 1857 మహత్తర ప్రథమ భారత సంగ్రామం తరువాత, విభజించి పాలించే విధానాన్ని అమలు

చేశారు. మిషనరీల ద్వారా పీడిత కులాలు క్రైస్తవ మతంలోకి మారడాన్ని వారు ప్రోత్సహించారు. మరోవైపు పీడిత కులాలు ప్రధానంగా దళితులు హిందూ మతంలోని వివక్షత, అంటరానితనం వంటి అమానవీయమైన దురాచారాలను భరించలేక క్రైస్తవ మతంలోకి వెళ్ళారు. పీడక కులాల వారు కూడా విద్య, వైద్యం వంటి ప్రయోజనాలనాశించి క్రైస్తవంలోకి మారారు. 1901 నుండి ప్రారంభించిన జనాభా లెక్కల సేకరణలో ప్రజల కులాల వివరాలను కూడా నమోదు చేశారు. తమ తమ కులాలను నమోదు చేయించుకోవడం కోసం, వివిధ కులాలు కులసభల ద్వారా, కుల పత్రికల ద్వారా ప్రాంతాలవారీగా సంఘటితం కావడానికి ఇది దారితీసింది.

ఉత్తర భారతదేశంలోని కాయస్థ కులానికి, కేరళలోని నాయర్ కులానికి చెందిన సంస్కర్తలు తమ కులాల్లోని కాలంచెల్లిన కట్టుబాట్లకు స్వస్తి చెప్పి, వలస పాలనలో అందుబాటులోకి వచ్చిన నూతన అవకాశాలకు అనుగుణంగా సర్దుబాటు కావడం కోసం కులాచారాల్లో మార్పులు తేవాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పారు. పీడిత కులాలలో కూడా, మైలపరిచేవిగా, హీనపరిచేవిగా పరిగణించేటటువంటి వృత్తులను మానడం కోసమూ, పీడక కులాల ఆచార వ్యవహారాలను అలవరచుకొని ఉన్నతస్థాయి హోదా పొందాలని ప్రయత్నించడం కోసమూ ఆ కులాలలోని పెటీబూర్జువా సెక్షన్లు తమ కులసంఘాలను సమీకరించాయి. చివరకు బ్రాహ్మణేతర ఉద్యమాల, సంస్కర్తల ఒత్తిడితో బ్రిటీషువారు చెరువులు, స్కూళ్లు, బావులు మొదలైన బహిరంగ ప్రదేశాల (public places)ను (ప్రభుత్వ నిధులతో నిర్వహించేవి) అన్ని కులాలకు, అన్ని వర్గాలకు అందుబాటులోకి తెస్తూ తీర్మానాలూ, చట్టాలూ చేయక తప్పలేదు. అయితే వాటిని అమలు చేయడం కోసం వారు పెద్దగా చేసిందేమీ లేదు.

బ్రిటిష్‌వారు తాము ప్రవేశపెట్టిన భూయాజమాన్య పద్ధతుల్లో నిజమైన సాగుదార్ల అనుల్లంఘనీయమైన హక్కులను విస్మరించారు. చాలా ప్రాంతాలలో దళారులు, సాగుదార్లు కానివారు, సాంప్రదాయికంగా ఉత్పత్తిలో పాల్గొనకుండా ఒక భాగాన్ని వాటాగా మాత్రమే కలిగినవారు భూమికి పూర్తి యజమానులైపోయారు. జమీందారీ ప్రాంతాలలోని శూద్ర రైతులు భూస్వాముల దయాదాక్షిణ్యాలపై ఆధారపడిన కౌలుదారులుగా మారిపోయారు. ఇతర ప్రాంతాలలో భూయజమానులైన రైతుల వర్గమొకటి ఆవిర్భవించింది. అయితే ఈ వర్గంలో కూడా పెద్ద రైతులు లాభపడగా అసలైన సాగుదార్లు కౌలుదార్లుగా, భాగస్వామ్య రైతులుగా మారారు. శూద్ర రైతాంగం ధనిక రైతులలో ఎగువ సెక్షన్‌గా, మధ్యతరగతి, పేద రైతులలో దిగువ సెక్షన్‌గా ఏర్పడ్డారు. తీవ్రతరమైన దోపిడీకి పన్నుల భారం, కరువు–కాటకాలు, ఇతర సంక్షోభాలు తోడుకాగా వ్యవసాయ కులాలన్నింటిలోని రుణగ్రస్తులైన రైతులు భూమిలేనివారిగా దిగజారిపోయారు. చేతివృత్తులవారిలోని ఒక విభాగం కూడా భూమిలేని కూలీలుగా మారారు.

19వ శతాబ్దంలో పలు కింది (పీడిత) వెనుకబడిన, దళిత కులాల నుండి గ్రామీణ నిరుపేద

వర్గం, భూమిలేని, పేద రైతాంగం ఆవిర్భవించింది. ఈ వెనుకబడిన, దళిత కులాల నుండి పారిశ్రామిక ఉత్పత్తితో ముడిపడిన కార్మికవర్గం కూడా ఆవిర్భవించింది. ఈ కులాలలోని ఒక చిన్న సెక్షనుకు కూడా చిన్న కాంట్రాక్టర్లుగా, వ్యాపారులుగా మారి సాంఘికంగా ఉన్నత స్థాయికి ఎదిగే, భూములు సంపాదించుకునే అవకాశాలు లభించాయి. విద్యావకాశాలూ, సైనిక సర్వీసులు, ప్రాథమిక సదుపాయల (ఇన్‌ఫ్రాస్ట్రక్చర్)తో పాటు జనపనార పరిశ్రమల పనులలోకి, ప్రభుత్వ యంత్రాంగాలలోకి ప్రవేశించే అవకాశాలు అందుబాటులోకి రావడంతో వెనుకబడిన, దళిత కులాలలో పెటీబూర్జువా వర్గం కూడా వృద్ధి చెందింది. ఇలా ఏర్పడిన ఆ పెటీబూర్జువా వర్గం, ప్రభుత్వోద్యోగాల పైన బ్రాహ్మణులకున్న గుత్తాధిపత్యం తమ అవకాశాలకు ఆటంకంగా ఉన్నదని గుర్తించింది. బ్రాహ్మణులు తదితర పీడక కులాలకు ఉన్న సాంప్రదాయిక విద్య వలనా, సామాజికంగా, ఆర్థికంగా శక్తివంతమైన స్థితి వలనా, వారు అనతికాలంలోనే పాశ్చాత్య విద్యనభ్యసించి పరిపాలనా యంత్రాంగంలోనూ, న్యాయవ్యవస్థలోనూ అధికభాగం ఉద్యోగాలను ఆక్రమించగలిగారు. ఈ విధంగా పాశ్చాత్య విద్యను ప్రవేశపెట్టడం బ్రాహ్మణులు వలస అధికార యంత్రాంగంపై గుత్తాధిపత్యం సంపాదించడానికి తోడ్పడింది.

## బ్రాహ్మణవాద వ్యతిరేక ఉద్యమాలు

బ్రాహ్మణేతర కులాలలో నూతన వర్గాలు అభివృద్ధి చెందడమనేది ఆ కులాలలో ప్రజాస్వామిక చైతన్యం వృద్ధి చెందడానికి దారితీసింది. బ్రాహ్మణీయ ఫ్యూడల్ ఆధిపత్యానికి, దోపిడీకి వ్యతిరేకంగా, శూద్ర, అతిశూద్ర కులాలను సమీకరించడం ద్వారా, 19వ శతాబ్దం చివరలో దక్షిణ, పశ్చిమ భారతదేశంలో బ్రాహ్మణవాద వ్యతిరేక ఉద్యమాలు ముందుకు వచ్చాయి. ఈ ఉద్యమాలు కులపీడనకు సంబంధించిన వివిధ అంశాలపైనా, మూఢాచారాల పైనా, కులపరమైన, ఫ్యూడల్ సంబంధమైన ఆధిక్యత, హక్కుల పైనా, పదవులను వంశపారంపర్యంగా కైవశం చేసుకోవడం పైనా, సంస్కృతంపై ఆధారపడిన విద్య మొదలైన వాటిపైనా కేంద్రీకరించాయి. కుల పీడనను వివరించడానికి గానూ ద్రవిడ జాతిని జయించిన ఆర్య–దురాక్రమణదారులుగా బ్రాహ్మణులను వ్యాఖ్యానించే జాతిపరమైన (racial) కుల పుట్టుక సిద్ధాంతాన్ని ఈ ఉద్యమం ముందుకు తెచ్చింది. విద్యారంగంలో, ప్రభుత్వోద్యోగాలలో, చట్టసభలలో బ్రాహ్మణుల గుత్తాధిపత్యాన్ని వ్యతిరేకించే పోరాటానికీ, జిల్లా బోర్డులో ప్రాతినిధ్యం సంపాదించి దానిపై అదుపు సాధించడం కోసం చేసే పోరాటానికీ పరిమితం కావాలని ఈ బ్రాహ్మణవాద వ్యతిరేక ఉద్యమంలోని మితవాద ధోరణి భావించింది. జస్టిస్‌పార్టీ, బ్రాహ్మణవాద వ్యతిరేక పార్టీ, యూనియనిస్టు పార్టీ (పంజాబు) ఈ ధోరణికి చెందినవే. ఇతర చోట్ల కూడా ఆర్య సమాజ్, గుజరాత్‌లో పాటిదార్‌లు, రాజ్‌పుత్ గ్రూపులు ఈ ధోరణికి ప్రాతినిధ్యం వహించాయి. బిహార్‌లోని త్రివేణి సంఘ్ కూడా మూడు ప్రధానమైనశూద్ర కులాలైన యాదవ, కుర్మి, కోయిరిలకు మాత్రమే పరిమితమైంది. ఈ ధోరణి దళిత, ఇతర పీడిత కులాల ఆకాంక్షల పట్ల, అవసరాల పట్ల సానుభూతి చూపలేదు.

అదే సమయంలో పశ్చిమ, దక్షిణ భారతదేశంలోని చాలా ప్రాంతాలలో బ్రాహ్మణేతర ప్రజానీకం వలస పాలనకు సామాజిక ఆధారంగా ఉండిన ఫ్యూడల్ సంపన్న వర్గంతోనూ, వడ్డీ వ్యాపారులతోనూ వైరుధ్యాన్ని కలిగి ఉండింది. ఈ ఫ్యూడల్ సంపన్న వర్గాలలో, వడ్డీ వ్యాపారులలో ఎక్కువ మంది పీడక కులాలకు, ప్రత్యేకించి, బ్రాహ్మణ కులానికి చెందినవారే ఉండినారు. వీరికి ఈ ప్రాంతాలలోని పాలనా యంత్రాంగంపై సైతం గుత్తాధిపత్యం ఉండింది. అందువల్ల మరింత రాడికల్‌గా, విశాల ప్రాతిపదిక కలిగి ఉండిన, సంపూర్ణమైన కుల వ్యతిరేక వైఖరిని కలిగి ఉండిన బ్రాహ్మణవాద వ్యతిరేక ఉద్యమానికి చెందిన ఒక సెక్షన్ కుల వ్యవస్థను దాని అంతస్థుల వ్యవస్థతో, విధులతో సహా మొత్తంగా తిరస్కరించింది.

## ఫూలే–సత్యశోధక సమాజ్:

24 సెప్టెంబర్,1873లో, జ్యోతీబా ఫూలే (1827–1890) పుణెలో 'సత్యశోధక్ సమాజ్'ను ఏర్పాటు చేయడంతో, మహారాష్ట్రలో బ్రాహ్మణవాద వ్యతిరేక ఉద్యమం ఒక నిర్దిష్టమైన రూపాన్ని సంతరించుకుంది. ఫూలే మాలి కులానికి (కూరగాయలు పండించి అమ్ముకునే) చెందిన ఒక మధ్యతరగతి కుటుంబంలో పుట్టారు. క్రైస్తవ మిషనరీ పాఠశాలలో చదువుకున్నారు. స్వేచ్ఛ, సమానత్వం వంటి పాశ్చాత్య ఆదర్శాలతో, ప్రత్యేకించి, అమెరికాకు చెందిన ఉదారవాది టామ్‌పెయిన్ రచనలతో ఉత్తేజితుడై ఫూలే సాంఘిక సంస్కరణలు చేపట్టారు.

పీష్వా (బ్రాహ్మణ రాజులు) పీడకుల పాలనను అంతం చేసిన బ్రిటిష్‌వారు వక్రీకృత పెట్టుబడిదారీ అభివృద్ధిని తీసుకొచ్చారు, అన్ని కులాలను పాశ్చాత్య వలసవాద దోపిడీ భావజాలంతో ప్రభావితం చేసారు. ఆ కాలంలోని చాలా మంది తూర్పు దేశాల మేధావుల వలెనే, ఫూలే కూడా పాశ్చాత్య పెట్టుబడిదారీ విధానం నుండి చాలా ఆశించారు. ప్రజలలోని పీడిత సెక్షన్లలోనూ, బొంబాయి కార్మికవర్గంలోనూ, రైతాంగంలోనూ, పుణెలో ఆ చుట్టుప్రక్కలా ఉన్న అంటరానివారి వీధులలోనూ ఫూలే, ఆయన జీవిత సహచరి సావిత్రిబాయి (1831–1897)తో కలిసి తన కృషిని కేంద్రీకరించారు. 'షేట్‌జీ–భాట్‌జీ' వర్గం (వడ్డీ వ్యాపార, పురోహిత వర్గం) ప్రజలను, ప్రత్యేకించి, రైతాంగాన్ని ఎన్ని విధాలుగా మోసగిస్తుండిందో ఆయన తన పాటలు, పుస్తకాలు, నాటికల ద్వారా వెలుగులోకి తెచ్చారు. ప్రజల భాషలో, కొట్టొచ్చినట్టుగా ఉండే శైలిలో ఆయన రచనలు చేశారు. ఆర్య దురాక్రమణదారులు స్థానిక రైతాంగాన్ని మోసగించడం ద్వారా రైతురాజైన బలిరాజు పాలనను ఓడించి వారిని బానిసలను గావించారన్న బహుళ ప్రాచుర్యం పొందిన జానపద కథ సహాయంతో, జాతిపరమైన కులవ్యవస్థ పుట్టుక సిద్ధాంతాన్ని వ్యాఖ్యానించి, సత్యశోధక్ సమాజ్ రైతాంగంతో సంబంధాలు ఏర్పర్చుకుంది.

సత్యశోధక్ సమాజ్ బ్రాహ్మణ పురోహితులు చేసే పెళ్లి తంతును తిరస్కరించింది. స్త్రీల కోసం పాఠశాలలను, అనాధలైన స్త్రీలకు ఆశ్రయాన్ని, పిల్లలకు ఆశ్రమాన్ని, పునర్వివాహాలను

ప్రారంభించింది. విధవలకు గుండ్లు గీయరాదని నిర్ణయించుకున్న మంగలుల సమ్మెకు నాయకత్వం వహించింది. అంటరానివారి కోసం పాఠశాలలు ప్రారంభించింది. మంచినీటి బావులను వారికి అందుబాటులోకి తెచ్చింది. పూలే మార్గదర్శకత్వంలో, ఎన్.ఎమ్. లోఖండే బొంబాయి జౌళి కార్మికుల మొట్టమొదటి సంస్కరణవాద సంస్థ 'మిల్‌హాండ్స్ అసోసియేషన్'ను ఏర్పాటు చేశారు. రైతాంగంలో ఆధునిక వ్యవసాయ వ్యాప్తి కోసం పూలే కృషి చేశారు. కాలువ నీరు ఉపయోగించరాదన్న మూఢవిశ్వాసానికి వ్యతిరేకంగా పోరాడారు. ఆయనే స్వయంగా ప్రయోగాత్మకంగా నీటిని సాగుకు ఉపయోగించి ఇతరులకు మార్గదర్శి అయ్యారు. భూమిని జాతీయం చేయాలనీ కోరారు. సహకార సంస్థలనేర్పాటు చేయడాన్ని ఆయన హృదయపూర్వకంగా సమర్థించారు. నిజానికి సత్యశోధక్ సమాజ్ కార్యక్రమంలో అది ఒక ముఖ్యమైన అంశం.

మొట్టమొదటిసారి పూలేనే శూద్ర రైతాంగపు పునరుజ్జీవనానికి ప్రతీకగా శివాజీని ఉపయోగించారు. మరాఠీ భాషలో విద్యా బోధన కోసం, పాలనా యంత్రాంగంలో వంశపారంపర్య పదవుల రద్దు కోసం ఆయన పోరాడారు. పూలేకు గల ప్రజాస్వామిక దృక్పథం, ఆయన రైతాంగంతో నిలకడగా మైత్రి నెరిపేందుకు దోహదం చేసింది. ఆయన కార్యక్రమం బ్రాహ్మణ్యం పైన, షెట్‌జీ–భాట్‌జీ వర్గపు దోపిడీ పైన ఎక్కుపెట్టబడింది. సత్యశోధక్ సమాజ్ కార్యక్రమం, రైతాంగపు ప్రయోజనాలను ప్రతిబింబించింది.

పూలే మరణానంతరం (20 నవంబర్ 1890) కూడా అహమద్‌నగర్, సతారా, కొల్హాపూర్ జిల్లాలలో సత్యశోధక్ సమాజ్ కార్యకలాపాలు సావిత్రిబాయి పూలే నాయకత్వంలో కొనసాగాయి. ఆమె మరణానంతరం కూడ అవి కొనసాగాయి. బేరార్ (విదర్భ) ప్రాంతంలోని అమరావతికి కూడా దాని కార్యకలాపాలు విస్తరించాయి. సత్యశోధక్ సమాజ్ 'తమాషా' బృందాల ప్రచారం, 1919–22లో సతారాలో, 1930లో బుల్డానాలో రైతాంగం తిరగబడడానికి దారితీసింది. ఆనంద్ స్వామి నాయకత్వాన రైతాంగం కౌలు తగ్గింపును డిమాండ్ చేసింది. బ్రాహ్మణులను, దేవతలను దూషించింది, వడ్డీ వ్యాపారులను దండించింది, బ్రిటిష్ ఖజానాలను జప్తు చేసుకుంది, పోలీసు స్టేషన్లపై దాడి చేసింది. వాస్తవానికి రైతాంగం గ్రామీణ ప్రాంతాలలోని భూస్వామ్య అధికారం పైన, బ్రిటీషు అధికారం పైన అన్ని విధాలా దాడి చేసింది. తద్వారా భూస్వామ్య వ్యతిరేక, సామ్రాజ్యవాద వ్యతిరేక చైతన్యాన్ని మేల్కొలిపింది.

బ్రాహ్మణేతరులలోని భూస్వామ్య వర్గం ఈ కార్యకలాపాలను సమర్థించకపోగా, ఖండించింది. ఈ ఉద్యమాలు పశ్చిమ మహారాష్ట్రలో బ్రాహ్మణ భూస్వాములు గ్రామాలు వీడిపోవడానికి దారితీశాయి. 1940లలో, భూస్వాముల, వడ్డీవ్యాపారుల కూటమికి వ్యతిరేకంగా సాగిన ఉద్యమాలు, బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా సాగిన ఉద్యమాలతో పెనవేసుకుపోయాయి. అంతేకాక ఈ ఉద్యమాలు 1940ల నాటి ఉద్యమానికి మార్గదర్శకమయ్యాయి, భూస్వామ్య–వడ్డీ వ్యాపార కూటమికి,

బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా ప్రసిద్ధ నానాపాటిల్ సమాంతర ప్రభుత్వాన్ని - పాత్రిసర్కార్ - ఏర్పాటు చేశారు. తరువాతి కాలంలో బ్రాహ్మణవాద వ్యతిరేక ఉద్యమాలలో ఈ ధోరణికి చెందినవారు పెజెంట్స్ అండ్ వర్కర్స్ పార్టీలోనూ, లాల్ నిషాన్ పార్టీలోనూ కలిసిపోయారు. జవాల్కర్, నానాపాటిల్‌లు భారత కమ్యూనిస్టు పార్టీలో చేరారు.

బహుళ ప్రజాదరణ పొందిన, సమరశీలమైన సత్యశోధక్ సమాజ్ కార్యక్రమం పట్ల అసంతృప్తి చెందిన భూస్వామ్య, ధనిక రైతాంగ సెక్షన్లు 1915లో బ్రాహ్మణవాద వ్యతిరేక పార్టీని ఏర్పాటు చేసి జిల్లా బోర్డు ఎన్నికలలో పోటీ చేసి శాసనసభలో ప్రవేశించారు. 1920లలో ఈ పార్టీలో చాలా సెక్షన్లు తిలక్‌ని, కాంగ్రెస్‌ని గట్టిగా వ్యతిరేకించినప్పటికీ, వారు 1930లలో కాంగ్రెస్‌లో చేరారు, సహకార సంఘాల నూతన అధిపతులుగా మారి, మరాఠా దురహంకార చైతన్యాన్ని పెంపొందింపజేశారు. సత్యశోధక్ సమాజ్ కులవ్యవస్థను, ఫ్యూడలిజాన్ని కొంతవరకు సంస్కరించగలిగింది. ఫూలే దంపతుల సంస్కరణల ప్రభావం ఇప్పటికీ మన దేశంలోని పీడిత సాంఘిక సముదాయాలపై గణనీయంగా వుంది.

## ఈ.వీ. రామస్వామి పెరియార్ (సాధు, రుషి) ఆత్మగౌరవ ఉద్యమం:

ఒకప్పటి మద్రాసు ప్రెసిడెన్సీలో మతపరమైన, ఆర్థికపరమైన అధికారం బ్రాహ్మణ కులాల చేతుల్లోనే ఉండేది. ఆ ప్రెసిడెన్సీలో ఆధునిక విద్య, పరిపాలనా రంగాలలో కూడా బ్రాహ్మణులు కేంద్రీకరించబడి ఆధిపత్యంలో ఉండేవారు. ఈ పరిస్థితులలో పీడిత కులాల నుండి పెటీబూర్జువా వర్గం, శైశవావస్థలోని బూర్జువా వర్గం, విద్యావంతులైన మేధావులు ఆవిర్భవించడంతో, తమిళనాడులో బ్రాహ్మణవాద వ్యతిరేక ఉద్యమాలు తలెత్తాయి. స్త్రీవిద్య, వివాహ సంస్కరణలు, అంటరానితనం నిర్మూలన, భిన్న కులాలు కలిసిమెలిసి ఉండాలని చురుకుగా ప్రోత్సహిస్తుండిన మద్రాసు హిందూ సోషల్ రిఫామ్ అసోసియేషన్ (1892) రూపంలోని సామాజిక సంస్కరణ ఉద్యమం తమిళనాడులో బ్రాహ్మణవాద వ్యతిరేక ఉద్యమాలకు నాంది పలికింది. వీటిలో మేధావులలోని ప్రగతిశీల విభాగాలు పాల్గొన్నాయి. పీడిత కులమైన కల్లుగీత నాడార్‌లు వర్తకం ద్వారా ఆర్థికంగా వృద్ధి చెందారు. 1899లో శివకాశి సమీపంలో, పట్టణ నాడార్‌లు ఒక విశ్వనాథ దేవాలయంలో ప్రవేశించాలని విఫలయత్నం చేశారు. దీనితో భూస్వామ్య మారవార్ (తమిళనాడులోని తిరునల్వేల్లి, రామనాడు ప్రాంతాలలో భూస్వామ్య కులం) (Feudal Maravars) లకూ, నాడార్‌లకూ మధ్య హింసాత్మక ఘర్షణలు చెలరేగాయి. సామాజిక విభజన వలన, సాంప్రదాయికమైన అసమానతలకు, సామాజిక అంతస్తుల వ్యవస్థకు వ్యతిరేకంగా ఆనాడు పీడిత కులాలు జాగృతం అవుతున్నాయనడానికి ఇది తార్కాణం. బ్రిటిష్ వారు కులప్రాతిపదికన రూపొందించిన నియోజకవర్గాల ద్వారా శాసనసభలలో ప్రాతినిధ్యం సంపాదించాలనీ, వాటిని ఉపయోగించి పాలనా యంత్రాంగంలో పదవులు సంపాదించాలనీ కోరుకున్న జస్టిస్ పార్టీ ఏర్పాటుకు ఈ నాడార్‌ల ఉద్యమం దారితీసింది.

జస్టిస్ పార్టీ బలమైన బ్రిటిష్ అనుకూల వైఖరిని కలిగి, బ్రాహ్మణేతర పీడక కులాలలోని బడా భూస్వాముల, వ్యాపారుల ప్రయోజనాలకు స్పష్టంగా ప్రాతినిధ్యం వహించింది. కాగా, . ఈ.వీ. రామస్వామి 'పెరియార్' నాయకత్వం వహించిన, మరింత ప్రజాపునాదిని, తీవ్ర స్వభావాన్ని కలిగిన రాడికల్ ఉద్యమమైన ఆత్మగౌరవ ఉద్యమం (self-respect movement) పాలనాపరమైన పదవుల విషయంలో బ్రాహ్మణేతర కులాల ప్రయోజనాల పరిరక్షణకు మాత్రమే పరిమితం కాలేదు. ఇంకా ముందుకు పోయి అది కులవ్యవస్థ పైన, బ్రాహ్మణీయ హిందూ మతం, మౌఢ్యం మీద పూర్తి స్థాయి దాడిని సాగించింది.

పెరియార్, 1879లో ఈరోడ్ లోని ఒక సంపన్న నాయకర్ కుటుంబంలో జన్మించారు. బ్రిటిష్ వ్యతిరేక స్థానిక సహాయ నిరాకరణోద్యమంలో ఆయన చురుకుగా పాల్గొన్నారు. ఆయన కాంగ్రెస్‌లో చేరారు. 1924లో 'అంటరాని కులాల' వారికి ఆలయ ప్రవేశం కోసం జరిగిన వైకం సత్యాగ్రహంలో ఆయన పాల్గొన్నారు. గాంధీ ఆ వ్యవహారంలో జోక్యం చేసుకుని, అది హిందువుల అంతర్గత విషయంగా వ్యవహరించడంతో, పెరియార్, కాంగ్రెస్ సనాతనవాద నాయకత్వాన్ని దుయ్యబట్టారు. 1925లో కాంగ్రెస్ బ్రాహ్మణేతరుల ప్రత్యేక నియోజకవర్గాల ప్రాతినిధ్యానికి మద్దతునివ్వడానికి సుముఖంగా లేకపోవడంతో, పెరియార్ కాంగ్రెస్ నుండి బయటకు వచ్చి, ఆత్మగౌరవ ఉద్యమాన్ని ("సుయ మరియాద్రై ఇయక్కమ్') ప్రారంభించారు. పెరియార్ ఆరంభించిన ఉద్యమం మద్రాసు రాష్ట్రంలోని తమిళ ప్రాంతాల్లో కేంద్రీకృతమయింది. అభివృద్ధి చెందుతున్న కార్మికవర్గం, మధ్యతరగతి, వర్తకుల నుండి ఈ ఉద్యమానికి మద్దతు లభించింది. ప్రత్యేకించి, ఈరోడ్, మధురై, కోయంబత్తూర్, సేలం, తిరుచిరాపల్లి, తూతికోరిన్ (తూతుకుడి) తదితర పట్టణ ప్రాంతాలలో ఈ ఉద్యమానికి విస్తృతమైన మద్దతు లభించింది.

ఈ ఉద్యమం అంటరానివారితో సహా పీడిత కులాల వారందరినీ ఉద్దేశించినది. స్త్రీలను, యువజనులను ఈ ఉద్యమంలో భాగస్వాములను చేయడానికి అవసరమైన చర్యలు చేపట్టారు. 'కుడి అరసు' అనే పత్రికను నడిపారు. కేవలం బ్రాహ్మణుల పైన మాత్రమే గాక మతం, మూఢాచారాలు, కుల విభజనలు, 'అగ్ర' కులపరమైన హక్కులకు వ్యతిరేకంగా కూడా ఈ ఆత్మగౌరవ ఉద్యమం నాస్తిక దృక్పథంతో కూడిన మిలిటెంటుదాడి రూపంలోసాగించింది. పీడిత కులాలలో ఆత్మగౌరవం, సమతా భావాలను రేకెత్తించాలని పెరియార్ వాంఛించారు. తమిళ భాష గర్వించదగిన భాషగా కీర్తిస్తూ వారు సంస్కృత భాషను వ్యతిరేకించారు. పెళ్లిళ్లలో బ్రాహ్మణ పురోహితులను వినియోగించడాన్ని నిషేధించాలని ప్రచారం చేసి, ఆత్మగౌరవ వివాహాలను ప్రాచుర్యంలోకి తెచ్చారు. 'రాలి' ('Rali') ని వ్యతిరేకించి కులాల పేర్లను ఉపయోగించడాన్ని నిషేధించాలని పిలుపునిచ్చారు. రామాయణం వంటి పురాణ ఇతిహాసాలను గేలిచేశారు. పెరియార్ శైలి సూటిగా ఉండేది, ప్రచార స్వభావం కలిగినది, అత్యంత జనాకర్షకమైనది. మతం పట్టును బద్దలుకొట్టి, అన్ని కులాల మధ్య సమానత్వం కోసం పోరాడి ఈ ఉద్యమం భౌతికవాదానికి మార్గాన్ని సుగమం చేసింది. వడ్డీ

వ్యాపారుల దోపిడీకి వ్యతిరేకంగానూ, రైతాంగ సమస్యల పైనా ఆత్మగౌరవ ఉద్యమం ప్రచార కార్యకలాపాలను చేపట్టింది.

కమ్యూనిస్టుల ప్రభావం వలన, పెరియార్ రష్యా పర్యటన ప్రభావం వలన 1930లలో తమిళనాడులోని ఆత్మగౌరవ ఉద్యమం సోషలిజాన్ని సమర్థించింది. శింగారవేలు వంటి తొలి కమ్యూనిస్టులు తమ పత్రిక ద్వారా భౌతికవాద తత్వశాస్త్రాన్ని, సోషలిజాన్ని ప్రచారం చేశారు. ఆత్మగౌరవ ఉద్యమంలో రెండు ధోరణులు చురుగ్గా ఉండేవి. ఒక ధోరణి సాంఘిక సంస్కరణలకు మాత్రమే పరిమితం కావాలని కోరుకోగా, రెండవ ధోరణి పెట్టుబడిదారీ విధాన వ్యతిరేక ప్రచారాన్ని, కార్యకలాపాలను కూడా చేపట్టాలని కోరుకున్నది. క్రమం తప్పకుండా జరిగే తమ మహాసభలతో పాటు, ఆత్మగౌరవ సోషలిస్టులు రైతాంగ సమస్యలపై వారిని సంఘటితం చేసే కృషిని కూడా చేపట్టారు. సీపీఐ నాయకుల ప్రభావంతో, ఆత్మగౌరవ సోషలిస్టులు (సమధర్మ గ్రూపు) 1936 నవంబర్‌లో కాంగ్రెస్ సోషలిస్టు పార్టీలో కలిసిపోయారు. బ్రాహ్మణేతర ప్రభుత్వం పైన దాడి చేస్తుండినందువలన, 'సోవియట్ బోల్షివిజాన్ని ప్రోత్సహిస్తుండి'నందువలన బ్రిటిష్ ప్రభుత్వం నుండి పెరియార్ నిర్బంధాన్ని ఎదుర్కోవలసి వచ్చింది. పెరియార్ వెనకడుగు వేశారు. ఆత్మగౌరవ ఉద్యమం తన సోషల్ రాడికలిజాన్ని నిలకడగా నిలుపుకోలేకపోయింది. ఫ్యూడల్ భూ సంబంధాల పైన పూర్తి దాడిని వాంఛిస్తున్న ప్రజల మనోభావాలను అది వ్యక్తీకరించలేకపోయింది.

దీని తర్వాత పెరియార్ జస్టిస్ పార్టీలో చేరారు. ఆ తరువాత 1942లో ఆయన 'ద్రవిడ కజగమ్' (డి.కె.) ను ఏర్పాటు చేశారు. రెండవ ప్రపంచ యుద్ధకాలంలో వారు బ్రిటిష్ వారిని సమర్థించారు. 1947లో అధికార మార్పిడి జరిగిన సమయంలో 'బ్రాహ్మణ రాజ్యం' నుండి స్వతంత్రాన్ని కోరుతూ పెరియార్ ఆగస్టు 15ను 'సంతాప దినం'గా పాటించాలని పిలుపునిచ్చారు. రాజగోపాలచారి నాయకత్వాన కాంగ్రెస్ పాలనా కాలంలో హిందీ భాషను రుద్దాలన్న నిర్ణయానికి వ్యతిరేకంగా తమిళనాడులో డి.కె. బలమైన ఆందోళనను చేపట్టింది. తమిళనాడులో 1943లోనూ, 1952లోనూ, తిరిగి 1965లోనూ హిందీ వ్యతిరేక ఆందోళనలు జరిగాయి. అఖిల భారత దళారీ నిరంకుశ బూర్జువావర్గపు ఆధిపత్యానికి వ్యతిరేకమైన తమిళ జాతీయ మనోభావాలను ఈ ఆందోళనలు వ్యక్తీకరించాయి. కేంద్రంలోని అప్పటి కాంగ్రెస్ పాలకులు హింసను ప్రయోగించి ఈ ఆందోళనను అణచివేశారు. డి.కె. తన కుల వ్యతిరేక ప్రచారాన్ని కూడా కొనసాగించింది. గణేశ విగ్రహాలను ధ్వంసం చేస్తూ, దేవాలయాలను బహిష్కరించాలని పిలుపునిచ్చింది. భారత రాజ్యాంగం కుల వ్యవస్థను కొనసాగిస్తున్నందున, 1957లో డి.కె. రాజ్యాంగపు వేలాది ప్రతులను కాలబెట్టింది. 1950లలో కొనసాగిన బ్రాహ్మణవాద వ్యతిరేక ఉద్యమం, పీడిత కులాలకు, తమిళ జాతీయతకు సాంస్కృతికపరమైన వ్యక్తీకరణ. నాడార్ కులస్థుడైన కామరాజ్ ముఖ్యమంత్రి అయినప్పుడు, పెరియార్ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని సమర్థించారు. ఆ తరువాత ఆయన డి.ఎం.కె. ప్రభుత్వాన్ని సమర్థించారు.

మిలిటెంటు స్వభావం గల గొప్ప వక్త అయిన పెరియార్, ఆత్మగౌరవ ఉద్యమానికి గొప్ప ఊపునిచ్చారు. తాత్వికంగా అమెరికన్ నాస్తిక చింతనాపరుడైన ఇంగర్‌సోల్ అనుచరుడైన పెరియార్, సోవియట్ రష్యా విజయాల పట్ల, మార్క్సిజం పట్ల ఆకర్షితుడయ్యారు. బ్రాహ్మణేతర కులాల సామాజిక, సాంస్కృతిక పీడనకు వ్యతిరేకంగా పోరాడినప్పటికీ, పీడిత ప్రజానీకపు వాస్తవ సామాజిక, ఆర్థిక స్థితిగతులతో ముడిపడి ఉన్న సమస్యలను లేవనెత్తారు. తమిళ ప్రజల ప్రజాస్వామిక సాంస్కృతిక ఆకాంక్షలతో మమేకమయ్యారు. అయినప్పటికీ, ఆయన బ్రాహ్మణేతర కులాలలోని భూస్వామ్య అనుకూలమైన, సామ్రాజ్యవాద అనుకూలమైన జస్టిస్ పార్టీపై ఆధారపడడం, కామరాజ్, డి.ఎం.కె.లకు మద్దతునివ్వడం ఆయనలోని ఊగిసలాటను, నిలకడలేనితనాన్ని వెల్లడి చేశాయి. అందువలన, ఆత్మగౌరవ ఉద్యమం, విశాలమైన పూర్తి స్థాయి భూస్వామ్య వ్యతిరేక పోరాటంగా అభివృద్ధిచెందగలిగే విధంగా తన సామర్థ్యాన్ని వృద్ధి చేసుకోలేకపోయింది.

1940లలో తమిళనాడు, కేరళలలో సీపీఐ నాయకత్వాన పీడిత కులాల ప్రజానీకం వీరోచితమైన భూస్వామ్య వ్యతిరేక పోరాటాలను చేపట్టినప్పుడు ఆత్మగౌరవ ఉద్యమం కేవలం ప్రేక్షక స్థానంలోనే నిలిచింది. తమిళనాడులో, బలహీనంగా ఉన్నప్పటికీ వృద్ధి చెందుతుండిన జాతీయ బూర్జువా శక్తుల ప్రయోజనాలను పెరియార్ వ్యక్తం చేశారు. నాడార్‌లలోని చిన్న పారిశ్రామికవేత్తల నుండి ఆయనకు మద్దతు లభించడమూ, ఆయనలో బలమైన జాతీయవాద భావనలుండడమూ, పట్టణాలలోని చిన్న వర్తకులే ఆయన ఉద్యమానికి ప్రధానమైన పునాది కావడమూ పెరియార్ వారి ప్రయోజనాలకు ప్రాతినిధ్యం వహించాడనీ, ఆ వర్గపు పరిమితులను, బలహీనతలను ఆయన అధిగమించలేకపోయారనీ తెలియజేస్తాయి.

బ్రాహ్మణవాద వ్యతిరేక ఉద్యమం దళితుల ప్రయోజనాలకు ఉపయోగపడకపోవడం వలనా, పీడిత కులాల సంస్కర్తలకున్న పరిమితుల వలనా కుల వ్యవస్థ కింద అతి తీవ్రమైన పీడనకు గురవుతుండిన కులాలైన దళితులు తమ సొంత ఉద్యమాన్ని అభివృద్ధి చేసుకున్నారు. ప్రత్యేకించి దక్షిణ భారతదేశంలో, 20వ శతాబ్దపు ప్రథమ భాగం నుండి దళితులు తమ కులాల పేర్లను ఆది-ద్రావిడులు, ఆది-ఆంధ్రులు, ఆది-కన్నడిగులుగా మార్చుకున్నారు. తమను తాము పంచములుగా పిలుచుకున్నారు. తద్వారా ఆయా ప్రాంతాలలోని అసలు మూలవాసులం తామేనని చెప్పడానికి ప్రయత్నించారు. విడిగా మహాసభలను నిర్వహించడం ప్రారంభించారు.

పంజాబులోని చమార్‌లు ఆర్య సమాజంతోనూ, దాని 'శుద్ధి' కార్యక్రమంతోనూ, దాని వేదాల సమర్థనతోనూ తెగతెంపులు చేసుకొని ఆది-ధర్మ ఉద్యమాన్ని ప్రారంభించారు. భక్తి ఉద్యమ ప్రబోధకుడైన సంత్ రవిదాస్ పేరును వారు తిరిగి వెలుగులోకి తెచ్చారు. మొదట్లో ఈ సంఘాలు విద్య, సంస్కృతీకరణలనే నొక్కి చెప్పాయి. అయితే త్వరలోనే పీడక కులాలను అనుకరించడం మాని సామాజిక సమానత్వం, రాజకీయ ప్రాతినిధ్యాల కోసం పోరాడడం, కులపీడనకు

సంబంధించిన నిర్దిష్ట రూపాలను అంతం చేయడం కోసం డిమాండు చేస్తూ గొంతు విప్పడం మొదలుపెట్టాయి.

సాంప్రదాయకంగా కల్లుగీతవారైన కేరళలోని ఎఝూవ కులస్థులు శ్రీనారాయణగురు (1855–1928) నాయకత్వాన ఒక ఉద్యమాన్ని విజయవంతంగా నడిపారు. మొట్టమొదటి ఎఝూవ పట్టభద్రుడైన డాక్టర్ పాల్ప్ సహాయంతో 1902–1903లో ఆయన 'శ్రీనారాయణగురు ధర్మ పరిపాలనా యోగం'ను ఏర్పాటు చేశారు. తొలుత ఉన్నతస్థాయి విద్య నేర్చుకోవాల్సిన ఆవశ్యకతను నొక్కి చెబుతూ వారు ఆ కులాన్ని సంఘటితం చేశారు. ఆలయ ప్రవేశం కోసం వారు ప్రయత్నించారు. 1924లో జరిగిన వైకం సత్యాగ్రహం, కేరళ ప్రజలలోని పురోగామి సెక్షన్‌లతో పాటు ఎఝూవ కులస్థుల కృషి ఫలితమే. ఇప్పటికీ తమిళనాడులో ప్రధానంగా వ్యవసాయ శ్రామిక కులాలలో ఒక పెద్ద సెక్షన్ పెరియార్ భావాలతో బలంగా ప్రభావితమై వున్నారు.

19వ శతాబ్దం చివరలో గురు ఘాసీదాస్ నేతృత్వంలో పంజాబ్, ఉమ్మడి మధ్యప్రదేశ్ (మరీ ముఖ్యంగా నేటి ఛత్తీస్‌గఢ్ ప్రాంతం) రాష్ట్రాల్లో సత్నామిపంత్ పేరుతో బ్రాహ్మణవాద వ్యతిరేక ఆత్మగౌరవ ఉద్యమం నడిచింది. చమార్‌లుగా పిలవబడే దళితుల్లోని పెద్ద సెక్షన్ ఈ ఉద్యమానికి సామాజిక పునాది. సత్నామిపంత్‌ను చేపట్టిన దళితులు తమను చమార్‌లుగా కాక సత్నామీలుగా పిలుచుకున్నారు. అలాగే ఇదే కాలంలో ఉత్తరప్రదేశ్‌లో కుల నిర్మూలనా లక్ష్యంతో కబీర్‌పంథ్ ఆత్మగౌరవ ఉద్యమం కూడా నడిచింది. నిజానికి ఇవన్నీ బ్రాహ్మణీయ కులతత్వాన్ని బలహీనపరచడానికి దోహదపడినాయి.

## దళితుల విముక్తికై అంకితమైన డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ జీవితం (1891–1956)

డాక్టర్ భీమ్‌రావ్ రాంజీ అంబేడ్కర్ (బి.ఆర్.అంబేడ్కర్), ప్రతికూల పరిస్థితుల్లో విద్య నేర్చుకుంటూ, ఉన్నత విద్యను అభ్యసించారు. బాల్యం నుంచే కులపీడన, సాంఘిక బహిష్కరణ, అత్యాచారాలను ఎదుర్కొంటూ ఆయన పెరిగారు. ఆనాటి సామాజిక పరిస్థితి, స్వయంగా ఆ స్థితిని అనుభవించిన కారణంగా సహజంగానే కులం ఆయన అధ్యయన విషయంగా మారింది. ఆయన భారతదేశ కుల వ్యవస్థపై ఒక గ్రంథాన్ని రచించారు. ఆయన అర్థశాస్త్రంలో కూడా లోతుగా అధ్యయనం చేసి ఒక గ్రంథాన్ని రాసారు. మహిళలకు సమాన హక్కులు కల్పించడం కోసం ఆయన నిరంతరం ప్రయత్నించేవారు. ఆయన కేవలం రాయడం వరకే పరిమితం కాలేదు. తాను అధ్యయనం చేయడం ద్వారా, కులంపై రూపొందించిన విశ్లేషణనూ, దాని నిర్మూలన కోసం చెప్పిన మార్గాన్ని సాకారం చేయడానికై యావత్తు దళిత ప్రజలను సంఘటితం చేయడం కోసం ముందుకు సాగారు. ఆయన తనకంటే ముందు కులనిర్మూలన కోసం పని చేసిన సంస్కర్తలను గురువులుగా స్వీకరించారు. తనకు ముగ్గురు గురువులున్నారని ఆయన

చెబుతుండేవారు. వారు గౌతమ బుద్ధుడు, కబీర్, జ్యోతిబా ఫూలే. మహారాష్ట్రలో అంబేద్కర్ నాయకత్వాన దళిత ఉద్యమం ఆవిర్భవించింది. ఆయన దళితుల విముక్తిని ఆశించి తాను నమ్మిన సిద్ధాంతాలకు కట్టుబడి వారి ప్రయోజనాల కోసం జీవితాంతం కృషి చేశారు. ఆధునిక భారత చరిత్రలో ఆయన ఒక సాంఘిక సంస్కర్తగా, ఆర్థికవేత్తగా, రాజకీయవేత్తగా, భారత రాజ్యాంగ నిర్మాతగా సుప్రసిద్ధుడే గాకుండా దళితుల ఆత్మగౌరవ ప్రతీకగా నిలిచిపోయారు. ఆయన ఒక సామాజిక విప్లవకారుడు.

**అంబేద్కర్ జీవితం – రాజకీయాచరణ:**

భారతదేశ నిచ్చెనమెట్ల కులవ్యవస్థలో అత్యంత దిగువన అతిశూద్ర లేదా దళిత కులాలు ఉన్నాయి. వీరు కులపీడనలో అత్యంత క్రూర, అమానవీయమైన అంటరానితనాన్ని ఎదుర్కోవలసి వచ్చేది. వీరిని అస్పృశ్యులని పిలిచేవారు. వీరు సాధారణ గ్రామ సేవకులుగా, వ్యవసాయ కూలీలుగా ఉండేవారు. స్థిరమైన సాంప్రదాయక వృత్తి లేకపోవడం వల్ల, కులపరమైన హింస, అత్యాచారాలకు గురికావడం వల్ల గ్రామాల నుంచి నిరంతరం దళిత కులాలవారి వలస పట్టణాలకు కొనసాగుతుండేది. వీరు అక్కడ జనపనార మిల్లులు, రైల్వేలు, రేవులు, సైన్యం, రక్షణ సంబంధమైన పనులు, చిన్న వ్యాపారం మొదలైన రంగాలలో ఉపాధిని సంపాధించుకునేవారు. వీరికి అక్కడ బ్రిటిష్ సైనిక, క్రిష్టియన్ మిషనరీ స్కూళ్ళద్వారా విద్యావకాశాలు లభించాయి. దీంతో దళితుల్లో ఒక చిన్న సెక్షన్ పెటీబూర్జువా వర్గంగా అభివృద్ధి చెందింది. గణనీయమైన సెక్షన్ కార్మికవర్గంగా మారింది. మహారాష్ట్రలో దళితులలో అత్యధికులు మహర్ కులం వారే ఉండేవారు. వీరు కూడా పెద్దసంఖ్యలో పట్టణాలకు వలసపోయి, కొద్దిమంది పెటీబూర్జువా సెక్షన్‌గానూ, మెజారిటీగా కార్మికులుగాను మారారు.

బ్రిటిష్ సైన్యంలో సుబేదార్ మేజర్ ర్యాంక్ కలిగిన ఒకరి కుమారుడైన అంబేద్కర్, ఆ కులంలోని మొట్టమొదటి పట్టభద్రులు. ఆయన అమెరికాలోని కొలంబియా విశ్వవిద్యాలయంలో 1916లో డాక్టరేట్ పట్టా పొందారు. ఆ తర్వాత బరోడా మహారాజు దివాణంలో సైన్య కార్యదర్శిగా, పిదప కళాశాల ప్రొఫెసర్‌గా పనిచేసారు. తర్వాత ఇంగ్లండ్‌కు వెళ్లి లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్‌లో ఆర్థిక విషయాలపై పరిశోధనా గ్రంథాన్ని (పీ.హెచ్.డీ) రాసారు. లండన్ విశ్వవిద్యాలయంలో లా డిగ్రీని కూడా పూర్తి చేసి 1923లో భారతదేశానికి తిరిగి వచ్చారు.

అంబేద్కర్ 1920ల రెండవ భాగంలో అంటరానివారి పౌరహక్కుల కోసం, కుల నిర్మూలన కోసం, ఇతరుల వలే దళితులకు సైతం సమాన హక్కులు సాధించడం కోసం, మహిళలకు సమాన హక్కుల కోసం, కార్మికుల హక్కుల కోసం చేసిన అనేక పోరాటాల్లో క్రియాశీలంగా పాల్గొని నాయకత్వం వహించారు. ఇందులో ముఖ్యమైనవి – కొంకణ్ ప్రాంతంలోని మహాద్ గ్రామంలో చెరువు నీటిని అన్ని కులాలు ఉపయోగించుకోవడం కోసం

1927లో జరిగిన మహాద్ సత్యాగ్రహం, పెద్ద మహాసభ, మనుస్మృతిని దహనం చేయడం, 1928, 1930లలో అమరావతి, నాసిక్‌లలో దేవాలయాలలో ప్రవేశించడం కోసం పోరాటాలు – ఇందులో నాసిక్ పోరాటం ఐదేళ్ల పాటు సాగింది. ఈ ప్రజా పోరాటాలు దళితులలోని మిలిటెంటు యువ సెక్షన్లకు ఉత్తేజాన్నిచ్చి మొత్తం దళితుల్లో సామూహిక చైతన్యాన్ని కలుగజేశాయి. ఈ పోరాటాలు దళితులను పశువులుగా చూసే సామాజిక వ్యవస్థ నియమాలనూ, సాంప్రదాయాలను ధిక్కరించే సాహసాన్ని దళితులలో పెంపొందించాయి. వారిలో ఆత్మగౌరవాన్ని మేల్కొలిపాయి. సమానత్వ సిద్ధాంతాలను ఎజెండాలోకి తెచ్చాయి.

ఈ కాలమంతా డాక్టర్ అంబేద్కర్ బ్రాహ్మణిజాన్ని, పెట్టుబడిదారీ విధానాన్ని ప్రజల రెండు శత్రువులుగా చెప్పినప్పటికీ ఆచరణలో ఆయన బ్రాహ్మణిజాన్ని ప్రధాన శత్రువుగా చేసుకుని పనిచేసారు. దీనికి వ్యతిరేకంగా, అభివృద్ధి నిరోధక కుల వ్యవస్థకు వ్యతిరేకంగా అనేక సాంఘిక ఉద్యమాలు, కార్మిక ఆందోళనలు నిర్వహించి సాంఘిక, కార్మిక ఉద్యమకారుడుగా ఒక ముఖ్య పాత్రను పోషించారు.

ఆ తదుపరి ఆయన కులసమస్యపై సాంఘిక సంస్కరణల కోసం, కులనిర్మూలన కోసం కృషి చేస్తూనే, ప్రధానంగా రాజకీయ కార్యకలాపాలను చురుకుగా కొనసాగించారు.

1936లో అంబేద్కర్ ఇండిపెండెంట్ లేబర్ పార్టీ (ఐఎల్‌పీ)ని స్థాపించారు. దాని జెండా ఎర్రజెండా, దాని పైభాగంలో ఒక మూలన 11 నక్షత్రాలు ఉండేవి. ఇవి ఆనాటి భారతదేశంలో 11 ప్రావిన్సులకు సంకేతంగా ఉండేవి. ఐ.ఎల్.పీ. కార్మికుల హక్కుల కోసం పోరాడింది. కమ్యూనిస్టుల, సోషలిస్టుల సహకారంతో జౌళి కార్మికుల సమ్మె నిర్వహించింది. ఖోతీదార్ (కొంకణ్‌లోని భూస్వాములు) వ్యవస్థకు వ్యతిరేకంగా పోరాటం నిర్వహించింది. అంబేద్కర్ కుల వ్యతిరేక ఉద్యమంలో మహిళలు అసంఖ్యాకంగా కదిలారు. కులంతో పాటు, జెండర్ అణచివేతకు కేంద్రంగా ఉన్న హిందూయిజపు మౌలిక నియమాలను ఆయన ప్రశ్నించడమే కాకుండా మహిళలకు సంబంధించిన కొన్ని సమస్యలపై పోరాటాలు చేపట్టారు.

అంబేద్కర్ తన కార్యక్రమాల్లో అధిక భాగం పోరాటాలకు, ప్రజా సమీకరణలకే వెచ్చించినప్పటికీ, బ్రిటిష్ పరిపాలనా యంత్రాంగం నుండి దళితులకు సదుపాయాలు, రాయితీలు పొందడం కోసం కృషి చేశారు. దళితులకు ప్రత్యేక నియోజకవర్గాలు, ఉద్యోగాల్లో రిజర్వేషన్లు, స్కాలర్‌షిప్పులు లాంటి ఈ కోర్కెలు ప్రధానంగా కొత్తగా పుట్టుకొస్తున్న దళిత, మధ్యతరగతి వర్గ పెరుగుదలకు, అభివృద్ధికి తోడ్పడేవి. ఈ క్రమంలోనే ఆయన 'స్వతంత్ర' భారతదేశంలో వంచిత వర్గాల హక్కులను ఖాయం చేసే లక్ష్యంతో, వారి ప్రతినిధిగా అధికారాన్ని పొందాలని నిర్ణయించుకున్నారు. ఎందుకంటే గాంధీ తనకు తాను బలహీనవర్గాల ప్రతినిధినని చెప్పుకుంటూ నూతన రాజ్యాంగ వ్యవస్థలో పీడిత వర్గాల హక్కుల పట్ల కపటనాటక

మాదుతుండినాడు. ఈ పరిస్థితుల్లో 1928లో సైమన్ కమిషన్‌లోనూ, 1930 మరియు 1931లో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశాలలోనూ బలహీనవర్గాల ప్రతినిధిగా అంబేద్కర్ పాల్గొన్నారు.

రెండవ ప్రపంచ యుద్ధం బద్దలైనప్పుడు ఫాసిజానికి వ్యతిరేకంగా మిత్రకూటమికి (బ్రిటన్, అమెరికా తదితర దేశాల) అంబేద్కర్ మద్దతునిచ్చారు. 1941 ఫిబ్రవరిలో వైస్రాయిని కూడా కలిసి బ్రిటిష్ సైన్యంలో దళితులను చేర్చుకోవలసిందిగా కోరారు. ఆయన కోరికను వైశ్రాయి ఒప్పుకోవడంతో స్వయంగా వివిధ ప్రాంతాలకు వెళ్లి దళిత యువకులను బ్రిటిష్ సైన్యంలో చేరవలసిందిగా ప్రోత్సహించారు.

ఆ సమయంలో వంచిత వర్గాలు ఉద్యోగాలు పొందడం, ఆర్థికంగా, సామాజికంగా మరింత అభివృద్ధి సాధించడం ఎంతో అవసరంగా ఉండేది. ఎందుకంటే బ్రాహ్మణవాదులు 'మహార్‌లు లేదా అంటరానివారు పోరాటతత్వం కలిగినవారు కాదు', అందువల్ల వారిని సైన్యంలో రిక్రూట్ చేసుకోకూడదనే షరతును కూడా బ్రిటిష్ వారితో ఆమోదింపజేసారు. బ్రిటీష్‌వారు దళితులను సైన్యంలో రిక్రూట్ చేసుకోవడం నిలిపివేసారు. ప్రపంచయుద్ధ సమయంలో అవకాశం రాగానే దీనిని అంబేద్కర్ అర్థం చేసుకొని తిరిగి దళితులకు ఒక ఆర్థిక వనరు కలిగేలా రిక్రూట్‌మెంట్‌కు దోహదపడ్డారు.

అంబేద్కర్ 1941 జులైలో బ్రిటిష్‌ఇండియా జాతీయ రక్షణా కౌన్సిల్‌లో సభ్యునిగానూ, 1942 జూన్‌లో వైస్రాయి క్యాబినెట్‌లో కార్మిక మంత్రిగానూ నియమ్మితులయ్యారు. అదే సమయంలో ఆయన కేంద్ర మంత్రిగా ఉండి దేశంలో కొన్ని కార్మిక సంక్షేమ చట్టాలను ప్రవేశపెట్టడానికి తోడ్పడినారు. అలాగే ఈ కాలంలో కూడా దళిత–మధ్యతరగతి సదుపాయాలకై ప్రయత్నాలు సాగిస్తూ బలహీనవర్గాలకు ప్రభుత్వోద్యోగాల్లో 8.33 శాతం రిజర్వేషన్లు, విదేశాల్లో చదువు కోసం స్కాలర్‌షిప్పులు సాధించగలిగారు.

బ్రిటిష్ వాళ్లు వెళ్లిపోయిన తరువాత ఏర్పడబోయే నూతన రాజ్యాంగ వ్యవస్థలో దళితులకు తగిన ప్రాతినిధ్యాన్ని సాధించాలనే ఉద్దేశ్యంతో ఈ కాలంలో అంబేద్కర్ తన దిశను నిర్ణయించుకున్నారు. దీనిని దృష్టిలో ఉంచుకొని 1942లో ఇండిపెండెంట్ లేబర్ పార్టీని రద్దుచేసి దళిత ప్రతినిధిగా బ్రిటిష్ వారితో సంప్రదింపులు జరపడానికి షెడ్యూల్డు కులాల ఫెడరేషన్ (ఎస్.సి.ఎఫ్.)ని ఏర్పరిచారు. తర్వాత 'స్వతంత్ర' భారతదేశంలో నెహ్రూ మంత్రివర్గంలో న్యాయమంత్రి అయ్యారు. యుద్ధానంతరం ఆయన భారత దళారీ బూర్జువా, ఫ్యూడల్ వర్గాలకు చెందిన రాజ్యపు రాజ్యాంగ ముసాయిదా కమిటీకి చైర్మన్‌గా ఉండడానికి అంగీకరించడం ద్వారా భారత రాజ్యాంగ రచనలో ఆయన ప్రధాన పాత్ర వహించారు.

ఆయనకు తాను జీవించి ఉండగానే దళితుల కోసం ఏదో ఒకటి చేయడం అవసరమని

ఆలోచిస్తున్న సమయంలో ఆయన రాజ్యాంగ కమిటీలో చేరడానికి అంగీకరించారు. అప్పటికి ఆయన ఆరోగ్యం కూడా దెబ్బతింటూ ఉండింది. ఆయన తాను ప్రారంభించిన ఉద్యమం చివరకు ఏదోక నిర్ణయాత్మక-నిర్దిష్ట విజయం సాధించకుండా వ్యర్థం కాకూడదని భావించారు. అందువల్ల రాజ్యాంగాన్ని రాసే అవకాశం ఆయనకు రాగానే దాన్ని ఆయన స్వీకరించారు. దళితులకూ, ఆదివాసీలకు కొన్ని అవకాశాలు, హక్కులనూ కల్పించారు. తద్వారా భవిష్యత్‌లో తమ హక్కుల కోసం వారు చేసే పోరాటానికి ఒక చట్టబద్ధతను కల్పించారు. అయినప్పటికీ, ఆయన ఈ పని చేసి దానిని కేవలం మూడేళ్ళు అమలు చేసిన తర్వాతనే, ఈ రాజ్యాంగం దళితులకు సమానత్వాన్ని అందించలేదనీ, కాంగ్రెస్ తనని ఉపయోగించుకుందని దీన్నితగలబెట్టే మొదటి వ్యక్తిగా తానే ఉంటానని ఆయనే అన్నారు.

అంబేద్కర్ 1947 తర్వాత నెహ్రూ మంత్రి మండలిలో న్యాయశాఖ మంత్రిగా ఉన్నప్పటికీ భారత సైన్యం తెలంగాణ సాయుధ ప్రజా పోరాటంపై అమలు పరచిన అమానుష అణచివేతపై ఆయన మౌనంగా ఉన్నారు. 1951లో 'హిందూ కోడ్ బిల్'ను ఆమోదించాలని పట్టుబట్టిన అంబేద్కర్‌తో విభేదిస్తూ, నెహ్రూ ఆ బిల్‌ను వ్యతిరేకిస్తున్న అభివృద్ధి నిరోధక బ్రాహ్మణీయ భూస్వామ్య శక్తులకు అండగా నిలవడంతో దీనికి నిరసనగా ఆయన నెహ్రూ మంత్రి మండలికి రాజీనామా చేశారు.

ఆయన తన జీవిత కాలంలో హిందూ మతం పైన, కులం పైన చేసిన పరిశోధనలు, విశ్లేషణలు చాలా ప్రముఖమైనవి. ఈ విషయాలపై అనేక సిద్ధాంత గ్రంథాలు రాశారు. అయితే ఆయన కులం పుట్టుకకు సంబంధించి సరైన నిర్ధారణ చేయలేకపోయారు. అలాగే కుల నిర్మూలనకు పరిష్కారం సామాజిక దోపిడీ సంబంధాలను ధ్వంసం చేయడం ద్వారా కాకుండా హిందూ మతం నుండి బౌద్ధమతంలోకి మారడం ద్వారా సాధించ చూశారు. ఫలితంగా 1956లో ఆయన చనిపోయే ముందు బౌద్ధమతం స్వీకరించి ప్రధానంగా మహారాష్ట్రలోని దళితులను బౌద్ధమతం వైపు పెద్ద ఎత్తున మళ్లించారు. తన జీవిత చివరి కాలంలో తీవ్ర అనారోగ్యానికి గురైనారు. ఆ సమయంలో ఔరంగాబాద్, బొంబాయిలలో కాలేజీల నిర్మాణం వంటి కార్యక్రమాలు చేపట్టడంతో పాటు ఆయన కొన్ని సంస్కరణ కార్యక్రమాలకు పరిమితమవుతూ వచ్చారు. ఆ కాలంలోనే సంయుక్త మహారాష్ట్ర ఉద్యమానికి మద్దతునిచ్చారు.

## అంబేడ్కర్ పట్ల మన రాజకీయ అంచనా:

అంబేద్కర్ నిచ్చెనమెట్ల కులవ్యవస్థలో అత్యంత దిగువన ఉండే దళిత ప్రజల సమానత్వం కోసమే కాక, కార్మికుల కోసం, మహిళల కోసం కూడా ఆయన పోరాటాలు నిర్వహించారు. ఆయన దృష్టిలో సమానత్వం, స్వాతంత్ర్యం, సౌభ్రాతృత్వం ఒకటిగా కలిసి భారతదేశ సమాజంలో ఉనికిలో ఉంటాయి. సామ్రాజ్యవాదం గురించి ఆయన అవగాహన ఏమంటే, దేశంలోని

భూస్వాములు, మిల్లు యజమానులు, వడ్డీ వ్యాపారులు వంటి సామ్రాజ్యవాద మిత్రులకు వ్యతిరేకంగా పోరాడకుండా సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా సమర్థవంతంగా ఎటువంటి యుద్ధాన్ని సాగించలేము. ఆయన వ్యూహాత్మకంగానే వలస పాలన పట్ల నిరంతరం తటస్థ వైఖరిని అవలంభించారు. ఆయన దృష్టిలో ఎలాంటి సాధనాలు లేని దళితులు శక్తివంతులైన యావత్తు శతృవులకు వ్యతిరేకంగా ఏకకాలంలో పోరాడటం సాధ్యం కాదు. ఆయన కాంగ్రెస్‌ను మౌలికంగా భూస్వాముల, పట్టణ పెట్టుబడిదారుల ప్రతినిధిగా భావించేవారు. వారు సాగించేది సామ్రాజ్యవాద వ్యతిరేక యుద్ధమని భావించడాన్ని ఆయన సవాలు చేసేవారు. ఆయన కులవ్యవస్థను హిందూ సామ్రాజ్యవాదంగా దళితుల పట్ల అది బ్రిటిష్ సామ్రాజ్యవాదంతో పోల్చితే దుష్టమైనదని విమర్శించారు.

అంబేద్కర్ సరైన అర్థంలో వంచిత వర్గాల ప్రతినిధి. ఆయన యావత్తు అస్పృశ్యులనూ, కింది కులాలనూ, అణచబడ్డ ప్రజలనూ, మహిళలను ఒకే వర్గంగా సంబోధించారు. ఆయన యావత్తు అణచబడ్డ ప్రజలను 'డిప్రెస్డ్ క్లాస్' (వంచితవర్గం లేదా అణచబడ్డ ప్రజల వర్గం) అని పిలిచేవారు. మరాఠీలో 'దళిత్' అని సంబోధించేవారు. కులవ్యవస్థను వర్గదృష్టితో సంఘటిత పరచడం ద్వారానే ధ్వంసం చేయగలుగుతామనే భావన తన 'డిప్రెస్డ్ క్లాస్' భావనలో ఉంది. అయితే ఆయన చెప్పిన ఈ ప్రజా సమూహాన్ని వర్గపరంగా ఏకం చేయడం, వర్గాన్ని గురించి మార్క్స్ చెప్పిన భావనకు భిన్నమైంది. ఆయన బ్రాహ్మణిజం, పెట్టుబడిదారీ విధానం భారత పీడిత ప్రజలకు రెండు శతృవులుగా పదే పదే చెప్పారు. ఆయన నాయకత్వంలో ప్రజా సమీకరణలలో, ప్రజా ఉద్యమాలలో లక్షల సంఖ్యలో ఈ వంచితవర్గం భాగమైంది. ఆయన నిర్వహించిన పోరాటాలు ఆరంభంలో సామాజిక, పౌరహక్కుల కోసం ఆత్మగౌరవం కోసం కాగా, ఆ తదుపరి దళితుల, రైతుల, కార్మికుల, మహిళల ప్రజాస్వామిక హక్కుల కోసం కూడా జరిగాయి. భూస్వామ్య వ్యతిరేక పోరాటాల్లో ముఖ్య భాగమైన అనేక కుల వ్యతిరేక పోరాటాలకు ఆయన నాయకత్వం వహించారు. ఆ విధంగా ఆయనా, ఆయన నాయకత్వం వహించిన ఉద్యమమూ ప్రజాస్వామిక శక్తులలో, ఉద్యమాలలో ఒక ముఖ్య భాగమే.

అంబేద్కర్ ప్రధానంగా దళితుల హక్కుల సాధన కోసం, సంక్షేమం కోసం తన జీవితాన్ని అంకితం చేసారు. అయితే తన లక్ష్య సాధన కోసం పార్లమెంటరీ ప్రజాస్వామ్యాన్ని ఆశ్రయించారు. ఈ వైఖరి వాస్తవంగా వారిని సమరశీల పోరాటమార్గం నుంచి మళ్ళించి పార్లమెంటరీ వ్యవస్థపై భ్రమలు కల్పించేలా చేసింది. మరోవైపు ఆయన సేవలు 1941 తర్వాత బ్రిటిష్ సామ్రాజ్యవాదులకూ, 1947 తర్వాత దళారీ, నిరంకుశ బూర్జువా, భూస్వామ్య వర్గాలకు ఉపయోగపడ్డాయి.

మొత్తంగా చూసినప్పుడు అంబేద్కర్ కుల నిర్మూలనను తన జీవిత లక్ష్యంగా ఎంచుకొని

లభించిన ప్రతి అవకాశాన్ని దళిత, అణచబడ్డ ప్రజల ప్రయోజనాల కోసం వినియోగించడానికి తన యావత్తు శక్తితో నిజాయితీగా ప్రయత్నించారు. పోరాటం గురించి, మార్గాల గురించి ఆయన నిరంతరం అన్వేషిస్తుండేవారు. మార్పు కోసం ఎల్లప్పుడు సిద్ధంగా ఉండేవారు. ఆయన విశాలమైన భారత నూతన ప్రజాస్వామిక విప్లవంలో చారిత్రక మిత్రశక్తి. ఈ దృష్టితో చూసినప్పుడు సమాజ పరివర్తన కోసం ఆయనలోని పాజిటివ్ అంశాలను తీసుకోవాలి. దీంతో పాటు విప్లవ మార్గానికి అవరోధంగా ఉండే వాటిని వదిలించుకోవాలి. అంబేడ్కర్ నాయకత్వంలో నడిచిన ఉద్యమం, ఆయన సాహిత్యం నిశ్చితంగా కులనిర్మూలన పోరాటానికీ, ప్రజాస్వామిక సమాజ నిర్మాణానికి ప్రేరణనిస్తాయి. వాటిని విమర్శనాత్మక దృష్టితో అధ్యయనం చేయాలి. అదే సమయంలో అంబేడ్కర్‌ను తమ స్వార్థం కోసం ఉపయోగించుకునే వారిపై ఆయన భావాలకు తప్పుడు అర్థాలు లాగుతూ ప్రజలను పక్కదోవ పట్టించేవారిపై కూడా పోరాటం సాగించాలి. అంబేడ్కర్ కులనిర్మూలనా సిద్ధాంతం ప్రజాస్వామిక సమాజ నిర్మాణపు దీర్ఘకాలిక ప్రక్రియలో ఒక ప్రముఖ భాగం. అంతేతప్ప ఇదే అంతిమమైంది కాదు. ఆ సిద్ధాంతమే సరిపోదు. ఈ ప్రక్రియ అంబేడ్కర్‌కు ముందు కూడా కొనసాగింది. ఇప్పటికీ కొనసాగుతోంది. మనం దాన్ని కడవరకూ ముందుకు తీసుకుపోవాలి. అందుకు ముఖ్యంగా దళిత విముక్తికి సరైన ఏకైక మార్గం కార్మికవర్గ నాయకత్వాన పీడిత వర్గాల, దళిత తదితర పీడిత కులాల, ఇతర పీడిత సెక్షన్ల సమైక్య సమరశీల పోరాటమేననీ, అది నూతన ప్రజాస్వామిక విప్లవమేనని దేశ ప్రజలందరి మధ్యా మన పార్టీ నిరంతరం స్పష్టంగా రాజకీయ ప్రచారం చేస్తూ వీరందరిని ఒక మహత్తర శక్తిగా సంఘటితం చేయాలి.

చాలా కాలం నుండే దళితుల సమస్యల పరిష్కారానికి వివిధ రంగాలలో అసంఖ్యాక సంఘాలు, సంస్థలు పని చేస్తున్నాయి. దళితుల పేరుతో రాజకీయ పార్టీలు పాలకవర్గ, పెటీబూర్జువా, కుల, ఉపకుల ప్రాతిపదికన ఏర్పడి పని చేస్తున్నాయి. ఈ సంఘాలు, సంస్థలు, పార్టీలు అన్నీ అంబేడ్కరిజంను తమకు తోచినట్లు వ్యాఖ్యానిస్తూ అదే తమ సిద్ధాంతమని చెప్పుకుంటున్నాయి. వీటిలో అంబేడ్కర్ పేరు చెప్పుకొని తమ పబ్బం గడుపుకొనే పాలకవర్గ దళిత పార్టీల, మార్టిజాన్నీ, మన పార్టీనీ వ్యతిరేకించే దళిత సంఘాల, సంస్థల పాలకవర్గ స్వభావాన్ని/పాలకవర్గ అనుకూల రాజకీయ అవకాశవాదాన్ని ప్రజలలో, ప్రత్యేకంగా దళిత తదితర పీడిత కులాల ప్రజలలో బహిర్గతం చేయాలి; వీటి నాయకత్వాన్ని ప్రజల నుండి ఒంటరి చేయాలి. ఇతర అంబేడ్కరిస్టు, దళిత సంఘాలను, సంస్థలను విశాల ప్రజాస్వామిక ఉద్యమంలో నిలబెట్టుకొనే లక్ష్యంతో వాటితో మిత్రవైఖరితో కలిసి పనిచేయాలి. పార్టీ వారి పోరాటాలకు మద్దతు తెలిపాలి. మనతో కలుపుకొని పోరాడాలి. అదే సమయంలో దళిత ప్రజారాశుల విముక్తి లక్ష్యంతో మనం స్వతంత్రంగా దళితుల సమస్యలపై విశాల ప్రాతిపదికన బలమైన ఉద్యమాలను నిర్మించాలి, సంస్థలను ఏర్పర్చాలి.

## అంబేద్కర్ సిద్ధాంతం (Ideology):

అంబేద్కర్ సైద్ధాంతికంగా మార్క్సిజానికి వ్యతిరేకి కాదు. ఆయన మార్క్సిజాన్ని వీలైనంత ప్రచారం చేసారు. తన పనిని మార్క్సిజం ప్రమాణంపై ఆధారపడి చేసారు. ఆయన తనకు ఏదైన తత్వశాస్త్రం దగ్గరగా ఉంది అంటే, అది మార్క్సిజమే అని చెప్పేవారు. అయితే ఆయన 'లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్'లో విద్యనభ్యసించే సమయంలో దేవే ఫెబియనిజంతో ప్రభావితులయ్యారు. ఈ సిద్ధాంత భావాలను వ్యవహారికవాదం (ప్రాగ్మాటిజం) లేదా ఇంస్ట్రుమెంటలిజం అని పిలిచేవారు. ఇంస్ట్రుమెంటలిస్టులు శాస్త్రీయ భావజాలాన్ని గుర్తిస్తారు.

అంబేద్కర్ తాను ఎంపిక చేసుకొని ఆచరించిన ప్రాగ్మాటిస్ట్ దృక్పథం వలన "కుల నిర్మూలన"కు సంబంధించిన సామాజిక, ఆర్థిక పునాది అంశానికి ప్రాధాన్యతనివ్వలేదు. ఆయన ఈ సమస్యపై మతసిద్ధాంతాల పట్ల భక్తిభావంతో స్వాభావికంగా ఉద్భవించిందే కులం అనీ, కులవివక్షకు పునాదిగా వున్న మతభావనలను ధ్వంసం చేయడమే ఈ కులాలను నిర్మూలించే మార్గమనీ, కులం అనేది భారత సమాజపు ప్రాచీన ఉత్పత్తి సంబంధాల నుండి కాక హిందూమతం నుండి పుట్టుకొచ్చిందనే తప్పుడు అవగాహనను ముందుంచారు. తత్ఫలితంగా సామాజిక వ్యవస్థను మార్చడం కాక, హిందూ మతాన్ని సంస్కరించడం ద్వారా కులాన్ని రూపుమాపవచ్చని ఆశించారు. అందువల్ల వేదాలను రద్దు చేయాలనీ, హిందువులందరికీ ఆమోదకరమైన ఒకే ఒక ప్రామాణిక హిందూ మత గ్రంథాన్ని రూపొందించాలనీ, అన్ని కులాలకు అవకాశం ఉండే విధంగా పరీక్షలు జరిపి పూజారులను నియమించాలనీ చట్టాలను ప్రతిపాదించారు. వర్ణాంతర వివాహాలే కుల నిర్మూలనకు పరిష్కారం అని భావించారు. ఆ విధంగా కేవలం మనిషి భావాలలోనూ, ఆలోచనలలోనూ మార్పు రావడం ద్వారా మాత్రమే కులవ్యవస్థ రద్దు కాబడుతుందని భావించారు. వర్ణాంతర వివాహాలను నిరంతరం ప్రోత్సహించవలసిన అవసరం ఉన్నప్పటికీ, కులం యొక్క సామాజిక, ఆర్థిక పునాదిని బద్దలు కొట్టకపోతే, అవి కుల వ్యవస్థ రద్దుకు పాక్షికంగా మాత్రమే తోడ్పతాయని అందువల్లనే ఆయన గ్రహించలేకపోయారు. భారతదేశంలో ఇస్లాం, క్రైస్తవ, సిక్కు మతాలలోనూ ఆఖరుకు బౌద్ధమతంలోనూ, కులం వేర్వేరు రూపాలలో ఎందుకు కొనసాగుతూ ఉందో ఆయన ప్రతిపాదించిన హిందూమత సంస్కరణ కానీ, ఆ తదుపరి తన మతమార్పిడి గానీ జవాబు చెప్పలేకపోయాయి. అందువల్ల అంతిమంగా తాను స్వీకరించిన బౌద్ధమత అవలంబన అనేది సహజంగానే కులవ్యవస్థ నుండి విముక్తి మార్గాన్ని చూపలేకపోయింది.

అంతేకాకుండా అది కుల ఛాందసులకు వ్యతిరేకంగా ఆయన చేపట్టిన పోరాటంలో బ్రిటిష్ పరిపాలనా యంత్రాంగంపై గణనీయంగా ఆధారపడేలా చేసింది. బ్రిటిష్‌వారు పాశ్చాత్య క్రైస్తవ మత విశ్వాసులుగా హిందూ కుల భావజాలానికి వ్యతిరేకంగా ఉంటారని భావించారు. మన

దేశంలో బ్రిటిష్ సామ్రాజ్యవాదులు ఫ్యూడల్ ఛాందసవాద శక్తులపై ఆధారపడి తమ దోపిడీని, అణచివేత విధానాలను కొనసాగిస్తున్నారు అనే విషయాన్ని చూడడంలో ఆయన ఆచరణలో విఫలమైనారు.

చివరగా, అంబేడ్కర్‌కున్న బూర్జువా ఉదారవాద ఆలోచనాసరళి వల్ల రాజ్య స్వభావం గురించి ఆయనలో తప్పుడు అవగాహన ఏర్పడింది. రాజ్యం తటస్థమైనది అనే బూర్జువా సిద్ధాంతాన్ని నమ్ముతూ అది అణచివేత సాధనం అనే దాని అసలు వర్గ స్వభావాన్ని అర్థం చేసుకోకపోవడం వలన ఆయన చట్టాలు రూపొందించడం ద్వారా, రాజ్యాంగ సంస్కరణల ద్వారా దాని స్వభావాన్ని మార్చవచ్చునని భావించారు. 'స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం' అనే బూర్జువా ప్రజాస్వామిక సూత్రాల ద్వారా ఉత్తేజం పొందినప్పటికీ, బూర్జువా ప్రజాస్వామ్యం మౌలిక స్వభావమైన బూర్జువావర్గ నియంతృత్వ స్వభావాన్ని ఆయన గుర్తించలేకపోయారు. ప్రత్యేకించి సామ్రాజ్యవాదమూ, దాని తాబేదార్లుగా ఉన్న భూస్వామ్య, దళారీ నిరంకుశ బూర్జువా వర్గాల, భారత రాజ్యపు అభివృద్ధి నిరోధక స్వభావాన్ని ఆయన గుర్తించలేకపోయారు. తత్ఫలితంగా ఆయన సామాజిక మార్పు తీసుకురావడం కోసం ప్రధానంగా చట్టాలు, కోర్టులు, పార్లమెంటు మరియు రాజ్యాంగం పైనే ఆధారపడ్డారు.

కేంద్రంలో అధికారంలో ఉన్న బ్రాహ్మణవాద హిందూ ఫాసిస్టు బీజేపీతో పాటు పాలక పార్టీలు, రివిజనిస్టు పార్టీలు తమ స్వార్థ ప్రయోజనాల కోసం అంబేడ్కర్‌కు దళిత తదితర పీడిత కులాల ప్రజలలో ఉన్న ఎనలేని గుర్తింపును దృష్టిలో పెట్టుకొని ఆయన భారత రాజ్యాంగ నిర్మాత అనీ, ఆయన పార్లమెంటరీ ప్రజాస్వామ్య ప్రదాత అనీ, భావజాలపరంగా ఆయన హింసకూ, విప్లవానికీ వ్యతిరేకి అనీ ఎడతెరిపి లేకుండా ప్రచారం చేస్తున్నాయి. దళితులు క్రమబద్ధమైన మార్పుల ద్వారా, ప్రజాస్వామ్య పద్ధతుల ద్వారా తమ జీవితాలను మెరుగుపరచుకోవడానికి ఓపికగా కృషి చేయాలని అంబేడ్కర్ చెప్పారని ఈ పార్టీలన్నీ ఒకదానిని మించి మరొకటి ప్రచారం చేస్తున్నాయి. ఈ విధంగా దోపిడీవర్గ పార్టీలన్నీ అంబేడ్కర్ పేరును వాడుకుంటూ దళితులను బూర్జువా, పెటీబూర్జువా సంస్కరణలకు పరిమితం చేస్తూ వారు మిలిటెంట్‌గా వర్గపోరాటాలకు పూనుకోకుండా, నూతన ప్రజాస్వామిక విప్లవంలో సంఘటితం కాకుండా తీవ్రంగా అడ్డుకుంటున్నాయి.

1947 తర్వాత దేశంలో ఎన్నడూలేని స్థాయిలో బ్రాహ్మణవాద హిందుత్వ ఫాసిస్టు సంఘ్‌పరివార్ ఎజెండాకనుగుణంగా మోదీ ప్రభుత్వం బరితెగించి రాజ్యాన్నీ, బ్రాహ్మణీయ హిందుత్వ మతోన్మాద కుల దురహంకార శక్తులను మరింతగా ఫాజీకరిస్తున్నది. ఒక వైపున మోదీ ప్రభుత్వంతో పాటు వివిధ రాష్ట్ర ప్రభుత్వాలు విప్లవోద్యమంపై బహుముఖ దాడిని తీవ్రతరం చేసి కొనసాగిస్తుంటే, మరొక వైపున రాజ్యం దన్నుతో సంఘ్ పరివార్ శక్తులు, దళిత,

ఆదివాసీ, మైనారిటీ, లౌకిక, ప్రజాస్వామిక, విప్లవ శక్తులపై సైద్ధాంతిక, రాజకీయ, సాంస్కృతిక, భౌతిక దాడులు కొనసాగిస్తున్నాయి. ఈ ఫాసిస్టు ప్రభుత్వాలతో, శక్తులతో రాజీ లేకుండా పోరాడే విప్లవ శక్తులపై, ఇతర సమరశీల ప్రజాస్వామిక శక్తులపై అత్యంత క్రూరమైన అణచివేతను కొనసాగిస్తున్నాయి. ఈ ఫాసిస్టులు ఇతర ఉద్యమ శక్తులను నయానా, భయానా లొంగదీసుకొని దేశ ప్రజలను బానిసత్వంలోకి నెట్టి, అడ్డూ ఆపూలేని విధంగా వారిని దోపిడీ పీడనలకు గురిచేయ జూస్తున్నారు. ఈ నేపథ్యంలోనే మోదీ నాయకత్వంలోని బీజేపీ ప్రభుత్వం అంబేద్కర్‌ను ఆకాశానికెత్తుతూ ఆయన 125వ జయంతిని ఘనంగా నిర్వహించింది. పాలకవర్గం తన ప్రయోజనాల కోసం ఈ విధంగా అంబేద్కర్‌ను ఒక ప్రతీకగా చూపడం వెనుక గల కపటాన్ని మనం బహిర్గతం చేయాలి. అంబేద్కర్‌ను విశాల ప్రజాస్వామిక పోరాటంలో ఒక ప్రభావవంతమైన శక్తిగా, తనకున్న స్థానాన్ని పదిలపరుస్తూ, పటిష్టపరుస్తూ ఆయనను పాలకవర్గాల కోట నుంచి వెలుపలికి తీసుకొచ్చి, ఆయన ఎవరి కోసమైతే తన జీవితాన్ని అర్పించారో వారి నిజమైన ప్రతీకగా నిలపాలి.

## 3వ అధ్యాయం

# బ్రిటిష్ వలసానంతర కాలంలోని కులవ్యవస్థలో మార్పులు

బ్రిటిష్ వలసానంతర కాలంలో దేశ రాజకీయ, ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక రంగాల్లో జరిగిన మార్పులలో భాగంగా కులాల రూపురేఖలు గణనీయంగా మార్పుకు గురయ్యాయి. మహత్తర తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంతో పాటు పలు ప్రజా పోరాటాలు కొనసాగడం, మహత్తర నక్సల్బరీ సాయుధ రైతాంగ పోరాటం నుండి మొదలుకొని దేశంలో నూతన ప్రజాస్వామిక విప్లవం కొనసాగుతుండడం, జమీందారీ రద్దు చట్టాన్ని అమలు చేయడం, పరిమితంగానైనా భూసంస్కరణలు అమలు చేయడం, కొన్ని రాష్ట్రాలలో 'హరిత విప్లవం' కొనసాగించడం, వివిధ సంస్కరణలను అమలు చేయడం, ప్రపంచంలో జరిగిన ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక పరిణామాల ప్రభావం మన దేశంపై పడుతుండడం, భూస్వామ్య సంబంధాలు గణనీయంగా బలహీనపడటం, పెట్టుబడిదారీ సంబంధాలు క్రమంగా పెరగడం, తదితర కారణాల ఫలితంగా ఈ మార్పులు సంభవించాయి. గ్రామీణ ప్రాంతాల్లో జరిగిన మార్పులు అత్యంత ప్రాముఖ్యత కలిగినవి.

పాత పీడక కుల జమీందార్ల, ఇతర ఫ్యూడల్ భూస్వాముల స్థానాన్ని ఒకప్పటి జమీందార్ల దగ్గరి పెద్ద కౌలుదార్లు, భూయజమానులైన పెద్ద రైతులు, చిన్న భూస్వాములు ఆక్రమించారు. సాంప్రదాయికంగా వ్యవసాయం చేసే కులాల్లోని ఒక చిన్న సెక్షన్ భూస్వాములుగా, ధనిక రైతులుగా మారారు. మధ్యతరగతి, పేద, భూమిలేని రైతాంగంలో ఈ మధ్యస్థ కులాల వారు పెద్ద సంఖ్యలో ఉన్నారు. మధ్యస్థ కులాలలోని దిగువ సెక్షన్లైన చేతివృత్తుల వారి కులాలు ప్రధానంగా మధ్యతరగతి, పేద, భూమిలేని రైతాంగం కాగా, వీరిలో కొందరు తమ సాంప్రదాయిక వృత్తులను కొనసాగిస్తున్నారు.

అందువలన, గ్రామీణ ప్రాంతాలలోని ప్రధాన దోపిడీవర్గంలో నేడు పీడక కులాలైన బ్రాహ్మణులు, రాజ్‌పుత్‌లు, భూమిహారుల కులాలకు చెందినవారే కాక, జాట్‌లు, యాదవులు, వెల్లాలులు, రెడ్లు, వెలమలు, కమ్మలు, నాయర్‌లుతో పాటు కుల సముదాయాలైన పాటిదార్లు, మరాఠాలు, వొక్కాలిగలు, లింగాయతులు , మొదలైనటువంటి పలు పీడక కులాలకు, కుల సముదాయాలకు చెందిన ఎక్కువ మందితో పాటు దోపిడీ వర్గాలలోకి మారిన కొద్ది మంది ఇతర కులాల వారు ఉన్నారు.

గ్రామీణ ప్రాంతంలో దాదాపు 20 శాతం కుటుంబాలుగా ఉండే మధ్యతరగతి రైతాంగం ముఖ్యంగా వ్యవసాయం చేసే కులాలకు, చేతివృత్తుల కులాలకు చెందినవారు. దళితులలోని ఒక చిన్న సెక్షన్ కూడా మధ్యతరగతి రైతులుగా ఉన్నారు. వర్గచైతన్యం కొరవడడం వలన మధ్యతరగతి రైతులు, గ్రామాల్లోని దోపిడీ వర్గాలతో తమకు వైరుధ్యాలున్నప్పటికీ, కుల సంబంధాల వలన సాధారణంగా వీరు తమ తమ కులాలకు చెందిన భూస్వాముల వెనుక ఉంటున్నారు. అయితే, వర్గ పోరాటంలో భూస్వాములను పీడిత ప్రజలందరికీ ఉమ్మడి లక్ష్యంగా చూపుతూ ఆ పీడక కులాలలోని మెజారిటీ పేద, మధ్యతరగతి ప్రజలను వారికి వ్యతిరేకంగా పీడిత వర్గాల పక్షాన నిలబడేలా చేసే కృషి ముఖ్యమైనది. కార్మికవర్గ పార్టీయే ఈ పని చేయగలదు.

పేద, భూమిలేని రైతాంగం గ్రామీణ కుటుంబాలలో 60 శాతంగా ఉంటుంది. వీరిలో కుల విభజనలు చాలా ఎక్కువ. పేద చేతివృత్తుల వారు, సేవలు చేసే కులాల వారు పెద్ద సంఖ్యలో ఈ పేద, భూమిలేని రైతాంగంలో ఉన్నారు. ఈ వర్గంలో దళితులు, ఆదివాసీలకు చెందిన కుటుంబాలతో పాటు ముస్లిం కుటుంబాలు కూడా పెద్ద సంఖ్యలో ఉన్నాయి. వ్యవసాయ కార్మికుల కుటుంబాలలో 37 శాతం దళితులకు, 10 శాతం ఆదివాసీలకు చెందినవి కాగా, మిగిలిన సగం వ్యవసాయం చేసే కులాలకు, ఇతర 'దిగువ' (పీడిత) కులాలకు చెందినవి. అందువలన, దోపిడీకి గురయ్యే పీడిత ప్రజానీకంలో కులవిభజన చాలా ఎక్కువగా ఉంది. కులాలలో జరిగిన వర్గ విభజన కారణంగా నేడు కులం, వర్గం మధ్య సంబంధం ఇలా సంక్లిష్టంగా ఉంది.

ప్రభుత్వ పాలనా యంత్రాంగం, ప్రభుత్వ రంగం (public sector) వృద్ధి చెందడంతో పాటు ఈ రంగాలలో కూడా కుల వివక్ష కొన్ని మార్పులతో కొనసాగుతోంది. పారిశ్రామిక సంస్థల నిర్వహణలోని, ప్రభుత్వ అధికార యంత్రాంగంలోని ఉన్నత స్థానాలలో పీడక కులాలు ఆధిపత్యం వహిస్తున్నాయి. దళితులు స్వీపర్లు, ప్యూనులు తదితరమైన చాకిరీ పనులలో-4వ తరగతి ఉద్యోగాలలో ఉన్నారు. దళితులు ప్రధానంగా అసంఘటితరంగ కార్మికులుగా కూడా (సాపేక్షికంగా నైపుణ్యం లేని, తక్కువ వేతనాలు లభించే, ఉద్యోగ భద్రత లేని పనులలోనూ, కాంట్రాక్టు కార్మికులుగానూ, చిన్నతరహా పారిశ్రామిక రంగంలోనూ) ఉన్నారు. ఉద్యమాల ఒత్తిడి వలన వివిధ ప్రభుత్వాలు రాష్ట్ర, కేంద్ర పాలనా యంత్రాంగాలలో రిజర్వుడ్ స్థానాలను ప్రత్యేకించి క్లర్క్ కేటగిరి, దిగువ స్థాయి నిర్వాహక కేటగిరి ఉద్యోగాలలో వీరిని భర్తీ చేయడం జరిగింది. అయినప్పటికీ, దళితులకు

ఇతర కులాల వారికి మధ్య సామాజికపరమైన అంతరంలో మాత్రం పెద్ద మార్పు లేదు. రిజర్వేషన్ల విధానం వలన నేడు మొత్తం దేశంలోని ఎస్సీ-ఎస్టీ జనాభాలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉద్యోగాల్లో పనిచేస్తున్న వారి సంఖ్య వారికి కేటాయించిన రిజర్వేషన్ కోటా కంటే చాలా తక్కువగా ఉంది. అంటే వీరిలో నూటికి 95 మంది వరకు స్థిరమైన, భద్రత కలిగిన ఉపాధి లేని వాళ్లే. పల్లెల్లో చూసినా, పట్టణాల్లో అసంఖ్యాకంగా ఉన్న మురికివాడల్లో చూసినా దళితులు దారిద్ర్యంతో, నిరక్షరాస్యతతో/కొద్దిపాటి చదువులతో దుర్భర జీవితం గడుపుతున్నారనేది యదార్థ జీవితసత్యం.

ఈ కులాలలో ఎక్కువ మంది వ్యవసాయ కూలీలుగా బతుకుభారం ఈడుస్తున్నవారే. నిరంతరం భూస్వాముల దోపిడీ, దౌర్జన్యాలకు గురవుతున్నవారే. పాలకులు చేసిన భూసంస్కరణల్లో 1 శాతం కన్నా తక్కువ భూమి పంపకం జరగగా దీనిలో దళితులకు సేద్యానికి పనికివచ్చే భూమి చాలా స్వల్పంగా దక్కింది. కొన్ని చోట్ల పట్టాలు వచ్చినా భూస్వాముల పెత్తందారీతనం వలన వారి చేతికి భూములు అందక పోవడం, ఎక్కడైనా చేతికి భూములు వచ్చినా వ్యవసాయానికి తగిన మదుపులు, వనరులు లేక దాన్ని చౌకగా తెగనమ్ముకోవడం లేక దాన్ని కుదవబెట్టి చేసిన బాకీ తీర్చలేక చివరికి ఆ భూములు వదిలివేయడం జరిగిపోయాయి. గ్రామీణ నిరుద్యోగులలో పట్టణాలకు వలస వెళ్లిన వారిలో అత్యధికులు దళితులే. ప్రభుత్వాలు ఎస్సి-ఎస్టిలకు కల్పించిన సదుపాయాలు, రిజర్వేషన్లు వారి జీవితాలలో మౌలిక మార్పును తీసుకురాలేకపోయాయి. అయితే ఒక చిన్న సెక్షన్ ఆర్థికంగా బలపడి మధ్యతరగతి వర్గంగా మారింది. కాగా, దేశంలో ఎల్.పీ.జీ. విధానాలు అతి వేగంగా, దూకుడుగా అమలవుతున్న నేపథ్యంలో ప్రభుత్వ రంగం యావత్తు ప్రైవేట్‌పరం అవుతుండగా రిజర్వేషన్‌లునామమాత్రమవుతున్నాయి. దీనితో ఇప్పటివరకూ లభించిన రిజర్వేషన్‌లు కరువైపోయి వారి విద్యా, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు హరించిపోతున్నాయి.

నిజానికి దళితుల సమస్య ప్రధానంగా భూమి సమస్య, అదే సమయంలో కుల సమస్య, అందులో భాగంగా అంటరానితనం సమస్య, వెలివాడ సమస్య, ఆత్మగౌరవ సమస్య, రాజ్యాధికార సమస్య కూడా. కనుక ఇక్కడ దళిత సమస్యను భూమికి మాత్రమే కుదించి మిగతా వాటిని నిర్లక్ష్యం చేసినా, లేక మిగతా వాటికి కుదించి భూమి సమస్యను నిర్లక్ష్యం చేసినా ఆ సమస్యను సంపూర్ణంగా అర్థం చేసుకోలేము. ఈ కారణం రీత్యానే దళిత సమస్య పరిష్కారానికి ఏకకాలంలో భూమి సమస్య, ఉపాధి సమస్యలతోపాటు మిగిలిన సాంఘిక, ఆర్థిక, రాజకీయ సమస్యలను కూడా చేపట్టాలి. నూతన ప్రజాస్వామిక విప్లవానికి ఇరుసు వంటిదైన దున్నేవారికే భూమి నినాదంతో జరిగే వ్యవసాయ విప్లవాన్ని విజయవంతం చేయడం ద్వారా అంటే దేశంలో నెలకొని ఉన్న సామాజిక దోపిడీ సంబంధాలను బ్రద్దలు కొట్టడం ద్వారా, అర్ధవలస, అర్ధభూస్వామ్య సామాజిక పునాదిని కూకటివేళ్లతో పెకిలించి వేయడం ద్వారా దళిత సమస్య పుట్టుకకు, కొనసాగటానికి మూలమైన భూస్వామ్యాన్ని, సామ్రాజ్యవాదాన్ని ధ్వంసం చేయడం ద్వారా దళిత సమస్య శాశ్వత పరిష్కారానికి మార్గం సుగమం అవుతుంది.

గ్రామాల్లో అంటరానితనం కొనసాగుతూనే ఉంది. పట్టణాలలో బహిరంగంగా అంటరానితనం పాటించడం చాలావరకు కనిపించకపోయినప్పటికీ, వారి పట్ల వివక్షతగానూ, పక్షపాతంగానూ ఇది వ్యక్తమవుతూనే ఉంది. బస్తీల్లో నల్లాల వద్ద, అద్దె ఇళ్ల విషయంలోనూ, కొన్ని బహిరంగ స్థలాలతో పాటు వివిధ పని స్థలాలలో అనేక రూపాల్లో ఈ వివక్షత కొనసాగుతూనే ఉంది. హిందూ దేవాలయాలలోకి ప్రవేశంపై ఈనాటికి అప్రటిత నిషేధం కొనసాగుతోంది. అత్యంత లాభసాటియైన వృత్తులు పీడక కులాలవారి గుత్తాధిపత్యంలోనే ఉన్నాయి.

వివిధ చారిత్రక పరిణామాలకు తోడు భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటు ప్రాంతీయ స్థాయిలో, ప్రత్యేకించి పశ్చిమ, దక్షిణ భారతదేశంలో, మధ్యస్థ కులాలలో ఆర్థికంగా బలపడిన చిన్న సెక్షన్‌లు రాజకీయ అధికారం సంపాదించడానికి తోడ్పడింది. అయితే ఉత్తర భారత రాష్ట్రాలలో నేటికీ ప్రభుత్వ యంత్రాంగం, ప్రభుత్వాలు చాలావరకు పీడక కులాల అధీనంలోనే ఉన్నాయి.

1960లలోని ఆర్థిక రాజకీయ సంక్షోభం, అఖిల భారత స్థాయిలో పాలకవర్గాల మధ్య వైరుధ్యాలు, అఖిల భారత దళారీ నిరంకుశ బూర్జువా వర్గానికీ ప్రాంతీయ దళారీ బూర్జువా వర్గంతోనూ, భూస్వామ్య సెక్షన్లతోనూ గల వైరుధ్యాలతో పాటు, దేశంలోని వైరుధ్యాలన్నీ తీవ్రతరం గావడానికి దారితీసింది. హరిత విప్లవం వంటి సామ్రాజ్యవాద ప్రాయోజిత విధానాలూ, కొన్ని ప్రాంతాలలో జరిగిన పారిశ్రామికీకరణ కారణంగా, వివిధ రాష్ట్రాలలో పెట్టుబడిదారీ, నూతన భూస్వామ్య/ధనికరైతు శక్తులు వృద్ధిచెందాయి. కేంద్ర ప్రభుత్వ వనరులలో తమకు వాటా కావాలని/వాటా పెరగాలని వారు డిమాండు చేయడం పెరిగింది. వారు కోరిన విధంగా వనరులను పంచుకోవడానికి సిద్ధంగాలేని అఖిల భారత దళారీ నిరంకుశ బూర్జువా వర్గం కేంద్రంలో అధికారాన్ని మరింతగా కేంద్రీకరించడానికి ప్రయత్నించింది. ఫలితంగా 1960ల చివర, 1970ల మొదట్లో దేశంలో ఉద్యమాలు వెల్లువెత్తి రాజకీయ అస్థిరత్వం నెలకొంది.

ఈ ఆర్థిక, రాజకీయ సంక్షోభం ఉత్తర భారతదేశంలో జయప్రకాష్ నారాయణ్ నేతృత్వంలో 'సంపూర్ణ విప్లవం' పేరుతో బద్ధలైంది. ఈ ఉద్యమం ప్రధానంగా గుజరాత్, బిహార్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాలు కేంద్రంగా ఉత్తర భారతదేశాన్ని కుదిపివేసింది. కొత్తగా ఆవిర్భవిస్తున్న వెనుకబడిన కులాలలోని పెట్టుబడిదారీ, భూస్వామ్య/ధనికరైతు శక్తులు నూతన దోపిడీ పాలకవర్గ రాజకీయ పార్టీల నాయకులుగా ఈ ఉద్యమం ద్వారా రంగ ప్రవేశం చేశారు. మరోవైపు ఈ రాజకీయ సంక్షోభం ఉత్తర భారత రాష్ట్రాలలో రాజకీయ అధికారంలో భాగం నిరాకరించబడిన వివిధ భూస్వామ్య/పెట్టుబడిదారీ శక్తులు సంఘటితపడడానికి దారితీసింది. పశ్చిమ యు.పి.లోని జాట్ భూస్వామ్య ప్రతినిధియైన చరణ్‌సింగ్ నాయకత్వంలో ఉత్తరప్రదేశ్‌లో ఏర్పడిన భారతీయ లోక్‌దళ్ (బిఎల్‌డి) ప్రభుత్వం వంటి వివిధ కాంగ్రెసేతర ప్రభుత్వాలు వివిధ రాష్ట్రాలలో ఏర్పడ్డాయి.

మధ్యస్థ కులాల్లోని పెట్టుబడిదారీ, భూస్వామ్య సెక్షన్‌లు, బడా వ్యాపారులు, వివిధ ప్రాంతీయ

దళారీ బూర్జువా సెక్షన్ల సహాయంతోనూ, అఖిల భారత దళారీ నిరంకుశ బూర్జువా వర్గంలోని ఒక సెక్షన్ సహాయంతోనూ తమ స్థానాన్ని గట్టిపరుచుకొని, రాజకీయ సంక్షోభ పరిస్థితులను సొమ్ము చేసుకోవడానికి 1977లో జనతా పార్టీని స్థాపించాయి. అయితే, వివిధ పాలకవర్గ ముఠాలతో ఏర్పడిన ఈ కూటమిలో తలెత్తిన అధికార కుమ్ములాటల మూలంగా ఎంతో కాలం అది నిలబడలేక పోయింది. దీనితో అఖిల భారత దళారీ నిరంకుశ బూర్జువా వర్గానికీ, కేంద్రంలోని కేంద్రీకృత అధికారానికీ, వనరులపై పట్టుకు ప్రాతినిధ్యం వహించిన కాంగ్రెస్(ఐ) 1980లో తిరిగి అధికారంలోకి వచ్చింది. యు.పి., బిహార్‌లలోని పెట్టుబడిదారీ భూస్వామ్య సెక్షన్‌లు, మరింత విశాలమైన ప్రాతిపదిక మీద వివిధ కేంద్ర, ప్రాంతీయ పాలకవర్గ ముఠాలు మరోసారి ఒక కూటమిగా ఏర్పడి జనతాదళ్‌ను ఏర్పరచి 1989లో కేంద్రంలో అధికారంలోకి వచ్చాయి. తమ సామాజిక పునాదిని స్థిరపరచుకోవడం కోసం వారు 'ఇతర వెనుకబడిన వర్గాలకు' (ఓ.బీ.సీ–అదర్ బ్యాక్‌వర్డ్ క్లాసెస్)లకు ప్రభుత్వ ఉద్యోగాలలో, ఉన్నతస్థాయి వృత్తివిద్యలో రిజర్వేషన్లను డిమాండు చేశారు. రాష్ట్ర స్థాయిలో వివిధ కమిషన్లను నియమించడమూ, 1977లో మండల్ కమిషన్‌ను నియమించడమూ ఈ క్రమంలో భాగమే. మధ్యస్థ కులాలలోని గ్రామీణ ఉన్నతవర్గాలు ప్రభుత్వ విద్యా, ఉద్యోగ అవకాశాలలో తమ వాటాకు హామీని సంపాదించడం కోసం, పేదవర్గాలలోని తమ కులస్థులపై తమ పట్టును మరింత గట్టిపరచుకోవడం కోసం కేంద్ర ప్రభుత్వ సర్వీసులలో ఉద్యోగ నియామకాలకు సంబంధించిన మండల్ కమిషన్ సిఫారసులను అమలుపరిచే ప్రయత్నం చేశారు.

మరో వైపు నేటి అర్ధవలస, అర్ధభూస్వామ్య వ్యవస్థలోని ఆర్థిక, రాజకీయ సంక్షోభం తీవ్రతరం కావడం కులవ్యవస్థలోని వైరుధ్యాలు తీవ్రతరం కావడానికి, నూతన వైరుధ్యాలు ముందుకు రావడానికి దారితీసింది. ఈ పరిణాణామాలురెండు అంశాల ద్వారా వ్యక్తమయ్యాయి. 1) దళితులలో కుల వివక్షతకు, ప్రత్యేకించి వారిపై గ్రామీణ ప్రాంతాలలో కొనసాగుతున్న హత్యాకాండలకు వ్యతిరేకంగా పెరుగుతున్న ప్రజాస్వామిక చైతన్యం, 2) ఓ.బీ.సీ.లకు రిజర్వేషన్లు కల్పించాలన్న డిమాండు రావడం; ఆ సమయంలో రిజర్వేషన్ల విధానానికి వ్యతిరేకంగా తీవ్రమైన రియాక్షనరీ ఆందోళనలు చెలరేగడం.

## దళితులపై దాడులు:

తమిళనాడులోని కీల్వెన్‌మణిలో 1968లో దళిత వ్యవసాయ కూలీల పైన మూకుమ్మడి మారణకాండ జరిగింది. ఎక్కువ వేతనాలు కావాలన్న డిమాండుతో వ్యవసాయ కూలీలైన దళితులు సమ్మెచేయ యత్నించినందుకు ప్రతీకారంగా పీడక కుల భూస్వామ్య పెత్తందారీ శక్తులు ఈ హత్యాకాండ జరిపాయి. అదేవిధంగా దేశవ్యాప్తంగా పలు ప్రాంతాలలో ప్రత్యేకించి 1970వ దశాబ్దం చివరిభాగం నుండి దళితులపై అలాంటి మారణకాండలు పెరుగుతూ వచ్చాయి. వీటిలో ఆంధ్రప్రదేశ్ లోని కారంచేడు (1985), నీరుకొండ (1987), చుండూరు (1991), పదిరికుప్పం,

వేంపెంట (1998), లక్షింపేట; బిహార్‌లోని బెల్చి (1977), పరస్‌బిఘా (1980), బథానీటోలా (1996), లక్ష్మణ్‌పూర్ బాతే (1997), శంకర్‌బిఘా (1999), బాల్‌బటరా (2006), రాంనగర్ (2006); హర్యానాలోని దులీన-ఝజ్జర్ (2002), తెహ్రావార్ (2003), గోహన (2005), మెహముద్‌పూర్ (2006), ఖిలాజాఫర్‌గర్ (2006); కర్నాటకలోని తత్తూరు, బెండిగేరి, కంబాలంపల్లి (2000), వన్నెనూరు (2001), కడుకోలు (2006); మహారాష్ట్రలోని నాందేడ్ (1993), రమాబాయినగర్-ముంబాయి (1997), ఖైర్లాంజీ (2006); ఒరిస్సాలోని భానపూర్ (1997); రాజస్థాన్‌లో కుమ్హెర్; తమిళనాడులో నాగిపట్టినం, కొడియాంకుళం (1995), నేలవాలవు (1997), తిరునల్వేలి (1997); ఉత్తరప్రదేశ్‌లో జెహ్రానా మరియు అసన్‌పూర్ మూకుమ్మడి హత్యాకాండలు ముఖ్యమైనవి. గుజరాత్‌లోని అహమ్మదాబాద్ తదితర ప్రాంతాలలో రిజర్వేషన్ల వ్యతిరేక శక్తులు దళితుల ఇళ్లపై రాజ్యం అండతో దాడులు జరిపి వారి ఇళ్లను ధ్వంసం చేశాయి. వారిపై సాంఘిక బహిష్కరణను అమలుపరిచాయి. ఇదే కాలంలో దళితులపై అమలవుతున్న కులపరమైన అణచివేతకు వ్యతిరేకంగా పేద దళిత ప్రజానీకం ఎదురునిలిచి ప్రతిఘటించడం పెరిగింది. ఈ ప్రతిఘటనను అణచివేయడం కోసం భూస్వామ్య, పెత్తందారీ కుల దురహంకార శక్తులు రాజ్యం అండదండలతో ప్రతి రాష్ట్రంలోనూ దళితులపై అమానుషమైన హత్యాకాండలకు, లెక్కలేనన్ని దాడులకు పాల్పడ్డాయి.

శ్రామికులకు సంబంధించినంతవరకు కులం-వర్గం మధ్య సంబంధం ప్రధానంగా ఒకదానితో మరొకటి ముడిపడి ఉంటుంది. దళితులపై చాలా సందర్భాలలో దాడికి దిగినవారు బ్రాహ్మణేతర కులాలలోని పీడక కుల భూస్వాములతో పాటు మధ్యస్థ కులాలకు చెందిన భూస్వామ్య పెత్తందారీ దోపిడీదారులే అవుతూ వచ్చారు. ఈ హత్యాకాండలు, దౌర్జన్యాలు కొనసాగించినవారు కుల దురహంకారులు అనేది సుస్పష్టమైనదే. అయితే దాదాపు ఈ ఘటనలన్నింటి వెనుక ఒకదానితో మరొకటి విడదీయరాని బలమైన సామాజిక, ఆర్థిక, రాజకీయ కారణాలున్నాయి. దళితులు ప్రజాస్వామిక ఆకాంక్షలతో తలఎత్తుకొని స్వతంత్రంగా నిలబడడానికి ప్రయత్నించినపుడే లేదా తమ న్యాయమైన సామాజిక, ఆర్థిక, రాజకీయ హక్కుల సాధన కోసం పోరాటాలకు పూనుకున్నప్పుడే లేదా తమపై కొనసాగే దౌర్జన్యాలను ప్రతిఘటించినప్పుడే ఇవన్నీ జరిగాయి. రాజ్యంతో కుమ్మక్కయ్యే బ్రాహ్మణవాద పీడక కుల దురహంకార భూస్వామ్య పెత్తందారీ శక్తులు బాహాటంగా ఈ దాడులను నిర్వహించగలగడంతో పాటు చట్టం నుండి తమను తాము రక్షించుకోగలిగాయి. ఇక్కడ సుస్పష్టమయ్యే మరో విషయమేమంటే పోలీసు-న్యాయవ్యవస్థలు దోపిడీదారులకు-పీడక కులాలకు అనుకూలమైనవీ, పేదలకు-దళితులకు వ్యతిరేకమైనవి.

మన పార్టీ నాయకత్వంలో దేశంలోని చాలా ప్రాంతాల్లో వర్గపోరాటం పదునెక్కి భూస్వామ్య పెత్తందార్ల ఆధిక్యతను దెబ్బతీసి పీడిత వర్గాల ఆధిక్యతను నెలకొల్పిన/పెంపొందింపజేసిన ప్రాంతాల్లో ఇలాంటి దాడులు దాదాపు పూర్తిగా నిలిచిపోయాయి. అయితే ఇలాంటి ప్రాంతాల్లో కూడా కుల

వివక్షత, పక్షపాతం ప్రత్యక్ష, పరోక్ష రూపాల్లో కొనసాగుతున్నాయి. మన విప్లవోద్యమం బలహీనపడిన ప్రాంతాల్లో తిరిగి అక్కడక్కడా దళితులపై పీడక కుల దాడులు జరుగుతున్నాయి. విప్లవోద్యమం ప్రాథమికంగా ఉన్న ప్రాంతాల్లో కొన్ని తేడాలతో ఉద్యమేతర ప్రాంతాల వంటి పరిస్థితే ఉన్నది.

కులం శ్రమ విభజనతోపాటు, శ్రామికుల విభజన కూడా చేస్తుంది. ఇది దోపిడీకి పాలకవర్గాలకు తమ అధికారాన్ని చెలాయించడానికీ వారసత్వంగా లభించిన ఒక ఆయుధం. వర్తమాన ఆర్థిక సంక్షోభ పరిస్థితిలో పాలకవర్గాలు బ్రాహ్మణీయ హిందూత్వ ఫాసిస్టు ప్రభుత్వాన్ని ఏర్పరిచాయి. దాని ద్వారా కొత్తగా కుల, మత పరమైన సాంప్రదాయక దాడులు పెరిగాయి. కేంద్రంలో మోడీ నాయకత్వాన బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత దేశవ్యాప్తంగా బ్రాహ్మణవాద, హిందూ మతోన్మాద పీడక కుల దురహంకార సంఘ్ పరివార్ సంస్థలు, వారి సాయుధ ముఠాలు మిళితమై రాజ్యం దన్నుతో దళితులపై, మత మైనారిటీలపై దాడులను తీవ్రతరం చేశాయి. ప్రభుత్వ అండతో ఈ శక్తులు దళితులను, ముస్లిం, క్రిస్టియన్ మత మైనారిటీలను, ఆదివాసులను, విప్లవకారులను, ప్రజాస్వామిక, లౌకిక, హేతువాద శక్తులను, సంస్థలను అణచివేయడానికి ఉనికిలో ఉన్న ప్రతిఘాతక చట్టాలను వినియోగించుకోవడంతో పాటు కొత్త కొత్త ఫాసిస్టు చట్టాలను రూపొందిస్తున్నాయి. ఇందులో ఒక భాగమే గొడ్డు మాంసం తిన్నారనే, గోహత్యకు పాల్పడ్డారనే, గోవులను దొంగతనంగా తరలిస్తున్నారనే, చట్టవిరుద్ధంగా మాంసం దుకాణాలు నడుపుతున్నారనే నెపంతో ఈ ఫాసిస్టు మూకలు చాలా రాష్ట్రాల్లో దళితులను, ముస్లింలను సామూహికంగా బాహాటంగా పాశవికంగా హత్య చేయడం లేదా గాయపరచడం లేదా జైళ్లలో పెట్టడం లేదా జీవనోపాధి లేకుండా చేయడం లేదా వీటన్నిటినీ అమలు చేయడం జరిగింది. అలాగే దేశంలోని చాలా రాష్ట్రాల్లో కఠినమైన శిక్షలతో కూడిన గోవధ నిషేధ చట్టాన్ని ప్రజలపై రుద్దుతున్నారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వం కూడా ఇలాంటి నిర్ణయాన్ని చేసి దేశ ప్రజలపై రుద్దడం ఆరంభించింది. ఈ విధంగా బ్రాహ్మణవాద హిందూమతోన్మాద, పీడక కుల దురహంకార ఫాసిస్టు శక్తులు, రాజ్య ఫాసిజం దేశ ప్రజల్లో భయాందోళనలను సృష్టిస్తున్నాయి.

ఇలాంటి దాడుల కొనసాగింపుగానే గుజరాత్ రాష్ట్రంలోని ఊనాలో బ్రాహ్మణీయ భూస్వామ్య పెత్తందారీ శక్తులు 2016లో దళితులపై దాడి జరిపాయి. తెలంగాణ రాష్ట్రంలోని పాతపల్లిలో కుల దురహంకారులు దళితవాడపై పెద్ద ఎత్తున దాడి చేశారు. మహారాష్ట్రలో కృష్ణ అనే దళిత సామాజిక కార్యకర్తపై దాడి చేశారు. ఈ దాడులు విశ్వవిద్యాలయాల దాకా పాకాయి. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో రోహిత్ వేముల అనే దళిత విద్యార్థి హిందూ మత అనుకూల యూనివర్సిటీ పాలక మండలి వేధింపులకు, హిందూమతోన్మాద అఖిల భారత విద్యార్థి పరిషత్ (ఏబివిపి)తో పాటు ఫాసిస్టు కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఒత్తిడి, అణచివేత చర్యలకు నిరసనగా ఆత్మహత్య చేసుకొని చనిపోయాడు. సమాజంతో పాటు విద్యా వ్యవస్థ–క్యాంపస్‌లు కాషాయీకరణ,

మార్కెటీకరణ జరిగిపోతున్న దాని దుష్ఫలితమే రోహిత్ వేముల మరణం. బ్రాహ్మణవాద, హిందూ మతోన్మాద కులదురహంకార ఫాసిస్టు శక్తులూ, ఫాసిస్టు రాజ్యం కొనసాగిస్తున్న అమానుషమైన ఈ హత్యాకాండలూ, దాడులూ, వేధింపులూ, వీటికి వ్యతిరేకంగా దళితులు, మైనారిటీలు, ప్రజాస్వామిక లౌకిక శక్తులు వివిధ రూపాల్లో కొనసాగిస్తున్న ప్రతిఘటన విప్లవ పరిష్కారాన్ని కోరుతున్న నేటి సమాజంలోని తీవ్ర వైరుధ్యాల వ్యక్తీకరణలే. దేశంలో దళిత ఉద్యమం తిరిగి పుంజుకోవడానికి ఇవి ప్రేరకాలుగా పనిచేస్తున్నాయి కూడా. ఈ సంఘటనలు జరిగినప్పుడు దేశవ్యాప్తంగానే కాకుండా విదేశాలలోని లక్షలాదిమంది దళితులు బ్రాహ్మణీయ రాజ్యానికి వ్యతిరేకంగా తమ నిరసనను వివిధ రూపాలలో మిలిటెంట్‌గా తెలియచేశారు. ఊనా సంఘటన సందర్భంగా అక్కడి దళితులు 'ఇక నుండి పశువుల తోళ్ళు ఒలిచే వృత్తిని మేము చేపట్టం, మాకు భూమి కావాలి' అని పెద్ద ఎత్తున నినదించారు. ఈ పోరాటాలకు ప్రజాస్వామికవాదులు, విప్లవ పార్టీలు, ప్రజాసంఘాలు, ముస్లింలు, ఆదివాసులు, వివిధ సెక్షన్ల ప్రజలు తమ క్రియాశీలక మద్దతును తెలియచేశారు.

విద్య, ఉద్యోగ, వ్యవసాయ, వ్యాపార, పారిశ్రామిక, రాజకీయ రంగాలలో దళితులకు ఒక మేరకు అవకాశాలు లభించి ప్రత్యేకించి విద్య, సంఘటిత ఉద్యమాల కారణంగా వారిలో ప్రజాస్వామిక ఆకాంక్షలు పెరుగుతున్నాయి. వారు తమ భాగస్వామ్యం కోసం ప్రతిస్థాయిలో జోక్యం చేసుకుంటున్నారు. కుల వివక్షతకు అత్యాచారాలకు, దాడులకు వ్యతిరేకంగా దళిత ప్రజానీకం జాగృతమై సంఘటితపడుతూ ఉద్యమించడం పెరుగుతున్నది. దళితులకు డాక్టర్ అంబేద్కర్ నేటికీ నిర్వివాద నాయకులుగా ఉన్నారు. దళిత సంఘాలు కొన్ని ప్రాంతాల్లో దళిత పాంథర్స్‌గా ఉంటే, మరికొన్ని ప్రాంతాల్లో బాబా సాహెబ్ అంబేద్కర్ సేవాసమితి పేరుతోనో, ఎస్‌సీ హక్కుల పరిరక్షణ సంఘాల పేరుతోనో, వివిధ విద్యార్థి, యువజన, మహిళా, సాహితీ సాంస్కృతిక సంఘాల పేరుతోనో సంఘటితపడడం పెరుగుతున్నది. ఒకచోట దళితులపై అత్యాచారం జరిగినప్పుడు ఆ ప్రాంతంలోనే గాక, రాష్ట్ర, దేశ స్థాయిలో కూడా దళితులు ఆ సంఘటనపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసి, బాధితులకు సహాయపడడం, అక్కడి పోరాటానికి చేయూతనివ్వడం దళితులతో పాటు వివిధ బ్రాహ్మణీయ హిందుత్వ వ్యతిరేక శక్తులు సంఘీభావం ప్రకటించడం పెరుగుతున్నది. 2018లో ఎస్.టీ., ఎస్.సీ అత్యాచార నిరోధక చట్టంపై సుప్రీంకోర్టు వెలువరించిన హిందుత్వ అనుకూల తీర్పును ఖండిస్తూ దళిత, ప్రజాస్వామిక శక్తులు తెలిపిన నిరసన, భీమా కోరేగాంలో లక్షలాది దళితుల సమీకరణలను మచ్చుకు రెండు ఇటీవలి ఉదాహరణలుగా చెప్పుకోవచ్చు. ఇది దళితులలో పెరుగుతున్న ప్రజాస్వామిక చైతన్యానికి నిదర్శనం. ఇది భారత ప్రజాస్వామిక విప్లవానికి దోహదపడే పరిణామం. విప్లవ సానుకూలమైన ఈ పరిణామాలనుసరైన మార్గంలోకి మలచుకోవడానికి సమస్త ప్రజాస్వామిక శక్తులను కలుపుకొని  మరింత సమరశీల పోరాటాలు చేపట్టాల్సిన గురుతరమైన బాధ్యత మన పార్టీపై ఉంది.

## రిజర్వేషన్ విధానం – మన వైఖరి:

భారత రాజ్యాంగం ప్రకారం 1950 నుండి షెడ్యూల్డు కులాలు, షెడ్యూల్డు తెగలకు ప్రభుత్వ ఉద్యోగాలలో, విద్యా సంస్థలలో రిజర్వేషన్లను కేటాయించడం ప్రారంభమయింది. 1919లో మాంటెగు చెమ్స్‌ఫర్డ్ సంస్కరణల ఫలితంగా వలస పాలకులు దేశంలోని కొన్ని ప్రాంతాలలో 131 దళిత, వెనుకబడిన కులాలను గుర్తించి రిజర్వేషన్లు ప్రారంభించారు. దీనికి ముందే మహారాష్ట్రలోని కొల్హాపుర్ సంస్థానాధీశుల్లాంటి వారు రిజర్వేషన్‌లను అమలు చేశారు. మైసూర్ సంస్థానంలో ఏర్పాటు చేసిన మిలిటరీ కమిషన్ బీసీలకు 50 శాతం రిజర్వేషన్‌లను సిఫారస్ చేసింది. వలస పాలనలో 1946 నాటికే షెడ్యూల్డు కులాలకు రిజర్వేషన్లను ప్రవేశపెట్టారు. అయితే 60వ దశాబ్దం మధ్యభాగం వరకు పాలకులు ఈ రిజర్వేషన్ల విధానాన్ని అయిష్టంగానే అరకొరగా అమలుచేశారు. బ్రాహ్మణేతర కులాలలోని ఎగువ సెక్షన్లు దక్షిణాది రాష్ట్రాల్లో అధికారం సంపాదించడంతో, బలమైన బ్రాహ్మణవాద వ్యతిరేక ఉద్యమపు ఒత్తిడితో వృత్తి విద్యా సంస్థల సీట్లలో, ప్రభుత్వోద్యోగాలలో వెనకబడిన కులాలకు (ఓ.బీ.సీ) పెద్దభాగం రిజర్వేషన్లు కేటాయించారు. ఆ తర్వాత 1980లలో ఓ.బీ.సీలకు రిజర్వేషన్ల విధానాన్ని ఉత్తరాది రాష్ట్రాల్లో కూడా అమలుచేశారు.

భారతదేశం అసమాన అభివృద్ధితో కూడిన వెనుకబడిన దేశం. పరిశ్రమలు, బ్యాంకులు, ఫైనాన్స్ కంపెనీలు, వ్యాపారాలు, నిర్మాణ కంపెనీలు, గనుల తవ్వకాలు, ట్రాన్స్‌పోర్టు కంపెనీలు, విద్య, వైద్యం, వినోదం తదితర సంస్థలలో పెట్టుబడులు పీడక కులాలకు చెందిన ఒక ఉన్నత వర్గం చేతుల్లో, పార్సీల వంటి హిందూయేతరుల లోని ఒక చిన్న ఉన్నత వర్గం చేతుల్లో, ఉన్నతవర్గంగా మారిన ఇతర కులాలకు చెందిన ఒక సెక్షన్ చేతుల్లో కేంద్రీకృతమై ఉన్నాయి. వీరిలో అత్యధికులు సామ్రాజ్యవాదులతో మిలాఖతై వారికి దళారీలుగా పని చేస్తున్నవారే. అలాగే 1947కు ముందు బ్రిటిష్ సామ్రాజ్యవాదులూ, తరువాత వారితో పాటు ప్రధానంగా అమెరికా తదితర సామ్రాజ్యవాదులు భారత ఆర్థిక వ్యవస్థలోని వివిధ రంగాలలో పెద్దెత్తున పెట్టుబడులు పెట్టారు.

దేశంలో 1990లలో ప్రారంభమైన సామ్రాజ్యవాద ఎల్.పీ.జీ. విధానాలతో ఈ పోకడ (ధోరణి) వేగంగా, దూకుడుగా పెరుగుతోంది. దీనివల్ల దేశంలోప్రభుత్వ రంగం కంటే ప్రైవేటురంగం విపరీతంగా పెరిగిపోయింది. ఈ దేశంలో చాలావరకు అవినీతి, బంధుప్రీతి, కులతత్వం పైన ఆధారపడి ఉద్యోగ నియామకాలు జరుగుతాయి. ఇటువంటి పరిస్థితిలో నేటికీ బడుగువర్గాలకు ప్రభుత్వ రంగమే ప్రధానంగా స్థిరమైన ఉద్యోగాలు కల్పించే సాధనంగా ఉంది. దళితులలోను, ఇతర పీడిత కులాలలోను విద్యావంతులైన యువకులు పెరుగుతున్నారు. ఆర్థిక స్థాయి పెంపొందించుకోవాలనే, సామాజిక హోదా పెంపొందించుకోవాలనే ఆకాంక్షలు కలిగిన దళితులకు ప్రభుత్వరంగమే ఉద్యోగాలకు ప్రధాన వనరయింది. అదే సమయంలో, మన భారత ఆర్థిక వ్యవస్థ

పైన పెరిగిన సామ్రాజ్యవాద భల్లూకపు పట్టు వలన పెరుగుతున్న ఆర్థిక సంక్షోభం, పరాధీనత, వక్రీకరించబడిన అభివృద్ధి తీవ్రతరమైనాయి.

రోజు రోజుకు అతివేగంగా పెరిగిపోతున్న విద్యావంతులైన నిరుద్యోగుల ఉపాధి అవసరాలను యేటేటా కుదించుకుపోతున్న ప్రభుత్వరంగం తీర్చలేకపోతున్నది. ఉద్యోగాల కోసం పెనుగులాట పెరగడంతో దళితుల రిజర్వేషన్ల పట్ల పీడక కులాలలోని మధ్యతరగతి వారిలో బ్రాహ్మణీయ హిందుత్వ శక్తులు ద్వేషాన్ని రేకెత్తించాయి. దళితుల చట్టబద్ధమైన ఈ హక్కును కూడా నిరాకరించడం కోసం పీడక కుల దురహంకార శక్తులు, ప్రభుత్వ ఉన్నతాధికారులు, పాలకులు రిజర్వేషన్లకు తూట్లు పొడవడానికి అన్ని విధాలా ప్రయత్నించారు. అంతేగాక కులాలవారీగా పీడిత ప్రజలను రిజర్వేషన్ అనుకూల, వ్యతిరేక సమూహాలుగా చీల్చడానికి ఈ విధానాన్ని ఉపయోగించుకున్నారు. దానితో, రిజర్వేషన్లు పట్టణ ప్రాంతాలలోని పీడక కులాల మధ్యతరగతి వర్గంలోనూ, దళితులలోనూ పెద్దెత్తున ఉద్రిక్తతలను సృష్టించాయి. పీడక కులాల దుష్ట శక్తుల కుట్రలతో ప్రజల మధ్య వైరుధ్యం కాస్తా వైషమ్యపూరితమైన రూపాన్ని ధరించింది. ఇది విద్యార్థి యువజనుల ఆందోళనలకు, అల్లర్లకు, మొత్తంగా దళితుల పైన దాడులకు దారితీసింది.

పీడక కులాల్లోని ఆధునిక సెక్షన్‌లుగా చెప్పబడే విద్యావంతులలో కులపక్షపాతము, కులతత్వ భావాలు ఎంతగా పెంచి పోషించబడ్డాయో రిజర్వేషన్ల వ్యతిరేక, మండల్ వ్యతిరేక ఆందోళనలు వెల్లడి చేశాయి. పీడక కులాలకు చెందిన ప్రతిఘాతక సెక్షన్లు ప్రభుత్వ వనరుల పైన, ప్రతిష్టాకరమైన మహా లాభసాటియైన వృత్తులపైన తమ గుత్తాధిపత్యాన్ని కొనసాగించడానికి చేసిన ఒక దుష్ట ప్రయత్నమే రిజర్వేషన్ల వ్యతిరేక ఆందోళన. ప్రజలను కులాలవారీగా విడగొట్టడానికి పాలకవర్గాలు వారిని రెచ్చగొడుతున్నాయి. ఇది దళితులను, ఓ.బీ.సీ.లలోని దిగువ సెక్షన్లను హీనులుగానూ, ఇష్టానుసారం దోచుకోబడగల శ్రామికులుగానూ ఉంచేయడం ద్వారా కులవ్యవస్థను శాశ్వతం చేయాలనుకొనే పాలకవర్గాల, పీడక కుల దురహంకారుల ప్రయత్నం తప్ప వేరుకాదు. అందుకే దళిత రిజర్వేషన్ల వ్యతిరేక ఆందోళనలను మనం వ్యతిరేకించాం, వ్యతిరేకించి తీరాలి. మనం దళితులతో పాటు ఓ.బీ.సీ. మరియు ఇతర పీడిత కులాల ప్రజలను రిజర్వేషన్‌ల అమలు కోసం ఐక్యం చేయాలి.

ఈ మధ్య కాలంలో రిజర్వేషన్ల విషయంలో మరో కొత్త ధోరణి తలెత్తుతున్నది. రాజస్థాన్‌లోని గుజ్జర్లు, ఆంధ్రప్రదేశ్‌లో కాపులు, గుజరాత్‌లో పాటిదార్లు, హర్యానాలో జాట్‌లు, మహారాష్ట్రలో మరాఠాలు రిజర్వేషన్లు కావాలని ఉద్యమిస్తున్నారు. వాస్తవంగా ఈ కులాలలోని ఉన్నత సెక్షన్ పాలకవర్గాలలో భాగంగా ఉండగా వీరిలో వర్గరీత్యా చాలా మంది మధ్యతరగతి వారు, అంతకంటే ఎక్కువగా పేదవారున్నారు. అయినప్పటికీ ఈ కులాలు సమాజంలో సాంఘికంగా వెనకబడిన కులాలు కావు. ఇవి సామాజికంగా ఆధిపత్య హోదాను కలిగి వున్నాయి. ఈ కులాల్లోని

మధ్యతరగతివారు, పేదవారు జీవనోపాధి సంపాదించుకునే అవకాశాలలో కొన్ని తేడాలున్నప్పటికీ వీరు వివిధ రూపాలలో జీవనోపాధి సంపాదించుకోవడానికి కొంతవరకు తమ సామాజిక హోదాను వినియోగించుకునే అవకాశాలు ఉన్నాయి. కనుక కులాల వారీగా రిజర్వేషన్లు కావాలని వీరు చేస్తున్న డిమాండ్ సమంజసమైనది కాదు, సమర్థనీయమైనది కాదు. వీరి డిమాండ్‌ను ఆమోదిస్తే అరకొరగా రిజర్వేషన్లను పొందుతున్న ఓ.బీ.సీ., ఎస్.సీ. కులాల ప్రయోజనాలతో పాటు ఎస్‌టిల ప్రయోజనాలు వివిధ రూపాల్లో దెబ్బతింటాయి. ఈ రిజర్వేషన్ డిమాండ్ల వల్ల సమాజంలో కుల ప్రాతిపదికన, సామాజిక సెక్షన్ల ప్రాతిపదికన వివిధ రూపాల్లో పేద, మధ్యతరగతి ప్రజల మధ్య ఘర్షణలు తలెత్తే పరిస్థితులు పెరుగుతున్నాయి. కనుక వీరి డిమాండ్‌ను సమర్థించకూడదు. మరోవైపూ, 2019 ఫిబ్రవరిలో మోదీ ప్రభుత్వం దేశంలో 4 శాతంగా ఉన్న 'అగ్ర' కులాల వారికి ఓటు బ్యాంకు రాజకీయాలతో ఈ.డబ్ల్యు.ఎస్. (ఇకనామిక్ వీకర్ సెక్షన్స్) రిజర్వేషన్స్ అంటూ 10 శాతం కల్పించి పీడక కులాల పట్ల తన భక్తిని చాటుకుంది. దీనిని మన పార్టీ వ్యతిరేకించింది.

అయితే మొదటి నుండీ ఈ కులాలలోని పేదవారి పిల్లల చదువులకు ఎంతో పరిమితి ఉండడంతో పాటు ఉన్నత చదువులకు అవకాశాలు చాలా తక్కువ. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న సామ్రాజ్యవాద అనుకూల, పాలకవర్గ అనుకూల విధానాల వల్ల దినదినం ప్రాథమిక స్థాయి నుండి వృత్తి విద్యా కోర్సులవరకు విద్య ప్రైవేటీకరించబడడం, పెరుగుతున్న సంక్షోభంలో భాగంగా నిత్యావసర సరుకుల ధరలు, పన్నుల భారం, నిరుద్యోగం తదితరాల వల్ల పేద ప్రజలకు అన్ని స్థాయిల్లో విద్యా ఉద్యోగావకాశాలు లేకుండా పోతున్నాయి. ఇలాంటి వారికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తప్పనిసరిగా ఉన్నత చదువుల వరకు అన్ని రకాల ఫీజుల రద్దు, ఉచితంగా పాఠ్య పుస్తకాలనందించడం, ఉచిత హాస్టల్ సౌకర్యాలనందించడం తదితర రూపాలలో ఉచితంగా విద్యనందించాలి. నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించాలి. ఈ కులాలన్నీ ఈ డిమాండ్లపై ఉ ద్యమించాల్సిన అవసరం ఉంది. రిజర్వేషన్లు పొందుతున్న సెక్షన్లన్నీ వీరికి మద్దతుగా నిలవాలి. మన పార్టీ ఈ డిమాండుపై ఉద్యమించే వారందరికీ మద్దతునివ్వడంతో పాటు విద్యార్థులను కదిలించటానికి కృషి చేస్తుంది.

అయితే పీడక కులాలలోని యువతతో పాటు పీడిత కులాల యువత సైతం రిజర్వేషన్ల ద్వారా పొందుతున్న విద్యా, ఉద్యోగ అవకాశాలు చాలా తక్కువ. నిజానికి దేశంలోని యువత అంతా విద్య, ఉద్యోగ సమస్యలను తీవ్రంగా ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న సామ్రాజ్యవాద అనుకూల, దోపిడీ పాలకవర్గాల అనుకూల ప్రజా వ్యతిరేక విధానాల వల్ల ఉత్పన్నమవుతున్నది. కనుక ఈ సమస్యలపై దేశవ్యాపితంగా కులమతాలకు అతీతంగా పీడిత వర్గాల యువత ఐక్యంగా ఉద్యమించాల్సిన అవసరం ఉంది. అన్ని ప్రభుత్వాలు అనుసరిస్తున్న దివాలాకోరు విధానాలకు వ్యతిరేకంగా ఎక్కడికక్కడా సమరశీల పోరాటాలు చేపట్టాలి. ఇదే సందర్భంలో పాలకవర్గ రాజకీయ పార్టీలు తమ ఎన్నికల ప్రయోజనాల కోసం, తమ దోపిడీ

విధానాల మూలంగా తలెత్తుతున్న వినాశకర పరిస్థితుల నుండి ప్రజల దృష్టిని, ప్రత్యేకంగా విద్యార్థి యువజనుల దృష్టిని పక్కదార్లు పట్టించడం కోసం అవకాశవాద పద్ధతుల్లో ఈ రిజర్వేషన్ డిమాండ్లపై అధికారంలో ఉన్నపుడు ఒక వైఖరి, అధికారంలో లేనపుడు మరొక వైఖరి తీసుకుంటూ ఉద్యమాలను ఎగదోస్తూ తమ పబ్బం గడుపుకొనే వీరిని మన పార్టీ ప్రజలలో బహిర్గతం చేయాలి.

సమాజంలో ఇప్పటికీ సాంఘికంగా, ఆర్థికంగా అణచివేతకు గురిఅవుతున్న ముస్లింలు, క్రిస్టియన్‌లతో పాటు కొన్ని చాలా వెనుకబడిన కులాల, తెగల ప్రజలు తగిన రిజర్వేషన్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేస్తూ సుదీర్ఘకాలంగా పోరాటాలు నిర్వహిస్తున్నారు. మన పార్టీ వీరి డిమాండ్లను సమర్థించాలి. తెలంగాణలో ముస్లింలకు అమలవుతున్న 5 శాతం రిజర్వేషన్‌లను రద్దు చేయాలనీ హిందుత్వ శక్తులు మతోన్మాదంతో ముందుకు వస్తున్నాయి. ప్రజలను మతపరంగా చీల్చే వీరి దుష్ట డిమాండ్లను మన పార్టీ గట్టిగా వ్యతిరేకించాలి. దళితులలో జనాభా ప్రాతిపదికన వర్గీకరణ డిమాండ్‌పై కూడా సుదీర్ఘకాలంగా పోరాటం జరుగుతున్నది. అయితే దళితులలోనే ఒక సెక్షన్ ఈ వర్గీకరణను వ్యతిరేకిస్తున్నది. మన పార్టీ దళితులలో వర్గీకరణ చేయాలనే వారి న్యాయమైన డిమాండ్‌కు మద్దతు నివ్వాలి. ఈ డిమాండ్‌ను వ్యతిరేకించే వారికి తమ వైఖరి సరైంది కాదనీ, దళితుల మధ్య ఐక్యత దెబ్బతినకుండా ఈ డిమాండ్‌ను సమర్థించాలని నచ్చచెప్పటానికి కృషి చేయాలి.

ఈ ఉద్యమాల ఉన్నత స్థాయి నాయకులు తమ స్వార్థ ప్రయోజనాల కోసం తమ సెక్షన్‌ల ప్రజలను ఒకరికి వ్యతిరేకంగా మరొకరిని నిలబెట్టడానికి ప్రయత్నిస్తూ వీరు పాలకపార్టీలకు ఓటు బ్యాంకుగా వినియోగపడుతున్నారు. ఈ రెండు సెక్షన్ల ప్రజల ప్రయోజనాలు పరస్పర ఆధారితాలే కానీ వ్యతిరేకమైనవి కావని వీరు గ్రహించాల్సిన అవసరం ఉంది. వీరు పరస్పరం వ్యతిరేకించుకునేలా నెట్టబడడానికి పాలకవర్గాలు చేస్తున్న కుట్రల పట్ల, తమ నాయకులు పాలకవర్గాలకు పావులుగా మారడం పట్ల జాగరూకత వహించాల్సిన అవసరం ఉంది. దళిత తదితర పీడిత కులాల, పీడిత వర్గాల ప్రజలు రిజర్వేషన్లకు గల పరిమితి గురించీ, సామాజిక వెనుకబాటుతనానికీ, కుల పీడనకూ, వర్గపీడనకూ గల మూలకారణాల గురించీ, ఈ దుస్థితి నుంచి శాశ్వతంగా బయటపడడానికి రూపొందించుకోవాల్సిన తక్షణ, దీర్ఘకాలిక సరైన కార్యక్రమం గురించీ, ఈ కార్యక్రమాన్ని అమలు జరిపి విజయం సాధించటానికి కావలసిన సరైన పోరాట పంథా గురించీ తీవ్రంగా ఆలోచించాల్సిన అవసరం ఉంది.

దళితుల విముక్తి దృష్టి నుండి చూస్తే రిజర్వేషన్ల విధానానికి తీవ్రమైన పరిమితులున్నాయి. పాలకవర్గాలు, దళితులలో పెటీబూర్జువా వర్గాన్ని సృష్టించి స్థిరపరచడానికీ, చిన్నదే అయినా పలుకుబడి కలిగిన ఒక సంపన్న వర్గాన్ని సృష్టించి తమలో కలుపుకోవడానికి రిజర్వేషన్లను ఉపయోగించుకున్నాయి. రిజర్వేషన్ల విధానం దళితులలో ప్రభుత్వంపై ఆధారపడేతత్వాన్ని పెంచి

పోషించింది. కులవ్యవస్థకు పునాదైన అర్ధవలస, అర్ధభూస్వామ్య వ్యవస్థను నాశనం చేయకుండా, దోపిడీ పునాదిపై ఆధారపడిన ఉత్పత్తి సంబంధాలను బ్రద్దలు కొట్టకుండా సామాజిక, ఆర్థిక, రాజకీయ సమానత్వం సాధించడం అసాధ్యం. కాని, రిజర్వేషన్ల విధానం, దోపిడీ వ్యవస్థలోనే సమానత్వం లభించగలదన్న భ్రమను దళిత కులాలలో కల్పించి, పెంచుతోంది. రిజర్వేషన్లు ఉపశమనాన్ని కలిగించే సంస్కరణవాద విధాన కార్యక్రమమే తప్ప, నిజమైన కుల విముక్తి మార్గం కాదు. రిజర్వేషన్లకున్న ఈ పరిమితుల గురించీ, సామాజిక, ఆర్థిక, రాజకీయ అసమానతలను శాశ్వతంగా అంతం చేసే విముక్తి మార్గం గురించి మన పార్టీ పీడితకులాల్లో, పీడిత ప్రజల్లో విస్తృతంగా ప్రచారం చేయవలసిన అవసరం ఉన్నది.

అయితే, రిజర్వేషన్లకు ఎన్ని పరిమితులున్నప్పటికీ కులాల మధ్య ఆర్థిక అసమానతలు రూపుమాపడానికి కొంతవరకైనా తోడ్పడడానికి అవి కూడా అవసరమే. నేటి దోపిడీ వ్యవస్థలో రిజర్వేషన్ల ద్వారా పీడిత కులాలకు ప్రత్యేకించి దళితులకు విద్యా సంస్థలలో, ప్రభుత్వోద్యోగాలలో ఒకమేరకైనా అవకాశాలు దొరికాయి. అంతేగాక వీటి ద్వారా పీడక కులాలు ఇంకా గుత్తాధిపత్యం నెరపుతున్న ప్రభుత్వ ఉద్యోగులలోని ఉన్నతాధికార పదవులలో, ప్రొఫెషనల్స్‌లో కొంతమేరకైనా వారు ప్రవేశించడానికి కూడ అవకాశం దొరికింది. అయితే, రిజర్వేషన్లను సరిగా అమలు చేయక పోవడంతో అత్యధిక శాతం దళితులు వాటి నుండి వంచనకు గురవుతున్నారు. మరోవైపు,చాలా మంది దళితులు తమ ప్రతిభ ద్వారా ఉన్నత స్థానాలకు ఎదుగుతున్నప్పటికీ, మోసపూరితంగా వారిని రిజర్వేషన్ కోటాలో చూపుతున్నారు.

ఇక్కడ మరో విషయాన్ని కూడ మనం దృష్టిలో వుంచుకోవాలి. రిజర్వేషన్ల వలన ఆర్థికంగా కొంత మేరకు మెరుగుపడిన కుటుంబాలను క్రీమీలేయర్‌గా పేర్కొంటూ వారికి రిజర్వేషన్లు లేకుండా చేయాలనే వాదన ముందుకు వస్తున్నది. ఇది సరైన వాదన కాదు. క్రీమీలేయర్‌గా చెబుతున్న కుటుంబాలు ఆర్థికంగా కొంత మెరుగుపడినప్పటికీ, సమాజంలో వారు సాంఘిక సమానత్వాన్ని పొందడం లేదు. గత పాతికేండ్లకుపైగా ప్రభుత్వాలన్నీ అనుసరిస్తున్న సామ్రాజ్యవాదుల నిర్దేశిత విధానాల వల్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉద్యోగాలు రోజురోజుకు చాలావరకు వట్టి పోతున్నాయి. ప్రభుత్వ రంగం సన్నగిల్లి పోతూ వీటి స్థానాన్ని ప్రైవేటు రంగం ఆక్రమించడంతో పాటు పెరుగుతున్న ఆధునికీకరణ వల్ల ఏటా కోటికి పైగా విద్యావంతులైన యువత నిరుద్యోగ సైన్యంలో చేరిపోతున్నారు. మరోవైపు, ఇప్పటికే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉన్నత స్థాయి ఉద్యోగాలతో పాటు వివిధ స్థాయి ఉద్యోగాలలోని దళిత కోటాలో చాలా ఖాళీలు ఉన్నాయి. ఎప్పటికప్పుడు ఈ ఖాళీలను దళిత వ్యతిరేక విధానాలతో (ఉదా.కు రోస్టర్ పద్ధతి) జనరల్ కోటా కింద భర్తీ చేయడమో లేదా రద్దు చేయడమో జరుగుతున్నది. ఇలాంటి పరిస్థితులలో క్రీమీలేయర్‌కు రిజర్వేషన్ ఎత్తివేయాలనే వాదన సరైనది కాదు. **కనుక** క్రీమీలేయర్‌లోని వారికి ఆయా కులాల కిచ్చే రిజర్వేషన్లు కొనసాగించాలి. అయితే విద్యా సంస్థల్లోగానీ, ఉద్యోగాల్లోగానీ రిజర్వేషన్ కోటా నిండిపోయే సందర్భాలలో క్రీమీలేయర్

తమ కులంలో వెనుకబడి ఉన్న వారికి రిజర్వేషన్ అవకాశం లభించడానికి తోడ్పడాలనే దృష్టితో వాటిని స్వచ్ఛందంగా వదులుకోవాలనే చైతన్యాన్ని ప్రదర్శించాల్సి ఉంటుంది. ఇందుకు వారిని సంసిద్ధం చేయడం కోసం దళిత తదితర పీడిత కులాలకు ప్రాతినిధ్యం వహించే సంఘాలు, సంస్థలు కృషి చేయాల్సిన అవసరం ఉంటుంది. మన పార్టీ నాయకత్వాన పనిచేస్తున్న ప్రజాసంస్థలు ఇందుకు రాజకీయ క్యాంపెయిన్లు కూడా నిర్వహించాల్సి ఉంటుంది.

పెరిగిపోతున్న నిరుద్యోగ సైన్యాల వల్ల, తరిగిపోతున్న విద్య, ఉద్యోగ అవకాశాల వల్ల ఒకే కులంలోని వివిధ ఉపకులాల మధ్య, ఒకే కులంలోని వివిధ సెక్షన్ల మధ్య అసమానతలు పెరిగిపోతున్నాయి. దీని ఫలితంగా ఇప్పటికే దళితుల్లో వర్గీకరణ డిమాండు ముందుకు వచ్చింది. ఇది న్యాయమైన డిమాండుగా గుర్తించి మన పార్టీ దీనిని సమర్థించింది. అయితే రిజర్వేషన్లకున్న పరిమితుల వల్ల, పాలకవర్గాల కుటిలనీతి వల్ల వీటిని పొందుతున్న ఆయా కులాల, సెక్షన్ల ప్రజలు విద్య, ఉద్యోగ, తదితరాల కోసం పరస్పరం ఘర్షించుకొనే పరిస్థితులు పెరుగుతున్నాయి. వీటిని పీడిత వర్గాల, పీడిత సెక్షన్ల సమైక్యతను పెంపొందించి సామాజిక విప్లవాన్ని ముందుకు తీసుకుపోయే దృష్టితో మన పార్టీ ఈ సమస్యను పరిష్కరించటానికి కృషి చేయాల్సి ఉంటుంది. ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్లు అమలు చేయాలనే డిమాండ్‌తో ఉద్యమాలు నిర్మించాల్సి ఉంటుంది. కార్మికవర్గం రాజ్యాధికారం హస్తగతం చేసుకున్న తర్వాత కులవ్యవస్థను నిర్మూలించే లక్ష్యంతో మౌలిక కార్యక్రమాన్ని అమలుచేస్తూనే దళితుల సామాజిక, ఆర్థిక, రాజకీయ స్థాయిని పెంపొందించటానికి వివిధ రూపాల్లో ప్రత్యేక కార్యక్రమాలను చేపడుతూనే రిజర్వేషన్లను అవసరమైనంత కాలం కొనసాగించాల్సి ఉంటుంది.

### ప్రస్తుత కాలంలో ఉద్యమాలు–దళిత పాంథర్‌ల తిరుగుబాటు:

ప్రతిఘాతక పాలకవర్గాల ఆర్థిక, రాజకీయ విధానాలు, 1970ల నుండి దళితుల, పీడిత కులాలలోని ఇతర సెక్షన్ల సమరశీల ఉద్యమాలకు దారితీశాయి. డాక్టర్ అంబేద్కర్ మరణం తరువాత, దళిత ఉద్యమ నాయకత్వాన్ని చాలా వరకు పాలకవర్గాలు తమలో కలుపుకున్నాయి. ఆ నాయకత్వం చిన్నాభిన్నమైంది. గ్రామీణ ప్రాంతాలలో అంటరానితనం నిరాఘాటంగా కొనసాగింది. ఆర్థికేతర కుల దోపిడీ రూపాలైన వెట్టిబిగారి, కుల కట్టుబాట్ల పేరుతో సేవలు చేయడం, ముడుపులు చెల్లించడం మొదలైనవి దేశంలోని చాలా భాగాలలో కొనసాగాయి. పట్టణ ప్రాంతాలలో కూడా కులవివక్ష, కులపక్షపాతాలు కొనసాగాయి. ఈ పరిస్థితికి బ్రాహ్మణీయ భావజాలం, హిందూ మత సాంస్కృతిక ఆధిపత్యం, విద్యా, ఉపాధి అవకాశాల లేమి, భ్రష్టుపట్టిపోయిన ఎన్నికల రాజకీయాలు తోడై తీవ్రతరమైన సామాజిక అశాంతి దళిత యువతలో పెను అసంతృప్తికి దారితీసింది. 1960లలో ప్రపంచవ్యాప్తంగా విద్యార్థులు, యువకులు, ముఖ్యంగా అమెరికాలో రెండవ శ్రేణి పౌరులుగా చూడబడుతున్న నల్లజాతివారు బ్లాక్ పాంథర్ (చిరుత) పేరుతో పెద్దెత్తున

తిరగబడ్డారు. ఆ ప్రభావంతోనూ, నక్సల్బరీ ఉద్యమ ప్రభావంతోనూ, మహారాష్ట్రలోని దళిత యువత దళిత పాంథర్‌ల పతాకం కింద సంఘటితమై తిరగబడింది.

ఈ ఉద్యమం 1971లో బొంబాయి నగరంలో ప్రారంభమయింది. తొలుత ఇది ఒక సాంస్కృతిక ఉద్యమం. ఆ తొలిదశలో పద్యాలు, వ్యాసాలతో చిన్న చిన్న పత్రికలను ప్రచురించారు. మురికివాడలలో, హాస్టళ్లలో, చాల్‌ల(chawls-)లోని దళిత యువకులు, విద్యార్థులు మనుస్మృతిని ఖండించి, ఆగస్టు 15 బూటకపు స్వాతంత్ర్యమని ప్రకటించారు. ఎన్నికల బహిష్కరణకు పిలుపునిచ్చారు. ఈ ఉద్యమం ఎంతోకాలం సాగనప్పటికీ, మహారాష్ట్రలోనిపుణె, నాగపూర్ వంటి ఇతర పట్టణ ప్రాంతాలకు, మధ్యప్రదేశ్‌లోని భోపాల్ లాంటి కొన్ని నగరాలతో పాటు చండీగఢ్, ఢిల్లీ, ఆగ్రా వంటి నగరాలకు కూడా వ్యాపించింది. ఈ నగరాలలో దళిత పాంథర్‌ల యూనిట్లు ఏర్పడ్డాయి. పాంథర్‌లు కులపీడనకు వ్యతిరేకంగా తిరగబడ్డారు. కులపీడన గురించి ఫిర్యాదులందిన గ్రామాలకు వారు క్యాంపెయిన్‌గా పోవడం దానినే సూచిస్తుంది. మనుస్మృతిని కాలబెట్టడం ద్వారా వారు కులవ్యవస్థ కు భావజాలపరమైన దుర్గంపైన దాడి సాగించారు.

బొంబాయి లోక్‌సభ నియోజకవర్గానికి జరిగిన ఉప ఎన్నికలను బహిష్కరించవలసిందిగా పిలుపునిచ్చి, వారు భ్రష్ట పార్లమెంటరీ వ్యవస్థపై దాడిచేశారు. వారి పిలుపు మేరకు, ఆ ప్రాంతంలో దాదాపు 85 శాతం మంది ఎస్.సి.లు ఆ ఎన్నికలను బహిష్కరించారు. దేశంలో బహిరంగంగా రాజ్యానికి వ్యతిరేకమైన వైఖరిని దళిత ఉద్యమం తీసుకోవడం అదే మొదటిసారి. వారు తమ ప్రదర్శనలకు వేలాది మంది ప్రజలను కదిలించారు. ప్రభుత్వ నిర్బంధాన్ని ఎదుర్కొన్నారు. వారు నిర్వహించిన ఒక ప్రదర్శనలో మరాఠా దురహంకార సంస్థ శివసేన అల్లర్లు సృష్టించగా పోలీసులు జరిపిన కాల్పుల్లో ఒక దళిత యువకవి మరణించాడు. దళితులు నివసించే మురికివాడలలో, చాల్‌లలో అల్లర్లను రెచ్చగొట్టిన శివసేనతో వారు మిలిటెంట్‌గా పోరాడారు. పాంథర్‌లు రాజ్య నిర్బంధాన్ని ఎదుర్కొన్నారు కానీ, ఇది పెటీబూర్జువా నాయకత్వంలోని యాదృశ్చికమైన తిరుగుబాటు అయినందువలనా, వీరిపై మార్క్సిజం ప్రభావం వున్నప్పటికీ ఏకీకృత వ్యూహం, ఎత్తుగడలు లేనందువలనా 1975కల్లా ఈ ఉద్యమం విచ్ఛిన్నమైపోవడం ప్రారంభమయింది.

భారత ప్రజాస్వామిక విప్లవోద్యమంలోని ఒక భాగమే దళిత పాంథర్‌ల ఉద్యమం. విప్లవకర వర్గపోరాటం అప్పటికి ఆ ప్రాంతంలో బలంగా లేనందువలన, ఆ ఉద్యమం ఒంటరిగా కొనసాగింది. కాంగ్రెసు ప్రభుత్వం ఈ ఉద్యమ నాయకత్వానికి సాంస్కృతిక అవార్డులను, ఇతర ప్రలోభాలను ఇవ్వడం ద్వారా వారిని నీరుగార్చింది. క్రమంగా ఆ నాయకత్వంలోని చాలా మంది రాజకీయ దివాళాకోరుతనానికి, అవకాశవాదానికి, లంపెనైజేషన్‌కు బలైపోయారు. అయినప్పటికీ రాష్ట్రంలోని దళిత యువకులు, విద్యార్థులు వివిధ ప్రాంతాలలో మరాత్వాడా యూనివర్సిటీ పేరు మార్చడం, 'ది రిడిల్ ఆఫ్ రామా అండ్ కృష్ణా' (డాక్టర్ అంబేద్కర్ రచించిన రాముడు కృష్ణుడి రహస్య లీలలు అనే పుస్తకం) వివాదం తదితర స్థానిక సమస్యల పైన పదే పదే చురుకుగా, మిలిటెంట్‌గా

ముందుకొచ్చారు. దళిత పాంథర్‌ల ఉద్యమం మహారాష్ట్ర ను కుదిపివేసింది. దేశవ్యాపితంగా చైతన్యమవుతున్న దళిత ప్రజలకు ఈ ఉద్యమం ఎంతో ఉత్తేజాన్ని అందించింది. దేశంలో కులవివక్ష, పక్షపాతం కొనసాగుతున్నాయని ఈ ఉద్యమం మరోసారి బలంగా ప్రపంచం ముందుకు తెచ్చింది. పీడక కుల గుత్తాధిపత్యంపైన, ఆధిక్యతపైన, కలిపేసుకునే కుటిల రాజకీయాలపైన అది బలమైన దెబ్బవేసింది. సాంస్కృతిక రంగం ప్రత్యేకించి బాగా ప్రభావితమైంది. పీడిత ప్రజల సాహిత్యానికి ఎన్నడూలేని గుర్తింపు వచ్చింది. దేశంలోని ఇతర ప్రాంతాలలోని దళితుల పైన ఈ ఉద్యమం చాలా ప్రభావం వేసింది.

కర్నాటకలో దళిత ఉద్యమం 1974లో ప్రారంభమైంది. ఈ ఉద్యమం పట్టణాల్లో మొదలయినా, దీనికి పెటీబూర్జువా వర్గం నాయకత్వం వహించినా అది త్వరగా గ్రామాలకు విస్తరించింది. పీడక కులాల అత్యాచారాలకు వ్యతిరేకంగా దళిత రైతు–కూలీలను కూడగట్టింది. అయితే, రాజ్యాన్ని (state) ఒత్తిడి చేసి తమ హక్కులను రక్షించుకోవడం అనే ఎత్తుగడే అవలంభించారు తప్ప, పీడక కుల ఫ్యూడల్ ప్రయోజనాలకు వ్యతిరేకంగా ప్రత్యక్షంగా అరుదుగానే పోరాటాలు చేసారు.

దశాబ్దం లోపలే ఈ ఉద్యమ నాయకత్వం పోరాటానికి తిలోదకాలివ్వటం ప్రారంభమయ్యింది. ఎన్నికల రాజకీయాల్లో పాల్గొంటూ బ్రాహ్మణీయ దోపిడీ పాలకవర్గాలకు దగ్గరయింది. ఈ ఉద్యమ నాయకత్వం గాంధీవాదాన్ని స్వీకరించింది. ఈ ఉద్యమ నాయకత్వ పెటీబూర్జువా వర్గస్వభావం వలన వారు ఎన్నికల రాజకీయాల్లోకి దిగడంతో ఉద్యమం త్వరగా ముక్కలయింది. ఈ నాయకత్వం రాజీ వైఖరిని అవలంభించిన కారణంగా, దళారీ నిరంకుశ బూర్జువా, ఫ్యూడల్ పాలకవర్గాలకు అది ఆధారం అయింది.

దళిత పాంథర్‌ల ఉద్యమానికి ముందు మహారాష్ట్రలో దాదాసాహెబ్ గైక్వాడ్ నాయకత్వంలో 1964–66 మధ్యకాలంలో దేశవ్యాప్తంగా భూమి కావాలనే డిమాండ్‌తో జరిగిన సత్యాగ్రహంలో లక్షలాది మంది దళిత ప్రజలు పాల్గొన్నారు. ఈ ఉద్యమం పాలకవ్యవస్థను కుదుపు కుదిపింది. ఇది దళిత ఉద్యమాలలో ఒక నూతన ధోరణిని ముందుకు తెచ్చింది. అయితే ఇది అనతికాలంలోనే నాయకత్వ రాజీ ధోరణుల వల్ల నీరుగారిపోయింది.

## ఉన్నత వర్గ (elite) దళిత – బహుజన రాజకీయాలు:

దళితుల ఈ తిరుగుబాటు వెల్లువ కారణంగా, పాలకవర్గాలు ఉద్దేశపూర్వకంగా దళితులలో ఒక చిన్న సెక్షన్‌ను సంపన్న వర్గంగాపెంచి పోషించాయి. ఈ దళిత సంపన్న వర్గం తమ స్వీయ ప్రయోజనాల కోసం, దళితుల ఐక్యతకు పిలుపునిస్తూ ఇతర పీడిత వర్గాలతోనూ, విప్లవ పార్టీలతోనూ ఐక్యతను నిరాకరించే సెక్టేరియన్ వైఖరిని ఉద్దేశపూర్వకంగానే చేపట్టింది. వీరు బ్రాహ్మణీయ

దోపిడీ పాలకవర్గాల పట్ల దళిత ప్రజానీకంలో విశ్వాసాన్ని కలిగించే రాజకీయ దళారీ పాత్రను పదేపదే పోషిస్తున్నారు. ఈ ఉన్నతవర్గ దళిత నాయకులు తమ వర్గ ప్రయోజనాలు నెరవేర్చుకోవటానికి పాలకవర్గాలకు అవసరమైన విధంగా అంబేద్కర్ భావజాలం పేరుతో పాలకవర్గ దోపిడీ భావజాలాన్ని వ్యాప్తి చేస్తున్నారు. వీరు రాజ్యాంగాన్ని సర్వరోగ నివారిణిగా కీర్తిస్తున్నారు. ఉదారవాద రాజకీయ తాత్విక చింతనను, బేరసారాల, బ్రతిమాలుడు రాజకీయాలను వీరు సమర్థిస్తున్నారు. అందువలన, పీడిత ప్రజానీకంలోని ఇతర సెక్షన్లతో దళిత ఐక్యత పట్ల వారు సెక్టేరియన్ వైఖరిని అవలంభిస్తున్నారు. కులపరమైన ఐక్యతపేరుతో వర్గవైరుధ్యాలను పరిగణనలోకి తీసుకోకుండా, దళితులు, ఓ.బీ.సీ.ల మధ్య కేవలం కులపరమైన ఐక్యత గురించి దళిత బహుజనులమంటూ మాట్లాడుతున్నారు. దళిత, ఓ.బీ.సీ. ప్రజల మౌలిక సమస్యలలో ఏ ఒక్కదానిని చేపట్టడానికి కూడా వారు సుముఖంగా లేరు. చెట్టుపేరు చెప్పుకొని కాయలమ్ముకునే వీరిలో కుల విముక్తి పట్ల, హిందుత్వ శక్తులకు వ్యతిరేకంగా పూలే, అంబేద్కర్లు ప్రదర్శించిన ఆత్మగౌరవం, నిజాయితీ మచ్చుకైనా కానరాదు. దళితులలోని ఈ సంపన్న వర్గ రాజకీయ నాయకత్వం పాలకవర్గ పార్టీలతో కుమ్మక్కై, దళిత ప్రజలను వారి దోపిడీ భావజాలపరమైన, నిర్మాణపరమైన ప్రాబల్యం కిందనే ఉంచాలని ప్రయత్నిస్తున్నది. వీరు ఏ బ్రాహ్మణవాద దోపిడీ భావజాలానికి వ్యతిరేకంగా పోరాటం చేస్తున్నామని చెబుతున్నారో, ఆ బ్రాహ్మణవాద కుల దృక్పథాన్నే కలిగివుంటూ, పీడిత వర్గ ఐక్యతకు ప్రతిబంధకంగా మారి కుల వ్యవస్థ తాలూకు యథాతథ స్థితిని కాపాడుతున్నారు. దళితుల ప్రజాస్వామిక ఆకాంక్షలు, మిలిటెంట్ విప్లవకర పోరాటాల వైపు మళ్లకుండా ఈ నాయకత్వం పదే పదే నిరోధిస్తూ, వాటిని పార్లమెంటరీ రాజకీయాల్లోకి మళ్లిస్తున్నది. అన్ని రూపాలలోని కులపీడనకు వ్యతిరేకంగా, కులవ్యవస్థను పునాదుల నుండి కూలద్రోయడం కోసం విప్లవ ప్రజాస్వామిక శక్తులు ఐక్య పోరాటాలను నిర్మించడాన్ని వారు అడ్డుకుంటున్నారు.

దళిత ప్రజలను మొదటి నుండి తన ఓటు బ్యాంకుగా భావించిన కాంగ్రెస్ పార్టీ ఎస్సి, ఎస్టిలపై అపారమైన ప్రేమను ఒలకబోస్తున్నది. రిజర్వ్డ్ నియోజకవర్గాల ద్వారా గ్రామ పంచాయతీ సర్పంచ్ నుండి/బస్తీ కౌన్సిలర్ నుండి చట్టసభల వరకు దళిత నాయకులను అక్కున చేర్చుకొని సీట్లు కేటాయించి తన రాజకీయ దళారులుగా మార్చుకున్నది. గ్రామాలలోనూ, పట్టణాలలో ప్రతి దళిత బస్తీ లోనూ ఇలాంటి దళిత నాయకులు తారసపడుతుంటారు. పైరవికారీతనం చేయడం ద్వారా అక్రమ సంపాదనాపరులైన వీరు సాటి దళితులను పీడిస్తూ, నయానా, భయానా తమ నాయకత్వం క్రింద ఉంచుకోవడానికి ప్రయత్నిస్తున్నారు. దీనికి కులకట్టడిని కూడా తెలివిగా ఉపయోగించుకుంటున్నారు. ఈ రాజకీయ దళారీ నాయకులు దళిత ప్రయోజనాలకు నష్టకరమైన, పాలకవర్గాలకు ఊడిగం చేసే రాజకీయాలనే నిత్యం ప్రబోధిస్తున్నారు.

విద్యావకాశాల పెరుగుదల, రాయితీలు, సబ్సిడీల వలన దళితుల్లోనే ఒక చిన్న సెక్షన్

నూతన సంపన్న వర్గంగా రూపొందింది. కొన్ని కుటుంబాలు పారిశ్రామిక బూర్జువా వర్గంగానూ, వాణిజ్య వర్గాలుగానూ, ఉన్నతోద్యోగాల ద్వారా బ్యూరోక్రాట్స్‌గానూ ఆర్థిక సంపన్నతను, రాజకీయ ప్రాబల్యాన్ని సంతరించుకుంటున్నాయి. 'దళితులకే రాజ్యాధికారం' అనే ఎన్నికల నినాదం ద్వారా లాభపడేది ప్రధానంగా ఈ వర్గమే. అంబేడ్కర్ కాలంలో వచ్చిన రిజర్వేషన్ల వలన దళితులకు ఎంత మేలు జరిగిందో, పాలకవర్గాలిస్తున్న రాయితీల వలన దళితులకు అంతకు తక్కువ నష్టమేమీ జరగడం లేదు. పైగా, సమరశీల దళిత కుల విముక్తి చైతన్యం మొద్దుబారుతోంది. ఈ నాయకుల పాలకవర్గ అనుకూల వైఖరినీ, పద్ధతులను బహిర్గతం చేయకుండా, దళితుల్లో ఈనాడు ఒక వటవృక్షంలా పెరిగిపోయిన 'పైరవీ' పద్ధతుల నుండి దళిత ప్రజారాశులను బయటపడవేయలేము. అలాగే ఈ అవకాశవాద నాయకుల్ని దళిత ప్రజానీకం నుంచి వేరు చేయకుండా నూతన ప్రజాస్వామిక విప్లవంలోకి విశాల దళిత ప్రజానీకాన్ని బలంగా సమీకరించలేము.

దళితుల్లో విద్య, ఉద్యోగాలు తదితర సామాజిక, ఆర్థిక, రాజకీయపరమైన అవకాశాల వలన వీరిలో కొందరు కృత్రిమమైన సాంఘిక హోదా గురించి వెంపర్లాడుతూ పీడక కులాలలోని సంపన్న వర్గాలను అనుకరిస్తూ 'నదిని దాటి తెప్ప తగలేసిన వారికి మల్లే' సోదర దళిత ప్రజలతో వ్యవహరిస్తున్నారు. దళితులలో ఇలాంటివారు గాక దళితుల అభ్యున్నతి గురించి నిజాయితీతో ఆలోచించేవారు కూడా ఎంతో మంది ఉన్నారు. వీరు దళితులకు ఏమైనా మంచి చేయాలని ఆలోచిస్తున్నారు. దళితులపై జరుగుతున్న దాడులకు, అమానుష హత్యలకు స్పందించి ఏ మేరకు వీలైతే ఆ మేరకు సహాయం అందించడం, వాటికి వ్యతిరేకంగా ప్రదర్శనల్లో, ఉద్యమాలలో పాల్గొనడం చేస్తున్నారు. ఇలాంటి శక్తులనే విప్లవోద్యమంలోకి మళ్లించాల్సిన అవసరం నేడెంతో ఉంది.

### నేటి దళిత ఉద్యమం – బీ.ఎస్.పీ.

1990లలో ఒక పక్క సామాజిక వైరుధ్యాలు తీవ్రతరం కావడం, దళితుల పైన కులపరమైన అత్యాచారాలు పెచ్చుపెరగడం వలన, మరోపక్క దేశంలోని పలు రాష్ట్రాలలో విప్లవకర పార్టీల నాయకత్వాన జరుగుతున్న భూస్వామ్య వ్యతిరేక, సామ్రాజ్యవాద వ్యతిరేక రైతాంగ పోరాటాలు సమాజాన్ని గణనీయంగా ప్రభావితం చేయడం వలన దేశంలోని వివిధ ప్రాంతాలలో గల దళితులు పెద్దయెత్తున జాగృతం కావడానికి దారితీసింది. వలస పాలనా కాలంలో కులవ్యవస్థలో సాపేక్షికంగా తక్కువ మార్పు జరిగినటువంటి ఉత్తరాది రాష్ట్రాలైన యూ.పీ., బిహార్, పంజాబ్, హరియాణాలతో పాటు, మధ్యప్రదేశ్‌లలో పీడిత ప్రజలు, ప్రత్యేకించి దళితులు ఈ కాలంలో జాగృతులయ్యారు. వీరిలో నుంచే దళిత ఉన్నత ప్రభుత్వోద్యోగుల పునాదిపై ఏర్పడినదే బహుజన సమాజ్ పార్టీ (బీ.ఎస్.పీ.). కులవివక్షకు వ్యతిరేకంగా సామాజిక రాజకీయ అధికారాన్ని కోరే దళిత ప్రజల ప్రజాస్వామిక మనోభావాలను ఉపయోగించుకొని ఆ పార్టీ అస్తిత్వంలోకి వచ్చింది. కానీ, ఆచరణలో బీ.ఎస్.పీ. బ్రాహ్మణవాద వ్యతిరేక ఊకదంపుడు మాటలతో, కులమైత్రిని నొక్కిచెబుతూ వర్గ

ఐక్యతను తిరస్కరిస్తుంది. దళిత ప్రజల విముక్తికి దానికొక క్రమబద్ధమైన సామాజిక, ఆర్థిక, రాజకీయ కార్యక్రమం లేదు. దోపిడీ పాలకవర్గాల ఎన్నికల రాజకీయాలు దానికి సర్వస్వం. ఆచరణలో ఇది దళితుల, ఇతర పీడిత కులాల ప్రజల ప్రజాస్వామిక ఆకాంక్షలను, మనోభావాలను దెబ్బతీస్తున్న పీడక కులాలతోనూ, పాలకవర్గ పార్టీలతోనూ, శక్తులతోనూ మైత్రి కొనసాగిస్తున్నది. బీ.ఎస్.పీ. దళారీ నిరంకుశ బూర్జువా భూస్వామ్య శక్తులపై ఆధారపడిన పార్టీలతో జతకూడి పేద, భూమిలేని రైతాంగపు ప్రయోజనాలకు ద్రోహం చేసింది. ఈ పార్టీ ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలో అధికారంలో ఉన్నప్పుడు ఇతర పాలకవర్గ పార్టీలకు ఏమాత్రం తీసిపోకుండా రైతాంగ విప్లవోద్యమంపై క్రూరమైన నిర్బంధాన్ని అమలు చేయడంలో భాగంగా రైతాంగ కార్యకర్తలను బూటకపు ఎన్‌కౌంటర్లలో కాల్చి చంపించింది. ప్రైవేటైజేషన్‌కూ, వ్యవసాయ ఆర్థిక వ్యవస్థ పైన సామ్రాజ్యవాద దోపిడీ పెరగడానికీ దారితీసిన సామ్రాజ్యవాద అనుకూల ఆర్థిక విధానాలకు మద్దతునివ్వడం ద్వారా, బీ.ఎస్.పీ. దళితులలోని పెటీబూర్జువా సెక్షన్‌లకు కూడా ద్రోహం చేస్తున్నది.

ఈ విధంగా దళితుల్లోని దళారీ నిరంకుశాధికారుల, పట్టణ పెటీ బూర్జువా వర్గంలోని ఉన్నత స్థాయి మేధావుల నాయకత్వంలోనూ, దళారీ నిరంకుశ బూర్జువా వర్గంలోని ఒక సెక్షన్ మద్దతుతోనూ బీఎస్‌పీ భారత పాలక వర్గాలకు నమ్మకంగా సేవచేసే పార్టీగా తయారైంది. ఈ పార్టీకి రాజ్యాంగం పట్ల గల విశ్వాసం, పార్లమెంటరీ ప్రజాస్వామ్యంలో దానికి గల నమ్మకం, భూసంస్కరణల గురించి గానీ, సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా గానీ దానికెటువంటి కార్యక్రమం లేకపోవడమూ, అట్టడుగుస్థాయి ప్రజానీకంలో ఉద్యమాన్ని నిర్మించడానికి అది ప్రదర్శించే విముఖత– వీటన్నిటి వలన ఆ పార్టీ భారత పాలకవర్గాలకు కూడా ఆమోదయోగ్యమైన పార్టీగా తయారైంది. అంటే నేడు అది దళితుల, బహుజనుల పేరుతో భారత దోపిడీ పాలకవర్గాలకు ప్రాతినిధ్యం వహించే పార్టీగా తయారయింది. బూర్జువా పార్లమెంటరీ పార్టీలు అన్నింటిలాగానే బీ.ఎస్.పీ. కూడా భారత ప్రజలు ఎదుర్కొంటున్న మౌలిక సమస్యలను ఏ విధంగానూ పరిష్కరించజాలదనీ, దాని నాయకత్వ సైద్ధాంతిక అవగాహనలు, రాజకీయ వైఖరులు, దాని కార్యక్రమం, పీడక కులాల వారికి ఎన్నికలలో సీట్ల పంపిణీ, బ్రాహ్మణవాద పీడక కుల ఆధారిత పాలక పార్టీలతో అవకాశవాద రాజకీయ పొత్తులు, దాని సుదీర్ఘ కార్యాచరణ మౌలికంగా అది ప్రధాన పాలక పార్టీల్లాంటిదేనని రుజువు చేస్తున్నాయి.

దేశంలో సామ్రాజ్యవాదుల, భూస్వాముల, దళారీ నిరంకుశ పెట్టుబడిదారుల దోపిడీ పీడనలు కొనసాగడం కోసం వారి ప్రయోజనాలకు బీ.ఎస్.పీ. ఊడిగం చేస్తున్నది. బీ.ఎస్.పీ. వాస్తవంగా దళిత తదితర పీడిత ప్రజలను బూర్జువా పార్లమెంటరీ ఊబిలోకి ఈడుస్తూ వారిని నిజమైన ప్రజాస్వామిక పోరాటాల నుండి, విప్లవపథం నుండి మళ్లిస్తున్నది. అలాగే రాం విలాస్ పాశ్వాన్ (ఆయన జీవించి ఉన్నంత వరకు) తదితర దళితుల్లోని ఉన్నతవర్గ నాయకులు, పాలక పార్టీల్లోని దళిత నాయకులు పాలకవర్గాల ఏజెంట్లుగా, పాలక రాజకీయ వ్యవస్థలో ఒక భాగంగా ఉంటూ

రాజకీయంగా బి.ఎస్.పి. నాయకత్వం నిర్వహిస్తున్న లాంటి పాత్రనే నిర్వహిస్తున్నారు.

దళిత, ఉన్నతవర్గాల అవినీతికర నాయకత్వం పెంచి పోషించిన బూర్జువా పార్లమెంటరీవాదం, సంస్కరణవాదం, చట్టబద్ధతావాదం, సంకుచిత ఒంటెత్తువాదం దళితులలోని సమైక్యతను దెబ్బతీస్తూ వారి మిలిటెన్సీని నీరుగారుస్తున్నది. ఈ నాయకత్వం వీరిని పాలకవర్గాల పార్టీలలోకి, సంస్థలలోకి నెడుతూ వాటిపై ఆధారపడేలా చేస్తున్నది. అలాగే ఈ నాయకత్వం వీరిని రాజకీయ పైరవీలలోకీ, అలగాతనం (lumpenness) లోకీ మళ్లిస్తున్నది. ఈ కుళ్లిపోయిన పార్లమెంటరీ మార్గం ద్వారా విశాల దళిత పేద ప్రజల ప్రయోజనాలు ఎన్నటికీ నెరవేరజాలవు. భారతదేశంలో దినదినం తీవ్రతరమవుతున్న ప్రముఖ సామాజిక వైరుధ్యాలతో పాటు తీవ్రతరమవుతున్న సామాజిక, ఆర్థిక, రాజకీయ సంక్షోభంతో దళిత పేద ప్రజానీకాన్నీ, దళిత పెటీబూర్జువా వర్గాన్ని ఇంకా ఇంకా ఎక్కువగా ప్రజాస్వామిక పోరాటాల్లోకీ, నిజమైన విముక్తి మార్గంలోకి తీసుకువచ్చే పరిస్థితులు మరింతగా పెంపొందుతున్నాయి.

## 4వ అధ్యాయం

## భారతదేశ చరిత్రలో వర్గాలు-వర్ణాలు-కులాల మధ్య సంబంధం

నూతన ప్రజాస్వామిక విప్లవ వ్యూహం, ఎత్తుగడల రీత్యా, వర్గం-కులం మధ్యగల సంబంధాన్ని గురించి సైద్ధాంతికంగా సరియైన అవగాహన కలిగి ఉండడమనేది అత్యంత ప్రాముఖ్యత కలిగిన అంశం. అందువల్ల మనం, మొదటి మూడు అధ్యాయాలలో వేర్వేరు సామాజిక దశలలో వర్గాల-వర్ణాల-కులాల పుట్టుక, అభివృద్ధి, పరివర్తనల గురించి వివరించిన నేపథ్యంలో వాటి మధ్య ఉన్న సంబంధాన్ని ఇపుడు పరిశీలిద్దాం. అలాగే నేటి సమాజంలో ఉన్న ఈ సంబంధాన్ని కూడా నిర్దిష్టంగా విశ్లేషిద్దాం.

**సింధూలోయ నాగరికత కాలం:** భారత దేశంలో ప్రాథమికంగా వర్గాలు క్రీ.పూ. 2000కు ముందు సింధు లోయ నాగరికత కాలంలో ఆవిర్భవించాయి. అయినప్పటికీ, ఈ వర్గాలు స్వజాతి వివాహ పద్ధతి (endogamous) కలిగిన వారసత్వ గుంపులుగా ఉన్నాయనే సమాచారం లేదు. అందువల్ల కులాలు, లేదా కులాల వివిధ రూపాలను వేద-పూర్వ కాలంలో గుర్తించలేము.

**వర్ణాశ్రమ కాలం:** క్రీ.పూ. 1500-500 సంవత్సరాలలో ఆర్యులు ప్రవేశించిన తరువాతి కాలంలో మాత్రమే మొదటిసారిగా వర్గం అభివ్యక్తీకరణగా వర్ణం కనబడుతుంది. ఆ తదనంతర కాలంలో ఏర్పడిన కులవ్యవస్థకు ఇందులోనే మూలాలు ఉన్నాయి. ఆర్యగణాలు మరియు మూల ద్రావిడ నాగరికతలు-గణాల మధ్య కొనసాగిన ఘర్షణలు, మిశ్రమాల సుదీర్ఘ క్రమం ద్వారానూ, బంధుత్వాల సంబంధాలు తెగిపోవడం వల్లనూ, వ్యవసాయం అభివృద్ధి చెందడం వల్లనూ ఆ కాలంలో వర్గాల యొక్క నిర్దిష్ట రూపాలుగా వర్ణాలు ఆవిర్భవించాయి. నేడు మనకు కనపడుతున్న కులాల లాగానే

అప్పటి వర్ణాలు లేనప్పటికీ సామాజికాభివృద్ధి క్రమంలో అవి వాటి ఆవిర్భావానికి దారితీశాయి.

క్రీ.పూ. 7వ శతాబ్ద ప్రాంతంలో వర్గాలుగా ఉన్న రెండు అగ్ర (పీడక) వర్ణాలైన బ్రాహ్మణ, క్షత్రియులపై ఆధారపడి తెగల ప్రభు కూటమి (tribal oligarchy) ఏర్పడింది. ఇది వైశ్యుల (విశ్)ను, శూద్రులనూ నియంత్రించింది. రాజ్యం ఇంకా అస్తిత్వంలోకి రావలసి ఉండింది. వర్ణాల నియంత్రణను, ప్రవర్తనా నియమావళినీ వర్ణాశ్రమ ధర్మం అందించింది. ఈ విధంగా వర్గమూ, వర్ణమూ ఈ కాలంలో కలిసిపోయే ఉన్నాయి.

**తొలి ఫ్యూడల్ రాజ్యం:** సుమారు క్రీ.పూ. 500 సంవత్సరాల నుండి ఫ్యూడలిజాన్ని పోలిన రాజ్యం ఆవిర్భవించి, అభివృద్ధి చెందడంతో, వర్గమూ, వర్ణమూ మధ్య సంబంధం కూడా మార్పు చెందింది. వివిధ వర్ణాలలో వర్గ విభజన మొదలైంది. బ్రాహ్మణులు పరిపాలనా విధులను నిర్వహించడమేకాక వర్తకులుగానూ పరివర్తన చెందారు. వైశ్యులలో వర్తకులుగా, సంపన్న భూస్వాములుగా (wealthy land owners), చేతివృత్తికారులుగా ఏర్పడినారు. వ్యవసాయ కూలీలుగా మారడం వలన శూద్రుల లక్షణాలలో కూడా మార్పు వచ్చింది. అలా గత కాలంలో ఉన్నంత సన్నిహిత సంబంధం వర్ణాలు–వర్గాల మధ్య లేదు. ఈ తొలి ఫ్యూడల్ రాజ్యంలో పాలకవర్గాలుగా ఉన్నది బ్రాహ్మణులు, క్షత్రియులు, వైశ్య వర్ణంలోని పైస్థాయికి చెందినవారు. ఆ విధంగా వైశ్యులలోని ఒక సెక్షన్ పాలక వర్గంలో భాగం కాగా, మరో విశాల సెక్షన్ పాలిత వర్గంలో కలిసిపోయింది.

గుర్తుంచుకోవాల్సిన మరో అంశం ఏమంటే ఈ వర్ణవ్యవస్థ అప్పటికి ఇంకా కులవ్యవస్థగా మార్పు చెందలేదనేది. ఒక వర్ణం నుండి మరో వర్ణానికి మారడం కొంతమేరకు సాధ్యమయ్యేది. ఆ తరువాత దశలో మాత్రమే కులాలు ఏర్పడి, విస్తరిస్తూ సంఘటితమయ్యాయి. జీవితకాలంలో కుల మార్పిడికి అవకాశాలు లేని ఇనుప కట్టడాలను మనుస్మృతి ఏర్పర్చింది.

**బ్రాహ్మణీయ కుల ఆధారిత ఫ్యూడలిజం:** సుమారు క్రీ.శ. 4వ శతాబ్దం నుండి అస్తిత్వంలోకి వచ్చిన కుల–ఆధారిత ఫ్యూడల్ విధానంతో భారతదేశంలో కులవ్యవస్థ అనేది ఏర్పడింది. ఫ్యూడలిజం విస్తరించే కొలదీ, తెగలను స్వజాతి వివాహ (endogamous–ఒకే గోత్రం వారు వివాహమాడరు. ఒకే తెగ వారి మధ్యనే వివాహాలుంటాయి) వృత్తి ఆధారిత కులాలుగా స్వయం–పోషక గ్రామ సముదాయాలలో ఇముడ్చుకున్నారు. వారు శూద్రులుగానో లేదా అతి–శూద్రులు (అంటరానివారు) గానో పరిగణించబడ్డారు. పట్టణాలకు పరిమితమైన వైశ్యులలోని చిన్న సెక్షన్ వర్తకవర్గంగా కొనసాగగా, ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో జీవిస్తున్న అత్యధికులను శూద్రులుగా గుర్తించారు. విదేశీ ఆక్రమణదారులకు, కొత్తగా పాలకవర్గాలలో చేరిన మునుపటి శూద్రులకు క్షత్రియకులం స్థాయి కల్పించారు. బ్రాహ్మణులు పురోహిత విధులను నిర్వహించడంతో పాటు భూస్వాములుగా తమ స్థానాన్ని పటిష్టపరచుకొన్నారు.

అనేక కులాలు వృద్ధి చెంది స్వయం–పోషక గ్రామ ఆర్థిక వ్యవస్థలో స్వజాతి వివాహ

పద్ధతిని కలిగి విడిగా వృత్తి చేసుకుంటూ, సంఘటితమైనది ఈ కాలంలోనే. ఒక వ్యక్తి గుర్తింపుకు గానీ, సాంఘిక, ఆర్థిక అంతర్ సంబంధానికి గానీ ఈ కులాలే ప్రధాన యూనిట్‌గా వ్యవహరించాయి. ఫ్యూడలిజం వృద్ధి అయ్యే క్రమంలో పెరిగిన అసంఖ్యాక కులాలు అంతకు ముందటి దశలోని వర్ణాల కంటే భిన్నమైనవి. అయితే వాటిని పాలకవర్గాలు వర్ణాశ్రమ ధర్మ చట్రంలో బిగించాయి. అంతేకాక కొత్తగా పాలకవర్గాలలో భాగమైనవారికీ, నూతనంగా ఆవిష్కరించిన 'వర్ణ సంస్కరణ' సిద్ధాంతానికి అనుగుణంగా తగిన స్థాయిని కల్పించారు. అలా వర్ణాలనేవి స్వజాతి సంబంధ గుంపులుగా వ్యవహరించడమనేది అంతమై, బదులుగా వాస్తవంలో స్వజాతి వివాహ పద్ధతి కలిగి వృత్తుల గుంపులుగా ఉన్న ఒక్కో కులం స్థాయిని సూచించేవిగా మారాయి.

వర్గము-కులం మధ్య సంబంధం ఆ విధంగా ఈ కాలంలో చాలా వరకు స్థిరపడి బలపడింది. కులవ్యవస్థ మరింత కట్టుదిట్టం కావడం వలన, ఒక కులానికి చెందిన సభ్యులు వారికి కేటాయించని మరో వృత్తికి మారడాన్ని నిరోధించే విధంగా ఖచ్చితమైన కట్టుబాట్లను అమలులోకి తెచ్చారు. ఆ విధంగా, ఒకరి కులము, వృత్తి అంటే ఉత్పత్తి సంబంధాలలో వారి స్థానం అనేది పుట్టుకతోనే నిర్ధారించబడి మరణం వరకూ ఏ మార్పు లేకుండా కొనసాగేది. ఒక నిర్దిష్ట వర్గం, ఉదాహరణకు రైతాంగం, వివిధ కులాలను కలిగి ఉండేది కానీ ఒక కులం మాత్రం ఎప్పటికీ ఒకే వృత్తిలో, ఉదాహరణకు గ్రామసేవకులు, చేతివృత్తికారులు, రైతులు, వర్తకులు, పురోహితులు, వ్యవసాయ కూలీలు,భూస్వామి వగైరా వర్గాలలో భాగంగా ఉండేది.

కులానికి, వర్గానికి మధ్య సంబంధం ముఖ్యంగా స్వయం-పోషక గ్రామ సముదాయ స్థాయిలో కట్టుదిట్టంగా ఉన్నప్పటికీ, పాలకవర్గాలకు మాత్రం ఇది వర్తించేది కాదు. బ్రాహ్మణులు, క్షత్రియులే ప్రధానంగా పాలకవర్గాలైనప్పటికీ, భూభాగాల లేదా రాజ్యాల ఆక్రమణల ద్వారా మిగతా కులాల సభ్యులు కానీ, విదేశీ దురాక్రమణదారులు కానీ పాలకవర్గాల్లో భాగమయ్యేవారు. వీరిలో కొంతమంది (ముఖ్యంగా ఉత్తర భారతంలో) క్షత్రియకులాన్ని స్వీకరించినప్పటికీ, ఇతరులు తమ పూర్వపు శూద్ర కులంలో గానీ లేదా ముస్లింలుగా గానీ కొనసాగారు. అయినప్పటికీ మొత్తం మీద కులవ్యవస్థలో పెద్దగా మార్పులేమీ రాలేదు. వాస్తవానికి ఫ్యూడల్ దశ అంతటా పాలకవర్గాలు తమ దోపిడీని, వర్గ పరిపాలనను పటిష్టపరచుకోవడానికి కులాన్ని పూర్తిగా ఉపయోగించుకున్నాయి.

**వలస, అర్ధభూస్వామ్య విధానం:** తమ దోపిడీ, పరిపాలనకనుగుణంగా కులవ్యవస్థను మునుపటి పాలకవర్గాలన్నీ వినియోగించుకొన్న విధానాన్నే వలసవాదులు కూడా కొనసాగించారు. అయితే వలస పాలన కంటే ముందే జరుగుతున్నటువంటి మార్పుల వల్లనూ, 19వ శతాబ్దంలో వలస దోపిడీ, పరిపాలనల మూలంగా చోటు చేసుకున్న ఆర్థిక మార్పుల వల్లనూ, కుల-ఆధారిత ఫ్యూడల్ వ్యవస్థలో గణనీయమైన మార్పులు సంభవించాయి. నూతన వర్గాల పుట్టుకతో వివిధ కులాలలో వర్గవిభజన జరిగింది. ఈ దశ నుండి కులం, కులాలలో వర్గ విభజన చోటుచేసుకొని కుల

సంబంధాల వెనుక దోపిడీ సంబంధాలు ఉనికిలోకి వచ్చి కులం వర్గం మధ్య ఉన్న సమాన (coincided) సంబంధం తగ్గుతూవచ్చింది

బ్రిటిష్‌వారు భారతదేశాన్ని వలసగా మార్చుకోక ముందు మొగలుల పాలనలో వర్తకము, పట్టణాల వృద్ధి తిరిగి ఉచ్ఛస్థితినందుకున్నాయి. నూతన వ్యాపారవర్గం పుట్టింది. ఈ జాతీయ (దేశీయ) బూర్జువా వర్గం శైశవదశలో ఉండగానే వలస దోపిడీదార్లచే (వలసవాదులచే) గొంతు నులమబడింది. బ్రిటిష్‌వారి కాలంలోనే ఆధునిక కార్మికవర్గం పుట్టింది. అలాగే దళారీ బూర్జువా వర్గం కూడా పుట్టింది. సామ్రాజ్యవాదులే దాన్ని పెంచి పోషించారు. రైతాంగంలో కూడా మెల్లగా క్రమక్రమంగా వర్గ విభజన జరుగుతూ వచ్చింది. ఈ కాలం నుండే కులం, వర్గం మధ్య సమాన సంబంధం ఉండడమనేది ఇంకా ఇంకా తగ్గుతూ వచ్చింది. ఉదా.కు శూద్ర కూలాల్లో భాగమైన రైతుల, చేతివృత్తుల కులాల వారు ఫ్యాక్టరీ కార్మికులుగా మారారు.

ఒకప్పటి అతిశూద్రులూ, అంటరానివారూ అయిన దళితులను పెద్ద సంఖ్యలో సైన్యంలో, రైల్వేలలో, రోడ్ల నిర్మాణంలో, ఫ్యాక్టరీలలో, నైపుణ్యం లేని పనులలో చేర్చుకున్నారు. దళితులు, ఆదివాసులు గనులలో, ప్లాంటేషన్‌లలో కూడా పనిచేశారు. వీరంతా కలిసి ఆధునిక కార్మికవర్గం ఏర్పడింది.

బ్రాహ్మణులు, క్షత్రియులు, వర్తక కులాలైన వైశ్యుల నుండి, ఒకప్పటి శూద్రుల నుండి, ముస్లింల నుండి కూడా వ్యాపారులు, వడ్డీ వ్యాపారులు ఏర్పడ్డారు.

ఖత్రి (అంటే క్షత్రియ కులం), బనియా వంటి వ్యాపార కులాలు, పారశీ, జైన మతాల వారి నుండి దళారీ వ్యాపార సంస్థలు ఏర్పడ్డాయి. బ్రాహ్మణుల నుండి, ఒకప్పటి శూద్ర కులాల నుండి కూడా కొన్ని వ్యాపార సంస్థలు ఏర్పడ్డాయి.

బ్రాహ్మణులు, కాయస్థులు, ఆంగ్లో ఇండియన్‌లు, పారశీలు, ముస్లింలలోని విద్యావంతమైన ధనాఢ్య వర్గాలు పాలనా యంత్రాంగంపై ఆధిపత్యం వహించారు.

బ్రిటిష్‌వారు కూడా భూస్వాములు (వతన్‌దారులు లేదా ఈనామ్‌దారులు కానివారు), కౌలుదార్లు, కూలీలు అనే వర్గాలను చట్టబద్ధం చేశారు. జమీందార్లు, ఖోతేదార్లు, తాలూక్‌దార్లు ఎక్కువగా పీడక కులాలకు చెందినవారే. కౌలుదార్లుగా ప్రకటించిన చిన్న భూస్వాములు, ధనికరైతులు ఒకప్పటి శూద్రకులాల నుండి వచ్చినవారు. భూమిలేని రైతాంగం, వ్యవసాయ శ్రామికులలో అత్యధిక భాగం అతిశూద్ర, ఆదివాసీ, సంచార తెగలకు చెందినవారు. దారిద్ర్యానికి గురైన శూద్ర రైతాంగంలోని ఒక పెద్ద సెక్షను కూడా భూమిలేని రైతులుగా, కూలీలుగా మారారు.

ఈ దశలో ఆవిర్భవించిన నూతన వర్గాలు అలా అనేక కులాలతో కూడినవిగా ఉండేవి. ప్రత్యేకించి ప్రధానంగా వెనకబడిన కులాల పేదలను, దళితులను తమలో కలుపుకున్న ఆధునిక కార్మికవర్గం జనించింది. అతి ముఖ్యమైన మార్పు ఏమంటే మునుపటి దశలో ఒకే వర్గంగా

ఉన్నటువంటి అనేక కులాలు అదే స్థితిలో కొనసాగకపోవడమే. వర్గవిభజన అనేది కులాలను విభజించి వివిధ వర్గాలుగా విడగొట్టింది. ప్రత్యేకించి శూద్ర కులాలలోని చిన్నవైనప్పటికీ పలుకుబడి కలిగిన సెక్షన్లు పాలకవర్గాల్లో స్థానాలను పొందే స్థితికి చేరుకోసాగాయి. అనేక కులాల్లో కొద్దిపాటి పెటీబూర్జువా సెక్షన్లు ఏర్పడ్డాయి. అలాగే పీడక కులాల్లో కొన్ని సెక్షన్లు కార్మికులుగా మారారు.

అయినప్పటికీ మొత్తంగా చూసినట్లయితే ఉత్పత్తి సాధనాలపై యాజమాన్యం, ఆధిపత్యం కలిగి ఉండి పాలకవర్గాల్లో ప్రధాన భాగస్వామిగా ఉన్నది ముఖ్యంగా పీడక కులాలలోని వారే. మరో ప్రక్క దళితులలో 90 శాతంకు పైగా వ్యవసాయ కూలీ, పేద రైతులుగానూ, కార్మికులుగానూ ఉన్నారు.

**అర్ధవలస, అర్ధభూస్వామ్య విధానం:** 1947 తర్వాతి కాలంలో భారతదేశంలో, ప్రత్యేకించి గ్రామీణ భారతదేశంలో మరిన్ని మార్పులొచ్చాయి. పెట్టుబడిదారీ ఉత్పత్తి సంబంధాలు విస్తరించడంతో, ప్రజా ఉద్యమాల తాకిడితో అర్ధవలస, అర్ధభూస్వామ్య భారతదేశంలో కులం, వర్గం సంబంధాలు నూతన రూపాలను ధరించాయి. ప్రత్యేకించి గ్రామీణ ప్రాంతంలో బ్రాహ్మణ, క్షత్రియ కులాల ఆధిపత్యం గణనీయంగా క్షీణించింది. ముందే చెప్పుకున్నట్లుగా ఒకప్పటి శూద్ర వర్ణంలోని పీడక కులాలు ఆ స్థానాన్ని ఆక్రమించాయి. నేటి గ్రామీణ ప్రాంతంలోని పాలక ఉన్నతవర్గాలలో బ్రాహ్మణులు, రాజ్‌పుత్‌లు, భూమిహారులు, వెల్లాలులు, కమ్మలు, రెడ్లు, వెలమలు, పటేళ్లు, కున్బీలు (ఆరె), జాట్లు, యాదవులు, కుర్మీలు మొదలైన కులాలవారే గాక కుల సముదాయాలైన లింగాయతులు, వొక్కాలిగలు, మరాఠాలు కూడా ఉన్నారు.

అయితే వీరిలో గణనీయమైన భాగం ధనిక, మధ్యతరగతి రైతులు కాగా కొద్దిమంది మాత్రం వ్యవసాయదారులుగా, పేద రైతాంగంగా ఉన్నారు. వెనుకబడిన కులాలలోని దాదాపు సగం మంది వ్యవసాయ కూలీలు, పేద రైతాంగానికి చెందినవారు కాగా, మిగతా వారిలో ఎక్కువ భాగం మధ్య, ధనిక రైతులు, కొద్దిమంది భూస్వాములుగా కూడా వున్నారు. దళితుల్లో అత్యధిక భాగం వ్యవసాయకూలీ భూమిలేని నిరుపేద రైతాంగానికి చెందినవారే. కొద్దిమంది మధ్యతరగతి రైతాంగానికి చెందినవారు. ఆ పై తరగతికి చెందినవారు అత్యల్పం మాత్రమే. ఈ విధంగా దళితులు ఇప్పటికీ పీడిత వర్గంగానే కొనసాగుతున్నారు.

ఈ విధంగా నేడు వర్గము, కులము మధ్య సమాన సంబంధం మరింతగా తగ్గింది. దాదాపు అన్ని కులాలలో తరతమ తేడాలతో దోపిడీశక్తులు ఆవిర్భవించి వర్గాల కులాల పొందికలో మార్పులు జరిగాయి. కుల ఆధారిత ఫ్యూడలిజం బలహీనపడినప్పటికీ, ఇంకా అస్థిత్వంలో ఉన్న అర్ధభూస్వామ్య సంబంధాల వల్లనూ, ఈ సంబంధాలను కొనసాగించడంలో పాలకవర్గాలకూ, సామ్రాజ్యవాదులకూ ఉన్న ప్రయోజనాల దృష్ట్యా కులవ్యవస్థ నూతన రూపాలలో ఇంకా ఘనీభవిస్తున్నది.

పాలకవర్గాల ఎన్నికల రాజకీయాల ఎత్తుగడలు, హిందూ మతోన్మాదుల పెరుగుదల

కులవ్యవస్థకు వివిధ రూపాలలో కొత్త ఊపిరినిచ్చాయి. కులవ్యవస్థను ఉపయోగించుకొని తమ నాయకత్వాన కులాలపై ఆధారపడిన బహువర్గ సంస్థలను నిర్మించడానికి పాలకవర్గాలు ప్రయత్నిస్తున్నాయి. పెటీబూర్జువా నాయకత్వంలో కొన్ని పీడిత కులాల సంస్థలు కూడా అస్థిత్వంలోకి వచ్చాయి. ఈ మొత్తం క్రమం యొక్క సంశ్లేషణ నేడు ఉనికిలో ఉన్న బ్రాహ్మణవాద సిద్ధాంత సారాన్ని కింది విధంగా నిర్వచిస్తుంది.

శ్రేణీకృత అసమానత, ఆధిపత్య, పీడనల సిద్ధాంతం బ్రాహ్మణిజం. ఇది స్వాతంత్ర్యం, సమానత్వం, సౌభ్రాతృత్వాలను నిషేధిస్తుంది. దీని మూలాలు వేల సంవత్సరాల క్రితపు వేద కాలంలో ఉన్నాయి. అయితే ఏ దోపిడీ వర్గం ఆవిర్భవించి అధికారం నెలకొల్పుకుంటే, ఆ వర్గ అవసరాలకు తగిన విధంగా బ్రాహ్మణిజాన్ని పునర్నిర్మించడంతో అది నిలదొక్కుకుంటూ వచ్చింది. ఇవాళ బ్రాహ్మణిజం భారతదేశ దళారీ నిరంకుశ బూర్జువా, భూస్వామ్య పాలకవర్గాలలో సమస్త సెక్షన్ల ప్రాపంచిక దృక్పథానికీ, విలువ వ్యవస్థకూ కేంద్రకంగా ఉన్నది. దానిలో వున్న శ్రేణీకృత ఆధిపత్యం, న్యూనతల దృక్పథం హెచ్చుతగ్గులతో ప్రతీ కులపర, మతపర సమూహాన్ని కాపాడుతున్నది, ప్రభావితం చేస్తున్నది. ఇది భారత సమాజంలో ప్రతిఘాతక విలువలనూ, సంబంధాలను పెంచి పోషిస్తున్నది.

బ్రాహ్మణిజం శారీరక శ్రమను చులకనగా చూస్తుంది. కులవ్యవస్థ దళితులను అమానవీయ బ్రాహ్మణీయ భావజాలంపై ఆధారపడి ఏర్పడిన దుర్భర పరిస్థితులకు నెడుతూ కుల ప్రాతిపదికన శ్రామికులను విడదీస్తుంది. మహిళా వ్యతిరేక దృక్పథం, పీడక సంబంధాలు, అలవాట్లు ఈ సిద్ధాంతంలో విడదీయరాని అంశాలు. ఇది ఆదివాసీ ప్రజల పట్ల ఆధిపత్యాన్ని, ద్వేషాన్ని, జాతుల పట్ల వివక్షను, మతమైనారిటీలపై ముఖ్యంగా ముస్లింలపై మతోన్మాదపూరిత శతృత్వాన్ని రెచ్చగొడుతుంది. భారత రాజ్య ప్రతిఘాతక 'జాతీయ సమైక్యత'కు ఇది సైద్ధాంతిక ఆధారం కల్పిస్తుంది. భారతదేశంలో అసంఖ్యాక జాతుల స్వయంనిర్ణయాధికార న్యాయమైన హక్కులను ఇది నిరాకరిస్తుంది. దీని భావవాదం అత్యంత ఘోరమైన మూఢనమ్మకాలను, నిర్హేతుకమైన ఆలోచనలను కలిగిస్తుంది. ప్రధానంగా పుట్టుకతోనే గొప్పవాళ్ళు, అల్పులు అనే తారతమ్యాన్ని సృష్టిస్తుంది.

ఈ నేపథ్యంలోనే కుల అణచివేతను ప్రతిఘటిస్తూ, కుల వ్యవస్థను రూపుమాపే ప్రత్యామ్నాయ కార్యక్రమాన్ని కార్మికవర్గ పార్టీ రూపొందించుకుంటుంది.

నూతన ప్రజాస్వామిక విప్లవ దశ నుంచి కమ్యూనిజానికి సోషలిజం గుండా ప్రయాణం చేసే క్రమమంతటిలో కార్మికవర్గ పార్టీ నేతృత్వంలో జరిగే విప్లవంలో అన్ని దశలలోనూ ఈ ప్రమాదకరమైన సిద్ధాంతాన్ని ఎండగట్టి, భావజాల రంగంలో పెళ్ళగించడానికి శక్తివంతమైన పోరాటాన్ని నిర్వహిస్తుంది. భావజాల రంగంలో బ్రాహ్మణవాద వ్యతిరేక పోరాటాన్ని, బూర్జువావర్గ

వ్యతిరేక పోరాటాన్ని స్థిరంగా చేపట్టడం ద్వారానే కార్మికవర్గ పార్టీ తన వర్గచైతన్యాన్ని మరింతగా పెంపొందించుకుంటూ విశాల ప్రజారాశుల చైతన్యాన్ని పెంపొందిస్తూ విప్లవానికి ప్రభావవంతంగా నాయకత్వ పాత్ర వహిస్తుంది.

బ్రాహ్మణవాద భావజాల వ్యతిరేక రాజకీయ పోరాటాల వివిధ స్రవంతులలో కులనిర్మూలన కోసం జరిగే పోరాటం అత్యంత ముఖ్యమైనది. ఎందుకంటే భారత సమాజంలో ఇది ఉత్పత్తి సంబంధాలతో విడదీయరాని భాగంగా ఉంటూ ఉపరితలంలో ఆధిపత్య పాత్ర వహిస్తున్నది. తరువాతి అధ్యాయాల్లో దీని గురించి చూద్దాం.

## 5వ అధ్యాయం

# కులనిర్మూలనపై వివిధ తప్పుడు ధోరణులు

### కుల సమస్యపై ఉమ్మడి భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) అవగాహన:

సీ.పీ.ఐ. భారతదేశంలోని కుల సమస్యను సరిగా అర్థం చేసుకోలేదు. ఉపరితలంలో భాగమైన కులవివక్షత, అసమానత అనే సమస్యలకు, బ్రాహ్మణీయ భావజాలానికి వ్యతిరేక పోరాటం అనే సమస్యకు ప్రాధాన్యతనివ్వక పోవడం మాత్రమే కాదు, ఉత్పత్తి రంగంలో, అంటే పునాదిలో కూడా కులం ఉన్నదన్న విషయాన్ని అది అర్థం చేసుకోలేదు.

అది సామ్రాజ్యవాదాన్ని మాత్రమే లక్ష్యంగా చూసింది తప్ప, దానికి ఫ్యూడల్, దళారీ బూర్జువా వర్గాలతో ఉన్న కుమ్మక్కునూ, భారతదేశాన్ని వెనకబడినదిగానే ఉంచే కులవ్యవస్థతో సహా కాలంచెల్లిన వ్యవస్థలన్నింటినీ తనకు అవసరమైన మేరకు మాత్రమే మార్చుతూ ఉండిన సామ్రాజ్యవాద, బూర్జువా ప్రయోజనాలనూ చూడలేకపోయింది.

బ్రిటిష్ వలసవాదానికి వ్యతిరేకంగా కొనసాగిన స్వాతంత్ర్యోద్యమంలో సీపీఐ చిన్న, భూమిలేని రైతుల, వ్యవసాయ కూలీల ప్రయోజనాలకు ప్రాధాన్యం ఇచ్చేటటువంటి రైతాంగ సమీకరణకు ప్రాముఖ్యతనివ్వలేదు. భూస్వామ్యంతో పాటు కులవ్యవస్థను కూడా నాశనం చేయడానికి మార్గాన్ని సుగమం చేయగల రాజ్యాధికారాన్ని చేజిక్కించుకునే సమస్యను 'దున్నేవారికే భూమి' నినాదంతో జోడించలేదు.

కార్మిక-కర్షక పునాదిపై అన్ని ప్రగతిశీల, ప్రజాస్వామిక శక్తులతో ప్రత్యేకించి, భూస్వామ్య వ్యతిరేక శక్తులతో అది ఐక్యసంఘటనను నిర్మించలేదు. అది దళారీ బూర్జువా వర్గం తోక పట్టుకు పోయింది. సీపీఐ కేడర్ స్థానికంగా కులసమస్యను చేపట్టి పనిచేశారు. కాబట్టే కొన్ని ప్రాంతాల్లో బలమైన వర్గ ఐక్యత, కార్మిక-కర్షక మైత్రిపై ఐక్యసంఘటనలు ఏర్పడ్డాయి. అందుకోసం చాలామంది ప్రాణత్యాగం చేశారు. ఆ పునాదులే భవిష్యత్ విప్లవ పోరాటాలు పెల్లుబకడానికి దోహదం చేశాయి.

కొంతమంది కేడర్లు అంటరానితనానికి వ్యతిరేకంగా అన్ని ప్రగతిశీల ప్రజాస్వామిక శక్తులు పాల్గొనేటటువంటి ఒక కూటమిని ఏర్పాటు చేయాలన్న భావనను ముందుకు తెచ్చారు. అయితే, సీపీఐ నాయకత్వంలో పిడివాదం, యాంత్రికమైన ఆలోచన ఆధిపత్యంలో ఉండడం వలన అది సరైన ప్రాతిపదికపై ఐక్యసంఘటనను నిర్మించడంలో విఫలమైంది.

1952 నుండి నక్సల్బరీ వరకూ, ఆ తర్వాతా కుల సమస్య పట్ల సీపీఐ వైఖరి మౌలికంగా ఇదే. సీపీఐ(ఎం) కూడా మౌలికంగా ఇదే వైఖరితో ఉంది. ఈ రివిజనిస్టు, నయారివిజనిస్టు పార్టీలకు ఎన్నికలే, అవకాశవాద పార్లమెంటరీ పొత్తులే సర్వస్వంగా ఉన్నాయి గనుక, వీటికి తోడ్పడేలా కుల సమస్యపై దళిత ప్రజరాశులను ఆకర్షించడానికి కావలసిన నాటకాలన్నీ వీటి నాయకులు ఆడుతారు. అంటరానితనాన్ని, కుల అణచివేతను పరిష్కరించటానికి బూర్జువా పార్లమెంటు చేసే చట్టాలపై ఆధారపడేలా ఆర్థికవాద దృష్టితో అప్పుడప్పుడు దళిత ప్రజలను ప్రభుత్వాలకు విజ్ఞాపన పత్రాలు అందించటానికి కదిలిస్తూ వారి మిలిటెన్సీని నీరుగారుస్తారు. ఈ విధంగా కులసమస్యపై రెండు రివిజనిస్టు పార్టీలది ఆచరణలో బూర్జువా పంథానే. వాటి పరాకాష్టగానే లాల్ నీల్ ఉద్యమాలను భుజానికెత్తుకుంటున్నారు. ఈ పార్టీలు దళితులలో పెరుగుతున్న ప్రజాస్వామిక చైతన్యాన్ని సమరశీల పోరాటాల వైపు కుల విముక్తి వైపు మళ్లించడం కాకుండా పార్లమెంటు రాజకీయాలకు, వర్గ సామరస్య విధానాలకు బలిపెడుతున్నారు.

## నేటి తప్పుడు ధోరణులు:

మార్క్సిజం–లెనినిజం–మావోయిజం అనుసరిస్తున్నామని ప్రకటించుకునే వారిలో కూడా నేడు కుల నిర్మూలన గురించి ప్రధానంగా రెండు తప్పుడు ధోరణులు వ్యక్తమవుతున్నాయి.

మొదటిది – కులం అనేది కేవలం ఉపరితలానికి సంబంధించిన అంశం మాత్రమేననీ, అందువలన ఉపరితలానికి చెందిన మిగతా అంశాల వలెనే కులం కూడా వ్యవస్థ మారిన తర్వాతనే నిర్మూలించబడుతుంది కాబట్టి నేడు కులనిర్మూలనకు సంబంధించిన కార్యక్రమాలు (ఉద్యమాలు) చేపట్టవలసిన అవసరం లేదనీ, చేపట్టినా వాటి వలన ఫలితం ఏమీ ఉండదనే వాదన. ఇది యాంత్రికమైన అవగాహన. ఈ వాదన చేసే కొన్ని ఎం.ఎల్. గ్రూపులు స్పష్టమైన వర్గ డిమాండ్లపై మాత్రమే పోరాటం చేయాలంటారు. వారు భారతదేశ నిర్దిష్ట పరిస్థితులను సరిగా అర్థం చేసుకోలేదనీ, యాంత్రికమైన అవగాహనతో కుల నిర్మూలన పోరాటాల్ని విప్లవానంతర దశకు వాయిదా వేస్తున్నారనేది స్పష్టమే. వారి ధోరణి పీడిత ప్రజలనందరినీ ఐక్యం చేయడానికి దోహదం చేయకపోగా ఆచరణలో అణచబడ్డ కులాలను కమ్యూనిస్టులకు వ్యతిరేకంగా మళ్లించడానికి పాలకవర్గాలకు ఉపయోగపడుతుంది.

దీనికి భిన్నమైన మరో తప్పుడు ధోరణి – కులానికి, వర్గానికి మధ్య గల తేడాని చూడక,

కులపోరాటాన్నే వర్గపోరాటంగా వక్రీకరించేది. కొన్ని ఎం.ఎల్. గ్రూపులు వర్గపోరాటమే ప్రధానమని పైపై మాటల్లో చెప్పినా, కులవిముక్తి జరగకుండా వర్గవిముక్తి జరగదు అనే మార్క్సిస్టేతర వాదనతో వర్గపోరాటానికి తూట్లు పొడుస్తూ పచ్చి అవకాశవాదంతో కుల సంఘాలనేర్పరచడం, కుల పోరాటాన్నే సర్వస్వంగా భావించడం చేస్తున్నారు.

కొందరు మార్క్సిజాన్ని, మరికొందరు మార్క్సిజం-అంబేద్కరిజాన్ని కలిపి సృజనాత్మకంగా భారతదేశ నిర్దిష్ట పరిస్థితులకు అన్వయిస్తున్నామని ప్రకటించుకుంటూ 'అస్థిత్వవాద సప్తవర్గ కూటమి' సిద్ధాంతం పేరుతో వర్గ అస్థిత్వాన్ని పూర్తిగా అభావం చేసి కుల విప్లవాన్ని ముందుకు తెస్తున్నారు. ఈ సిద్ధాంతానికి అనుగుణంగా రాజకీయ రంగంలో పార్లమెంటరీ పంథా ద్వారా ప్రస్తుత సామాజిక వ్యవస్థలోనే 'దళిత, బహుజన ఐడెంటిటీ అలయెన్స్' అధికారాన్ని ప్రతిపాదిస్తున్నారు. వీరు మాటల్లో కుల వర్గ పోరాటం అంటూనే ఆచరణలో వర్గపోరాటాన్ని అటకెక్కించి పీడక కులాలకు వ్యతిరేకంగా వెనుకబడిన, దళిత కులాలను నిలబెట్టే కుల విప్లవ నినాదాన్నిస్తున్నారు. దేశంలో వర్గ వ్యవస్థ స్వంత అస్థిత్వాన్ని కోల్పోయి కులాధీన వర్గ వ్యవస్థగా పరిణమించిందనీ, ఇక్కడ మార్క్సిస్టులు మార్క్సిజాన్ని వర్గ కుదింపు వాదంగా మార్చారని సిద్ధాంతీకరిస్తున్నారు. ప్రస్తుతం కులవ్యతిరేక పోరాటాన్ని చేపట్టడమే విప్లవకారుల తక్షణ కర్తవ్యమనీ, దానిని గుర్తించకపోవడమే కమ్యూనిస్టు ఉద్యమ వైఫల్యానికి కారణమని చెప్తున్నారు.

అంతేకాక భారతదేశంలో విప్లవ విజయానికి 'నూతన తరహా కార్మికవర్గ పార్టీ'ని నిర్మించాలనీ, అందులో పీడక కులాల నుండి వచ్చిన కామ్రేడ్స్ ఉన్నతస్థాయి కమిటీలలోకి ప్రవేశించడాన్ని నిషేధించాలనీ వీరు వాదిస్తున్నారు. .దళిత, ఆదివాసీలకు చెందిన వారి నుండి దేశాధ్యక్షులను ఎంపిక చేస్తే కులతత్వం కొంతవరకు కడగబడుతుందనీ, ఈ వాదనను వ్యతిరేకించడం కులతత్వం అవుతుందనే తప్పుడు వాదనలను ప్రచారంలోకి తెస్తున్నారు. వీరు అణచబడ్డ కులాల ప్రజలకు ప్రధాన శత్రువు పీడక కులాలని చెప్తూ వారికి నిజమైన శత్రువులెవరో, మిత్రులెవరో తెలియకుండా చేస్తూ వర్గపోరాటాన్ని పక్కదోవ పట్టిస్తున్నారు. నేటి దోపిడీ వ్యవస్థ చట్రంలోనే సాంఘిక పోరాటం పేరుతో కొనసాగించే సంస్కరణవాద ఉద్యమాల ద్వారా, పార్లమెంటరీ పంథా ద్వారా కుల నిర్మూలన సాధ్యమంటూ పీడిత ప్రజలకు దోపిడీ వ్యవస్థపై భ్రమలు కలుగజేస్తున్నారు.

ఈ మధ్య కాలంలో పాలక వ్యవస్థ పట్ల దళిత ప్రజల్లో పెరుగుతున్న తీవ్ర అసంతృప్తిని పక్కదారి పట్టించి సంస్కరణవాదంలో ముంచెత్తడానికీ, పార్లమెంటరీ పంథాలోకి మళ్లించడానికి అవకాశవాదంతో సీపీఐ (ఎం)నీల్ జెండా, లాల్ జెండాలను (అంబేద్కరిజాన్ని, మార్క్సిజాన్ని)కలిపి పాదయాత్ర చేపట్టి తెలంగాణలో దళితుల ఓట్లు దండుకునేందుకు ప్రయత్నిస్తున్నది. మరి కొంతమంది నీల్ సలామ్, లాల్ సలామ్ పేరుతో అంబేద్కరిజాన్ని, మార్క్సిజాన్ని కలిపేందుకు ప్రయత్నిస్తున్నారు. ఈ బూర్జువా, పెటీబూర్జువా ధోరణులన్నీ పైన చెప్పుకున్నట్లుగా దళిత సమస్యకు పరిష్కారాలు

కావు. ఈ తప్పుడు ధోరణులకు వ్యతిరేకంగా సైద్ధాంతిక పోరాటం కొనసాగించాలి. అలాగే బ్రాహ్మణీయ హిందూ మతోన్మాదానికీ, పీడక కుల దురహంకారానికి వ్యతిరేకంగా కొనసాగే పోరాటంలో ఎత్తుగడలపరంగా వీరిలో పాజిటివ్ శక్తులతో కలిసి పని చేయటానికి కృషి చేయాలి. దళిత సమస్యపై మన పార్టీ స్వతంత్రంగా విశాల ప్రాతిపదికన బలమైన ఉద్యమాలను నిర్మించాల్సిన అవసరం ఉంది.

## పోస్ట్ మోడర్నిస్ట్ సిద్ధాంతం:

కొన్ని దళిత, వెనకబడిన కులాల, ఆదివాసీ సంఘాలు నేరుగా ఈ సిద్ధాంతం ఆధారంగా పని చేస్తున్నాయి. ఈ సిద్ధాంతం వర్గాల అస్థిత్వాన్ని గుర్తించ నిరాకరిస్తూ కేవలం గ్రూపులు (ఐడెంటిటీస్) మాత్రమే అస్థిత్వంలో వున్నాయంటుంది. పీడిత ప్రజానీకం వివిధ గ్రూపులుగా విడిపోయి వుండటం వలన వారు సమిష్టిగా పోరాటాన్ని సాగించడం అసాధ్యమని సిద్ధాంతీకరిస్తుంది. ఏ గ్రూపుకు ఆ గ్రూపు తన ప్రయోజనాల కొరకు మాత్రమే పోరాడాలని, సమిష్టిగా మొత్తం పీడిత ప్రజానికాన్ని ఐక్యం చేసి పోరాటాలను చేపట్టడం అవసరం లేదని, అసాధ్యమని చెపుతుంది. ఈ సిద్ధాంతం అన్ని రకాల అణచివేతలను వ్యతిరేకిస్తుంది. కానీ, ఈ అణచివేతల కొనసాగింపుకు వనరుగా, వకాల్తా దారుగా ఉంటూ పీడిత ప్రజలపైన తీవ్రమైన అణచివేతను కొనసాగిస్తున్న దోపిడీ పాలకవర్గాలు, వారి రాజ్యం విషయంలో మౌనంగా ఉంటుంది. ఈ కారణాల రీత్యా ఈ ధోరణి కూడా కుల నిర్మూలనకు ఏ మాత్రం దోహదపడకపోగా పీడిత వర్గాలనూ, ప్రజలనూ ఐక్యం కానీయకుండా చేసి ప్రస్తుత దోపిడీ వ్యవస్థను యథాతథంగా ఉంచడంలో తన వంతు సేవ చేస్తుంది. ఇంతవరకు ఈ సిద్ధాంతం అంతర్జాతీయంగానూ, మన దేశంలోనూ మార్క్సిజానికి సైద్ధాంతికంగా చాలా నష్టం కలిగించింది. మనం ఈ సిద్ధాంతాన్ని వ్యతిరేకించాలి, బహిర్గతపరచాలి. అయితే దళితులు, వెనకబడిన కులాలు ఆదివాసీలలోని వివిధ సెక్షన్ల ప్రజల డిమాండ్లు, ఆకాంక్షలను ప్రతిబింబించేలా సరైన సమయంలో సరైన పోరాట నిర్మాణ రూపాల(ఎత్తుగడలు)ను రూపొందించాలి. ఈ విషయంలో వైఫల్యం జరిగిన చోటా, మన ఉద్యమం బలహీనపడిన చోట మన పోరాట ప్రాంతంలో అస్థిత్వ ఉద్యమాలు తలెత్తాయి.

భారతదేశంలో కులానికి, వర్గానికి దగ్గర సంబంధం ఉన్న మాట వాస్తవమే అయినా కులం, వర్గం ఒకటి కాదనే విషయాన్ని గుర్తించాలి. అయితే దళితుల (ఎస్.సీ.) విషయంలో చాలా వరకు కులం, వర్గం కలిసిపోయే ఉన్నాయి. రాజకీయాల్లో చేరి ఉన్నత స్థితికి ఎదిగి పాలకవర్గాల్లో భాగమైన దళితులను, పాలకవర్గ ప్రయోజనాలకు ఊడిగం చేసే కొద్దిపాటి మేధావులను, బ్యూరాక్రట్లను, చాలా చిన్న సెక్షన్ వ్యాపారస్తులను మినహాయిస్తే దళితులలోని అత్యధిక మెజారిటీ (90 శాతానికి పైబడి) గ్రామాల్లోని వ్యవసాయకూలీ, పేద రైతాంగానికీ, పట్టణాలలోని పేదల బస్తీల్లోని శ్రమజీవులకు చెందినవారే. బి.సి.లకు చెందిన వారిలో వర్గ

సమీకరణ (class polarisation) అనేది చాలా స్పష్టంగా జరగడమే కాక అందులో చెప్పుకోదగ్గ సెక్షన్ భూస్వాములుగాను, ధనిక రైతులుగాను, పారిశ్రామికవేత్తలుగానూ, వ్యాపారస్తులుగానూ పరివర్తన చెంది పాలకవర్గాల్లో భాగమయ్యారు. ఈ వెనకబడ్డ కులాల్లో కూడా కొన్ని కులాలు అత్యంత దయనీయమైన స్థితిలో ఉండగా కొన్ని సాపేక్షికంగా అభివృద్ధి చెంది ఉన్నాయి. మొత్తం మీద చూసినట్లైతే ఈ కులాల్లోని మెజారిటీ ప్రజానీకం విప్లవాన్ని కోరుకునే శ్రమజీవులే. అయితే ఈ కులాలపై కూడా వివిధ రూపాల్లో ఇప్పటికీ కులపీడన-వివక్ష అమలవుతున్నది. ముఖ్యంగా రిజర్వేషన్ల సమస్యలో ఈ కులాలవారు ముందు పీఠీన నిలబడి పోరాడుతున్నారు. వీరిపై అమలయ్యే కులపీడన-వివక్షకు వ్యతిరేకంగా ఈ కులాల వారిని దళితులతో పాటుగా సంఘటితం చేయాలి.

పీడక కులాల ప్రజానీకమంతటిని దోపిడీవర్గాలకు చెందినవారుగా పరిగణించాలని చెప్పడం కూడా సరైనది కాదు. దోపిడీవర్గ పొందికలో అత్యధికం పీడక కులాలకు సంబంధించినవారేననడం సమంజసమైనప్పటికీ పీడక కులాల్లోని అందరూ దోపిడీ వర్గాలకు చెందిన వారు కాదు. పీడక కులాల్లో కూడా చెప్పుకోదగ్గ శాతం నూతన ప్రజాస్వామిక విప్లవంలో కలిసివచ్చేవారే. మిగతా కులాల పీడిత ప్రజానీకంతో వారిని ఐక్యం చేసి వివిధ సమస్యలపై పోరాటాలను నిర్వహించడం సాధ్యమూ, అత్యావశ్యమూ కూడా. ప్రత్యేకించి కుల నిర్మూలనా పోరాటాలలో వారందరినీ ఐక్యంచేయ యత్నించాలి. పీడక, పీడిత కులాల విభజనకు మూలమైన, పీడిత వర్గాల ఐక్యతకు అవరోధంగా నిలిచిన బ్రాహ్మణవాద భావజాలాన్ని ఎండగడుతూ, పీడక కులాల వారిలో ఉన్న కుల దురహంకారానికీ ఆధిక్యతా భావజాలానికీ, పీడిత కులాల వారిలో ఉన్న సంకుచిత సెక్టేరియన్ వైఖరికి వ్యతిరేకంగా పోరాడకుండా పీడిత ప్రజలందరిని ఐక్యం చేయడం సాధ్యం కాదు. ఈ పోరాటంలో మన దాడి కేంద్రీకరణ పీడక కుల ఆర్థిక ఆధిపత్యం పైననే, పీడక కుల దురహంకారం పైననే, కులాధిక్యతా భావజాలం పైననే ఉండాలి.

నూతన ప్రజాస్వామిక విప్లవ విజయమే సంపూర్ణ కుల నిర్మూలనకు భౌతిక పునాది నేర్పరుస్తుందనేది గుర్తిస్తూనే, ఈ విప్లవ విజయ సాధనకు కుల నిర్మూలనా పోరాటాన్ని దీనిలో అంతర్భాగంగా కొనసాగించాలి.

**కులానికి పునాదితో, ఉపరితలంతో సంబంధం:**

వివిధ ఎం.ఎల్. గ్రూపులలో ఉన్న తప్పుడు అవగాహన దృష్ట్యా మన అవగాహనను తిరిగి మరోసారి చెప్పాల్సిన అవసరం ఉంది.

మొదటగా మనం అర్థం చేసుకోవలసింది, కొన్ని గ్రూపులు చెప్తున్నట్లుగా కులం అనేది కేవలం ఉపరితలానికో లేదా పునాదికో మాత్రమే చెందినదనడం మార్క్సిస్టు వ్యతిరేకమూ, యాంత్రికమూ. ఉపరితల అంశాలుగా కనపడే బ్రాహ్మణవాద సిద్ధాంతం లాంటివి ఉత్పత్తి

సంబంధాలలో, అంటే పునాదిలో కూడా అంతర్భాగమేననే అంశాన్ని మనం గుర్తించాలి. లోగడ మనం పేర్కొన్నట్లు పునాదిలో కులం పాత్ర, కుల ఆధారిత భూస్వామ్య విధానం, పెట్టుబడిదారీ సంబంధాలు అభివృద్ధి చెందుతుండడంతో, రాజకీయ రంగంలో కొనసాగుతున్న వర్గపోరాటం అభివృద్ధి చెందుతుండడంతో తగ్గుతూ వచ్చింది. అయినప్పటికీ దేశం అర్ధవలస, అర్ధభూస్వామ్య వ్యవస్థగా అస్థిత్వంలో ఉన్నంతవరకూ, కులవ్యవస్థను పాలకవర్గాలు తమ దోపిడీకీ, పరిపాలనకూ ఉపయోగించుకున్నంత కాలం పునాదిలో కూడా కులం యొక్క పాత్ర వివిధ రూపాలలో కొనసాగుతూ ఉంటుంది.

దేశంలో నేడు బ్రాహ్మణవాదం, హిందూ మతదురహంకారం, పీడక కులాధిపత్య భావనలు ఉపరితలంలో ఆధిపత్య స్థానంలో ఉండి నిరంతరం ఈ దోపిడీ వ్యవస్థ మనుగడకు తోడ్పడుతున్నాయి. అదే సమయంలో ఇదే పునాది నుండి బ్రాహ్మణవాదాన్నీ, హిందూమత దురహంకారాన్నీ, పీడక కులాధిపత్యాన్ని వ్యతిరేకిస్తూ వీటిని ఢీకొంటూ అసలు ఈ పునాదినే సమూలంగా మార్చివేసే శాస్త్రీయ, ప్రగతిశీల, ప్రజాస్వామిక, పురోగామి, విప్లవాత్మక భావజాలం, రాజకీయాలు, వీటికి ప్రాతినిధ్యం వహించే శక్తులు, వీటి నిర్మాణాలు, వర్గపోరాటం ఉపరితల రంగంలో జనిస్తున్నాయి. ఇవి నేటి కాలం చెల్లిన పునాదిని నిలిపి ఉంచే శక్తులను కూలదోసి ఈ పునాదిని బ్రద్దలుకొట్టే వర్గపోరాటాన్ని ఉపరితల రంగంలోని అన్ని అంశాల్లో కొనసాగిస్తున్నాయి. నేడు ఒకే పునాదిపై ఆధారపడి ఉనికిలో ఉన్న పరస్పర విరుద్ధ శక్తులు ఉపరితల రంగంలో తీవ్రంగా ఘర్షిస్తున్నాయి. ఇందులో భావజాల రంగంలో, రాజకీయ రంగంలో జరిగే పోరాటం ప్రధానమైనదీ, కీలకమైనదీ, నిర్ణయాత్మకమైనది. ఈ విషయాన్ని తిరస్కరిస్తూ, సమాజ విప్లవాత్మక పరివర్తనకు జరిగే కృషిని తిరస్కరిస్తూ ఇదే వ్యవస్థను సంస్కరించాలనే బూర్జువా వర్గ దగాకోరు మోసాలను, పెటీబూర్జువా సంస్కరణవాద కుతర్కాలను మనం గట్టిగా వ్యతిరేకించాలి.

పైన పేర్కొన్న అంశం నుండి ఉద్భవించే ప్రధాన సూత్రం ఏమంటే కుల సమస్యను కేవలం పునాదిలో భాగంగానో లేక ఉపరితలంలో భాగంగానో ఎంచి పరిష్కరించజాలమనేది. నూతన ప్రజాస్వామిక విప్లవ ఆరంభం నుండి దాని అంతిమ విజయం వరకూ పునాదిలోనూ, ఉపరితలంలోనూ అన్ని వైపుల నుండి కులంపై దాడి చేయడం మూలంగానే దానిని రద్దు గావించడానికి మార్గం సుగమం అవుతుంది.

## 6వ అధ్యాయం

## కుల సమస్యపై మన పార్టీ అవగాహన-ఆచరణ

కుల సమస్యను మన పార్టీ భారత సమాజానికి సంబంధించిన ఒక ప్రత్యేక సమస్యగానే చూస్తున్నది. మన దేశంలో ఉన్న ప్రజానీకమంతా ఈనాడు వివిధ వర్గాల క్రింద ఎలా విభజింపబడి

ఉన్నారో, అలాగే వివిధ కులాల క్రింద కూడా విభజింపబడి ఉన్నారనీ, అందువలన ఈ సమస్య ఎడల జనరల్‌గానూ, నిర్దిష్టంగానూ కూడా మనకు స్పష్టమైన వైఖరి ఉండాలని మన పార్టీ చెబుతున్నది. నూతన ప్రజాస్వామిక విప్లవ లక్ష్యంతో ఈ ప్రత్యేక సమస్యపై దళిత, వెనుకబడిన కులాల ప్రజలతో పాటు ఇతర కులాలలోని ప్రజాస్వామిక శక్తులను సమీకరించి కులపీడనకు వ్యతిరేకంగా బలమైన ఉద్యమాన్ని నిర్మించాలనీ 2007లో జరిగిన మన నూతన పార్టీ ఐక్యతా కాంగ్రెస్-9వ కాంగ్రెస్ ఆమోదించిన మౌలిక డాక్యుమెంట్స్ (పార్టీ కార్యక్రమం, భారత విప్లవ వ్యూహం-ఎత్తుగడలు)లో స్పష్టంగా ఈ క్రింది విధంగా పేర్కొన్నాము.

"వేల సంవత్సరాల పాటు భారత సమాజంపై పెత్తనం చెలాయించిన భూస్వామ్య విధానం, బ్రాహ్మణవాద భావజాలం ప్రాతిపదికపై నిర్మితమైన కట్టుదిట్టమైన కులవ్యవస్థ పునాది గల భూస్వామ్య విధానమే. పీడితుల నుండి ప్రత్యేకించి బానిసల్లాంటి పరిస్థితిలోకి నెట్టబడి అంటరానివారుగా పిలువబడే వారి నుండి పెద్దమొత్తంలో అదనపు విలువను పిండుకోవడంలో ఈ వినాశకారియైన కుల వ్యవస్థ దీనికి ఎంతగానో ఉపకరించింది." (పార్టీ కార్యక్రమం, పేజీ 4)

"భారతదేశంలో భూస్వామ్య/అర్ధ భూస్వామ్య విధానం యూరప్ యొక్క సాంప్రదాయిక రూపాన్ని తీసుకోలేదు. ఇక్కడ కులపీడన, బ్రాహ్మణవాదం నేడు నెలకొని ఉన్న అర్ధభూస్వామ్య, అర్ధవలస వ్యవస్థతో విడదీయడం సాధ్యంకాని విధంగా పెనవేసుకొని ఉన్నాయి. కులవ్యవస్థ ఇక్కడ ఉపరితల నిర్మాణానికి సంబంధించిన అంశం (ఫినామినా) మాత్రమే కాదు, అది ఆర్థిక పునాదిలో భాగం కూడా. ఈ కారణం రీత్యా అంటరానితనం నిర్మూలన, దానితో పాటు బ్రాహ్మణవాదపు వ్యక్తీకరణలన్నింటిపై పోరాటాలతో సహా, కుల వ్యవస్థను దుంపనాశనం చేయడం అన్నది, దేశంలోని నూతన ప్రజాస్వామిక విప్లవంలో ఒక ఆవశ్యక భాగంగా ఉంటుంది. కులతత్వం, బ్రాహ్మణవాదం, ప్రత్యేకించి శిష్ట ప్రాధాన్యత (ఎలైటిస్ట్)ను, పైనుంచి కిందికి సాగే అంతరువులతోను కూడుకొని ఉన్నవి, అవి ఒక కులంలోని వ్యక్తులకు, వారి పుట్టుక నుంచే, తాము తమ కింది కులాల వారి కంటే అధికులమనే భావనను సంతరింపజేస్తాయి........ దీనికంతటికీ మతం పేరిట పవిత్ర ఆమోదముద్ర లభిస్తుంది. ఇది పీడిత ప్రజల నడుమ చీలిక తేవడానికి ఒక మారణాయుధం కూడా. ఇటువంటి శిష్ట ప్రాధాన్యత గల నిర్మాణం, ఏ దోపిడీ వ్యవస్థకైనా ఆదర్శప్రాయమైనదే." (భారత విప్లవ వ్యూహం-ఎత్తుగడలు, పేజీ 15)

"కుల పునాదిపై ఉన్న బ్రాహ్మణవాద భూస్వామ్య విధానం భారత ప్రజానీకంలోని అత్యధికులను వెనుకబడిన ఉత్పత్తి సంబంధాలకే కట్టిపడవేసి ఉంచడం ద్వారా ఉత్పత్తి శక్తుల అభివృద్ధికి సంకెలగా పనిచేస్తుంది. ఆర్థికంగా అది ప్రజలలోని అత్యధికులను కటిక దారిద్ర్యంలో, దయనీయమైన స్థితిలో ఉంచేస్తుంది, వారి కొనుగోలు శక్తిని కుంచింపజేస్తుంది. తద్వారా అది దేశీయ మార్కెటు వృద్ధిని పరిమితం చేస్తుంది, పారిశ్రామికాభివృద్ధిని కుంటుపరిచి పెద్దఎత్తున నిరుద్యోగానికి, ఆర్థిక

వ్యవస్థలో ప్రతిష్టంభనకు దారితీస్తుంది. రాజకీయంగా అది ప్రజారాశుల ప్రజాస్వామిక హక్కులను అణచివేస్తుంది. కొన్ని ప్రాంతాలలో అది 'రాజ్యంలో మరో రాజ్యా'న్ని సృష్టిస్తుంది. అంటే గ్రామీణ ప్రాంతాలలో తమ సొంత ప్రైవేటు సైన్యాలను కలిగి ఉన్న రాజ్యపు కిరాయి సాయుధ మూకల మద్దతు గల ఒక సమాంతర భూస్వామ్య రాజ్యాన్ని సైతం సృష్టిస్తుంది. అది రైతాంగాన్ని శాశ్వతమైన దాస్యానికి, వెట్టికి గురి చేస్తుంది. బ్రాహ్మణవాదమూ, కులవ్యవస్థా సమాజపరంగానూ, సిద్ధాంతపరంగానూ కింది కులాలపై, దళితులపై ఇంకా అదనపు పీడనను కలుగజేస్తాయి. దళితుల విషయంలో అది అంటరానితనం అనే అమానుష రూపం తీసుకుంటుంది. ఇవి భూస్వామ్య శక్తులకు మిగులును (సర్‌ప్లస్) దండుకోవడంలో ఆర్థికేతర బలప్రయోగ సాధనాలుగా కూడా ఉపకరిస్తాయి." (భారత విప్లవ వ్యూహం–ఎత్తుగడలు, పేజీ 18)

"ఖండించవలసి ఉన్న కులవ్యవస్థ, కులతత్వం, ప్రత్యేకించి, బ్రాహ్మణవాద కులతత్వం భారతదేశంలో నెలకొని ఉన్న అర్ధభూస్వామ్య వ్యవస్థ యొక్క ఒక ప్రత్యేక లక్షణం. పాలకవర్గాలు వేల సంవత్సరాలుగా అమలు చేస్తున్న ఈ నీచ కులవ్యవస్థ, కులతత్వం, దేశంలోని పీడిత కులాలను దెబ్బతీస్తున్న సామాజిక పీడన, దోపిడీల ఒక ప్రత్యేక రూపం. కులతత్వం వ్యక్తి ఆత్మాభిమానాన్ని ధ్వంసం చేస్తుంది. వారిని హీనులుగా పరిగణిస్తుంది. నిచ్చెనమెట్లను పోలిన సామాజిక దొంతరను సృష్టిస్తుంది. ఈ దొంతరలో ఒక దొంతరకు చెందినవారు తమ కింది దొంతరలకు చెందిన వారందరినీ చిన్న చూపు చూస్తుంటారు. పేద ప్రజలను, పీడిత ప్రజలను రెచ్చగొట్టడానికి, విభజించడానికి ఇటు భారత పాలకవర్గాలు, అటు సామ్రాజ్యవాదులు ఇద్దరూ వాడుతోన్న ఆయుధం ఇది. పీడిత కులాలలో అధిక సంఖ్యాకులు పేదలే. వారు వర్గపీడనతో పాటు తీవ్ర కులపీడనకు కూడా లోనవుతున్నారు. సామ్రాజ్యవాదానికి, భూస్వామ్య విధానానికి, దళారీ బ్యూరాక్రటిక్ పెట్టుబడిదారీ విధానానికి వ్యతిరేకంగా సాగే వారి వాస్తవ పోరాటాలను పట్టాలు తప్పించడానికి కులతత్వం వినియోగించబడుతోంది." (పార్టీ కార్యక్రమం, పేజీ 15)

"ఈ కులతత్వ నిచ్చెన మెట్లలో దళితులు అట్టడుగు మెట్టుగా ఉంటారు. వారు తమకు పైమెట్టున ఉన్న అన్ని సామాజిక బృందాల చేతుల్లో, ప్రత్యేకించి భూస్వామ్య శక్తుల చేతుల్లో తీవ్రమైన సామాజిక పీడనకు గురవుతుంటారు. అమానుషమైన అంటరానితనం ఇప్పటికీ కొనసాగుతోంది, పెంచి పోషించబడుతోంది. తదనుగుణంగానే దళితులు రెండవ శ్రేణి పౌరులుగా చూడబడుతున్నారు. నేటికి కూడా వారిలో 90 నుండి 95% మంది భూమిలేని రైతులు లేదా పేద రైతులు లేదా గ్రామ నౌకరులే.

"భూస్వామ్య పీడనకు వ్యతిరేకంగానూ, సమాజంలో సమాన హోదాను పొందడానికి తరతరాలుగా వారు సాగిస్తున్న పోరాటాలపై నేటికీ దాడులు జరుగుతూనే ఉన్నాయి. పాలకవర్గాలు, వారి రాజ్యాంగయంత్రం పెంచి పోషిస్తున్న భూస్వామ్య, హిందూవాద ఛాందసవాద శక్తుల క్రూర

దాడులకు దళితులు బలవుతున్నారు. ఈ దాడులు, ముక్మమ్మడి హత్యాకాండలు, మహిళల పైన మూకుమ్మడి లైంగిక అత్యాచారాల రూపంలో వ్యక్తమవుతున్నాయి.

"దళిత సమస్య అంతస్సారంలో వర్గసమస్యే అయినప్పటికీ పార్టీ దళితులపైనా, ఇతర వెనుకబడిన కులాల పైన సాగుతున్న కుల అణచివేత వ్యతిరేక పోరాటాన్ని నూతన ప్రజాస్వామిక విప్లవంలో భాగంగా నడపాలి. కులవివక్ష, పీడన తాలూకు అన్ని రూపాలతోనూ పోరాడడం ద్వారా సామాజిక జీవనానికి సంబంధించిన అన్ని రంగాలలోనూ వారికి సమాన హోదా కోసమూ, కులవ్యవస్థను దుంపనాశనం చేయడానికీ పోరాడాలి." (పార్టీ కార్యక్రమం, పేజీ 16)

"బ్రాహ్మణవాద, కుల పునాది స్వభావం మూలంగా అర్ధభూస్వామ్య వ్యవస్థలో ఇంకా దిగజారిపోతున్న దుర్భర, దౌర్భాగ్య జీవన పరిస్థితులను మార్చడానికి గాను రైతాంగంలోని విశాల మెజారిటీకి వ్యవసాయక విప్లవం తక్షణ అవసరంగా ఉంది. భారతదేశంలో ప్రజాస్వామిక విప్లవం పరిపూర్తిగాక పోవడం, భూ సమస్య పరిష్కారం కాకుండా ఉండిపోవడం అనే వాస్తవం నుండి ఈ పరిస్థితి ఏర్పడింది. అందువలన భూమి కోసం, రాజకీయాధికారం కోసం సాగే రైతాంగ యుద్ధం నూతన ప్రజాస్వామిక విప్లవపు సారంగా కొనసాగుతుంది. ఇది విశాల రైతాంగ ప్రజారాశులను జాగృతం చేసి ప్రజాసైన్యంలో సంఘటితం చేయడానికిగానూ పార్టీ సమర్థవంతంగా ఉపయోగించుకోగలిగిన ఒక ముఖ్య అంశంగా ఉంటుంది." (భారత విప్లవ వ్యూహం-ఎత్తుగడలు, పేజీ 38)

"భారతదేశంలో కులాలు లోతుగా వేళ్లూనుకొని ఉన్నాయి. దేశంలో కుల పీడన, బ్రాహ్మణ ఆధిక్యత విస్తృతంగా వ్యాపించి ఉంది. దళితులు అమానుషమైన అంటరానితనం అనే ఆచారాన్ని ఎదుర్కొంటూ, నిచ్చెనమెట్లలో అతి కింది మెట్టుగా ఉన్నారు. అన్ని రూపాలలోని కుల పీడనను వ్యతిరేకించాల్సి ఉన్నప్పటికీ పార్టీ దళితులపై పీడన పైనా, అంటరానితనం నిర్మూలన పైనా ప్రత్యేకించి దృష్టి పెట్టాలి. దళితులు లేదా షెడ్యూల్డ్ కులాలను దుర్మార్గమైన కులవ్యవస్థలో చిక్కిన భారత సమాజపు ప్రత్యేకతైన ఒక ప్రత్యేక సామాజిక సెక్షన్‌గా పరిగణించాలి. వీరిలో అత్యధిక మెజారిటీ (90% పైగా) పేద, భూమిలేని రైతాంగానికి, కార్మికవర్గం తదితర వేతనాలకు పనిచేసే సెక్షన్లకు చెందినవారై ఉంటారు. అయినప్పటికీ వీరు కూడా సామాజిక అణచివేతకు, పీడక కులాల దౌర్జన్యాలకు, జీవితంలోని అన్ని రంగాలలోను వివక్షకు గురయ్యేవారుగా ఉంటారు. ఈ సామాజిక అణచివేతకు సంబంధించిన అత్యంత హేయమైన, అమానుషమైన వ్యక్తీకరణ అయిన అంటరానితనాన్ని పాటించడం అనే ఆచారం భారతదేశంలోని ఎక్కువ ప్రాంతాలలో ఇంకా ఆచరించబడుతూనే ఉంది. దున్నేవారికే భూమిని పంపిణీ చేసే ప్రాతిపదిక పైన వ్యవసాయక విప్లవాన్ని విజయవంతంగా పరిపూర్తి చేయడం ద్వారా నేటి అర్ధవలస, అర్ధభూస్వామ్య వ్యవస్థను ధ్వంసం చేయడంలోనే దళితుల సమస్యలకు నిజమైన పరిష్కారం ఉన్నది." (భారత విప్లవ వ్యూహం-

ఎత్తుగడలు, పేజీ 119)

"భారత జనాభాలో దాదాపు 17.5% ఉండే విశాల దళిత ప్రజారాశులను వ్యవసాయక విప్లవంలోకి సమీకరించేటప్పుడు వారిపై సాగే అన్ని రకాల సామాజిక అణచివేతకు, పీడక కులాలు అనుసరించే కుల వివక్షకు వ్యతిరేకంగా పోరాడే కర్తవ్యానికి మనం ప్రత్యేకమైన ప్రాధాన్యతను కూడా ఇచ్చి తీరాలి. అంటరానితనం, దళితుల పైన పీడక కుల దౌర్జన్యాలు, ఇంకా కుల ప్రాతిపదిక పైన జరిగే ఇతర రూపాలలోని వివక్ష వంటి చెడులకు వ్యతిరేకంగా పోరాడడానికి గాను వివిధ స్థాయిలలో తగిన నిర్మాణ రూపాలను అభివృద్ధిపరచాలి. అదే సమయంలో మనం దళితుల కోసం పూర్తిగా కుల ప్రాతిపదిక పైనే ఉండే సంఘాలను ఏర్పరచడానికి పూనుకోవద్దు. అది కేవలం వారిని మరింతగా వేరుచేసి ఉంచడానికి మాత్రమే దారి తీస్తుంది.

"ఇతర వెనుకబడిన కులాల వారికి సమాన హక్కులు, రిజర్వేషన్లు, తదితర ప్రత్యేక సౌకర్యాల కల్పన కోసం పార్టీ, దళితులు తప్పనిసరిగా పోరాడాలి. వాటిని ప్రజాస్వామ్యం కోసం సాగే పోరాటంలో అవిభాజ్య భాగంగా పరిగణించాలి. అదే సమయంలో ఈ సమస్యలపై పాలకవర్గాల రాజ్యం యొక్క విధానాల డొల్లతనాన్ని ఎండగట్టాలి. దళిత సమస్యలను చేపట్టడం పేరిట తమ ఎన్నికల పబ్బాలను గడుపుకొనే అవకాశవాద దళిత నాయకులను కూడా మనం ఎండగట్టాలి. దళితులపై హింస, వివక్షలకు సంబంధించిన అన్ని రూపాలకు వ్యతిరేక పోరాటాన్ని మన స్వంత వర్గ సంఘాల ద్వారానే మనం చేపట్టి నాయకత్వం అందించాలి. సమాజపు నూతన ప్రజాస్వామిక పరివర్తనలో భాగంగా అంటరానితనానికి, కుల వివక్షకు వ్యతిరేకంగా, కుల వ్యవస్థ నిర్మూలన కోసం పోరాడటానికి సంఘాలను నిర్మించాల్సిన సత్వర అవసరం ఉంది.

"కొన్ని రాష్ట్రాలలో దళితులలోని పెటీబూర్జువా సెక్షన్లు దళితులకు మాత్రమే సంబంధించిన సంఘాలను ఏర్పరచి, తమకు సంబంధించిన కొన్ని సమస్యలపై ఉద్యమాలను నిర్మిస్తున్నారు. ఆ సమస్యలపై మనం ఈ పెటీబూర్జువా సంస్థలతో కలిసి పనిచేయాలి. కాగా, అదే సమయంలో మత మార్పిడి, రిజర్వేషన్ల వంటి వాటి ద్వారా కుల నిర్మూలన అనే వారి సంస్కరణవాదోన్ముఖ భావాలపై వారితో సిద్ధాంత, రాజకీయ పోరాటాలు జరపాలి. నాయకత్వపు సంస్కరణవాద, అవకాశవాదాన్ని ఎండగట్టాలి. కుల వ్యవస్థపై విప్లవ విధానాన్ని మనం ప్రచారం చేయాలి. విప్లవకర ప్రత్యామ్నాయం లోపించినందువలన మాత్రమే దేశంలోని వివిధ ప్రాంతాలలో కేవలం దళితులే ఉన్న సంఘాలు తమంత తాముగా పుట్టుకొస్తున్నాయి. విప్లవ పార్టీ, ప్రజాసంఘాలు దళితుల సమస్యలను చేపట్టి అన్ని సెక్షన్ల ప్రజలతో విశాల ప్రాతిపదిక పైన ఉద్యమాన్ని నిర్మించినట్లయితే అలాంటి సంఘాలు నిరుపయోగమైనవవుతాయి." (భారత విప్లవ వ్యూహం–ఎత్తుగడలు, పేజీ 120)

"దేశంలో అంటరానితనాన్ని ఎదిరించి పోరాడుతున్న బలమైన దళిత ఉద్యమం ఉంది.

దీనిలో ఒక భాగాన్ని పాలకవర్గాలు తమ చేతుల్లోకి తీసుకోగలిగినప్పటికీ, దళితులపై దాడులకు వ్యతిరేకంగా, వారిని చీదరించి అవమానించడానికి వ్యతిరేకంగా స్పాంటేనియస్‌గా పోరాటాలు విజృంభిస్తూనే ఉన్నాయి. ఇది ఒక్క పల్లె పట్టులలోనే కాక పట్టణ ప్రాంతాల్లో కూడా జరుగుతోంది. పట్టణ ప్రాంతాల దళితుల్లో ఆత్మగౌరవం, ధీమా పెరిగింది. ఈ ఉద్యమాల్లో పాల్గొనడం, వీలైన చోట్ల వాటికి నాయకత్వాన్నందించడం చాలా ముఖ్యం. అలా చేస్తున్నప్పుడు మనం కులపీడన, అంటరానితనాలను యావత్తు సమాజపు ప్రజాస్వామికీకరణతో అంటే నూతన ప్రజాస్వామిక విప్లవ కర్తవ్యాలతో ముడిపెడుతూ ఈ ఉద్యమాలకు సరైన దిశానిర్దేశాన్ని అందించాలి." (భారత విప్లవ వ్యూహం–ఎత్తుగడలు, పేజీ 131)

"ప్రజల ప్రజాస్వామిక విప్లవం తర్వాత, దోపిడీదారులకూ, పీడితులకూ మధ్య వర్గ వ్యత్యాసాన్ని నిర్మూలించే క్రమంలో క్రమక్రమంగా ఉత్పత్తి సంబంధాలను విప్లవీకరిస్తుంది. శాస్త్రీయ సోషలిస్టు దృక్పథాన్ని పెంపొందించడం ద్వారా బ్రాహ్మణవాద భావజాలాన్ని, కులపీడన, వివక్షను రూపుమాపే తన కృషిని అది కొనసాగిస్తుంది." (పార్టీ కార్యక్రమం, పేజీ 30)

"భారతదేశంలో నెలకొని ఉన్న నిర్దిష్ట పరిస్థితులలో విప్లవానికి నాయకత్వం వహించే కార్మికవర్గ పార్టీ మహిళలు, దళితులు, ఆదివాసులు, మతమైనారిటీలు అనే అతి ముఖ్యమైన సామాజిక సెక్షన్లను పరిగణనలోకి తీసుకోవలసి ఉంటుంది. ఈ సెక్షన్లన్నిటికీ వాటి వాటి సొంత ప్రత్యేక సమస్యలున్నాయి. వర్గపీడనకు తోడు ప్రత్యేక రకాలైన ఆర్థికేతర పీడనకు కూడా గురవుతుంటాయి. వారి ప్రత్యేక సమస్యల పరిష్కారం పైనా, వారిని విప్లవోద్యమంలోకి సమర్థవంతంగా సమీకరించే ప్రత్యేక కర్తవ్యాలను రూపొందించుకోవడం పైనా మనం తగు శ్రద్ధ వహించవలసి ఉంటుంది. ఈ లక్ష్య సాధన దిశగా మనం ఇతర పీడిత ప్రజారాశులతో పాటు వీరిని కూడా వర్గ సంస్థలలోకి తీసుకురావడమే గాక, వారి ప్రత్యేక సమస్యల పైన స్వల్పకాలిక, దీర్ఘకాలిక ప్రాతిపదిక పైన ఈ సెక్షన్లను పెద్ద ఎత్తున సమీకరించడానికి అవసరమైన విశాల ప్రాతిపదిక కలిగిన నిర్మాణ రూపాలను, పోరాట రూపాలను కూడా రూపొందించుకోవాలి. ఎక్కడ, ఎప్పుడు అవసరమైతే అప్పుడు ప్రత్యేకమైన సమస్యల పరిష్కారం కోసం విశాలమైన సంయుక్త సంఘటనలను కూడా మనం నిర్మించాలి.

"అయితే ఈ సెక్షన్లకు సంబంధించిన ప్రత్యేక సమస్యల పైన ప్రత్యేక ఎత్తుగడలను చేపడుతూనే మనం ఈ ఎత్తుగడలు ఎల్లప్పుడూ మన వ్యూహాత్మక పంథాకు లోబడి ఉండాలనేది దృష్టిలో ఉంచుకోవాలి. దేశంలో కొనసాగుతోన్న ప్రజాయుద్ధపు మొత్తం నేపథ్యంలోనూ, దానితో ముడిపెట్టి మనం వారి ప్రత్యేక సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కార్యక్రమాన్ని చూడాలి. తమ సమస్యలు ఆవశ్యకంగానే వర్గ సమస్యలని, వర్గపీడన నుండి తమల్ని తాము విముక్తి చేసుకోవడం ద్వారానే వారి సమస్యల అంతిమ పరిష్కారానికి భౌతిక ప్రాతిపదిక వేయబడగలదని, అందువల్ల, కార్మికవర్గ నాయకత్వం కింద, ఇతర పీడిత ప్రజారాశులతో సమైక్యంగా దేశపు విశాల ప్రజారాశులను

పీడిస్తోన్న ఉమ్మడి శత్రువులైన సామ్రాజ్యవాదం, భూస్వామ్య విధానం, దళారీ బ్యూరాక్రటిక్ బూర్జువాలకు వ్యతిరేకంగా యుద్ధం చేయాల్సిన తప్పనిసరి అగత్యాన్ని గురించి ఈ సెక్షన్లకు మనం తప్పనిసరిగా బోధన గరపాలి.

"ప్రజాయుద్ధమూ, నేడు సాగుతున్న వర్గ పోరాటమూ ఈ సెక్షన్లను నానాటికీ ఇంకా ఎక్కువగా ఎలా ప్రధాన రంగస్థలం పైకి తీసుకొస్తున్నవో మనం ఆచరణలో చూపాలి; ఈ పీడిత సెక్షన్లలో నిద్రాణమై ఉన్న సామర్థ్యం, సృజనాత్మకమైన శక్తియుక్తులు విప్లవ చొరవ, సామర్థ్యాలు ఆ ప్రజాయుద్ధ క్రమంలో, లోతుగా విస్తరిస్తున్న వర్గపోరాట క్రమంలో ఎలా వికసిస్తున్నాయో ఆచరణలో వారికి తెలియజెప్పాలి. ఈ సెక్షన్లలోని పీడితుల పైన కార్మికవర్గ పార్టీ నాయకత్వం ప్రత్యేకమైన శ్రద్ధ చూపడం ద్వారా, నిర్దిష్టమైన పథకంపై ఆధారపడి చైతన్యయుతమైన కృషిని సాగించడం ద్వారా, వారిని అభివృద్ధిపరచడం ద్వారా మాత్రమే మొత్తంగా పార్టీలోని వారి హోదా, విప్లవోద్యమంలోని వారి స్థానాలలో ఒక గుణాత్మకమైన మార్పును తీసుకురాగలుగుతాం. అందువలన, మన అన్ని గెరిల్లాజోన్లలోనూ, వర్గపోరాట ప్రాంతాల్లోనూ, ముందుగా మనం వర్గపంథానూ, ప్రజాపంథానూ శ్రద్ధాపూర్వకంగా అనుసరించాలి. అంటే భూమిలేని, పేద రైతాంగంలోనూ, వ్యవసాయ కూలీల్లోనూ – వీరు సాధారణంగా దళిత సెక్షన్లకు చెందిన వారై ఉంటారు – ప్రధానంగా పనిచేయాలి. ఈ అంశంపై దృఢంగా ఆధారపడుతూ ఈ సెక్షన్ల పురోగామి శక్తులను పార్టీలోకి, వర్గసంస్థలలోకి ఇముడ్చుకునే ఒక సుస్పష్టమైన పథకంతో ఈ సెక్షన్లలోని విశాల ప్రజారాశులను వారి ప్రత్యేక డిమాండ్ల పైన ప్రత్యేక పోరాట, నిర్మాణ రూపాలలో సమీకరించడమే గాక ఈ సెక్షన్లను అన్ని రంగాలలో ముందుకు తీసుకురావడానికి ప్రత్యేక కార్యక్రమాలను చేపట్టవలసి ఉంటుంది.

"పైన పేర్కొన్న సాధారణ పంథాను, వైఖరిని అనుసరించడం ద్వారా మనం ఈ ప్రత్యేక పీడిత సామాజిక సెక్షన్ల సమస్యల పరిష్కారానికి సంబంధించి, మన దేశంలోని పార్లమెంటరీ, రివిజనిస్టు పార్టీలకు, సంస్కరణవాద ఎన్.జి.వో.లు తదితర పెటీబూర్జువా సంస్థలకు, కమ్యూనిస్టు విప్లవ సంస్థలుగా చెలామణీ అయ్యే వాటికి మనకు మధ్య విస్పష్టమైన విభజన రేఖను గీయగలుగుతాం. ఈ సెక్షన్ల ఉద్యమాలలోని వివిధ బూర్జువా–సంస్కరణవాద–రివిజనిస్టు ధోరణులను మనం నిలకడగా రాజకీయంగా ఎండగట్టడాన్ని కూడా చేపట్టాలి." (భారత విప్లవ వ్యూహం–ఎత్తుగడలు, పేజీ 117–18)

కులసమస్యపై మునుపటి సీపీఐ (ఎంఎల్) (పీపుల్స్‌వార్), ఎంసీపీఐల అవగాహన, ఆచరణ మౌలికంగా ఒకేలా ఉండేది. ఇవి మౌలికంగా సరైనవే. అయితే మునుపటి రెండు పార్టీల అవగాహనలో, కార్యాచరణలో కొన్ని పరిమితులు, లోటుపాట్లు ఉన్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో దళిత తదితర అణచివేతకు గురవుతున్న కులాల ప్రజలను కదిలించి వ్యవసాయ విప్లవంలో భాగంగా కుల తదితర సామాజిక పీడనలకు వ్యతిరేకంగా పోరాటాలను నిర్మించి ఎన్నో గణనీయ

విజయాలను సాధించినప్పటికీ, ఈ సమస్యపై ప్రత్యేక నిర్మాణాలను ఏర్పరచడం గానీ, తగినంతగా ప్రత్యేక ఉద్యమాలను నిర్మించడంగానీ చేయలేదు. అలాగే ఈ సమస్యపై అన్ని రంగాల్లోనూ అవసరమైనంతగా సైద్ధాంతిక, రాజకీయ, నిర్మాణ, పోరాట కృషి కొనసాగించలేకపోయాం. దీనివల్ల సకాలంలో ప్రత్యేక ఎత్తుగడలను అభివృద్ధి చేయలేకపోవడంతో పాటు వ్యవసాయ విప్లవంలో క్రియాశీల పాత్ర నిర్వహించిన పీడిత ప్రజలను కుల సమస్యపై బూర్జువా, పెటీబూర్జువా సంస్కరణవాద ప్రభావానికి గురికాకుండా దీర్ఘకాలం బలంగా నిలబెట్టలేకపోయాం.

నూతన పార్టీ ఏర్పాటు వరకు రెండు పార్టీల అభివృద్ధి క్రమంలో, అవి పనిచేసిన ప్రాంతాల సామాజిక పరిస్థితులలో, ఆయా ఉద్యమాలు ఎదుర్కొన్న కొన్ని ముఖ్యమైన సమస్యలలో, అవి నాయకత్వం వహించిన ఉద్యమాల ఆటుపోట్లలో గల తేడాల వల్ల కుల సమస్యపై చేసిన సైద్ధాంతిక, రాజకీయ, నిర్మాణ కృషిలో కొన్ని తేడాలున్నాయి. కుల సమస్యపై రెండు పార్టీల పరిమితులు, లోటుపాట్లు ఆ మేరకు ఆయా ఉద్యమాలను నెగెటివ్‌గా ప్రభావితం చేశాయి. అయితే 1990ల మధ్య సీపీఐ (ఎంఎల్) (పీపుల్స్‌వార్) కుల సమస్య కేవలం ఉపరితలానికి సంబంధించిన సమస్య కాదనీ, అది పునాదిలోనూ భాగంగా వుందనీ, భారతదేశంలో భూస్వామ్యం కులాధారిత భూస్వామ్యం అని గుర్తిస్తూ తన అవగాహనను మౌలికంగానే పెంపొందించుకునిఒక ముందంజ వేయగా, నూతన పార్టీ ఏర్పడి ఐక్యతా కాంగ్రెస్-9వ కాంగ్రెస్ విజయవంతంగా జరగడంతో ఈ సమస్య విషయంలో యావత్తు పార్టీ అవగాహన మెరుగులు దిద్దుకొని మరింత బలపడి మరో ముందంజ వేసింది. అయినప్పటికీ నేటికీ ఈ రంగంలో మన కృషిలో చాలానే లోపాలు కొనసాగుతున్నాయి. వీటిని సరిదిద్దుకొని ఈ రంగంలో బలమైన ఉద్యమాన్ని నిర్మించాల్సిన తక్షణ అవసరం ఎంతో ఉంది.

మహత్తర నక్సల్బరీ, శ్రీకాకుళం, సోనార్‌పుర్, కాంక్సా తదితర విప్లవ రైతాంగ పోరాటాల నాటి నుండి కూడా మనం గ్రామీణ ప్రాంతాల్లోని పునాది వర్గాల ప్రజలను నూతన ప్రజాస్వామిక విప్లవ రాజకీయాలతో సమీకరించి సాయుధ వ్యవసాయ విప్లవోద్యమాన్ని నిర్మించడానికీ, ఈ వర్గాలలోనే కమ్యూనిస్టు పార్టీ నిర్మాణాన్ని బలోపేతం చేయడానికి కేంద్రీకరించి కృషి చేశాము. అందువల్లనే చైతన్యపూర్వకంగా, ప్రణాళికాబద్ధంగా మనం ప్రధానంగా పేదవర్గాలైన దళిత, వెనుకబడిన కులాల ప్రజల్లో కేంద్రీకరించి మన కార్యకలాపాలను కొనసాగించాము. ఈ విధంగా పని చేయడం వల్లనే, అంటే ప్రధానంగా ఈ కులాల పేద, మధ్యతరగతి రైతాంగ ప్రజలను కదిలించి బలమైన వ్యవసాయ విప్లవోద్యమాలను నిర్మించగలిగాము. 'గ్రామాలకు తరలండి' అనే రాజకీయ కేంపెయిన్‌ల కోసం పార్టీ విద్యార్థి యువజనులకు ఇచ్చిన గైడెన్స్‌లో ఈ కేంపెయిన్‌లు జయప్రదం కావడానికి దళిత పల్లెల్లో ఎన్ని రోజులు నివసించారనేదే గీటురాయిగా ఉంటుందని చెప్పాము. విద్యార్థి, యువజనులు సరిగ్గా ఈ గైడెన్స్‌ను ఆచరణలో పెట్టి మంచి ఫలితాలు సాధించారు.

ప్రజా సమస్యలైన వెట్టిచాకిరి రద్దు, కూలీల, పాలేర్ల జీతాల పెంపుదల, భూస్వాములు దండుకున్న దండుగల వాపస్, బంజరు తదితర ప్రభుత్వ భూముల స్వాధీనం, భూస్వాముల భూముల స్వాధీనం వంటి వ్యవసాయ విప్లవ సమస్యలపైననే గాకుండా అంటరానితనం, కులపీడన-వివక్ష, దళితులపై అత్యాచారాలు లాంటి సామాజిక సమస్యలపై ఉద్యమాలు నిర్మించడం ద్వారా దళిత-వెనకబడిన కులాల్లోని, పీడక కులాల్లోని పేద, మధ్యతరగతి ప్రజల మధ్య ఐక్యత సాధించగలిగాము. భూస్వామ్య వ్యతిరేక ఉద్యమాలతో పాటు రాజ్యవ్యతిరేక ఉద్యమాల ద్వారానూ, సామ్రాజ్యవాద వ్యతిరేక ఉద్యమాల ద్వారానూ, పట్టణాలలోని విద్యార్థి, యువజన, కార్మిక, మహిళా, ప్రజాస్వామిక హక్కుల, సాహితీ సాంస్కృతిక, ఉద్యోగ తదితర ఉద్యమాల ద్వారానూ, వివిధ కులాల్లోని ప్రత్యేకంగా దళిత, వెనుకబడిన కులాల్లోని పేద, మధ్యతరగతి ప్రజల మధ్య ఐక్యత సాధించాము. రైతు-కూలీ సంఘాలు/క్రాంతికారీ కిసాన్ కమిటీలతోపాటు యువజన, మహిళా, సాంస్కృతిక సంఘాలలో దళిత-వెనుకబడిన కులాలకు చెందిన పేద, మధ్యతరగతి నుండి నాయకత్వ స్థానంలోకి రాగలిగేలా అభివృద్ధిపరచి ప్రజల చేత గుర్తింపు పొందేలాగ ప్రయత్నపూర్వకంగా కృషి చేసినట్లే పట్టణాల్లోని ప్రజాసంఘాలలోనూ నాయకత్వాన్ని అభివృద్ధి చేయగలిగాము. వీరు పార్టీ నాయకత్వంలో గ్రామ వ్యవహారాల్లో నాయకత్వపరంగా నిర్వహిస్తున్న ప్రజాస్వామ్యయుత రాజకీయ పాత్రను వెనకబడిన కులాలకు, పీడక కులాలకు చెందిన మెజారిటీ పేద, మధ్య తరగతి ప్రజలు కూడా ఆమోదిస్తున్నారు. ఈ విధంగా అన్ని కులాల పేద, మధ్యతరగతి ప్రజల మధ్య ఐక్యత పెంపొందుతూ క్రమంగా కుల నిర్మూలన కోసం కొనసాగుతున్న ప్రజాస్వామిక పోరాటంగా అభివృద్ధి చెందుతున్నది.

దేశంలోని చాలా రాష్ట్రాల గ్రామీణ ప్రాంతాల్లో దళితులపై భూస్వామ్య, పెత్తందారీ శక్తులు అమలుచేసిన వర్గ దోపిడీ, పీడనలకు, ఆధిపత్యానికి వ్యతిరేకంగానూ, సామాజికంగా అంటరానితనానికీ, అత్యాచారాలకూ, అణచివేతకు, భౌతిక దాడులకు వ్యతిరేకంగానూ ఎన్నో పోరాటాలను చేపట్టాం. భూస్వామ్య పెత్తందారీ పీడక కుల దురహంకార శక్తులు బిహార్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో దళితులపై మారణకాండలు జరిపినపుడు మనం చాలా దృఢంగా పీడితుల పక్షంలో నిలబడడంతో పాటు ఈ దుర్మార్గాలను ఎండగడుతూ పెద్ద ఎత్తున ప్రచారాన్ని, నిరసన కార్యక్రమాలను నిర్వహించాం. ఇలాంటి ప్రతిఘాతక శక్తులను లక్ష్మణ్‌పుర్ బాథే, సెనారీ, దలాల్ చౌక్-భగౌరా, కారంచేడు లాంటి చోట్ల నిర్మూలించాము. బిహార్‌లో 1970ల చివరి నుండి 1990ల చివరి వరకు భూస్వామ్య దుష్టపెత్తందారీ పీడక కుల దురహంకార శక్తులు ప్రధాన దోపిడీవర్గ రాజకీయ పార్టీల నాయకుల అండతో, రాజ్యం-పాలక యంత్రాంగం దన్నుతో ఏర్పరచిన బ్రహ్మర్షి సేన, భూమిసేన, సవర్ణ లిబరేషన్ ఫ్రంట్, సన్‌లైట్‌సేన, రణవీర్‌సేన, తదితర కులాల సేనలు విప్లవోద్యమాన్ని నాశనం చేసే లక్ష్యంతో దళిత తదితర పీడిత వర్గాల, పీడిత కులాల ప్రజలపై మధ్యయుగాలను తలపింపజేసే మారణకాండలను, అంతులేని అత్యాచారాలను జరిపాయి. పార్టీ

నాయకత్వాన పీడిత ప్రజలు సాయుధమై ఒక్కొక్కటిగా ఈ సైన్యాలను, వీటికి నాయకత్వం వహించిన కరుడుగట్టిన పీడక కులాల భూస్వామ్య శక్తులను అణచివేయడం ద్వారానే విప్లవోద్యమం పురోగమించింది.

ప్రభుత్వ సంస్కరణలు అనేవి ప్రధానంగా వివిధ రూపాలలో ప్రజలు కొనసాగించే పోరాటాల ఫలితమే అయినా పాలకవర్గాలు తమ స్వార్థ ప్రయోజనాల కోసం ప్రజలను మభ్యపెట్టటానికి వాటిని తామే తీసుకువచ్చామనే ప్రచారం చేసుకుంటాయి. అందువల్ల పాలకవర్గాల బూటకత్వాన్ని ఎండగడుతూనే, ఈ సంస్కరణలకున్న పరిమితిని గురించి ప్రజలకు వివరిస్తూనే ఎస్‌సీల, ఓబీసీల, ఎస్‌టీల రిజర్వేషన్లను సమర్థించి, వాటి సాధన కోసం పోరాటాలు నిర్వహించడంలో మనం ముందు వరుసలోనే ఉన్నాం. కులతత్వాన్ని రెచ్చగొట్టే బ్రాహ్మణవాద హిందుత్వ పీడక కుల దురహంకారానికీ, దానికి మొనగాడుగా ఉన్న సంఘ్ పరివార్‌కు, బీజేపీకి వ్యతిరేకంగా ప్రచారాందోళనలు చేపట్టాం. అందులో భాగంగానే ప్రజలను కదిలించి ఎన్నో సభలు, సమావేశాలు నిర్వహించాం.

మన విప్లవోద్యమం సాధించిన ఒక గొప్ప విజయమేమంటే భారత సమాజం లోని విశాలమైన గ్రామీణ ప్రాంతాల్లో సాయుధ వ్యవసాయ విప్లవోద్యమం ద్వారా దళిత తదితర వెనుకబడిన కులాల పేద ప్రజలతో పాటు పీడక కులాల పేద, మధ్యతరగతి ప్రజలను రాజకీయంగా సమీకరించి సంఘటితం చేస్తూ సుదీర్ఘకాలం పాటు భూస్వామ్యాన్ని, పీడక కుల దురహంకారాన్ని ఎదుర్కొని దానిని దెబ్బపై దెబ్బ తీసి దాని పునాదులనూ, దానిపై ఆధారపడిన కాలం చెల్లిన బ్రాహ్మణీయ పీడక కుల విలువలను కుదిపివేస్తూ ఈ సమస్య శాశ్వత పరిష్కారానికి ఒక నూతన దృక్పథాన్నీ, నూతన పోరాట మార్గాన్నీ ముందుకు తేవడం. అలాగే మరో గొప్ప విజయమేమంటే దళిత, వెనుకబడిన కులాలకు, ఆదివాసీలకు చెందిన పీడిత ప్రజలు వర్గపోరాటంలో విప్లవ రాజకీయాలతో సుశిక్షితమవుతూ వివిధ ప్రజాసంఘాలలో, విప్లవ ప్రజాకమిటీలలో, పార్టీ, ప్రజావిముక్తి గెరిల్లా సైన్య నిర్మాణాల్లో కేవలం గ్రామస్థాయిలోనే కాకుండా రాష్ట్ర, కేంద్రస్థాయి నాయకత్వాల్లోకి రావడం అనేది పెరగడం.

దళిత తదితర వెనుకబడిన కులాల ప్రజలను రాజకీయంగా సమీకరిస్తూ సంఘటితం చేసే క్రమంలో పీడక కుల భూస్వామ్య, దుష్టపెత్తందారీ శక్తుల దురహంకారాన్నీ, సామాజిక, రాజకీయ, ఆర్థిక, సాంస్కృతిక ఆధిపత్యాన్ని ధ్వంసం చేయటానికి కొనసాగించిన అనేక పోరాటాల ద్వారా పీడితులలో ఆత్మవిశ్వాసం పెంపొందించగలిగాము. శ్రమజీవులను కులం పేరుతో దూషించడం, దళిత ప్రజలను కించపరుస్తూ చులకన భావంతో చేసే సంబోధనలను దాదాపు పూర్తిగా లేదా చాలావరకు లేదా గణనీయంగా మన పార్టీ పనిచేసిన ఆయా ప్రాంతాల్లోని ఉద్యమ బలాన్ని బట్టి నిరోధించగలిగాము. వీరిలో ఎప్పటి నుండో ఏర్పడి ఉన్న న్యూనతాభావాన్ని చాలా వరకు

తొలగించగలిగాము. ఈ విధంగా అందరితో సమానమైన వాళ్లమనే సాంఘిక చైతన్యాన్ని వీరిలో పెంపొందించగలిగాము. ఈ విధంగా గ్రామీణ ప్రాంతాల్లో కొనసాగుతున్న అంటరానితనాన్ని, కులవివక్షను పోరాట క్రమంలో ధైర్యంగా ప్రతిఘటించి పీడిత కులాలను, వివిధ కులాల్లోని పీడిత వర్గాలను విప్లవోద్యమంలో ఐక్యం చేయడానికి కృషి సల్పాము. ఇదే పద్ధతిలో పట్టణ ప్రజల్లోనూ కృషి చేశాము.

అయినప్పటికీ, సమస్య స్వభావాన్ని బట్టి మన పై ప్రయత్నాలే సరిపోవని అనుభవం తెలియజేస్తున్నది. సమస్య ఎంత లోతైనదని పై అధ్యాయాలలో వివరించబడిందో అంత లోతైన, నిరంతరాయమైన, దృఢమైన ప్రయత్నాలు మనం కొనసాగించలేకపోయామనేది కూడా ఒక వాస్తవం. జనరల్‌గా కులసమస్యపై సరియైన అవగాహనే పార్టీకి ఉన్నప్పటికీ, నిర్దిష్టంగానూ, లోతుల్లోనూ చూసినప్పుడు అవగాహనలోనూ, ఆచరణలోనూ ఇంకా కొన్ని పరిమితులు, లోపాలు ఉన్నాయి. వీటివల్లనే కుల నిర్మూలనా సమస్య పట్ల సమగ్రమైన ప్రత్యేక కార్యక్రమం తీసుకోవడంలో, నూతన పోరాట, నిర్మాణ రూపాలు చేపట్టడంలో, తీసుకున్న మేరకైనా వాటిని నిరంతరం కొనసాగించడంలో లోపాలు కొనసాగాయి.

భూస్వామ్య వ్యతిరేక, సామ్రాజ్యవాద వ్యతిరేక వర్గపోరాటాలతో పాటు అదే సమయంలో వీటితో అనుసంధానిస్తూ వివిధ సాంఘిక సమస్యలపై, ప్రత్యేకంగా బ్రాహ్మణవాద భావజాలానికీ, అంటరానితనానికీ, కులపీడనకూ వ్యతిరేకంగా సామాజిక రంగంలో వర్గపోరాటం నిర్వహించడం ద్వారానే దళిత తదితర పీడిత కులాల ప్రజలలో సాంఘికంగా తాము అందరిలాంటి మనుష్యులమేననే, అందరితో సమానంగా బ్రతికే హక్కు తమకూ ఉందనే చైతన్యం పెరుగుతుంది. వారిలో పెరుగుతున్న వ్యక్తిత్వానికి, ప్రజాస్వామిక చైతన్యానికి అది చిహ్నం. అలాంటి వ్యక్తిత్వం, చైతన్యం పెరగకుండా విప్లవ చైతన్యం పెంపొందడం కూడా అసంభవం. అందువల్ల నూతన ప్రజాస్వామిక విప్లవ లక్ష్యంతో భూస్వామ్య విధానానికీ, సామ్రాజ్యవాదానికీ వ్యతిరేకంగా ఆర్థిక, రాజకీయ పోరాటాలతో పాటు సాంఘిక, సాంస్కృతిక సమస్యలపై పోరాటాలను నడపడం మీద కూడా కేంద్రీకరించడం ద్వారానే దళిత తదితర పీడిత కులాల ప్రజల వ్యక్తిత్వాన్ని, చైతన్యాన్ని విప్లవాత్మకంగా మలచగలం. ఆ వ్యక్తిత్వ, చైతన్య ఫలితంగానే విప్లవానికి వెన్నెముకగా ఉన్న పీడితవర్గాలైన దళిత తదితర పీడిత కులాల ప్రజలు విప్లవ చైతన్యాన్ని తొందరగా పెంపొందించు కుంటారు.

ఇప్పటివరకు మనం విప్లవకర వర్గాలను నూతన ప్రజాస్వామిక విప్లవంలో సమీకరించు కోవడానికి ప్రధానంగా వర్గ సంఘాల ద్వారా కృషి చేస్తూ వీటి ద్వారా కులపీడన, వివక్షకు వ్యతిరేకంగా పోరాటాలు నడిపాము. మన అనుభవం ద్వారా తేలిన విషయమేమంటే కేవలం వర్గసంఘాల ద్వారానే సాంఘిక అసమానతను రూపుమాపడం సాధ్యం కాదు. కుల అణచివేతకు

వ్యతిరేకంగా జరిగే పోరాటం పాలకవర్గాలకు వ్యతిరేకంగా జరిపే పోరాటమేగాక ప్రజల మధ్య భావజాలపరంగా జరపాల్సిన సాంఘిక, సాంస్కృతిక పోరాటం కూడా. కుల ఆధారిత భారత సమాజంలో పీడక, పీడిత (వెనుకబడిన, దళిత) కులాల ప్రజలు వందల, వేల సంఖ్యలో కులాలు, ఉపకులాలుగా విడిపోయి ఉన్నారు. పీడక, పీడిత (వెనుకబడిన, దళిత) కులాల, ఉపకులాల ప్రజల మధ్య పైనుండి కిందికి నిచ్చెనమెట్ల కులవ్యవస్థకు సంబంధించిన వివిధ రూపాల సాంఘిక అసమానత, అంతరాలు, అణచివేత, వైరుధ్యాలు కొనసాగుతున్నాయి. ఉదాహరణకు మిగతా కులాల్లో వలెనే దళితుల్లో కూడ వివిధ కులాలు, ఉప కులాల నడుమ ఒక రకమైన అంటరానితనంతో పాటు అంతరాలు, వైరుధ్యాలు కొనసాగుతున్నాయి. వీటి మధ్య వివాహాలు నిషిద్ధంగా ఉన్నాయి. వీరి ఇళ్లు, గుళ్లు, చర్చిలు వేరువేరుగా ఉంటున్నాయి. అలాగే వెనుకబడిన కులాల వారిలో కూడా ఇదే పరిస్థితి ఉంది. ఈ పరిస్థితుల్లో ప్రజల మధ్య ప్రత్యేకించి పీడితుల మధ్య కుల అంతరాలను పోగొట్టి సమానత్వం సాధించడానికి, ఏరకమైనటువంటి అంటరానితనానికి తావివ్వకుండా ఉండడానికి వీలుగా కులనిర్మూలనా లక్ష్యంగా పోరాటం సాగించాల్సి ఉంది.

దినదినానికి దళితులపై పీడక కుల అహంకారుల, భూస్వాముల దాడులు, నేరాలు పెరుగుతున్నాయి. ఈ దాడులకూ, నేరాలకు వ్యతిరేకంగా ప్రతి సంవత్సరం వేలాది కేసులు పోలీస్‌స్టేషన్‌లలో నమోదు అవుతున్నప్పటికీ, వాటిలో అత్యల్ప కేసుల్లో మాత్రమే శిక్షలు పడుతున్నాయి. మనం ఈ విషయాన్ని లోతుల్లోకి వెళ్ళి పరిశీలించినట్లయితే గ్రామీణ ప్రాంతంలో ఎస్.సీ, ఎస్.టీలపై జరిగే వేలాది నేరాలు వాస్తవానికి నమోదే అవ్వడం లేదనే విషయం అర్థం కావడంతో పాటుఅనేక చోట్ల పోలీసులు చట్టబద్ధంగా కనీసం వీటిని నమోదు చేసేందుకు తిరస్కరిస్తున్నారని తెలుస్తుంది. మరోవైపు నమోదు చేసిన వేలాది కేసులు కోర్టుల్లో పెండింగ్ పడి ఉన్నాయి. మరికొన్ని కేసులు పోలీసుల ఘోరమైన నిర్లక్ష్యంవల్లనూ, పబ్లిక్ ప్రాసిక్యూటర్ల పూర్తి ప్రతికూల వైఖరి వల్లను కొట్టివేశారు. నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో సర్వే, ప్రిజన్ స్టాటిస్టిక్స్ ఇండియా 2020 ప్రకారం దేశంలోని మొత్తం 1,306 జైళ్లలో విచారణలో ఉన్న 3,52,495 మంది ఖైదీలలో దళితులు (77,716), ఆదివాసీలు (39,031), ఓబీసీలు (1,27,736) ముస్లింలు (66,384)లకు చెందినవారే. మొత్తం శిక్షపడిన 1,12,589 మందిలో దళితులు 23,498 మంది, ఆదివాసీలు 15,613 మంది, ఓబీసీలు 41,850 వున్నారు. పీడక కులాల వారు, హిందూమతోన్మాదులు ఏటా దళిత, ఆదివాసీ, ముస్లింలపై, విప్లవకారులపై జరిపే వేలాది నేరాలలో నేరస్థులను పోలీసులు అరెస్టు చేస్తున్నవారి సంఖ్య చాలా తక్కువ. వీరి వివరాలు నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరోలో కూడా చేర్చనంత స్వల్పంగా వున్నాయి. వీరు ఈ ఘరానా నేరస్థులంతా పెద్దగా ఏ శిక్షలూ పడకుండా నిర్దోషులుగా వదిలివేయబడుతున్నారు. దేశంలో పెద్ద సంచలనం సృష్టించిన కీల్వెన్‌మణి, బథానీటోలా, లక్ష్మణ్‌పుర్ బాథే, శంకర్‌బిఘా, కారంచేడు, చుండూరు, కంబాలంపల్లి లాంటి ఊచకోతలలో నిందితులైన పీడక కులాల, పీడక వర్గాల వారంతా నిర్దోషులని కోర్టులు

నిర్లజ్జగా తీర్పులిచ్చాయి. ఇవన్నీ పోలీసు, న్యాయవ్యవస్థ పీడక కుల, పీడక వర్గ స్వభావాన్ని చాలా స్పష్టంగా బహిర్గతపరుస్తున్నాయి. మరొకవైపున దళిత, ఆదివాసీ, ముస్లింలను, విప్లవకారులను చాలావరకు తప్పుడు ఆరోపణలతో, స్వల్పమైన నేరారోపణలతో, పెద్దెత్తున జైళ్లలో పెట్టడం, శిక్షలు విధించడం చేస్తున్నారు. దీనికి సజీవ ఉదాహరణ భీమాకోరేగావ్.

దళిత, ఆదివాసీలపై ప్రభుత్వ లెక్కల్లో రాని వేల, లక్షల అత్యాచారాలు కొనసాగుతూనే ఉన్నాయి. అలాగే వీటిలో హత్యల సంఖ్య చాలా ఎక్కువే ఉంటుంది. ఇక దళితుల్ని తిడితే, కొడితే మునుపటిలా అణిగిమణిగి ఉండలేని నేటి పరిస్థితుల్లో దళితుల్ని చంపడం ఒక పద్ధతిగానే పీడక కుల దురహంకారులు కొనసాగిస్తున్నారు. నిరంతరం చైతన్యమవుతున్న దళితులను అణచివేయడానికి పీడక కుల భూస్వామ్య, పెత్తందారీ శక్తులు సామూహిక అత్యాచారాలు జరపడం, ఇళ్లను ధ్వంసం చేయడం, పదుల సంఖ్యలో దారుణంగా చంపివేయడం చేస్తున్నారు. ముఖ్యంగా ఇటీవలి సంవత్సరాలలో ఖైర్లాంజీ, ఉన్నావ్, కథువా, హత్రాస్, బారాబంకి వంటి సంఘటనలలో దళిత, ఆదివాసీ, మైనారిటీ బాలికలపై హిందూ మతోన్మాదులు దాడి చేసి, అత్యాచారం గావించి చంపివేయడం దేశంలో ఒక ధోరణిగానే కొనసాగుతున్నది. ఈ వరుస సంఘటనలు మోడీ ఇచ్చిన 'బేటీ బచావ్, బేటీ పడావ్' నినాదాన్ని నవ్వులపాలు చేస్తున్నాయి. పరువు హత్యల పేరుతో దళిత యువకులను అమానవీయంగా హత్యలు చేస్తున్నారు. తెలంగాణలో ప్రణయ్ హత్యా ఉదంతం ఈ కోవకు చెందినదే. హరియాణ, ఉత్తరప్రదేశ్‌లలో ఖాప్ పంచాయితీల పేరుతో దళితులను బహిష్కరించడం, హతమార్చడం పెద్ద ఎత్తునే కొనసాగుతున్నది.

ఆంధ్రప్రదేశ్‌లో ఇసుక మాఫియాను వ్యతిరేకించినందుకూ, భూస్వామి మామిడితోటలో పండు కోసినందుకు దళిత యువకులకు ఈ ఆధిపత్య శక్తుల ప్రోత్సాహంతో పోలీసు అధికారులు గుండ్లు కొట్టించి అవమానపరిచారు. అంబేద్కర్ విగ్రహ ప్రతిష్ఠను వ్యతిరేకించడం, అంబేద్కర్ విగ్రహాలను కూల్చడం వంటి విధ్వంసక చర్యలకు పాల్పడుతున్న పీడక కుల దురహంకారులనూ, వారికి మద్దతుగా వస్తున్న అరాచక మూకలను ఎదుర్కొంటున్నందుకు దళితులపై దాడులు కొనసాగిస్తున్నారు. ఈ మధ్య కాలంలో దళితులు పవిత్రంగా భావించే సంత్ రవిదాసు మందిరాన్ని హిందూ మతోన్మాదులు కూల్చి వేసారు. ఇలా దేశవ్యాపితంగా దళితులపై దాడులు మోదీ అధికారంలోకి వచ్చిన తర్వాత మరింతగా పెరుగుతూ వచ్చాయి. అయితే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలలో అధికారంలో ఉన్న బ్రాహ్మణీయ హిందుత్వ పాలక వర్గాలు తమ పాలనలో దళితులపై, మైనారిటీలపై, మహిళలపై నేరాల సంఖ్య తగ్గుముఖం పట్టిందని పార్లమెంటులో, అసెంబ్లీలలో బుకాయిస్తున్నారు.

ఈ పరిస్థితుల్లో దళితుల ఉద్ధరణకే ఆవిర్భవించామని చెప్పుకునే బీఎస్‌పీ లాంటి పాలకవర్గ అనుకూల పార్టీలు, అనేక అవకాశవాద సంస్థలు పుట్టుకు వస్తున్నాయి. దళిత ప్రజల్లో పెరుగుతున్న చైతన్యాన్ని, తమ హక్కుల కోసం పోరాడాలనే దృఢనిశ్చయాన్ని ఉపయోగించుకొని వారిని

సంస్కరణవాద మార్గంలోకి మళ్లించడానికి అవి ప్రయత్నిస్తున్నాయి. ఎప్పుడూలేని విధంగా కాంగ్రెసు–బీజేపీలు కుల మహాసభలు నిర్వహించి తమ పట్టులో వారిని ఉంచుకొనడానికి ప్రయత్నిస్తున్నాయి. ఇలాంటి పాలకవర్గ అనుకూల అవకాశవాద నాయకత్వాన్ని దళిత, వెనకబడిన కులాల ప్రజల నుంచి ఒంటరి చేయకుండా సామాజిక విప్లవాన్ని జయప్రదం చేయలేము. అందుకు మనం కుల నిర్మూలనా పోరాటాన్ని వర్గపోరాటంలో భాగం చేయడం ద్వారానే సాంఘిక అణచివేత నుండే కాక ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక అణచివేతల నుండి కూడా పీడిత ప్రజలను సరైన దిశలో విముక్తి మార్గంలో నడిపించగలుగుతాము.

వర్గపోరాటం తీవ్రంగా ఉన్న ప్రాంతాల్లో కూడా కుల సమస్య పరిష్కారానికి నిర్దిష్ట కార్యక్రమాన్ని రూపొందించుకొని ప్రత్యేకంగా కేంద్రీకరించి పనిచేయాల్సిన అవసరం ఉంది. మనం బలహీనంగా ఉండి, వర్గపోరాటం ప్రాథమిక స్థాయిలో ఉన్న ప్రాంతాలలో దళితులూ, ఇతర పీడితకులాల ప్రజలు ప్రత్యేక డిమాండ్లపై కొనసాగించే ఉద్యమాలను బలపరచాలి, వీటిలో మనం చురుగ్గా పాల్గొనాలి. ఈ ఉద్యమాలకు మనం నాయకత్వం వహించి, సమాజంలోని అన్ని పీడిత సెక్షన్ల ప్రజలను కలుపుకువచ్చేలా వీటిని క్రమంగా విస్తరింపజేయాల్సి ఉంది.

కుల నిర్మూలనా పోరాటాన్ని వర్గపోరాటంలో అంతర్భాగంగా కొనసాగించాలంటే 'కుల సమస్య సారాంశంలో ఈనాడు వర్గ సమస్యే' అని సైద్ధాంతికంగా గుర్తిస్తే సరిపోదనీ, ఈ పోరాటాన్ని నూతన ప్రజాస్వామిక విప్లవంలో భాగంగా కొనసాగించడానికి తగిన వివిధ నిర్మాణాలు కూడా అవసరముంటాయని గుర్తించాం.

అలాగే తమ వర్గ–కులాధిపత్యాన్ని కొనసాగించటానికి పీడక కులాల వారు ఏనాడో నిర్మించుకున్న సంస్థలను మనం వ్యతిరేకిస్తున్నాం.

ఇప్పటికే అసంఖ్యాకంగా ఏర్పడి వ్యాపిస్తోన్న కుల సంఘాలు కులద్వేషాన్నీ, అపోహలనూ (prejudices) పెంపొందించడానికీ, ప్రజల ఆలోచనలను పక్కదారి పట్టించడానికి తోడ్పడుతున్నాయి. ఇలాంటి కులసంఘాల నాయకత్వం పట్ల జాగరూకతతో ఉండాలని మనం ప్రజలకు చెబుతున్నాం.

దళితులు–పీడిత కులాలు తమ హక్కుల రక్షణ కొరకు నిర్మించుకున్న సంఘాలు ఉన్నాయి. వీటిలో కొన్ని ప్రజాస్వామికమైనప్పటికీ వీటికి సరైన లక్ష్యం లేకపోవడం వలన తరచుగా పాలకవర్గ ప్రలోభాలకు కొట్టుకుపోతున్నాయి. వీటికి సరైన దిశను అందించడానికి మనం ప్రయత్నిస్తున్నాం.

నూతన ప్రజాస్వామిక విప్లవంలో భాగంగా కుల పీడనకు వ్యతిరేకంగా, కుల వ్యవస్థను నిర్మూలించే లక్ష్యంతో పోరాడే 'కుల నిర్మూలనా సంఘాల'ను విస్తరింపజేస్తూ బలమైన ఉద్యమాలను అభివృద్ధి చేయాల్సిన అవసరం ఈనాడు ఎంతో ఉందని మనం గుర్తిస్తున్నాం.

ఈ లక్ష్యాన్ని సాధించటానికి పీడిత కులాలనన్నిటినీ (ఎస్.సీ., బీ.సీ.) ఐక్యం చేయడానికి కృషి చేస్తూనే కులవివక్షను పాటించని, వ్యతిరేకించే పీడక కులాల సెక్షన్స్‌తో, వ్యక్తులతో మైత్రి కొనసాగించడంతో పాటు వీరిలోని పురోగామి శక్తులను కులనిర్మూలన ఉద్యమంలో క్రియాశీలంగా కదిలించటానికి మనం తీవ్రంగా కృషి చేయాల్సి ఉంది. ఈ విషయంలో జరిగిన లోపాన్ని వెంటనే సరిదిద్దుకోవాలని నిర్ణయించుకున్నాం.

కులవ్యవస్థను కాపాడుతున్న భూస్వామ్య విధానానికీ, సామ్రాజ్యవాదానికీ వ్యతిరేకంగా పోరాడుతూనే భూస్వామ్యానికి, కులవ్యవస్థకు పట్టుగొమ్మలైన భూస్వామ్య శక్తులను కులనిర్మూలనా ఉద్యమానికి ప్రధాన శత్రువులుగా ఎంచుకొని బ్రాహ్మణీయ హిందూ మతోన్మాద, కులదురహంకార శక్తులకు వ్యతిరేకంగా పోరాటాన్ని తీవ్రతరం చేయడానికి మన కృషి ఇనుమడింపజేయాల్సిన అవసరం ఉంది.

భూస్వామ్య విధానానికీ, సామ్రాజ్యవాదానికీ వ్యతిరేకంగా పోరాడుతున్న అన్ని సంస్థలతో, వ్యక్తులతో కులనిర్మూలనా ఉద్యమం సమైక్యతను నెలకొల్పుకోవడానికి కృషి చేస్తున్నది.

కుల నిర్మూలనా భావాలను అన్ని రూపాలలోనూ ప్రచారం చేయడానికీ, కులాల పేరుతో జరుగుతున్న సాంఘిక అణచివేతను ప్రతిఘటించడానికీ, పీడిత కులాల సాంఘిక, సాంస్కృతిక స్థాయిని పెంచడానికి కృషిచేస్తున్నాం.

అంటరానితనాన్ని నిర్మూలించడానికి కులాంతర వివాహాలను, సహపంక్తి భోజనాలను, ఉమ్మడి చేతబావుల. కుళాయిల నిర్మాణాన్ని, ఉమ్మడి నివాసాల కోసం ప్రభుత్వాల నుండి ఇళ్ల ప్లాట్ల కేటాయింపును ప్రోత్సహించడం లాంటి కార్యకలాపాలను సామాజిక ఉద్యమాలుగా పెంపొందించాల్సిన అవసరం ఉంది.

పీడిత కులాల విద్యా, సాంస్కృతిక స్థాయిని పెంచటానికి ప్రత్యేక ఎడ్యుకేషనల్ కార్యక్రమాలు, రాత్రి పాఠశాలలు, సాంస్కృతిక కార్యకలాపాలను నిర్వహించడంతో పాటు శ్రమ ఔన్నత్యాన్ని ఎత్తిపడుతూ, హిందూ మతానికి సంబంధించిన దుర్మార్గమైన కులవ్యవస్థని బహిర్గతపరుస్తూ సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించడాన్ని సామాజిక ఉద్యమాలుగా కొనసాగించాల్సిన అవసరం ఉంది.

వర్గపోరాటం తీవ్రంగా కొనసాగుతున్న గెరిల్లాజోన్ ప్రాంతాలలో కూడా ఇలాంటి సంఘాలను నిర్మించి ప్రజల మధ్య కుల అంతరాలను తొలగించటానికి ప్రయత్నపూర్వకంగా కృషి చేయాలి. ఇప్పటికే ఏర్పడిఉన్న విద్యార్థి, యువజన, రైతుకూలీ, మహిళా, సాహితీ సాంస్కృతిక తదితర ప్రజాసంఘాలన్నీ తమ మౌలిక కార్యక్రమంలో ఒక ముఖ్యమైన అంశంగా కులనిర్మూలనకు సంబంధించిన ప్రత్యేక కార్యక్రమం చేర్చుకోవాలి. తమ కార్యాచరణను, అంటే రాజకీయ

సమీకరణను, సంఘటితీకరణను, ఉద్యమ నిర్మాణాన్ని, ఐక్యసంఘటనా కృషిని ఈ అవగాహనతో కొనసాగించాలి. గ్రామీణ, పట్టణ ప్రాంతాలలో సాంస్కృతిక సంస్థలు కులసమస్యపై ప్రత్యేక కార్యక్రమాలను రూపొందించుకొని సాంస్కృతిక టీముల ద్వారా ప్రచారం చేయాలి. కుల నిర్మూలనకు మన పార్టీ రూపొందించుకున్న కార్యక్రమాన్ని ప్రభావవంతంగా కొనసాగించాల్సిన అవసరం నేడెంతో ఉంది.

## 7వ అధ్యాయం

## ప్రత్యేక కార్యక్రమం

నేటి భారతదేశంలో కులవ్యవస్థను కాపాడుతున్నటువంటి ఫ్యూడలిజాన్ని, దళారీ నిరంకుశ పెట్టుబడిదారీ విధానాన్ని, సామ్రాజ్యవాదాన్ని కూలదోసి నూతన ప్రజాస్వామిక విప్లవాన్ని విజయవంతం చేయడం ద్వారా కులవ్యవస్థ సమూల నిర్మూలనకు కావలసిన అనుకూలమైన భౌతిక పరిస్థితిని సృష్టించే లక్ష్యంతో సకల రంగాలలో కులవ్యతిరేక పోరాటం కొనసాగించాలి. ఈ లక్ష్య సాధన కోసం ఈ క్రింది వ్యూహాత్మక, ఎత్తుగడల కర్తవ్యాలు చేపట్టాలి.

### వ్యూహాత్మక కర్తవ్యాలు:

1. మన దేశంలో అశేష ప్రజారాశులను వెనుకబడిన ఉత్పత్తి సంబంధాలకు కట్టిపడవేసి ఉంచడం ద్వారా ఉత్పత్తి శక్తుల అభివృద్ధికి సంకెలుగా ఉన్న; మెజారిటీ ప్రజల దోపిడీ పీడనలకూ, దారిద్ర్యానికీ దయనీయ స్థితికీ, అమానవీయమైన అంటరానితనానికీ కులపీడనకూ మూలభూతంగా ఉన్న; దేశ నిజమైన స్వాతంత్ర్యానికీ ప్రజాస్వామ్యానికీ సార్వభౌమత్వానికీ ఆర్థిక రాజకీయ సాంస్కృతిక పురోభివృద్ధికీ పెను ఆటంకంగా ఉన్న కుల ఆధారిత భూస్వామ్య విధానంతో పాటు దళారీ నిరంకుశ పెట్టుబడిదారీ విధానాన్నీ, సామ్రాజ్యవాదాన్ని కూలదోయడానికి కార్మికవర్గ నాయకత్వంలో నాలుగు విప్లవకర వర్గాల ప్రజలను, దళిత-ఆదివాసీ-మతమైనారిటీ-పీడిత జాతుల ప్రజలను, మహిళలను కదిలించి నూతన ప్రజాస్వామిక విప్లవం విజయవంతం చేయడం ద్వారా కులవ్యవస్థ పునాదులను పెకిలించివేసి శాశ్వితంగా కుల వ్యవస్థ నిర్మూలనకు కావలసిన భౌతిక పరిస్థితులను సృష్టించాలి.

2. కార్మికవర్గ మహత్తర సిద్ధాంతమైన మార్క్సిజం-లెనినిజం-మావోయిజం (ఎంఎల్ఎం) మార్గదర్శకత్వాన కార్మికవర్గ పార్టీ నూతన ప్రజాస్వామిక విప్లవ కాలంలో బ్రాహ్మణీయ కులాధారిత భూస్వామ్య భావజాలాన్నీ సంస్కృతినీ, వాటి వివిధ వ్యక్తీకరణలనూ ప్రధానంగా టార్గెట్ చేసి పోరాడుతూనే సామ్రాజ్యవాద భావజాలానికీ, సంస్కృతికీ, వాటి వివిధ వ్యక్తీకరణలకూ వ్యతిరేకంగానూ పట్టువిడవకుండా పోరాడాలి; సాంస్కృతిక రంగంలో విప్లవాన్ని ప్రభావవంతంగా కొనసాగించడంలో భాగంగా స్వీయాత్మక శక్తుల-ప్రజల ప్రాపంచిక దృక్పథాన్ని శాస్త్రీయంగా మలచడానికి గతితార్కిక

చారిత్రిక భౌతికవాద సిద్ధాంతాన్ని, ప్రజాస్వామిక భావాలను, సోషలిస్టు భావజాలాన్నీ, నూతన ప్రజాస్వామిక రాజకీయాలను, నూతన ప్రజాస్వామిక సంస్కృతిని విస్తృతంగా ప్రజల ముందుకు తేవడం ద్వారా స్వీయాత్మక శక్తులను, అశేష పీడిత ప్రజారాశులను నూతన ప్రజాస్వామిక విప్లవంలో చైతన్యయుతంగా, విస్తృతంగా సమీకరించాలి; రాజకీయ రంగంలో కొనసాగే విప్లవంతో పాటే సాంస్కృతిక రంగంలో విప్లవాన్ని కొనసాగిస్తూ కాలంచెల్లిన అభివృద్ధి నిరోధక శక్తులకు ప్రాతినిధ్యం వహించే బ్రాహ్మణవాద, కులాధిపత్య, భూస్వామ్య, సామ్రాజ్యవాద సంస్కృతులను తుడిచిపెట్టి అంటరానితనానికి, కులపీడనకు తావులేని నిజమైన ప్రజాస్వామిక, సోషలిస్టు సంస్కృతిని నెలకొల్పాలి.

3. సామ్రాజ్యవాదం, భూస్వామ్యం, దళారీ నిరంకుశ పెట్టుబడిదారీ విధానాలచే అత్యంత తీవ్రంగా వర్గ దోపిడీ పీడనలతో పాటు సామాజిక అణచివేతకు గురవుతున్నదీ; నూతన ప్రజాస్వామిక విప్లవంలో పాల్గొనేదీ; వర్గ సెక్షనల్ సంఘాలను, సంస్థలను ఏర్పరచుకునేదీ; విప్లవానికి నాయకత్వం వహించే కార్మికవర్గం చేతుల్లో అద్భుత ఆయుధాలుగా ఉండే పార్టీ, ప్రజాసైన్యం, ఐక్యసంఘటన నిర్మాణాలలో ఉండేదీ; ఈ విప్లవాన్ని విజయవంతం చేసి నూతన ప్రజాస్వామిక రాజ్యాన్ని స్థాపించుకునేదీ; ముందు జనతా ప్రజాస్వామిక నియంతృత్వం కింద సోషలిస్టు పరివర్తనను పూర్తి చేసి తదనంతరం కార్మికవర్గ నియంతృత్వం కింద నిరంతరాయ వర్గపోరాటం ద్వారా సోషలిజం, కమ్యూనిజం లక్ష్యంతో పురోగమించేదీ; ప్రధానంగా దేశ జనాభాలో అత్యధిక సంఖ్యాకులుగా ఉన్న కార్మికులు, రైతాంగం, పట్టణ మధ్యతరగతి ప్రజలే, ప్రత్యేకంగా కార్మికులు, వ్యవసాయ కూలీలు, పేదరైతులు, అర్ధశ్రామికులే. మన సామాజిక నిర్దిష్ట పరిస్థితులలో వీరిలో అత్యధికులు దళిత తదితర పీడిత సామాజిక సెక్షన్లకు చెందినవారే. ఇలాంటి పరిస్థితులలో నూతన ప్రజాస్వామిక విప్లవ ఐక్యసంఘటనలో, నూతన విప్లవకర రాజకీయాధికారంలో వారికి నిర్దిష్ట ప్రాతినిధ్యం ఉండాలి. సామాజిక విప్లవంలోని సకల రంగాలలో పీడిత వర్గాల, పీడిత సామాజిక సెక్షన్ల ప్రజల చైతన్యయుత, క్రియాశీల పాత్రను పెంపొందిస్తూ కార్మికవర్గ నాయకత్వాన్ని స్థాపించడం అనే వ్యూహాత్మక కర్తవ్యం అత్యంత కీలకమైనది. ఈ కర్తవ్యాన్ని మన పార్టీ మార్క్సిజం–లెనినిజం–మావోయిజం మార్గదర్శకత్వంలో మన దేశ సామాజిక నిర్దిష్ట పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని వర్గపంథాను, ప్రజాపంథాను సృజనాత్మకంగా అన్వయిస్తూ పని చేయడం ద్వారా పరిపూర్తి చేయాల్సి ఉంటుంది.

4. మా–లె–మా సిద్ధాంత మార్గదర్శకత్వాన పనిచేసే మన పార్టీకి గల శాస్త్రీయమైన, స్పష్టమైన, సరైన అవగాహన ప్రకారం భారత సమాజంలో వర్గాలు ఏర్పడినప్పటి నుండి నేటివరకు గడచిన వేల సంవత్సరాల చరిత్రంతా పీడక, పీడిత వర్గాల మధ్య జరిగిన వర్గపోరాట చరిత్రే. భారతదేశంలో మొట్టమొదటి వర్ణాలుగా వర్గాలు ఏర్పడినప్పటి నుండి వివిధ సామాజిక దశలలో–వర్ణ వ్యవస్థ, ఫ్యూడల్ వ్యవస్థ/కులవ్యవస్థ, వలస–భూస్వామ్య/అర్ధభూస్వామ్య వ్యవస్థ, అర్ధవలస,

అర్ధభూస్వామ్య వ్యవస్థలలో జరిగిన వర్గపోరాటమే సామాజికాభివృద్ధికి ప్రధాన కారణం. ఈ సమాజాలన్నిటిలోనూ భావజాల, సామాజిక, సాంస్కృతిక, ధార్మిక, ఆర్థిక, రాజకీయ, న్యాయ తదితర రంగాలలో నిరంతరాయంగా వర్గపోరాటం కొనసాగింది. పీడితులెపుడూ పీడకులకు వ్యతిరేకంగా పోరాడకుండా లేరు. ఈ పోరాటం హింసాయుతంగానో హింసేతరంగానో, తీవ్ర స్థాయిలోనో, మంద్రస్థాయిలోనో రూపాలు, తీవ్రత ఏవైనప్పటికీ నిరంతరాయంగా కొనసాగుతూనే వచ్చింది. వీటిలో పీడితులకు లభించిన జయాపజయాల సంఖ్య, స్థాయి ఏదైనప్పటికీ ఈ పోరాటం కొనసాగుతూనే ఉన్నది. పీడితులు పీడకులకు వ్యతిరేకంగా కొనసాగించిన పోరాట వారసత్వాన్నీ, పాజిటివ్ అనుభవాలన్నిటినీ మనం ఎత్తిపట్టాలి. ఇందులో భాగంగా వర్గపీడనకు, సామాజిక పీడనకు వ్యతిరేకంగా జరిగిన ఉద్యమాల పాజిటివ్ అంశాలన్నిటినీ ఎత్తిపట్టాలి, వీటి పరిమితులను ఎత్తిచూపాలి, వీటి నెగెటివ్ అంశాలను తిరస్కరించాలి. వాటి నుండి గుణపాఠాలు తీసుకోవాలి. పీడితులు జరిపిన ఈ పోరాటాల కొనసాగింపుగా, అభివృద్ధిగా నేడు మన పార్టీ నాయకత్వంలో వర్గపోరాటం/ప్రజాయుద్ధం కొనసాగుతున్నది. దీనిని తుది విజయం వరకు నడిపి వర్గపీడన నుండి, కుల విముక్తి సహా సమస్త సామాజిక పీడనల నుండి విముక్తి సాధించాలి. దీని ద్వారా దేశ జనాభాలో 90 శాతానికి పైగా ఉన్న పీడిత వర్గాల, పీడిత సామాజిక సెక్షన్ల ప్రజలు విముక్తమవుతారు.

## ఎత్తుగడల కర్తవ్యాలు:

వ్యూహాత్మక కర్తవ్యాలను సఫలం చేయడానికి ఈ కింది సాధారణ ఎత్తుగడల కర్తవ్యాలు రూపొందించుకుందాం. వీటిని అమలు చేసేటప్పుడు మన దేశ అసమానాభివృద్ధినీ, వైవిధ్యాలను దృష్టిలో పెట్టుకొని ఇక్కడ ఇచ్చిన ఎత్తుగడల కర్తవ్యాలతోపాటు, ఇతర పోరాట నిర్మాణ రూపాలను సృజనాత్మకంగా చేపట్టాలి.

1. కులనిర్మూలనా లక్ష్యంతో కులపీడనకు వ్యతిరేకంగా మన పార్టీ నాయకత్వంలోని వివిధ వర్గ సంఘాలు, సెక్షనల్ సంఘాలు దళిత తదితర పీడిత కులాల, పీడిత వర్గాల, సెక్షన్ల ప్రజలను రాజకీయంగా సమీకరించి ఉద్యమాలు నిర్మించాలి. నేటి ఉద్యమ విస్తృతిని, ప్రభావాన్ని దృష్టిలో పెట్టుకున్నప్పుడు ఈ సమస్యపై కొనసాగే పోరాటాలను ఉన్నత స్థాయికి అభివృద్ధి చేయటానికి కృషి చేయవలసి ఉంటుంది. ఈ పోరాటాలను వ్యవసాయ విప్లవ పోరాటాలతోనూ, సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటాలతోనూ సమన్వయించి ప్రభావవంతంగా నడపాలి. అలాగే మన వర్గసంఘాలు ఈ సమస్యపై పనిచేసే వివిధ ప్రత్యేక సంస్థలతోనూ, ఐక్యసంఘటన వేదికలతోనూ సమన్వయించి తమ కార్యకలాపాలు కొనసాగించాలి.

ఇదే సమస్యపై దళిత తదితర పీడిత కులాల ప్రజలనూ, కులపీడనను వ్యతిరేకించే ఇతర కులాలలోని ప్రజాస్వామిక శక్తులను రాజకీయంగా సమీకరిస్తూ తగిన ప్రత్యేక పోరాట, నిర్మాణ

రూపాలను రూపొందించుకోవాలి. దేశ సామాజిక, విప్లవోద్యమ పరిస్థితులలోని అసమానాభివృద్ధిని దృష్టిలో పెట్టుకునీ, ప్రజల రాజకీయ చైతన్యంపై, పోరాట సంసిద్ధతపై ఆధారపడి తగిన ప్రత్యేక నిర్మాణాలను ఏర్పరచుకోవడం ద్వారా పోరాట క్రమంలో తమ స్వీయానుభవంతో ప్రజలు మరింత ఉన్నత పోరాట, నిర్మాణ రూపాలను చేపట్టగలుగుతారు.

ఈ సమస్యపై ఐక్యకార్యాచరణలో కలిసి వచ్చే ఎం-ఎల్ పార్టీలతో, వారి ప్రజాసంఘాలతో, ఇతర ప్రజాస్వామిక సంస్థలతో, వ్యక్తులతో ఎత్తుగడలపర ఐక్యసంఘటనా వేదికలను నిర్మించాలి. అలాగే కొన్ని సమయాల్లో సమస్య ప్రాతిపదికన కలిసివచ్చే రివిజనిస్టు పార్టీలతో, వాటి ప్రజాసంఘాలతో, వ్యక్తులతో కలిసి పనిచేయాలి. వీటన్నింటి ద్వారా దళిత తదితర పీడిత కులాల ప్రజలను, కులపీడనను వ్యతిరేకించే ఇతర కులాలలోని ప్రజాస్వామిక శక్తులను రాజకీయంగా సమీకరించి దేశంలో విశాలమైన, బలమైన ఉద్యమాన్ని నిర్మించాలి. ఈ కార్యకలాపాలన్నింటి నిర్వహణ మన లక్ష్యం కులవ్యవస్థను రద్దు చేయడమే.

ఈ క్రమంలో ఉద్యమ నిర్మాణం విస్తృతం, పటిష్టం కావడమే గాకుండా దీని నాయకత్వం కూడా సమర్థవంతంగా తయారవుతుంది. ఈ ఉద్యమ శక్తులను, ప్రత్యేకించి పీడిత కులాల నుంచి వచ్చిన శక్తులను సైద్ధాంతికంగా, రాజకీయంగా మలచి మన పార్టీలోకి తీసుకొనిరావడం ద్వారా మన పార్టీ యొక్క ప్రజాస్వభావం పెంపొందడమే గాకుండా వర్గపునాది, సామాజిక పునాది బలోపేతం అవుతుంది.

2. బ్రాహ్మణీయ కుల ఆధారిత భూస్వామ్యానికి వ్యతిరేకంగా భావజాల రంగంలోనే గాకుండా రాజకీయ రంగంలోనూ పార్టీ వర్గపోరాటాన్ని తీవ్రతరం చేయాలి. ముఖ్యంగా ప్రభుత్వాలు, బ్రాహ్మణవాద సంస్థలు, హిందూ మత దురహంకార సంస్థలు బ్రాహ్మణవాద-పీడక కుల స్వభావంతో కూడిన భారత రాజ్యాంగాన్నీ, రాజ్యాంగ యంత్రాంగాన్ని వివిధ రకాలుగా వినియోగించుకొని చేపట్టే భావజాల, మత, సాంస్కృతిక ప్రచారాన్ని, కార్యక్రమాలను ప్రజలలో ఎండగట్టాలి, ఎదుర్కొవాలి, రాజ్యాంగపు-రాజ్యాంగ యంత్రపు హిందూమత, పీడక కుల స్వభావాన్ని బహిర్గతం చేయాలి.

3. పార్టీ యూనిట్లు సామాజిక సంబంధాలపై పరిశోధనా కార్యక్రమం చేపట్టినప్పుడు, నేటికీ పునాదిలో, ఉపరితలంలో వివిధ రూపాలలో ఉన్న కులాన్ని కూడ దృష్టిలో వుంచుకొని వర్గ వైరుధ్యాలను అధ్యయనం చేయాలి. అలాగే కుల వైరుధ్యాల వివిధ వ్యక్తీకరణలను నిర్దిష్టంగా అధ్యయనం చేయాలి. నిర్దిష్ట అధ్యయన క్రోడీకరణల ప్రాతిపదికగా వ్యవసాయక విప్లవ కార్యక్రమానికి కుల నిర్మూలనా కార్యక్రమాన్ని జోడించి అమలు చేయాలి. ఏక కాలంలో తీసుకునే ఈ రెండు కార్యక్రమాలు ఒకదానిపై మరొకటి సకారాత్మక ప్రభావాన్ని వేస్తాయి.

4. పార్టీలో చేరే నూతన శక్తులను సైద్ధాంతికంగా, రాజకీయంగా, నిర్మాణపరంగా, సాంస్కృతికంగా ప్రోలిటేరియనైజు చేయడానికీ, పాత శక్తులలో తలెత్తే కార్మికవర్గేతర ధోరణులను

ప్రక్షాళన చేసి ప్రోలిటేరియనైజు చేయడానికీ, విప్లవానికి సమర్థవంతంగా నాయకత్వం వహించడానికి తగినట్లు పార్టీ సైద్ధాంతిక రాజకీయ స్థాయిని, నిర్మాణ పటిష్టతను పెంపొందించాలి. ఇందుకోసం నిరంతరాయంగా కొనసాగించే కృషిలో భాగంగా, ఇందుకు చేపట్టే క్యాంపెయిన్లలో భాగంగా, పార్టీలోనూ, విప్లవోద్యమంలోని వివిధ రంగాలలోనూ ఉన్న కుల భావజాల ప్రభావంపై కూడా చర్చించాలి. ఈ చర్చల్లో కుల భావజాల ప్రభావ నిర్దిష్ట సైద్ధాంతిక, సాంస్కృతిక, రాజకీయ, నిర్మాణ వ్యక్తీకరణలను, అవి కలిగించే నెగెటివ్ ప్రభావాన్ని-నష్టాన్ని గుర్తించి వాటిని సరిదిద్దడానికి స్వయంవిమర్శ-విమర్శ పద్ధతిని అనుసరించాలి. దీనికి తోడ్పడడానికి ఈ సమస్యపై అధ్యయనం, ఎడ్యుకేషన్ కొనసాగించాలి. ఈ సమస్యపై తలెత్తే తప్పుడు ధోరణుల తీవ్రతనీ, విస్తృతిని దృష్టిలో పెట్టుకొని, సైద్ధాంతిక రాజకీయ పోరాటం కొనసాగించాలి. ఈ పద్ధతి యావత్తు పార్టీ (అన్ని రంగాలలోని పార్టీ యూనిట్ల)లోనూ నిరంతరం అమలు చేయాలి. నేటి మన అర్ధవలస, అర్ధఫ్యూడల్ సమాజాన్ని నూతన ప్రజాస్వామిక సమాజంగా మార్చే తక్షణ లక్ష్యంతో, తదనంతరం సోషలిస్టు సమాజంగా, కమ్యూనిస్టు సమాజంగా మార్చే అంతిమ లక్ష్యంతో సాగుతున్న సామాజిక విప్లవానికి నాయకత్వం వహించే పార్టీ ఈ విషయంలో కూడా ప్రజల ముందు పీఠీన నిలవాల్సిన అవసరం ఉంది.

5. ప్రజాస్వామిక ఉద్యమంలో భాగమైన అస్థిత్వ ఉద్యమాలను సమర్థిస్తూనే వీటిపై పడే పోస్ట్‌మోడర్నిస్టు సిద్ధాంత ప్రభావాన్ని సిద్ధాంతపరంగా ఎత్తిచూపుతూ ఇవి సరైన దిశలో సాగడానికీ, వీటిని విప్లవోద్యమంలో భాగం చేయడానికి కృషి చేయాలి. వివిధ పీడిత సామాజిక సెక్షన్లు, వెనుకబడిన ప్రాంతాల ప్రజలు తమ ప్రజాస్వామిక డిమాండ్ల కొరకు పోరాడుతూనే, తమ కన్నా సాంఘికంగా, ఆర్థికంగా, రాజకీయంగా వెనుకబడి పోయిన పీడిత సామాజిక సెక్షన్ల, ప్రజల హక్కులను గౌరవించడమే కాకుండా వారి పోరాటానికి మద్దతు తెలిపే ప్రజాస్వామిక దృక్పథాన్ని అలవర్చుకునే విధంగా వారిని ఎడ్యుకేట్ చేయడానికి కృషి చేయాలి. అప్పుడే మనం సాధించాల్సిన ప్రజాస్వామ్యం, సామాజిక న్యాయం దిశగా విశాల పీడిత ప్రజానీకం మధ్య ఐక్యత ఏర్పడుతుంది.

6. బ్రాహ్మణీయ హిందుత్వ ఫాసిజానికి వ్యతిరేకంగా విశాల ప్రాతిపదికన ఎత్తుగడలపర ఐక్యసంఘటన నిర్మించాలి. కుల నిర్మూలనా సంఘాలతోనూ, ప్రజాస్వామిక స్వభావం కలిగిన వివిధ దళిత, వెనుకబడిన కులాల, ఆదివాసీ, మత మైనారిటీ, పీడిత జాతుల సంస్థలతోనూ, మహిళా సంఘాలతోనూ, లౌకికవాద శక్తులతోనూ, కలిసి వచ్చే ఎం-ఎల్ శక్తులతోనూ దీన్ని నిర్మించాలి. బ్రాహ్మణీయ హిందుత్వ ఫాసిజానికి వ్యతిరేకంగా దేశంలో కొనసాగుతున్న ఉద్యమానికి ఒక సరైన దిశనిచ్చి రాజకీయంగా సంఘటితపరచాలి. కలసి వచ్చే రివిజనిస్టు పార్టీల, బూర్జువా పార్టీల ప్రజా సంఘాలతో సమస్య ప్రతిపాదికన మాత్రమే ఎత్తుగడలపరంగా ఫ్రంట్ కట్టాలి. పార్లమెంటరీ పార్టీలతో సమస్య ప్రాతిపదికపై ఫ్రంట్ కట్టేటపుడు ప్రజలలో వీరి పట్ల భ్రమలు ఏర్పడకుండా చూడాలి.

7. పీడిత ప్రజలలో ఉన్నటువంటి వెనకబాటు భావజాలాన్ని తొలగించడానికి వారికి శాస్త్రీయ భావజాలాన్ని అందించడం ద్వారా, వారిని ప్రజాస్వామిక విప్లవ రాజకీయోద్యమాలలోకి సమీకరించడం ద్వారా చైతన్యవంతులను చేయాలి. ఇందుకు మన పార్టీతో పాటు మన పార్టీ నాయకత్వంలోని వివిధ ప్రజాసంఘాలు ప్రణాళికాబద్ధంగా, నిరంతరాయంగా కృషి చేయాలి. ఇందులో విద్యార్థి యువజనుల, సాహితీ సాంస్కృతిక రంగాల పాత్ర చాలా ప్రముఖంగా ఉ ంటుంది.

కుల భావజాలానికి, అన్ని ఇతర రూపాలలోని కులతత్వ ఆలోచనలకు వ్యతిరేకంగా భావజాలపరమైన పోరాటం నడపాలి. మనుస్మృతి–వేదాలు, రామాయణ, మహాభారతాలు మొదలైన పురాణాలలో, ఉపనిషత్తులలో గల కులతత్వ విద్వేష భావజాలాన్ని, ఎండగట్టాలి. ఉపరితలంలో విప్లవాన్ని కొనసాగించడంలో భాగంగా బ్రాహ్మణవాదాన్నీ, కులతత్వాన్నీ భావజాలపరంగా ఎదుర్కోవడంపై కేంద్రీకరించి పనిచేయాలి.

పాలకవర్గాలు, ప్రత్యేకంగా బీజేపీ–సంఘ్‌పరివార్ శక్తులు నిరంతరాయంగా మాస్ మీడియాతో పాటు అన్ని రకాల ప్రచార, ప్రసార సాధనాలను, వివిధ రకాల హిందూమత ఛాందసవాద–దురహంకార సంస్థలతో పాటు వీటి అనుకూల దేశ విదేశీ సంస్థలను, వీటి అనుకూల స్వచ్ఛంద సంఘాలను–సేవా ముసుగులో ఉన్న సంస్థలను, ప్రభుత్వ యంత్రాంగాన్ని పెద్దెత్తున వినియోగించుకొని భావజాలపరంగా, సైద్ధాంతికంగా, రాజకీయంగా, సాంస్కృతికంగా ప్రజల మెదళ్లను తమ కనుకూలంగా మలచుకుంటూ తమ, సామ్రాజ్యవాదుల దోపిడీ, పీడనలను, ఆధిపత్యాన్ని మరింత తీవ్రంగా కొనసాగిస్తున్నాయి. నేడు సమాజంలో అత్యంత ప్రమాదకర స్థితిని కల్పించాయి. ఈ పరిస్థితులలో వీటన్నింటినీ క్రియాశీలంగా, ప్రభావవంతంగా ఎదుర్కోవలసిన అవసరం ఉంది. సామాజిక విప్లవాన్ని విజయవంతం చేయాలంటే పీడిత ప్రజలను సమైక్యంగా, క్రియాశీలంగా, సమరశీలంగా కదిలించడానికి వారి అభిప్రాయాలను విప్లవీకరించడం అత్యంతావశ్యకం. అందువల్ల ఈ లక్ష్య సాధనకు ఉపరితలంలో ప్రతిఘాతక విప్లవాన్ని ఎదుర్కోవడాన్ని అత్యంత ముఖ్యమైన భావజాల, సైద్ధాంతిక కర్తవ్యంగా చేపట్టాలి. ఇందుకు మన పార్టీ మీడియా, సామాజిక, సాహితీ సాంస్కృతిక, విద్యా, మేధో, యువజన రంగాల్లో ప్రత్యేకంగా కేంద్రీకరించి పనిచేయాలి, అవసరమైన పోరాట నిర్మాణ రూపాలను రూపొందించుకోవాలి.

మూఢ నమ్మకాలు, అంటరానితనం వంటి వాటికి వ్యతిరేకంగా పోరాడాలి.

కుల అస్థిత్వాన్ని సూచించే, హీనపరిచే సంకేతాలను, భాషను, కులతత్వాన్ని కలిగిన సంస్కృతిని వ్యతిరేకించాలి. ప్రజాస్వామిక దృష్టితో భాషా, సంస్కృతులలో అవసరమైన మార్పు తీసుకురావడానికి మన సాహితీ సాంస్కృతికరంగ సంస్థలు కృషి చేయాలి.

గోహత్య నిషేధాన్ని వ్యతిరేకించాలి. గోమాంసం తినడంపై నిషేధాన్ని వ్యతిరేకించాలి. పీడిత కులాలు ఆచరించే కొన్ని వృత్తులను, జంతు మాంసాలు, పక్షులు, సరీసృపాలు (పాములు లేదా పాకుడు ప్రాణులు) తినే ప్రజల సాంప్రదాయాలను హీనంగా చూడడాన్ని వ్యతిరేకించాలి.

సామాజిక వేడుకల్లో పీడిత కులాల సమాన భాగస్వామ్యం కోసం పోరాడాలి. వర్గపోరాటంలో పాల్గొనే వివిధ కులాలకు చెందిన ప్రజల మధ్య సామాజికంగా కలిసిపోయే ధోరణిని పెంచటానికి ప్రయత్నించాలి. ఆ కులాల ప్రజల మధ్య సహపంక్తి భోజనాలను ప్రోత్సహించాలి. మన ప్రజాసంస్థలు వివిధ సామాజిక, సాంస్కృతిక, రాజకీయ కార్యక్రమాల సందర్భంగా ప్రజల భాగస్వామ్యంతో సహపంక్తి భోజనాలను ఏర్పరచి, వీటినే ఒక ముఖ్యమైన ఎడ్యుకేషన్ వేదికలుగా వినియోగించుకోవడానికి కృషి చేయాలి.

ప్రజాసంఘాలలోని కార్యకర్తలలో కులపరమైన విశ్వాసాలను, ఆలోచనలను వ్యతిరేకించాలి, వీటిని తొలగించటానికి ఎడ్యుకేట్ చేయాలి.

పీడక కులాలలోని పేద ప్రజలలో, తాము తమ కులాలలోని ధనవంతులతో సామాజికంగా సమానమన్న తప్పుడు చైతన్యాన్ని, భ్రమల్ని పోగొట్టాలి.

8. రాజ్య వ్యతిరేక పోరాటాలలో పీడిత కులాల ప్రజలను విస్తృతంగా సమరశీలంగా సమీకరించాలి. ఈ పోరాటాలకు వివిధ పీడిత వర్గాల, పీడిత సెక్షన్ల ప్రజల మద్దతును కూడగట్టడానికి కృషి చేయాలి. అలాగే ఇతర పీడిత వర్గాల, పీడిత సెక్షన్ల ప్రజల పోరాటాలకు పీడిత కులాల ప్రజలు మద్దతుగా నిలిచేలా కృషి చేయాలి.

కులవ్యవస్థ యధాతథ స్థితిని కాపాడటానికి తోడ్పడుతున్న కులపరమైన వేర్పాటుపై ఆధారపడిన గృహ పథకాలను అమలు చేస్తున్న ప్రభుత్వాల ఆధిపత్య కుల అనుకూల ఉద్దేశ్యాలను బహిర్గతపరచాలి.

కులాంతర, మతాంతర వివాహాలకు మద్దతు, ప్రోత్సాహం అందించాలి. కులాంతర, మతాంతర వివాహాలు చేసుకున్న వారి పిల్లలు తల్లిదండ్రులలో ఎవరికి లభించే సదుపాయాలనైనా పొందటానికి అర్హులవుతారని చెప్పాలి. ఈ విషయంలో అన్ని ప్రజా ఉద్యమ సంస్థల కార్యకర్తలు ఆచరణలో ఆదర్శవంతంగా ఉండాలి. కులాంతర, మతాంతర వివాహాలపై అన్ని ప్రజా ఉద్యమ సంస్థల నాయకత్వం తన సంబంధిత సంస్థలలో, ప్రజలలో క్యాంపెయిన్లు కూడా నిర్వహించాలి.

రిజర్వేషన్ల విధాన సక్రమ అమలు కోసం పోరాడాలి. రిజర్వేషన్లను ఎత్తివేయాలనే సంఘ్‌పరివార్ ఎజెండాకనుగుణంగా మోడీ నాయకత్వంలోని ఎన్‌డిఏ ప్రభుత్వం రిజర్వేషన్లను నీరుగార్చడానికి చేస్తున్న ప్రయత్నాలను తిప్పికొట్టాలి. అలాగే ఇతర కులాలలోని పేదవారి పిల్లలకు ప్రభుత్వం ఉచిత విద్యనందించడం కోసం పోరాడాలి. ప్రభుత్వ విద్యను కార్పొరేటీకరిస్తూ, ప్రభుత్వ

రంగ సంస్థలను ప్రైవేటీకరిస్తూ రిజర్వేషన్లను నీరుగారుస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలకు వ్యతిరేకంగా ఎస్‌సి, బిసి, ఎస్‌టి ప్రజలతో పాటు ఇతర కులాల పేద ప్రజలను, ప్రత్యేకంగా విద్యార్థి యువజనులను, నిరుద్యోగులను, ఉపాధ్యాయులను, కార్మిక సంఘాలను, ఉద్యోగులను, ప్రజాస్వామిక విద్యావేత్తలను కదిలించి పోరాటాలు నిర్వహించాలి. విద్య కాషాయికరణకు వ్యతిరేకంగా పోరాడాలి. పాఠ్యాంశాల నుంచి దళిత వ్యతిరేక, కులతత్వ భావజాలాన్ని తొలగించాలనీ, పాఠ్యాంశాలలో ఆత్మగౌరవ ఉద్యమాలను, కుల వ్యతిరేక/నిర్మూలనా ఉద్యమాలను చేర్చాలని పోరాడాలి.

ఎస్.సి., ఓ.బి.సి.లకు రుణాలు, సబ్సిడీలు ఇవ్వడంలో కొనసాగే పాలనాపరమైన జాప్యానికి, అవినీతికి వ్యతిరేకంగా పోరాడాలి.

గ్రామీణ ప్రాంతంలో దళితులు సాధించుకున్న హక్కులను వమ్ము చేయటానికి భూస్వాములకు మద్దతుగా ప్రభుత్వం అమలుపరచుతున్న నిర్బంధపూరిత చట్టాలకు, అణచివేత చర్యలకు వ్యతిరేకంగా పోరాడాలి.

9. ఆత్మగౌరవం కోసం దళితులు చేసే పోరాటాలను సమర్థించాలి, వాటిలో పాల్గోవాలి, వాటికి నాయకత్వాన్నందించడానికి కృషి చేయాలి. మన ఉద్యమ ప్రాంతాలలో ఈ సమస్యపై మనమే ఉద్యమాల్ని నిర్మించాలి. పరువు హత్యల పేరుతో అమానవీయంగా కొనసాగుతున్న దళిత హత్యలను, ఖాప్ పంచాయితీలను వ్యతిరేకిస్తూ పోరాడాలి.

10. కుల నిర్మూలనా లక్ష్యంతో, అంటరానితనానికీ, కులపీడనకు, వివక్షతకు వ్యతిరేకంగా, పీడిత కులాల పైన జరిగే ఊచకోతకు, అత్యాచారాలకు, అవమానాలకు, దౌర్జన్యాలకు, అణచివేతకు వ్యతిరేకంగా కులనిర్మూలనా సంఘాలు, ఇతర ప్రజాసంఘాలు పీడితులకు లీగల్ ఎయిడ్ నందించాలి, వారికి అండగా ఉండి నైతిక, ఆర్థిక, పాదార్థిక మద్దతునందించాలి, వారికండగా సంఘీభావ ఉద్యమాలు నిర్మించాలి. ఆచరణ క్రమంలో కులపీడనకు వ్యతిరేకంగా సృజనాత్మక పోరాట నిర్మాణ రూపాలు కూడా ముందుకు వస్తున్నాయి. మన పార్టీ వీటిని బలపరచాలి, వీటికి నిర్మాణాత్మక సలహాలందిస్తూ నాయకత్వాన్నందించడానికి కృషి చేయాలి. ఈ ఉద్యమాలను రాజకీయంగా, నిర్మాణపరంగా సంఘటితపరుస్తూ కులనిర్మూలనా లక్ష్య సాధనా దిశగా అభివృద్ధి చేయడానికి ప్రణాళికాబద్ధంగా కృషి చేయాలి.

11. పీడక కుల సంఘాల సాంఘిక, సాంస్కృతిక ఆధిపత్య స్వభావాన్ని బట్టబయలు చేయడంతో పాటు ఇవి చేపట్టే దళిత తదితర పీడిత కుల వ్యతిరేక కార్యకలాపాలకు వ్యతిరేకంగా పోరాడాలి. పీడక కుల దురహంకారాన్ని రెచ్చగొట్టే సంఘాలను తీవ్రంగా వ్యతిరేకించాలి. వీటిపై మన దాడిని ఎక్కుపెట్టాలి.

పీడిత ప్రజల వర్గ ఐక్యతను, పీడిత సామాజిక సెక్షన్ల ప్రజల ఐక్యతను నిరోధించే పీడిత కులాలలోని కులతత్వ ఛాందస నాయకత్వ శక్తులకు వ్యతిరేకంగా పోరాడాలి. పీడక కులాధిపత్యంపై మన దాడిని ఎక్కుపెడుతూనే, పీడిత కులాలలో తలెత్తే సెక్టేరియన్ ధోరణులను వ్యతిరేకించాలి.

హిందూ మతోన్మాదానికి వ్యతిరేకంగా పోరాడాలి. హిందూ ఐక్యత పేరుతో పీడక కుల ఆధిపత్యాన్నీ, కులవ్యవస్థనూ కొనసాగించే ప్రయత్నాలను వ్యతిరేకించాలి. కులపరమైన అత్యాచారాలకు, దాడులకు వ్యతిరేకంగా ప్రతిఘటించడం కోసం మనం చొరవ చేయాలి. అత్యాచారాలకు పాల్పడే వారిని శిక్షించి పీడిత ప్రజలకు న్యాయం చేయడంలో ముందుండాలి. ఇందుకోసం ఆత్మరక్షణా దళాలను నిర్మాణం చేయాలి.

ఈ ప్రత్యేక కర్తవ్యాలతో పాటు మనం ఇంతవరకు చేపట్టిన ఇతర కర్తవ్యాలను కూడా సమీక్షించుకొని గుణపాఠాలు తీసుకోవాలి. మన సామాజిక, ఉద్యమ అసమాన పరిస్థితులను దృష్టిలో పెట్టుకున్నపుడు ఈ కర్తవ్యాల సాధనకు సృజనాత్మకంగా కృషి చేస్తూనే వాటికి మాత్రమే పరిమితమై ఆలోచించకూడదు. ఇతర విషయాలలో వలెనే కర్తవ్యాల విషయంలోనూ అధిభౌతికవాద దృష్టితో ఆలోచించకూడదు. సాధారణంగా మన పార్టీ అంతర్జాతీయ, దేశీయ రాజకీయార్థిక పరిస్థితులలో కలిగే మార్పులను దృష్టిలో పెట్టుకొని, ఉద్యమంలో కలిగే మార్పులను దృష్టిలో పెట్టుకుని నిర్దిష్ట పరిస్థితుల నిర్దిష్ట విశ్లేషణపై ఆధారపడి ఉద్యమాభివృద్ధికీ–లక్ష్యసాధనకు తోడ్పడే కర్తవ్యాలను రూపొందించుకుంటుంది. మనం అశేష పీడిత ప్రజారాశులను ఎంత ఎక్కువగా, ఎంత క్రియాశీలంగా రాజకీయ రంగంలోకి సమీకరించగలుగుతామో, ఎంత ఎక్కువగా సంఘటితపరచగలుగుతామో వారి స్వీయ కార్యాచరణ నుండి అంత ఎక్కువగా సృజనాత్మక పోరాట నిర్మాణ రూపాలు ముందుకు వస్తాయి. అందుకనుగుణంగా ఎత్తుగడలపర కర్తవ్యాలలో కూడా మార్పు వస్తుంది. వాటిని నాయకత్వం మెరుగుపరచి అభివృద్ధి చేయాలి. కుల సమస్యపై కర్తవ్యాలు, ఎత్తుగడలు రూపొందించుకునే విషయంలోనూ మన యావత్తు పార్టీ యూనిట్లు, ప్రజాసంఘాలు సృజనాత్మకంగా, చొరవగా మన సాధారణ అవగాహనను దృష్టిలో పెట్టుకొని పనిచేయాలి.

## 8వ అధ్యాయం

## నూతన ప్రజాస్వామిక విప్లవానంతర కాలంలో కుల సమస్య

మన దేశంలో నూతన ప్రజాస్వామిక విప్లవానంతరం కార్మికవర్గ అగ్రగామిగా కమ్యూనిస్టు పార్టీ జనతా ప్రజాస్వామ్యానికీ, తదనంతరం సోషలిస్టు ప్రజాస్వామ్యానికీ నాయకత్వం వహిస్తుంది. ప్రపంచ సోషలిస్టు విప్లవ విజయానికి తన వంతు పాత్ర నిర్వహిస్తూ కమ్యూనిజం స్థాపనకూ, ఈ క్రమమంతటిలో కుల నిర్మూలనకూ కృషి చేస్తుంది.

1. కార్మికవర్గ నాయకత్వాన నూతన ప్రజాస్వామిక విప్లవం విజయవంతమై రాజకీయంగా అంతవరకు పాలితులుగా ఉన్న కార్మికులు, కర్షకులు, పట్టణ మధ్యతరగతి ప్రజలు, చిన్న మధ్యతరహా పెట్టుబడిదారులు, దళిత తదితర పీడిత సెక్షన్ల ప్రజలు పాలకులుగా మారి జనతా ప్రజాస్వామిక వ్యవస్థ నెలకొల్పబడడంతో భారత సమాజం ఒక ఉన్నత నూతన చారిత్రక దశలోకి ప్రవేశిస్తుంది. దీనితో పీడిత ప్రజలు అంతవరకు తమపై కొనసాగుతూ వచ్చిన వర్గపీడననూ, కుల, మత, జాతి, లింగ తదితర సామాజిక పీడన, వివక్షలను కార్మికవర్గ నాయకత్వాన రద్దుచేసే, తమ భవిష్యత్తును, దేశ భవిష్యత్తును-స్వయంగా నిర్ణయించుకొని స్వహస్తాలతో నిర్మించుకునే, తమ స్వంత కాళ్లపై నిలబడి ఒక్కొక్క అడుగు ముందుకు వేస్తూ మార్గమధ్యంలో ఎదురయ్యే ఆటంకాలను ఒక్కొక్కటిగా అధిగమిస్తూ ఎలాంటి దోపిడీ, పీడనలకు తావులేని వర్గరహిత సమాజం-సోషలిజం, కమ్యూనిజం స్థాపనా లక్ష్యంతో ముందుకు సాగే గొప్ప చారిత్రక దశలోకి ప్రవేశిస్తారు.

ఈ తక్షణ, దీర్ఘకాలిక లక్ష్యాలతో కార్మికవర్గ నాయకత్వాన జనతా ప్రజాస్వామిక రాజ్యం సామాజిక సంబంధాలలో నిర్దిష్టంగా కులం కోణంలోనూ, ఉత్పత్తి సంబంధాలలోను సమూల మార్పు తీసుకురావడానికి మన దేశ నిర్దిష్ట సామాజిక పరిస్థితులను, అంతర్జాతీయ పరిస్థితులలో కలిగే మార్పులను దృష్టిలో పెట్టుకొని ఆర్థిక, రాజకీయ, సామాజిక, సాంస్కృతిక, సైనిక, పర్యావరణ తదితర రంగాలన్నింటికీ సంబంధించిన నిర్ణయాలు తీసుకొని అమలు చేస్తుంది.

2. కార్మికవర్గ నాయకత్వంలో జనతా ప్రజాస్వామిక రాజ్యం సమాజంలో ఉత్పత్తి సంబంధాలలో మౌలికమైన మార్పును తీసుకువస్తుంది. ఈ రాజ్యం కుల అస్థిత్వానికీ, వివిధ రూపాల్లో, స్థాయిల్లో కులపీడన, వివక్ష కొనసాగడానికి మూలాధారంగా ఉన్న ప్రధాన ఉత్పత్తి సాధనాలైన భూస్వాముల చేతుల్లోని భూమినీ, వివిధ ప్రైవేటు సంస్థల చేతుల్లోని పెద్ద వ్యవసాయ ఎస్టేట్లతో పాటు దేవాలయాల చేతుల్లో పెద్దెత్తున ఉన్న భూములను దున్నేవారికే భూమి ప్రాతిపదికన పంపిణీ చేయడం ద్వారా, దేశంలో గల సామ్రాజ్యవాదుల పరిశ్రమలు, బ్యాంకులు, వ్యాపార సంస్థలు, తదితర ఆస్తులను స్వాధీనం చేసుకొని సమాజపరం చేయడం ద్వారా, దళారీ నిరంకుశ పెట్టుబడిదారుల పరిశ్రమలు, వ్యాపార సంస్థలు, బ్యాంకులు, వ్యవసాయ ఎస్టేట్‌లు తదితర ఆస్తులను స్వాధీనం చేసుకొని సమాజపరం చేయడం ద్వారా పునాదిలో, ఉత్పత్తి సంబంధాలలో కులవ్యవస్థను రద్దు చేస్తుంది, కుల ప్రాతిపదికపై జరిగే దోపిడీని రద్దు చేస్తుంది.

పై విధంగా రాజకీయ, ఆర్థిక రంగాల్లో కులాధారం ధ్వంసం కావడంతో ఉపరితలంలో కులం వ్యవస్థగా మనగలగడానికి కావలసిన భౌతిక ప్రాతిపదిక లేకుండా పోతుంది.

జనతా ప్రజాస్వామిక రాజ్యం గ్రామీణ ప్రాంతాల్లో సామాజిక, రాజకీయ, ఆర్థిక అసమానతలకు వ్యతిరేకంగా నిరంతరం ప్రజల్ని చైతన్యపరుస్తుంది. ఆచరణలో అందుకు తగిన పథకాలను రూపొందించి అమలు చేయడం ద్వారా వ్యవసాయోత్పత్తిలో గణనీయమైన అభివృద్ధి

సాధించటానికి కృషి చేస్తుంది. ప్రణాళికాబద్ధంగా వ్యవసాయాన్ని పారిశ్రామికీకరిస్తుంది. వ్యవసాయాధారిత పరిశ్రమల అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తుంది. వ్యవసాయాన్ని పునాదిగా చేసుకొని పరిశ్రమలను లీడింగ్‌గా ఉంచి, ఈ రెంటిపై ఆధారపడి ప్రణాళికాబద్ధంగా మెట్టుమెట్టుగా ఆర్థిక వ్యవస్థను అభివృద్ధి చేస్తుంది. దేశ అసమానాభివృద్ధిని దృష్టిలో పెట్టుకొని వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక కృషి చేస్తుంది. దీనివల్ల గ్రామీణ, పట్టణ పేద ప్రజల ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక అభివృద్ధిలో, సామాజిక సంబంధాలలో గొప్ప మార్పు వస్తుంది.

జనతా ప్రజాస్వామిక రాజ్యం గ్రామీణ ప్రాంతాల్లోనే గాక, పట్టణాలలో కూడా దళిత తదితర పీడిత కులాల ప్రజలు తమ జ్ఞానాన్ని, నైపుణ్యాన్ని వృద్ధి చేసుకోవడానికి అవసరమైనంతకాలం ప్రత్యేక శిక్షణను, ప్రోత్సాహాలను అందిస్తుంది.

గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయాన్ని పారిశ్రామికీకరించడం ద్వారా, చిన్న మధ్య తరహా పరిశ్రమలను స్థాపించి పారిశ్రామికోత్పత్తులను పెంపొందించడం ద్వారా కులాధారిత వృత్తుల ప్రాతిపదికను తొలగిస్తుంది. కులాధారిత వృత్తుల నుండి బయటికి వచ్చే వారికి వ్యవసాయిక, పారిశ్రామిక రంగాల్లో ఉపాధి అవకాశాలు కల్పిస్తుంది. వారికి కొత్త పద్ధతులు, టెక్నిక్‌లు నేర్పించడం ద్వారా ప్రత్యామ్నాయ ఉపాధి కల్పిస్తుంది. వ్యవసాయ ఆధార పరిశ్రమలను స్థానికంగా అభివృద్ధి చేస్తుంది. హస్తకళల పరిశ్రమలను క్రమంగా యాంత్రీకరిస్తుంది.

వీటిని క్రమబద్ధంగా త్వరితగతిన మేలైన ఫలితాలను సాధిస్తూ సమిష్టీకరణ వైపు, సోషలిస్టు పరివర్తన వైపు ముందుకు సాగడానికి ప్రజలను కదిలించి వ్యవసాయంలో సహకార ఉద్యమాలను నిర్వహిస్తుంది. వీటితో పాటు గ్రామాలు విద్య, వైద్యం, త్రాగునీరు, రవాణా, నిత్యావసర సరుకుల సరఫరా తదితర రంగాలలో స్వయం పోషకం కావటానికి వివిధ స్థాయిల్లో ప్రజా ప్రభుత్వాలు అవసరమైన సహాయాన్నందిస్తూనే సహకార ఉద్యమాలను నడుపుతాయి. వీటన్నింటిలోనూ పేద వర్గాలకు, పీడిత సామాజిక సెక్షన్లకు మొదటి ప్రాధాన్యత ఉంటుంది.

3. జనతా ప్రజాస్వామిక రాజ్యం అంటరానితనాన్ని చట్టపరంగా నిషేధిస్తుంది. అంటరానితనాన్ని పాటించడం శిక్షార్హం చేస్తుంది. కులపీడనను, వివక్షతను వ్యతిరేకిస్తుంది. దీనిని అదుపు చేయటానికి చట్టపరంగా కృషి చేస్తుంది. దీనిని సమాజం నుండి తొలగించటానికి చట్టపరంగా వివిధ రూపాలలో కృషి చేయడమే గాకుండా ప్రజలలో ప్రజాస్వామిక, సోషలిస్టు చైతన్యాన్ని పెంపొందించడానికి కృషి చేస్తుంది. అంటరానితనానికి, కులపీడనకు, వివక్షతకు వ్యతిరేకంగానే కాకుండా కులవ్యవస్థ రద్దు కోసం పనిచేసే వివిధ ప్రజాసంస్థలకు మద్దతునిస్తుంది, తోడ్పాటునందిస్తుంది.

పాత కుళ్లు వ్యవస్థకు భావజాలపరంగా, రాజకీయంగా, సాంస్కృతికంగా సేవ చేసిన పాత విద్యా విధానాన్ని రద్దు చేసి కుల, మత, జాతి, లింగ తదితర సామాజిక పీడన, వివక్షలకు

తావులేని, దేశ ప్రజల, దేశ సర్వతోముఖాభివృద్ధికీ, సామాజిక పురోగమనానికి తోడ్పడే నూతన, శాస్త్రీయ ప్రజాస్వామిక విద్యా విధానాన్ని ప్రవేశపెట్టడంతో పాటు అందరికీ ఉచిత విద్యను అందుబాటులోకి తీసుకురావడానికి అత్యంత ప్రాధాన్యతనిస్తుంది. చరిత్రను శాస్త్రీయంగా, ప్రజా దృక్పథం నుంచి భౌతిక ప్రమాణాలపై ఆధారపడి తిరగరాస్తుంది. ఈ విధంగా ఉపరితలంలో ఒక గొప్ప విప్లవాత్మక మార్పు జరుగుతుంది.

కులపరమైన అసమానతలన్నింటినీ తొలగించటానికి ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తుంది. కులపరమైన అసమానతలున్నంత కాలం విద్యారంగంలో దళిత తదితర పీడిత కులాలకు రిజర్వేషన్లనూ, ఇతర సదుపాయాలనూ కల్పిస్తుంది. అలాగే వీరికి ఉద్యోగాల్లో రిజర్వేషన్లను కల్పిస్తుంది.

ఇక్కడ రాజ్యాధికారం లౌకికమైందిగా ఉంటుంది. ప్రభుత్వ సంస్థలలో, పనులలో మతపరమైన కర్మకాండలపై, చిహ్నాలపై, పూజా పునస్కారాలపై నిషేధం ఉంటుంది. జనతా ప్రజాస్వామిక రాజ్యం ప్రజలకు జవాబుదారిగా ఉంటుంది.

కార్మికవర్గ నాయకత్వాన కార్మికులు, కర్షకులు, పట్టణ మధ్యతరగతి ప్రజలు, జాతీయ పెట్టుబడిదారులు దేశవ్యాపిత అధికారం చేపట్టిన వెంటనే మొట్టమొదట చేసే ప్రధానమైన నిర్ణయాల్లో ఒకటి - పాత బ్రాహ్మణ హిందుత్వ స్వభావం కలిగిన రాజ్యాంగయంత్రపు ప్రధాన అంగాలైన సైనిక, పారా మిలటరీ, మిలటరీ, పోలీసు, న్యాయ వ్యవస్థలను రద్దు చేసి వాటి స్థానంలో ప్రజాసేవకు అంకితమైన, ప్రజల-ప్రభుత్వ-దేశ రక్షణకు కృషి చేసే, కుల, మత, జాతి, లింగ తదితర సామాజిక పీడన, వివక్షలకు తావులేని నూతన ప్రజాస్వామ్యాన్ని సంఘటితం చేస్తూ సోషలిస్టు పరివర్తన తక్షణ లక్ష్యంగా కలిగి ఉండే నూతన రాజ్యాంగయంత్రాన్ని నిర్మించుకోవడం. నూతన రాజ్యాంగయంత్రం అధికారం నుండి కూలదోయబడిన-ప్రధాన ఉత్పత్తి సాధనాల యాజమాన్యం నుండి తొలగించబడిన దోపిడీ వర్గాల, పీడక కులాల, వారి ఏజెంట్ల కుట్రలను, కుహకాలను, తిరుగుబాట్లను అణచివేయడంతో పాటు, సామ్రాజ్యవాదుల జోక్యందారీతనాన్ని, కుట్రలను-కుహకాలను-దురాక్రమణలను తిప్పికొడుతుంది. ఇందుకు దీర్ఘకాలిక ప్రజాయుద్ధ క్రమంలో పాత రాజ్యాంగయంత్రాన్ని బ్రద్దలుకొడుతూ విముక్తి ప్రాంతాలలో నిర్మించుకున్న నూతన రాజ్యాంగయంత్రం పునాదిగా ఉపయోగపడుతుంది. అవినీతిమయమై పోయి, దోపిడీ పీడనలకు ఆలవాలంగా మారి, ప్రజలపై పెనుభారంగా ఉండే పాత పరిపాలక యంత్రాంగం లోని ఉన్నత స్థానాల్లో ఉండే వారిలో అత్యధికులు పీడక కులాల, పీడక వర్గాల వారే. వీరు పాలకవర్గాల్లో ఒక విడదీయరాని భాగం. మిగిలిన కొద్ది మంది దళిత తదితర పీడిత కులాల, పేద వర్గాల వారే అయినప్పటికీ వీరిలో ఎక్కువ మంది వర్గపీడనతో పాటు సామాజిక పీడన కొనసాగించేవారే. నూతన రాజ్యం పాత నిరంకుశాధికారుల్లో ప్రజాస్వామిక భావాలు ఉన్నవారినీ, నిజాయితీపరులను

మినహాయించి మిగతావారినందరిని తొలగిస్తుంది. వారి స్థానంలో పీడిత వర్గాల, పీడిత సామాజిక సెక్షన్ల, ప్రజాస్వామిక శక్తుల నుండి నిజాయితీ కలిగిన వారిని ఎంపిక చేసుకొని తక్షణ బాధ్యతల్లో నియమించడంతో పాటు అవసరాలకనుగుణంగా పీడిత వర్గాల, పీడిత సామాజిక సెక్షన్ల, ప్రజాస్వామిక సెక్షన్లకు చెందిన వారిని విద్యావంతం, సుశిక్షితం చేసి భర్తీ చేసుకొంటుంది. పాత పరిపాలనా యంత్రాంగంలోని కింది, మధ్యస్థాయిలోని ఉద్యోగులలోని ప్రతిఘాతక శక్తులను తొలగించి వేసి మిగతా వారిని విద్యావంతం చేసి ప్రజాస్వామికీకరించి వినియోగించుకోవటానికి కృషి చేస్తూనే ప్రధానంగా పీడిత వర్గాల, పీడిత సామాజిక సెక్షన్ల, ప్రజాస్వామిక శక్తుల నుండి భర్తీ చేసుకుంటుంది. దీనివల్ల కూడా సామాజిక ఉత్పత్తి సంబంధాలలో, ఉపరితలంలో ఒక గొప్ప మార్పు జరిగి కులవ్యవస్థకు గల సామాజిక ప్రాతిపదిక తొలగిపోతుంది.

4. జనతా ప్రజాస్వామిక రాజ్యం కులాంతర, మతాంతర వివాహాలను ప్రోత్సహిస్తుంది. ఇలాంటి వివాహాలు చేసుకున్న వారికి రక్షణ కల్పిస్తుంది, ప్రోత్సాహకాలు అందిస్తుంది. నూతన ప్రజాస్వామిక విప్లవ క్రమంలోనే పార్టీ, ప్రజాసైన్యం, ప్రజాసంఘాలు, ప్రజా ప్రభుత్వాలలో కులాంతర, మతాంతర, జాత్యంతర వివాహాలు అత్యధికంగా లేదా గణనీయంగా జరుగుతూ సమాజాన్ని ఎంతో ప్రభావితం చేస్తున్నాయి. విప్లవ విజయానంతరం కూడా ఈ రంగాల్లోని వారు కులాంతర, మతాంతర, జాత్యంతర వివాహాలు చేసుకోవడంలో ప్రజలకు ముందుపీఠీన నిలుస్తారు. సమాజంలో ఇలాంటి వివాహాలను ప్రోత్సహించటానికి సాంస్కృతిక సంస్థలు, సాంస్కృతిక బృందాలు నిరంతరాయంగా కృషి చేస్తాయి.

జనతా ప్రజాస్వామిక రాజ్యం భావజాల, సాంస్కృతిక రంగాల్లో బ్రాహ్మణీయ ఆచారాలను, పూజలను, మూఢనమ్మకాలను, అంధ విశ్వాసాలను వ్యతిరేకిస్తుంది. కుల మత పక్షపాతాలను చట్టపరంగా అరికట్టటానికి కృషి చేస్తుంది. అయితే స్వంత మత విశ్వాసాలను అనుసరించడానికి వ్యక్తిగత హక్కును కాపాడుతుంది. విద్యావ్యవస్థలో మౌలికమైన మార్పును తీసుకురావడం ద్వారా, విజ్ఞాన శాస్త్రాలను అభివృద్ధి చేయడం ద్వారా, నిరంతరాయంగా భౌతికవాదాన్ని, విజ్ఞానశాస్త్రాలను, మార్క్సిజం-లెనినిజం-మావోయిజాన్ని ప్రజలలో వ్యాపింపజేయడం ద్వారా, ప్రజల సాంస్కృతిక స్థాయిని పెంపొందించడం ద్వారా, సామాజిక జీవన రంగాలన్నిటిలో అశేష ప్రజానీకం పాత్ర పెంపొందించడం ద్వారా, కూలదోయబడిన దోపిడీవర్గాలకు, పీడక కులాలకు ప్రాతినిధ్యం వహించే ప్రతిఘాతక శక్తులు అత్యంత కుట్రపూరితంగా, మోసపూరితంగా, దుర్మార్గంగా, బాహాటంగా చేసే సైద్ధాంతిక, రాజకీయ, ఆర్థిక, భౌతిక దాడులకు, వారి భావజాలానికి, సంస్కృతికి వ్యతిరేకంగా నిరంతరాయ వర్గ పోరాటం కొనసాగించడం ద్వారా సమాజంపై నెలకొని ఉన్న బ్రాహ్మణీయ భావజాల, సంస్కృతుల ప్రభావాన్ని తొలగించడానికి కృషి చేస్తుంది. ఆచరణలో నెత్తిపై మైలను మోసే పద్ధతిని నిషేధిస్తుంది. సీవరేజ్ ట్యాంకులు, పైపు లైన్లు, కాలువలు, కటర్ సఫాయి,

ఊడ్చడంలలో ప్రత్యేకించి ఒక కులం వారినే నియమించడాన్ని నిషేధిస్తుంది. ఈ పనిలో ఉన్న దళితులకు ఇతర ఉపాధి సాధనాలను కల్పిస్తుంది. పారిశుధ్య పనుల్లో ఆధునిక టెక్నాలజీని వినియోగిస్తుంది. ఈ విధంగా ఉపరితలం, సేవారంగాలు విప్లవీకరించబడుతాయి. ఇందుకు కార్మికవర్గ పార్టీ మరియు రాజ్యంతో పాటు సాంస్కృతిక-శాస్త్రీయ-విద్య-భావజాల తదితర రంగాలలో పనిచేసే సంస్థలు నిరంతరాయంగా కృషి చేస్తాయి.

5. ముందు జనతా ప్రజాస్వామిక రాజ్యం, ఆ తర్వాత సోషలిస్టు రాజ్యం సమాజంలో మానసిక, శారీరక శ్రమల మధ్య అంతరాన్నీ, పట్టణాలకు గ్రామాలకు మధ్య అంతరాన్నీ, లింగ, కుల, జాతి అంతరాలను తొలగించటానికి ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తుంది. సోషలిస్టు సమాజంలో కార్మికవర్గ నియంతృత్వం కింద సరైన పంథా మార్గదర్శకత్వాన నిరంతరాయంగా వర్గపోరాటాన్ని కొనసాగిస్తుంది. ఉపరితలంలో విప్లవాన్ని కొనసాగిస్తూ ఉత్పత్తి సంబంధాలను విప్లవీకరిస్తుంది. సమాజంలో తగిన భౌతిక, బౌద్ధిక పరిస్థితులను సృష్టించడం ద్వారా ఈ అంతరాలు మెట్టు మెట్టుగా తగ్గించబడతాయి, చివరికి వాటి అస్తిత్వానికి గల భౌతిక ప్రాతిపదిక రద్దయిపోతుంది. ఇలాగే సకల రకాల దోపిడీ, పీడనలకు మూలకారణమైన వర్గాల ఉనికికి గల భౌతిక ప్రాతిపదిక లేకుండాపోయి వర్గాలే అంతర్ధానమై పోతాయి. మానవాళి కమ్యూనిజంలోకి అడుగిడుతుంది.

6. భారత నూతన ప్రజాస్వామిక విప్లవాన్నే గాకుండా, విప్లవానంతరం నూతన ప్రజాస్వామిక వ్యవస్థను, తదనంతరం సోషలిస్టు వ్యవస్థను కాపాడుకోవటానికి గత, నేటి, రేపటి ప్రపంచ కార్మికవర్గ విప్లవాల పాజిటివ్, నెగెటివ్ అనుభవాల నుండి ప్రత్యేకంగా చైనాలో కామ్రేడ్ మావో సారథ్యంలో జరిగిన మహత్తర కార్మికవర్గ సాంస్కృతిక విప్లవం నుండి నేర్చుకోవాలి. కార్మికవర్గ నాయకత్వంలో భారత పీడిత ప్రజలు ప్రపంచ మానవాళితో కలిసి కమ్యూనిజం సాధన కోసం ముందుకు సాగడానికి మహత్తర చైనా సాంస్కృతిక విప్లవ పాజిటివ్ అనుభవాలతో పాటు ఇతర విప్లవాల పాజిటివ్ అనుభవాలను ఎత్తిపట్టాలి. కార్మికవర్గ నియంతృత్వం కింద సరైన పంథాలో సోషలిస్టు నిర్మాణాన్ని సంఘటితం చేస్తూ పురోగమింపజేయడానికీ, ప్రపంచ సోషలిస్టు విప్లవ విజయ సాధనా లక్ష్యంతో తన వంతు క్రియాశీల భూమిక నిర్వహించటానికి అడుగడుగునా అడ్డు తగిలే పార్టీ-సైన్యం-ప్రభుత్వ నాయకత్వంలో దాగి ఉన్న ఆధునిక రివిజనిస్టు శక్తులు పెట్టుబడిదారీ పునరుద్ధరణకు చేసే కుట్రలను కుహకాలను, తిరుగుబాట్లను అణచివేయాలి, సోషలిజాన్ని నాశనం చేయడానికి సామ్రాజ్యవాదులు కొనసాగించే జోక్యాన్ని, దురాక్రమణను తిప్పికొట్టాలి. ఈ పురోగమనం 'సాధారణంగా సమస్త వర్గాలు, వర్గభేదాలు వాటికి పునాదిగా ఉన్న అన్ని రకాల ఉత్పత్తి సంబంధాలు వాటికి సంబంధించిన సమస్త సామాజిక సంబంధాలు, ఈ సామాజిక సంబంధాల నుంచి ఉద్భవించే సమస్త భావాల నిర్మూలన'తో కూడి ఉన్న ప్రక్రియ అని మార్క్స్ అంటారు. ఇందుకు ఉపరితలంలో నిరంతరాయంగా వర్గపోరాటం కొనసాగించడంతో పాటు

కార్మికవర్గ సాంస్కృతిక విప్లవాలను నడపాలి. ఈ విధంగా ఉపరితలంలో నిరంతరాయంగా వర్గపోరాటం కొనసాగించడం ద్వారా, సాంస్కృతిక విప్లవాలను నడపడం ద్వారా ప్రజల ప్రాపంచిక దృక్పథాన్ని విప్లవాత్మకంగా మలుస్తూ ఉత్పత్తి సంబంధాలను విప్లవీకరించాలి. సుదీర్ఘ సోషలిజం క్రమంలో ఎదురయ్యే మలుపులను, మెలికలను అధిగమించడానికి సాహసోపేతంగా, సమర్థవంతంగా కృషి చేయడం ద్వారా కమ్యూనిజం సాధనా లక్ష్యంతో సోషలిజాన్ని సంఘటితం చేయాలి. నిర్దిష్టంగా భారతదేశంలో సోషలిస్టు విప్లవాన్ని కొనసాగించే క్రమంలో కూడా బ్రాహ్మణవాదానికి, దాని నిర్దిష్ట వ్యక్తీకరణలకు వ్యతిరేకంగా కుల నిర్మూలనా పోరాటాన్ని పురోగమింపజేయడం, గాఢతరం చేయడం కీలకమైన కర్తవ్యంగా ఉంటుంది. ఈ క్రమంలోనే సమాజంలో సకల దోపిడీ, పీడనల ఉనికికి ప్రాతిపదిక లేని సామాజిక పరిస్థితులను సృష్టించుకోవాలి. అంటే వర్గరహిత సమాజం ఏర్పడాలి. నూతన మానవులు సృష్టించబడాలి. కమ్యూనిజంలోకి అడుగిడాలి. దీనితో సకల మానవాళి వర్గపీడనకే గాకుండా సకల సామాజిక పీడనలకు చరమగీతం పాడుతుంది.

**కేంద్రకమిటీ,**

**సి.పి.ఐ. (మావోయిస్టు)**

★★★